





శ్రీరస్తు

శుభమస్తు                    అవిఘ్నమస్తు



# హరి నీమయమే అంతాను

(సంపుటి - I)

## ఎన్నుకొన్న
## అన్నమయ్య సంకీర్తనలకు
### ఉపోద్ఘాతము మరియు తాత్పర్యవివరణ

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

**M.Tech.**

# హరి నీమయమే అంతాను

(సంపుటి - I)

మొదటి ప్రచురణ

**ఏప్రిల్ 2013**

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**

వెల : **అమూల్యం**

**ప్రతులకు :**

**ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,**

**హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360**

**డి.టి.పి. ప్రింటింగ్ :**

**కె.వి.ఆర్.**

**98495 79345**





## అంకితము

## దశరథుని కంటివెలుగు అయిన

# శ్రీరామచంద్ర మూర్తికి..



నా ఇష్టదైవము, శ్రీ వేంకటేశ్వరుని త్రేతాయుగ రూపమైన కౌసల్యానందనుడు దశరథుని కంటివెలుగు అయిన శ్రీరామచంద్రమూర్తికి...

మ॥ **నరుడై పుట్టి వసించ మానవునిగా నారాయణుండే ధరన్**
**పరమాన్నంబు భుజించ తాను కలిగెన్ పాపండు కౌసల్యకై**
**సిరితావచ్చెను సీతవోలె దనుజుల్ క్షీణించ లంకేశుతో**
**కరుణాసింధుని కంకితమ్ము నిడెదన్ కావ్యంబునిద్దానిన్.**

తా॥ మానవుడై పుట్టి జీవిస్తేగాని రావణాసురుడు తన చేతిలో చావదని శ్రీమన్నారాయణుడంతటివాడు పరమాన్నము తిన్న కౌసల్యకు పాపనివలె జన్మించాడు. లక్ష్మీదేవి సీతయై రాక్షస సంహార కార్యక్రమానికై తాను సిరులరాణియైకూడా కన్నీరు కార్చింది. ఆమెతో ఈయనా శోకించాడు. ఆ కరుణా సముద్రుడు శ్రీరామచంద్రునికి ఈ కావ్యం అంకితమిచ్చి తరించెదగాక!

# హరి నీమయమే అంతాను

(సంపుటి - I)

ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు

## విషయ సూచిక


| క్ర.సం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | అచ్చుతు శరణమే అన్నిటికిని గురి | 16 |
| 2. | అతడేమిసేసినా మాకదే గురి | 42 |
| 3. | అదెవచ్చె రాఘవుడాతని దాడి ముట్టె | 67 |
| 4. | అలమేల్మంగవు నీవు యక్కుననుందానవు | 69 |
| 5. | అల్లదెకో విజయధ్వజము | 55 |
| 6. | ఆతడెవ్వాడు చూపరే అమ్మలాల | 7 |
| 7. | ఆ రూపమునకే హరి నీకు మొక్కెదను | 164 |
| 8. | ఇంతలేకుంటే నది యెక్కడి సుజ్ఞానము | 193 |
| 9. | ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే | 162 |
| 10. | ఇందిరానాథుడవు ఇందరికి నేలికవు | 26 |
| 11. | ఇందులోనే కానవద్దా యితడు దైవమని | 195 |
| 12. | ఇప్పటినుండియు నిన్ను ఇంతేసి దూరగనేల | 9 |
| 13. | ఇలవేల్పితడే ఇందరికిని | 5 |
| 14. | ఇహపరములకును యేలికవు | 84 |







| | | |
|---|---|---|
| 15. | ఇహము బరము జిక్కెనీతని వంక | 38 |
| 16. | ఈతడఖిలంబునకు నీశ్వరుడై | 117 |
| 17. | ఈతడు విష్ణుడు రిపులెక్కడ చొచ్చేరు | 125 |
| 18. | ఈతని మహిమలు యెంతని చెప్పెద | 20 |
| 19. | ఈసురలీ మునులీ చరాచరములు | 109 |
| 20. | ఎంతసేయగలేదు ఇటువంటి విధియభవు | 94 |
| 21. | ఎంత ప్రతాపమో నీదియెంచి చూచితే | 51 |
| 22. | ఎందరివెంట నెట్లు తిరుగవచ్చు | 139 |
| 23. | ఎందుగాపురము సేతు నేది | 170 |
| 24. | ఎందుబొడమితిమో యెఱుగము | 103 |
| 25. | ఎక్కడిదురవస్థలేటిదేహములోన | 130 |
| 26. | ఎక్కడిపాపము లెక్కడి పుణ్యము | 197 |
| 27. | ఎనుబోతుతోనెద్దు నేరుగట్టినయట్లు | 107 |
| 28. | ఎఱుకగలుగు నాడెఅంగడటా | 205 |
| 29. | ఎవ్వరికైనను యీ వ్రాత | 145 |
| 30. | ఏటి బిడ్డగంటివమ్మ యశోదమ్మ | 57 |
| 31. | ఏణ నయనల చూపులెంత సొబగైయుండు | 111 |

| | | |
|---|---|---|
| 32. | ఏతపములునేల యే దానములునేల | 166 |
| 33. | ఏది చూచినా నీవే ఇన్నియును | 113 |
| 34. | ఏమని చెప్పగవచ్చు నీతనిప్రతాపము | 77 |
| 35. | ఏమివలసిన నిచ్చు నెప్పుడైనను | 117 |
| 36. | ఏమిచెప్పేది ప్రతాపమెట్టి విలుకాడితడు | 119 |
| 37. | ఏలికవు నీవట ఇంకాదైన్యమేల | 178 |
| 38. | ఔదువయ్యా జాణవు ప్రహ్లాదవరద | 90 |
| 39. | కంచుగాదు పెంచుగాదు కడుబెలచు మనసు | 48 |
| 40. | కంటిమి వింటిమి అట్టే కానీవయ్యా | 86 |
| 41. | కొండంత పొడవుతోడ కోనేటి రాయుడు | 183 |
| 42. | కొండవంటి దేవుడు నే గొలిచే దేవుడు | 179 |
| 43. | కామధేనువు దేవకల్పితము | 153 |
| 44. | కావగ నీకే పోదు కరుణానిధివిగాన | 160 |
| 45. | కొలువరో మొక్కరో కోరి తలచరో | 22 |
| 46. | కొలువుడు వలసితే గొలవక మానుడు | 187 |
| 47. | గోవింద నీవన్నిటిలో గూడితేజాలు | 156 |
| 48. | గోవిందకేశవ నీకు కుయ్యో మొఱ్ఱో | 28 |
| 49. | ఘనుడీతడొకడు కలుగ గదా! | 137 |







| | | |
|---|---|---|
| 50. | చేకొన్న భక్తులపాలి చింతామణి | 63 |
| 51. | జీవములు దవ్వువోయ చీమలును | 172 |
| 52. | తలవ వెనక నుయ్యి తగరు ముందట | 30 |
| 53. | త్రివిక్రమమూర్తియైన దేవునివలెనున్నాడు | 71 |
| 54. | తెలియదుగాక ద్రిష్టము జీవుడు | 123 |
| 55. | తెలియరాదు మాయదేహమా | 201 |
| 56. | తోరణములే దోవెల్లా | 99 |
| 57. | దానవారితోడి పగ ధరించరాదు | 46 |
| 58. | దేవతలు చెలగిరి దిక్కులెల్లా సంతోషించె | 92 |
| 59. | దైవమా నీవే దయాధర్మము దలచుట | 185 |
| 60. | నవమూర్తులైనట్టి నరసింహము వీడె | 180 |
| 61. | నాకుగల పనియిదే నారాయణుడ | 189 |
| 62. | నిజమో కల్లో నిమిషములోననే | 34 |
| 63. | నీటముంచు పాలముంచు నీచిత్తమికను | 11 |
| 64. | పదిలము కోటపగవారు | 143 |
| 65. | పసలేని యీ బ్రతుకు | 141 |
| 66. | పరమోపకారులు ప్రత్యక్షదైవములు | 191 |
| 67. | పట్టిన వ్రతమే పంతము హరితో | 174 |

| | | |
|---|---|---|
| 68. | పుట్టించినవాడు దానె బుద్ధి చెప్పెడి | 176 |
| 69. | బంటుకు బంటవుదురా పాపముగాక | 73 |
| 70. | బొడ్డుతామరలోన గడ్డి వయసు పెద్ద | 13 |
| 71. | బ్రహ్మాదులకు నిదేపరచింత | 168 |
| 72. | మమ్ముజూడ నేమున్నది మావంకనీకే | 53 |
| 73. | మానరాదు నీకింక మముగావవలెను | 36 |
| 74. | మిక్కిలి పుణ్యులు హరి మీదాసులే హరి | 32 |
| 75. | మొక్కరో సేవించరో మునులాల ఋషులాల | 88 |
| 76. | రాచాజ్ఞ మరలించ రాజేకర్తగాన | 1 |
| 77. | రామచంద్రా రామభద్రా రఘువీర | 40 |
| 78. | రాముడు లోకాభిరాముడుదయించె | 151 |
| 79. | వాసివంతు విడిచిన వాడే | 121 |
| 80. | విచ్చేయవమ్మా వెన్నెల బొమ్మా | 158 |
| 81. | విడువుము మనసా వీరిడి చేతలు | 128 |
| 82. | విధి నిషేధములకు వెలవగబనిలేదు | 203 |
| 83. | వినయాలు సేసేవు వేంకటేశుడా | 82 |







| | | |
|---|---|---|
| 84. | వినోదకాడవౌదువు విఠలేశ్వరా | 59 |
| 85. | వెఱవకు మనసా విష్ణుని యభయము | 44 |
| 86. | వెదకితే నీవంటి వేల్పు లెవ్వరున్నారు | 65 |
| 87. | వీడివో కొలువున్నాడు విట్ఠలేశుడు | 18 |
| 88. | వీడివో కలశాపుర వీరహనుమంతుడు | 24 |
| 89. | వెలయనిన్నియును వృథా వృథా | 105 |
| 90. | వెన్నవట్టుక నేయి వెదకనేలా | 135 |
| 91. | వేలగట్టినట్టి వేవేలు చక్కిలాలు | 80 |
| 92. | వేదవేద్యులు వెదకేటిమందు | 97 |
| 93. | శిష్టులను మన్నించే శిశువీతడు | 75 |
| 94. | సడిబెట్టె గటకటా సంసారము | 132 |
| 95. | సర్వాంతరాత్ముడవు శరణాగతుడ నేను | 199 |
| 96. | సరిలేరితనికి సాహస విక్రముడీతడు | 61 |
| 97. | సులభమా మనుజులకు హరిభక్తి | 101 |
| 98. | సులభుడు మధుసూదనుడు | 207 |
| 99. | హరినెఱగని పుణ్యమంటేరు | 147 |
| 100. | హరి నీమయమే అంతాను | 3 |
| 101. | హరి మంగళము | 210 |

# ప్రార్థన

కం॥ శ్రీహరి నీమయమంతా
సాహసమగు నిన్ను వీడి జతనము సలుపన్
ఊహాతీతము జీవికి
ఆహా! నీలీల నెఱుగ నది సాధ్యంబే!!

ఉ॥ ఆకలిగొన్నవేళ తన అక్కున జేర్చుచు స్తన్యమిచ్చి చీ-
కాకను మాటలేక తను కమ్మగ నింపును బొజ్జ బిడ్డకున్
నాకము సాటికాగలదె నా జననీమణికీ జగంబులన్
హేకరుణామయా! తిరుమలేశ్వర! అమ్మలకమ్మనీవెగా.

చం॥ నలుపుగనుండువాడు నవనీతము ముచ్చిలి మ్రింగువాడు ఆ
వలపులతేనిగన్న హరి వంటి కృపాకరుడేడి సృష్టిలో
చెలువుడు వేంకటేశ్వరుడు చేరెను నందవ్రజంబు వెన్నుడై
తలవక కొంచెగోవులను తన్వుల మానము కొల్లగొట్టుచున్

సీ॥ అలవాటుకును జిక్కి అలమటించుట కద్దు
ఇదియేమి అలవాటు ఇందిరేశ!
వ్యసనంబునకు జిక్కి వాపోవుటది కద్దు
వింత వ్యసనమిద్ది వేంకటేశ!
కోర్కెలకును జిక్కి కుందుట అది కద్దు
తీరేటి కోరికా? తిరుమలేశ!
మోహంబుకును జిక్కి మునిగిపోవుట కద్దు
పెనుమోహమిద్దిరా శ్రీనివాస!

ఆ.వె॥ మంచిలేదు నాకు యెంచ చెడును లేదు
దారితప్పినట్టి తనయుడనని
ఉద్ధరించవయ్య! ఉర్వీధరా! హరీ
వెట్టి బానిసలను తిట్టనేల?





మ॥ హరి నీమాయనెరుంగ మాకు వశమే! అజ్ఞానికెట్లౌనురా?
కురిపించంగదవే! కృపన్ నిలుచుచున్ కూటస్థుడౌ శ్రీపతీ!
ధర నీకెవ్వరు సాటిరాగలరురా! తండ్రీ! జగన్మోహనా!
వర శ్రీవేంకటనాయకా! విడువ నీ పాదంబులన్ జుట్టెదన్.

తే.గీ.॥ కనుల గోచరమవనట్టి కమలనాభు
వేదరాశులకందని విశ్వరూపు
భక్తిలేకున్న స్థిరముగా మనసునందు
తెలియసాధ్యమా!! యేరికి, కలను గాదు.

కం॥ తిరుమలరాయని గొలువుడు
తరుగునురా పాపరాశి ధన్యత కలుగున్
తరగని వరములు కురియును
తరియించును వంగడంబు తరతరములకున్

శా॥ నాదోపాసన గొప్పసాధనమురా నారాయణున్ జేరగా
వాదం బేటికి? ప్రాప్యస్థానమతడే వాంఛించకైవల్యమున్
ఏదో జన్మసుకృత్యమిట్లు వెలసెన్ హే శ్రీపతీ! ధన్యుడన్
తాదాత్మ్యంబుగ అన్నమయ్య కృతులన్ తర్కించి నే జెప్పెదన్

ఆ.వె.॥ కాదు అన్నమయ్య, కాదురా త్యాగయ్య
కారు రామదాసు ధరణి నరులు
కూనిరాగములతో కొలిచినా హరి మెచ్చు
భక్తిలేని నోట భజనలేల?

ఉ॥ పాదరసంబు వోలెవడి బట్టగ కాదుర చంచలంబు, ఆ
వేదన జిక్కు నా మనసు వేంకటనాయక యేమిసేతురా
పాదము బట్టి వేడెదను పాయక కట్టుము నీదు ధ్యాసలో
కాదనకయ్య! నీచమగు కావిరి జన్మలనెత్తలేను రా!

సీ॥ శోధించి వేధించి శుష్కింప జేసిన
"హరి ఆర్తరక్షకు" డనుటయెట్లు?
కర్మగిర్మయటించు కథలన్ని నాకేల
నాదు భారము నీది నందకధర!
తొలగించి వేదన తుడువక కన్నీరు
దీనబంధుడవెట్లు తిరుమలేశ!
శరణాగతత్రాణ బిరుదంబదేలరా?
కరుణగావకయున్న కమలనాభ!

ఆ.వె॥ బిడ్డ తప్పుజేయ బిగియించునా తండ్రి?
తప్పు దిద్ది మంచి దారి జూపు
జగతినెందునైన సర్వసామాన్యమే
వెకలిజెప్పుటేల వేంకటేశ!

**మత్తకోకిల:**
ఏమిటీ హరిమాయ దెల్వను యేమి నాగతి శ్రీపతీ!
కామక్రోధములొగ్గనైతిని కండకావరమెక్కగా
ఏమిసేతును కాలుడొచ్చెను ఇంటివాకిట నిల్చెనే
రామచంద్రుని గొల్వనైతిని లక్షబుద్ధుల జెప్పినన్.

కం॥ నమ్మి చెడినవాడెవ్వడు
ఇమ్ముగ శ్రీవేంకటేశు నిహపరములకున్
అమ్మలకమ్మగు అమ్మను
నెమ్మదిలో నిల్పుకొన్న నిపుణుండితడే.





# ముందుమాట

"హరినీమయమే అంతాను" అనబడే ఈ సంకీర్తనా స్రవంతిని మొదలుపెట్టినప్పుడు నా మనస్సులో వున్న ఆలోచన నా అంతిమ శ్వాసదాకా యెన్ని కీర్తనలు అన్నమాచార్యులవారివి వివరించగలిగితే అన్ని వివరిద్దామని మాత్రమే. గతంలో 1010 అన్నమాచార్యులవారి కీర్తనలను ఉపోద్ఘాత సహితముగా తాత్పర్యవివరణ ఇచ్చి, **భావయామి వేంకటేశం – హరి నామమే కదా! అన్నమయ్య వరము** అనే రెండు ప్రతులుగా 30 కాపీలు ప్రింటు (డి.టి.పి) చేయించి శ్రీ వేంకటేశ్వరుని ఆలయాలలో పంచిపెట్టాను. అంతకు మించి నాకు ఆర్థిక స్తోమత లేదు.

నాకు భగవత్కృప కలిగి తిరుమల సందర్శించటానికి వెళ్ళి నా వెంట కొన్ని ప్రతులను అక్కడి పెద్దలకిచ్చి కంప్యూటర్ సి.డి.నందించి నా అశక్తతను మొరవెట్టి దానిని వెలుగులోకి తేవలసినదిగా అర్థించాను. శ్రీవేంకటేశ్వరుడు ఆ మహానుభావుల రూపంలో నన్ను అనుగ్రహించి దానిని వెలువరించ నిశ్చయించారు. నా జీవితం ధన్యమయింది.

ఈ కార్యక్రమానికి నాలుగు నెలల సమయం పట్టింది. ఈలోగా 108 అన్నమాచార్యులవారి ప్రత్యేక కీర్తనలు యెన్నుకొని వాటికి ఉపోదాతసహిత తాత్పర్య వివరణనందించాను. అవి అన్నీ అతిపొడవైన (సుదీర్ఘమైన) అందుకనే ఆ నా ప్రయత్నానికి "పొడవుకు పొడవైన పురుషోత్తమా" అని పేరుపెట్టాను. దానిని "సుజనరంజని" హైదరాబాదు వారికి అందించాను. ఎందుకంటే "సుజనరంజని" వారి "అన్నమయ్య పదామృత వర్షిణి" నాకు మార్గదర్శకంగా తొలినాళ్ళలో నిలిచింది. అదే నాకు స్ఫూర్తి అయింది. ఏ చేతిని పట్టుకొని అడుగులేయటం నేర్చుకొని ఆ చేతిని మఱచేవాడు నా దృష్టిలో మనిషే కాదు. మనిషి స్వార్థ జీవి అనే మాట నిజమే కాని ప్రతిక్షణం బేరీజు వేసికొంటూ స్వార్థాన్ని నియంత్రించుకోవటమే "బ్రతకటం" అంటే.

ఈ నా ప్రస్తుత ప్రయత్నము "హరి నీ మయమే అంతాను" గురించి ముచ్చటిస్తాను. నాకు పద్యరచన అంటే చాలా మక్కువ. ఇది యే జన్మ సిద్ధియో నాకు తెలియదు. కబీరుదాసు దోహాలను ఆటవెలది పద్యాలుగా తాత్పర్యసహిత వివరణ నిచ్చినప్పుడు నాకు కలిగిన తృప్తిని మాటలలో వర్ణించలేను.

మనము చేసిన యే పనినైనా కాగితంపై పెడితే అది యేనాటికైనా, యెవరికో ఒకరికి, యేదో ఒక విధంగా వుపయోగిస్తుందని నమ్మే ఆశావాదిని నేను. అందుకనే నాచేత భగవంతుడు చేయించిన రచనలన్నింటినీ నా వెబ్‌సైట్‌లో పెట్టాను "గూగుల్" నెట్‌వర్క్ ద్వారా ప్రపంచంలో యెక్కడవున్నా దానిని మీరు చదువుకోవచ్చు. "geetadeeksha" అనే సైట్‌కి లాగ్‌ఆన్ అయితే చాలు. వినాయక చవితి వచ్చింది. మీకు ఒక్క శ్లోకమూ రాదు అనుకోండి వెంటనే నా వెబ్‌సైట్‌ను చూడండి. "భగవద్గీత" అంటే యేమిటి అనే జనరేషన్ రాబోతున్నది. మీ తర్వాతి జనరేషన్‌ను ఎలా కాపాడుకుంటారో మీ చేతిలోనే వున్నది. నన్ను నమ్మండి. సంస్కృతిని మరిచే వాడు, కన్నతల్లిని మరచేవాడు పుట్టినా ఒకటే చచ్చినా ఒకటే. లెక్కపెట్టలేనన్ని కోట్లు సంపాదించి జీవచ్ఛవాలలాగా బ్రతుకుతూ యెప్పుడు చస్తాడో తెలియని బ్రతుకు దేనికి? ఏ ఒక్కడికీ ఉపయోగించని జీవితం యెందుకు? అందుకని, ఇప్పటికైనా ఆ సర్వేశ్వరుడు మెచ్చే పనిచేద్దాం. తోటి వారికి సహాయం చేయండి. కనీసం వారికి మంచిని చెప్పండి. పరనింద చేయకండి. నేను చెప్పేదే కరెక్ట్ అనే మొండితనం మానండి. కళ్ళుమూసుకొనేది మీరే... కానీ ఆ కళ్ళు తెరుచుకోవాలంటే మనలోని అంతర్యామి అవునన్నాల్సిందే. లేకపోతే మూసిన కన్ను తెరుచుకోదు. ఇది సత్యం. కనుక "హరి నీమయమే అంతాను" అనుకొంటూ జీవించండి. చక్కటి మానసిక వైభవం పొందండి. నిరంతరం ఆనందంగా వుండండి. ఒక చక్కటి ఇంగ్లీషు సూక్తి వినండి. If it has to happen, it will happen. Otherwise it will never happen. It is Gods will. ఈ సృష్టిలో సర్వమూ హరిమయమే. ఆయన చైతన్య స్వరూపుడు. ఆది మధ్యాంతరహితుడు.





గుణాతీతుడు. అవదనుకొన్న పనిని అయ్యేట్లుగాను అవుతుందనుకొన్న పనిని అవకుండాను చేస్తాడు. అంటే యేమిటి? సంకల్ప వికల్పాలు ఆయనవే కాని మనవి కావు. మనం కేవలం నిమిత్తమాత్రులం. ఆయన కావాలనుకొన్నది, ఆయన అనుకొన్నప్పుడు, ఆయనకనుగుణంగా, ఆయనకెవరిపై దయగలిగితే వారితో చేయించుకోగలడు. వద్దనుకుంటే ఒకే ఒక్క సెకనులో సర్వమూ ఆపించగలడు. ఇంత తెలిశాక ఇంకా విచారము, ఆనందము, నిరాశ, ఆశ వేధిస్తాయా? 'హరి నీమయమే అంతాను' అని భావించేవాడు ఒక నాటికి రాగాతీతుడై నిత్యముక్తుడవుతాడు. వాడి శరీరం పడిపోవటం కేవలం ఒక పరిణామమవుతుంది అంతే.

నేటి నవీనయుగంలో జియ్యరులవంటి మహామహులకే సంఘంలో జరుగుతున్న పరిణామాలను అవసరం మేరకు ఖండించాల్సి వస్తోంది. శృంగేరివంటి పీఠాధిపతులకే సంఘంలో జరుగుతున్న అసామాన్యతలను తెగడవలసి వస్తోంది. సామాజిక అవసరాలు తీరక సంపాదన చాలక అక్రమాలు చేసేస్తున్నారు. చేయలేనివారు నిరాశా నిస్పృహలతో జీవిస్తున్నారు. కానీ శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పినట్లు యెవరినివారే ఉద్ధరించుకోవాలి. పక్కవాడు యెలాగైనా వుండనీ, నేను మాత్రం నిజాయితీతో వుంటాను అనే దృఢ నిశ్చయంతో ప్రతివాడూ వుంటే ఈ సంఘం చూస్తుండగానే బాగుపడుతుంది. అరే! వాడు లంచం తీసికొని బాగుపడుతున్నాడు నేను ఎదుగూ బొదుగూ లేకుండా అఘోరిస్తున్నాను అని ప్రతివాడూ అనుకోబట్టే లంచగొండులు పెరిగిపోయారు. మనిషి రక్తం రుచి మరిగిన పులుల్లా వీళ్ళు మనుష్యుల్ని పీక్కుతింటున్నారు. మరి వీరిలో ఒక్కడన్నా మారవలెనంటే ఒకే ఒక సాధనం భక్తి. ఆ భక్తి న్యాయంపైన వుండాలి. సంఘంపైన వుండాలి. తన గురువుపై వుండాలి. పరిపాలకులపై వుండాలి. అన్నిటినీ మించి ఇంతటికీ కారణమైన దైవంపై వుండాలి. ప్రభుత్వంపై వుండాలి. తన యజమానిపై వుండాలి. తన వృత్తిపై వుండాలి. నేటి సమాజంలో ఇవన్నీ కొరవడుతున్నాయి కాబట్టే చెప్పిన మాటవినని ఉద్యోగులు, భార్యలు, పిల్లలు,

సేవకులు పుంఖానుపుంఖాలుగా తయారవుతున్నారు. వీరందరి అంతరాత్ముడు శ్రీహరే. కాబట్టే వీరందరికీ తాము చేస్తున్నది తప్పు అని తెలుసు. కానీ అహంకారం అంతరాత్ముని నోరుమూయించి చెడగొడుతున్నది. ఆ అపరాధ భావననుంచి తప్పుకోవాలనే అందరి తాపత్రయం. బెంబేలెత్తిపోతున్న యువత మత్తుకు లొంగిపోయింది. స్త్రీత్వం విశృంఖలత  నేర్చుకొన్నది. సామాన్య ప్రజ చట్టవ్యతిరేకి అయింది. ఇప్పుడేది దారి? వీటిలో యెన్నడూ చెడనివాడు దైవం ఒక్కడే. ఆయనను శరణనండి ముందు మీరు మారండి. ప్రతిదీ దానంతట అదే సర్దుకొంటుంది. “హరి నీమయమే అంతాను” అనుకున్నవాడు తన యెదురుగానే శ్రీహరి వున్నాడని యెన్నటికీ తప్పు చేయడు.

ఇందులో నేనెన్నుకున్న అన్నమయ్య కీర్తనలకు భావక్రోడీకరణతో వివరించిన పద్య వివరణ అనుబంధంగా ప్రతి కీర్తన చివరిగా యిచ్చాను. ఇది నా ఆత్మతృప్తికి నేనెన్నుకొన్న హరిమార్గం. తాత్పర్య వివరణలో కూడా కొంత వ్యత్యాసం చూపించాను. తెలియని పదములకు పాఠకులు అర్థం తేలికగా గుర్తుపట్టి అర్థం చేసికొనగలరు.

అలాగే ఉపోద్ఘాతంలో ఆ కీర్తన ప్రాశస్త్యం గురించి, ప్రత్యేకంగా నేర్వవలసిన సంగతుల గురించి తెలుసుకోవచ్చును. ప్రతి కీర్తనకు టి.టి.డి. సంపుటి సంఖ్య రోమన్ లెటర్సులోను కీర్తన సంఖ్య ఇంగ్లీషు సంఖ్యలలోనూ ఇవ్వబడింది. IV/209 అంటే. అన్నమయ్య కీర్తనల నాలుగవ సంపుటిలోని 209వ కీర్తన అని అర్థం. భక్తి కంటే తరించే మార్గం జ్ఞానం కానీ భక్తి లేని జ్ఞానం పరిమళంలేని పుష్పం. భక్తి జ్ఞానం రెండూ వున్నవాడికి మోక్షం ఇంకా సుగమం అవుతుంది. ఈ కీర్తనలు భక్తి ఇనుమడింపజేసికోవటానికి ఉపయోగపడితే వీటి తాత్పర్యవివరణ జ్ఞానం పెంపొందించుకోవటానికి దోహద పడుతుంది అనే మాట నిజం.

ఇంకొక్క విషయం మనః పూర్వకంగా మనవి చేస్తున్నాను. అన్నమయ్య వాడిని కొన్ని మాటలకి నిఘంటువుల్లో అర్థం లభించదు. అథవా లభించినా ఆ అర్థం సూటిగా అన్వయించలేము. కొన్ని కొన్ని ఆనాటి వాడుక పదాలు ఈనాడు వాడుకలోలేవు. అందుకని ఊహకూడా ఉపకారే అవుతుంది.















## హరి నీమయమే అంతాను సంకీర్తనలు

సంఖ్య: II/447 రాగం : సామంతం
కీర్తన : రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన

### సామంతం

**1 రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన**
**యేచి నీకు శరణంటి నిది మానుపవే ॥పల్లవి॥**

**కడు నహంకరించినను తొల్లి ఘనుడు నారదమౌని**
**బెడిదపుటింతిఁ జేసి నీమాయ ఆతని బిడ్డలఁ గనిపించెను**
**అడరి నే నసఁగా నెంతటివాఁడను అది నేఁ గడపఁగలనా**
**తడవి నే శరణంటి దనుజారి ఆమాయ దగ్గరకుండఁగఁజేయవే**
**॥రాచా॥**

**మహి మిమ్ము మోచేనని మున్ను మదించినగరుడనిని**
**సహజపునీహస్తము మోయకుండఁగ శక్తి హరించె నీమాయ**
**బహుముఖముల, నే నెంతటివాఁడను పాయఁగ నీమాయ**
**అహిశయనుఁడ నే నీశరణంటిని అది నన్ను దగ్గరకుండఁ జేయవే**
**॥రాచా॥**

**సారపుశ్రీవేంకటేశ స్వతంత్రుఁడవు నీవు**
**గారవపుమాయ నీదే కమ్మి నే నీవాఁడనే**
**మారుదైవములు లేరు మరి నన్నుఁ గావ నిన్నుఁ**
**బేరుకొని శరణంటిఁ బెడఁబాపు మాయ ॥రాచా॥ 447**

**ఉపోద్ఘాతము:**

ఓ దేవదేవా! నీవు జగన్నియంతవు. ఒక దేశపు రాజు వేసిన శిక్షను తప్పించుటకు రాజే సమర్థుడు. అన్యులకు అది అసాధ్యం. నీవు విధించిన





శిక్షను ప్రపంచంలో ఏ రాజూ కాదనలేడు. దానిని మానుప నీకే సాధ్యము. ప్రభూ నిన్ను శరణన్నాను. నన్ను రక్షించు అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

రాజుగారు విధించిన శిక్షనుమరలించుటకు రాజువొక్కడే సమర్థుడు. నీవు జగన్నియంతవు. నీవు నాకు విధించిన ఈ “బ్రతుకు” శిక్ష మానుపవయ్యా! నీకు నేను శరణంటిని.

పూర్వం నారదుడు తనని నీమాయ యేమీ చేయలేదని గర్విస్తే నీమాయ ఆతని భార్యయై సంసారిని జేసి బిడ్డలనుకని కన్నీరుబెట్టించి గుణపాఠం నేర్పినది. దేవమౌని అయిన ఆయన అన్ని తిప్పలు బడితే ఇక మాబోటి వారెంత ప్రభూ! ఓ రాక్షసవైరీ! నీమాయనే దాటగలనా? దానిని మాత్రం నా వద్దకు రానీయకు. నీకు శరణంటిని తండ్రీ!

నీ వాహనమైన గరుత్మంతునికి నిన్ను మోయుచున్నాననే గర్వం కలిగింది. వాని గర్వం ఖర్వం చేయుటకు అతనిని యెంత అశక్తుని చేశావంటే, అతను నీ చేతిని కూడా ఎత్తలేకపోయాడు. మరి నీమాయ అంటే దుస్సాధ్యము కదా! అసంఖ్యాకమైన తీరులనుండే నీమాయను నేను దాటగలనా?

ఓ శేషశయనా! నీ మాయను మాత్రం నాదగ్గరకు రానీకు. ఇదే నిన్ను శరణంటున్నాను. సారముగల శ్రీ వేంకటేశ్వరా! నీవు సర్వ స్వతంత్రుడవు ప్రభూ! అతి సమర్థవంతమైన నీ మాయకు జిక్కినా నేను నీ ఆశ్రితుడను. నన్ను రక్షించుటకు ఇంకొక దేవుడు లేనేలేడయ్యా! అందుకని నిన్నే పేర్కొని శరణంటిని. నీ మాయను నివారింపుము తండ్రీ!

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **రాజువేయు శిక్ష రాజొక్కడే బాపు**
**ఒరులకది యసాధ్యమో మురారి!**
**నీదుమాయ దునుప నీవేసమర్థుడౌ**
**జంకునెవ్వడైన వేంకటేశ!**

సంఖ్య: IV/418 రాగం : సాళంగ భైరవి
కీర్తన : హరి నీమయమే అంతాను

## సాళంగ భైరవి

**2 హరి నీమయమే అంతాను**
**అరసి నీకు శరణనియెద నేను** ||పల్లవి||

**యెదుట నెవ్వరిక నేమాటాడిన**
**అది నీ ఘననామాంకితమే**
**అదివో సకల శబ్దాఖ్యుడవని నిన్ను**
**పొదలి చదువులు పొగడీగాన** ||హరి||

**యెవ్వరి బొడగని యెక్కడనుండిన**
**నివ్వటిల్ల నది నీరూపే**
**నెవ్వదీర నిదె నిను విశ్వరూపు**
**డెవ్వల నని శ్రుతులెంచీ గాన** ||హరి||

**భావన యిది నీ బ్రహ్మాత్మకమే**
**శ్రీవేంకటేశ నాచింత యిదే**
**ఆవల నిను సర్వాంతర్యామెని**
**దేవ శాస్త్రములు తెలిపీ గాన** ||హరి||

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య వినిపిస్తున్న చక్కని హరి శరణాగతి నాలకించండి. అణువణువున విశ్వమంతా నిండిన నారాయణుని కీర్తిస్తున్నారు. అంతా నీమయమే అని గ్రహించి నీకే శరణంటున్నాను ప్రభూ! అంటున్నారు.





ఇంత సరళమైన కీర్తనలో కూడా రెండు మూడు చోట్ల తెల్లమొగము వేసే ప్రమాదం వున్నది సుమండీ!

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీహరీ! అంతాను (ఈ విశ్వమంతా) నీ మయమే (నీతోనే నిండిపోయినది). నేను అరసి (ఇది గ్రహించి) నీకు శరణనియెదను ప్రభూ!

నేను ఇక మాటాడిన (పలికిన) అది నీ ఘనమైన నామాంకితమే (నామ సంకీర్తనమే). ఇకపై నాయెదుట యెవ్వరూ లేరు. అదిగో పొదలి (వర్ధిల్లిన) చదువులు (వేద వేదాంగములు) నిన్ను సకల శబ్దాఖ్యుడవని (సృష్టిలోని సకల శబ్దములచేత కీర్తించబడువాడవు).

ఎక్కడనుండిన (ఏలోకంలోనున్నా) ఎవ్వని బొడగని (ఏదేవుని చూచినా) అది (ఆ రూపము) నివ్వటిల్ల (అతిశయించుచూ) నీరూపే అని గ్రహించితిని. ఇదే, నెవ్వదీర (నిరపాయముగా) నిన్ను విశ్వరూపుడవని శ్రుతులు (వేదరాశి), నిన్ను యెంచెను గాన, అంతా నీమయమే అనడంలో అతిశయమేమున్నది?

ప్రభూ! నీ బ్రహ్మాత్వమే (పరబ్రహ్మతత్త్వమే) శ్రీవేంకటేశ స్వరూపము. ఇదే నా భావము మరియు నా చింతన. ఆవల (అటుపై) సకల శాస్త్రములు నిన్ను సర్వాంతర్యామివి (అందరిలో నున్న అంతర్యామివి) అని తెలిపీగాన, అంతా నీమయమే అని గ్రహించి ఆనందంతో పులకించిపోయాను, తండ్రీ!

**పద్యవివరణ:**

కం|| హరి నీమయమే అంతా
అరయన్ మరి యొకటి లేదు అంబుజనాభా!
మరి మరి శ్రుతులిదె జెప్పెను
శరణంటిని నీకు మ్రొక్కి శబ్దాఖ్యు! తగున్

సంఖ్య: IV/133 రాగం : శ్రీరాగం
కీర్తన : ఇలవేల్పితడే ఇందరికిని

## శ్రీరాగం

**3 ఇలవేల్పితడే ఇందరికిని మరి**
**పలువేల్పులతో పని యికనేలా** ||పల్లవి||

**కమలారమణుని కరుణేకాదా**
**అమరులుగొనియెడియమృతము**
**అమితపుశ్రీహరి యాధారముగాదా (గద?)**
**నెమకేటి ప్రాణులు నిలిచినభూమి** ||ఇలవేల్పు||

**దనుజాంతకుబొడ్డుతామెర కాదా**
**జననకారణము సర్వమునకు**
**మనికై హరిసతిమహిమే కాదా**
**నినుపై భువిలో నిండినసిరులు** ||ఇలవేల్పు||

**యితనికొడుకు రచనింతాగాదా**
**సతులపతులసంసారరతి**
**గతి శ్రీవేంకటపతిలోకమె వు-**
**న్నతివైకుంఠపునగరపుముక్తి** ||ఇలవేల్పు||

**ఉపోద్ఘాతము:**

ఈ లోకంలో వున్న ఇంతమందికీ కులదైవము ఈ శ్రీవేంకటేశ్వరుడే. అవునా? అటువంటప్పుడు ఇతర దేవతలను కొలిచి యేవేవో పనికిమాలిన కోరికలతో సతమతమవుతూ బ్రతకాల్సిన పనేమిటి చెప్పండి? అసలు ముక్తి అంటే యేమిటి శ్రీమన్నారాయణుని వైకుంఠపురం చేరి తిరిగి జన్మలేకుండా వుండటమే కదా! అంటున్నారు తాళ్ళపాక అన్నమయ్య.





**తాత్పర్య వివరణ:**

ఇందరికిని (ఈ లోకంలోని వారందరికీ) ఇలవేల్పు (కులదైవం) ఇతడే (ఈ శ్రీవేంకటేశ్వరుడే). మరి (ఇంకా) అసంఖ్యాకులైన అన్యదేవతలతో ఇక యేమిపని వున్నది చెప్పండి?

ఈనాడు అమరులు (దేవతలంతా) లొట్టలు వేసికొంటూ అమృతం త్రాగుతున్నారంటే, అది కమలారమణుడు (శ్రీనాథుడు) అయిన శ్రీహరి కరుణే కాదా (కృపయే కదా!) అంతెందుకు నేడు మనమంతా నిలుచుని వున్న ఈ భూమి ఆనాడు శ్రీహరి హిరణ్యాక్షుని వరాహమూర్తియై వధించి కాపాడుట వలననే మనకు దక్కింది. కాబట్టి అమితపు (అనంతుడైన) శ్రీహరియే ప్రాణులన్నిటికీ ఆధారము అని ఒప్పుకొంటారా?

దనుజాంతకుడు (రాక్షసాంతకుడు) అయిన శ్రీహరి బొడ్డుతామెర (నాభికమలము)లో జన్మించిన బ్రహ్మ జరుపుతున్న సృష్టియే ఈ జగత్తు. ఆ విధంగా అందరి పుట్టుకకు హరియే కారణము. ఈ భూమిపైనున్న సిరులు (సంపదలన్ని) నినుపై వున్నవంటే (సమృద్ధిగా వున్నవంటే) హరి సతి అయిన లక్ష్మీదేవి కరుణే కదా!

అవన్నీ ఒక పక్కన పెట్టండి. ఈ లోకంలో భార్యాభర్తలు రతిలోదేలి సంసార సుఖులై సృష్టి నిర్వహిస్తున్నది ఈ శ్రీహరి కొడుకైన మన్మథుని రచనా చమత్కారమువల్లనే సుమా! ఈ శ్రీవేంకటపతి గతి (నిర్దేశనమే) వైకుంఠపురమున ముక్తులై వుండే వైభవం కల్పిస్తుంది. ఇంతకు మించి యేమి కావాలి?

**పద్యవివరణ:**

ఆ.వె.|| **ఇందరికిని భువిని ఇలవేల్పితడెజుమ్మీ!**
**పలు దివిజులతోటి పని యదేమి?**
**వేంకటేశు జేర వెలయు వైకుంఠమ్ము**
**అదియె ముక్తిపథము హరికి నెలవు.**

సంఖ్య: XXI/385 రాగం : ధన్యాసి
కీర్తన : ఆతడెవ్వాడు చూపరే అమ్మలాల

### ధన్యాసి

4 **ఆతడెవ్వాడు చూపరే అమ్మలాల**
**ఏతుల నాడేటి కృష్ణుడీతడే కాదు-గదా** ||పల్లవి||

**కందువ దేవకి బిడ్డగనెనట నడురేయి**
**అంది యశోదకు కొడుకైనాడట**
**సందడించి పూతకి చంటిపాలు తాగెనట**
**మందల ఆవులగాచి మలసెనట** ||ఆతడె||

**మంచి బండిదన్నెనట మద్దులు విరిచెనట**
**ఇంచుకంత వేల కొండ ఎత్తినాడట**
**మంచాలపై గొల్లెతలమానాలు చేకొనెనట**
**మించుల పిల్లగోవి పట్టి మెరసెనట** ||ఆతడె||

**కాళింగుని మెట్టెనట కంసుని పొరిగొనెనట**
**పాలించి సురల చేపట్టెనట**
**ఈలీల శ్రీ వేంకటాద్రి నిరవైన దేవుడట**
**ఏలెనట పదారువేల ఇంతుల నిందరిని** ||ఆతడె||

**ఉపోద్ఘాతము:**

ఓ అమ్మలారా! ఆతడు శ్రీవేంకటేశ్వరుడా లేక ఉద్ధతితో మన ముంగిట ఆడుచున్న శ్రీకృష్ణుడా అనే అనుమానము వ్యక్తం చేసి అన్నమయ్య ఆ కృష్ణుని లీలలను వివరిస్తున్నారు.

మంచాలపై గొల్లెతల మానము చేకొనెనట కాని అంత గడుగ్గాయి పిల్లగాడూ యెవరో కాదట శ్రీవేంకటాద్రిని ఇరవయిన శ్రీనివాసుడేనట.





**తాత్పర్య వివరణ:**

ఓ అమ్మలారా! ఆతడు (ఆ శ్రీవేంకటేశ్వరుడు) యెవ్వాడో చూపరే (యెవ్వరో తెలియపరచండి). ఏతుల (ఉద్ధతితో) మన యెదురుగా ఆడుతున్న ఈ కృష్ణుడు, ఆతడు కాదుగదా!

కందువ (ఏకాంతమున) దేవకీదేవి ఒక మగ బిడ్డను నడిరేయి కన్నది (అర్ధరాత్రివేళ ప్రసవించింది). అటుపిమ్మట ఆ పిల్లవాడే రేపల్లెలో యశోద పొత్తిళ్ళలో బాలుడైనాడట. సందడించె (ఆర్భాటంగా వచ్చిన) పూతన చనుబాలు త్రాపగా తాగెనట. మరి పాపం అంతటి రాక్షసి యెందుకు చచ్చిందో తెలియదు. కానివాడే పెరిగి ఆవులమందని కాచి మలసెనట (తిరిగాడట).

ఈ పిల్లవాడి లీలలు యేమి చెప్పమన్నారు. మంచి (గట్టి) బండిని ఒక్క తన్ను తన్ని ముక్కలు ముక్కలు చేశాడట. పెద్దపెద్ద మద్దిచెట్లను రోటికి అడ్డంగా లాగి పడకొట్టాడట. ఇంచుకంతవేల (చిటికెనవ్రేలిపై) గోవర్ధన పర్వతాన్ని యెత్తాడట. గొల్లభామలు మంచాలపై నిద్రిస్తుంటే తనూ మంచంపై చేరి మానము దోచుకొన్నాడట. మధురమైన పిల్లనగోవి (మురళి) పట్టి వెలుగులు జిమ్మెనట.

కాళీయుడనే సర్పముపైనెక్కి ఆడి వాని గర్వము ఖర్వము జేసెనట. కంసుని పొరిగెనట (చంపాడట). ఇన్ని లీలలు చేసి శ్రీవేంకటాద్రి మీద దేవుడైనాడట. ఆ కృష్ణయ్యగా పదియారువేల మంది ఇంతులను పెళ్ళాడాడట. నేడు ఇందరినీ యేలుతున్నది ఆయనే కదా!

**పద్యవివరణ:**

ఉ.|| **కందువ దేవకీసుతుడు కన్నులపంట గనా యశోదకున్**
**సందడి బిడ్డ, పూతనను చన్నుల పాలను పీల్చి చంపెరా,**
**పొందుగ జూపరే యతని పొంతల నాడెదమంటిరే సతుల్**
**విందగు వేంకటేశ్వరుడు వీధుల గొల్లెత మోవి జుఱ్ఱెనో!!**

సంఖ్య: XXIX/495 రాగం : వకుళాభరణం
కీర్తన : ఇప్పటి నుండియు నిన్ను ఇంతేసి దూరగనేల

**వకుళాభరణం**

**5 ఇప్పటి నుండియు నిన్ను ఇంతేసి దూరగనేల**
**చెప్పనేల నీవేమైనా చేయవయ్య చేతలు** ||పల్లవి||

**వెంగెము లాడిన గాక వెరచేవా సతులకు**
**అంగము సోకినగాక అలసేవా**
**కొంగు వట్టితేగాక కొసరుకులోనయ్యేవా**
**చెంగట నేమైనా నీవు సేయవయ్యా చేతలు** ||ఇప్పటి||

**కన్నులను తిట్టననుగాక కడు కరగేవా**
**చన్నుల నొత్తిన కాక సమ్మతించేవా**
**చిన్ని గోరూదిన గాక చేతికి వసమయ్యేవా**
**చెన్ను మీర నేమైనా చేయవయ్యా చేతలు** ||ఇప్పటి||

**కాలు దొక్కితే గాక కౌగిట నీవు గూడేవా**
**కేలుపై జాచిన గాక కిందుపడేవా**
**యీలీల శ్రీవేంకటేశ యేలితివి ననునేడు**
**చేల కొంగిచ్చి యేమైన చేయవయ్య చేతలు** ||ఇప్పటి||

**ఉపోద్ఘాతము:**

"ఇంకా యెంత జీవితం వున్నదో యెవరు చెప్పగలరు? నీ వ్యవహారం తెలిసిపోయాక యెన్ననుకొని యేమి లాభం? నిన్ను అనవసరంగా మాటలని తిట్టి వుపయోగమేమిటి? నీవేమైనా చేసికోవయ్యా నాకేమిటి? నీకు నేను చెప్పవలసిన అవసరమేమి వున్నది" అని నాయిక శ్రీవేంకటేశ్వరుని దెప్పుతున్నది. ఆయన చిలిపి చేష్టలు, వ్యంగ్య సంభాషణలు, శృంగార చేతలు ఆమెకు లోపల సంతోషం కలిగిస్తున్నా పైకిమాత్రం 'కారం' అద్దినట్లు మండిపడుతోంది. అన్నమయ్య శృంగారకీర్తన అజరామరం.





**తాత్పర్య వివరణ:**

స్వామీ! ఇప్పటినుండియు (ఇంకపైన) నిన్ను ఇంతేసి (ఇన్ని మాటలని) దూరనేల (తిట్టడం యెందుకు)? నీవేమైనా చేతలు చేయవయా? నీకు నేను చెప్పనేల?

ప్రభూ! సతులు నీగురించి యెన్ని వెంగెములాడుచున్నారో (పరాచికాలు పలుకుతున్నారో) చూశావా?అయినా వాటికి నీవు వెరచేవా యేమి? (నీకు జంకు కూడా లేదు). ఆడవాళ్ళ అంగములు తాకుతూవుంటే నీకు అలుపుయెందుకువస్తుందయ్యా? అయినా ఇదేమి పని స్వామీ! నీవు స్త్రీల కొంగులు పట్టుకోవటమేమిటి, కొసరుకు లోనవటం (మా కసురుకోవటానికి) యేమటి? నీవు దేవదేవుడవు. నిన్ను కాదనే దెవరు? చెంగట (నా దగ్గర) వుంటే చాలును. నీవు యేమి చేసికొనినా నేనభ్యంతరం చెప్పను.

ప్రభూ! నీవు చేసే చిలిపి చేష్టలకు నేను నాకళ్ళతోనే నిన్ను మందలిస్తాను. నేనొక పక్క తిడుతుంటే నీవు కడుకరగేవ (అంత పరవశించిపోతావా?) ఇదేమి చోద్యం? నా చన్నులు నొక్కితేగాని వూరకుండవా?చిన్ని గోరూదినగాక (గోటి గాటుపెట్టేదాకా) నీ చేతులు వూరకుండవు గదా! చెన్నుమీర (ఇంపుగా) నీవు చేసే చిలిపి చేష్టలుంటాయి. నీవేమి చేసినా మాకిష్టమే.

స్వామి! నేను చూసుకోకుండా నీకాలు తొక్కానని నన్ను కౌగలించికూడెదవా? అదొక వంకయా నీకు. నీపై చేయివేయగానే, కిందుపడేవా (లొంగిపోతావా?) యెంత విచిత్రం!! ఇన్ని తమాషాలు చేస్తావు కాబట్టే పరవశించనివారుండరు.ఓ శ్రీ వేంకటేశ్వరా ! నీవు ఈ లీల (ఈ విధముగా) యేలితివి. నా కొంగు నీ చేతికిచ్చాను. నీవేమి చేసినా నేను కాదనను ప్రభూ!

**పద్యవివరణ:**

తే.|| **చెప్పనేల నీవేమైన చేయవయ్య!**
**ఇప్పుడిటు నిన్ను దూరిన యేమి ఫలము?**
**కినిసి వేంకటవిభునిపైయనె వధూటి**
**చేల కొంగిచ్చి యేమైన చేయవయ్య!**

సంఖ్య: IV/224 రాగం : సాళంగనాట
కీర్తన : నీటముంచు పాలముంచు నీచిత్త మిఁకను

**సాళంగనాట**

**6 నీటముంచు పాలముంచు నీచిత్తమిఁకను**
**చాటితి నీకృప గురి సంసారమునకు** ||పల్లవి||

**హరి నీవే గురి నాయాతుమలోపలికి**
**అరిది శంఖచక్రాలే యంగపుగురి**
**పరమపదమే గురి పట్టినవ్రతమునకు**
**తిరుమంత్రమే గురి దిష్టపునాలికకు** ||నీట||

**గోవింద నీపాదపూజే గురి నాదాస్యమునకు**
**తావుల నాభక్తికి నీదాసులే గురి**
**ఆవల నాకర్మమున కాచార్యుఁడే గురి**
**దేవ నీశరణు గురి దిష్టపు జన్మానకు** ||నీట||

**నగుశ్రీపతి గురి నన్ను రక్షించుటకును**
**తగుసంకీర్తన గురి తపమునకు**
**తెగనిజ్ఞానమునకు తిరుమణులే గురి**
**మిగుల శ్రీవేంకటేశ మించి నీవే గురి** ||నీట|| **224**

**ఉపోద్ఘాతము:**

'గురి' అంటే లక్ష్యము. ప్రతి మనిషికీ ఒక లక్ష్యం వున్నట్లే ప్రతిపనికీ ఒక లక్ష్యం వుంటుంది. మాయామేయ జగత్తు యొక్క విచిత్ర లక్షణం యేమంటే ఇది నిత్యము, సత్యము అనే భ్రమ కల్పిస్తూ వుంటుంది. తన వైభోగం నిత్యము అనే భ్రమవల్లనే లోకంలో ఇన్ని అన్యాయాలు జరుగుతున్నాయి. ఒక పెద్ద భూకంపంవస్తే అయిదు నిముషాల్లో అంతా తుడిచిపెట్టుకుపోతుంది.





అప్పుడెవ్వరు నీకు గతి? శ్రీహరికృప ఒక్కటే. కాబట్టి ఈ సంసారపు వునికికి గురి కేవలం ఆ దేవదేవుని దయ. కనుక తండ్రీ! మమ్మల్ని పాలలోముంచినా నీటిలో ముంచినా నీదే భారం అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ప్రభూ! మేము నీ శరణాగతులము. మమ్మల్ని నీటిలో ముంచినా (చెడు చేసినా), పాలలో ముంచినా (మేలు చేసినా) నీ చిత్తము (నీ ఇష్టం). దీనిని అందరికీ చాటితిని-నీకృపయే ఈ సంసారమునకు (జగతికి) గురి (కావలసినది).

ఓ శ్రీహరీ! నా ఆత్మలో నెలకొనివుండుటకు నీవే గురి (నీవే నా లక్ష్యము). నా శరీరాంగాలకు గురి పవిత్రమైన అరుదైన నీ శంఖ చక్రముల ముద్రలు. మేము ఇన్ని వ్రతముల నాచరించుచున్నాము. వీటికి మేము యెంచుకొన్న 'గురి' పరమపదము (కైవల్యము). మీ దిష్టపు నాలుకకు (నాలుక ఉపదేశమునకు) గురి "నమో నారాయణ" అనే నీ పవిత్ర మంత్రము.

ఓ గోవిందుడా! నా దాస్యమునకు గురి నీ పాదసేవ. మరి నా భక్తికి గురి యెవరు? హరిదాసులే కదా! నా గత పాప నివారణార్థం నేను అనేక పుణ్య కర్మలు చేస్తున్నాను. వీటిని నాచేత చేయిస్తున్నది మా ఆచార్యుడే. కావున నా కర్మలన్నింటికీ ఆచార్యుడే గురి. మరి ఈ నా జన్మకు గురి నీ శరణాగతి మాత్రమే.

నన్ను రక్షించుటకు గురి నగవులొలికే శ్రీపతి. అసంఖ్యాకులు చేసే తపస్సునకు గురి శ్రీహరి నామసంకీర్తనము. మరి అఖండమైన జ్ఞానమునకు గురి తిరుమణి (పవిత్రమైన నుదుటి నామము అనే బొట్టు). ఓ శ్రీవేంకటేశ్వరా! అన్నిటినీ మించిన గురి నీవే తండ్రీ!

**పద్యవివరణ:**

కం.|| **గురి సంసారంబునకును**
**హరికృపయే, భారమంత యతనిదె సుండీ!**
**గురినన్ను గావ శ్రీపతి**
**హరి సంకీర్తనమె "గురి" కదా! తపములకున్**

సంఖ్య: IV/36 రాగం : సామంతం
కీర్తన : బొడ్డు తామెరలోన గడ్డి వయసు పెద్ద

**సామంతం**

**7 బొడ్డు తామెరలోన గడ్డివయసు పెద్ద**
**బిడ్డఁ గన్నట్టివాఁడు పిన్నవాఁడు ॥పల్లవి॥**

**బిరుసైనదొకకొండ పెనుబాముతోఁ జుట్టి**
**బిరబిరనె త్రిప్పే పిన్నవాఁడు**
**గురుతైనదొకకొండ గొడగుగా నొకచేత**
**పెరికి పట్టేవాఁడు పిన్నవాఁడు. ॥బొడ్డు॥**

**బెడిదంపు శిశుపాలు పెనుమోఁతతోఁగూడ**
**పెడచేతనే వేసెఁ (వేసేపి?) బిన్నవాఁడు**
**పడవేసి చాణూరుఁ బట్టి యురము దొక్కి**
**పిడికిటనే చంపే పిన్నవాఁడు ॥బొడ్డు॥**

**ఎక్కడఁ జూచినఁ నింతటఁ దానై**
**పెక్కురూపములైన పిన్నవాఁడు**
**ఇక్కడఁ దిరువేంకటేశుఁడై జగమెల్ల**
**పిక్కిటిల్లినవాఁడు పిన్నవాఁడు ॥బొడ్డు॥ 36**

**ఉపోద్ఘాతము:**

పిన్నవాడు అంటే చిన్నవయసున్న పాపడు అని అర్థం. ఈ కీర్తనలో ఈ పిన్నవాడు యెటువంటివాడో వివరిస్తున్నారు అన్నమయ్య. కొన్ని





మాటలకు అర్థాలు నిఘంటువులో దొరకవు. ఉదాహరణకు గడ్డి వయసు పెద్దబిడ్డ గన్నట్టి అంటే గడ్డము వుండే వయస్సు వున్న పెద్దకొడుకునే తానే కన్నవాడు అని అర్థం. అంటే గడ్డాలు మీసాలు వున్న బ్రహ్మదేవుని తానే తల్లిలేకుండా కన్నవాడు అన్నమాట. అటువంటి పిన్నవాడెవరు? ఇంకెవరు... నారాయణుడు. ఈ కీర్తన పౌరాణిక వాఙ్మయంతో పరిచయం వుంటేగానీ వివరించటం కష్టం.

**తాత్పర్య వివరణ:**

ఓ జనులారా! బొడ్డుతామెరలోన (తన నాభినుండి ఉద్భవించిన కమలములోంచి), గడ్డి వయసు (గడ్డము వచ్చేవయస్సువున్న) పెద్ద బిడ్డన్ (పెద్దకొడుకును) కన్నట్టివాడు (తానే కన్నట్టివాడు) పిన్నవాడు (పిల్లవాడా!) ఏమి చోద్యము!!

ఒక కొండ బిరుసైనది (ఒక పర్వతము అతి కఠినమైనది వున్నది). దానిని పెనుబాముతోజుట్టి (చాల పొడుగైన సర్పముతో బిగించి) బిరబిరనే త్రిప్పె (అంత పెద్ద పర్వతాన్నీ గిరగిరా కవ్వములా త్రిప్పినాడు. (శ్రీహరి క్షీరసాగరమథనమున మందర పర్వతాన్ని వాసుకి చేత కవ్వములా మథింపజేసి అమృతావిష్కరణకు దేవతలకు సహాయపడ్డాడు). ఇంతచేసినవాడు పిన్నవాడా? ఇంకొక కొండవున్నది. అది గురుతైన కొండ (ప్రసిద్ధికెక్కిన పర్వతము). అదే గోవర్ధన పర్వతము. ఈతడు ఆ కొండను గొడుగులాగా ఒక చేతి పెరికి పట్టుకొని ఇంద్రుడి రాళ్ళవాన నుండి గోకులాన్ని రక్షించాడు. ఇది పిల్లగాళ్లు చేసే పనియేనా?

శిశుపాలుడు అనే తన మేనత్తకొడుకు, బెడిదంపు పెనుమోతతో (పరుష వచనములాడుచూ గొప్ప రండెలు వేస్తే) వాడిని పెడచేతనే (చేతి వెనుక

భాగంనుంచి సుదర్శన చక్రాన్ని తెప్పించి తల నతికి వేశాడు). ఔరా! సుదర్శన చక్రం తెప్పించేవాడు పిన్నవాడా? మధురానగరంలో జగత్ప్రసిద్ధుడైన చాణూరుడు అనే మల్లయోధుడున్నాడు. వాడు పర్వత కాయుడు. శ్రీకృష్ణుడు వాడిని పట్టి పడవేసి వాడి యెదురురొమ్ము మీద తొక్కి పిడికిటితో ఒక గుద్దు గుద్ది చంపివేశాడు. ఇంకా మీరు వీడు చిన్నవాడు అనుకొంటున్నారా?

ఇక పెద్దవాడయ్యాక తాను రక్షించిన పదియారువేలమంది రాచకన్నెలను వారి కోరిక మేరకు తానే పెండ్లాడి పదియారువేల భవనాలలో వుంచి పదియారువేల కృష్ణులై ప్రతిచోటా తన గృహస్థ ధర్మం నెరవేర్చాడు. నారదుడు ఇది చూద్దామని వచ్చి పెక్కురూపములనున్న ఆయనను చూచి బిక్కమొగము వేశాడు. అటువంటి చతురుడు పిన్నవాడా? ఇక్కడ శ్రీవేంకటాద్రి మీద శ్రీవేంకటేశ్వరుడై జగమెల్లా పిక్కటిల్ల (సుప్రసిద్ధుడై) సర్వులను రక్షించే ఈ దేవదేవుడు పిన్నవాడటయ్యా? మీకు బుద్ధి వున్నదా?

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **వీడు పిన్నవాడ!! విశ్వాత్ముడీతండు**
**వేంకటాద్రి మీద విభుడు తానె**
**పిన్నవయసువాడు వెన్నుడీ జగపతి**
**వీని లీల దెలియ వేరికగును?**





సంఖ్య: IV/3 రాగం : కళ్యాణి
కీర్తన : అచ్యుతుశరణమే అన్నిటికిని గురి

**కళ్యాణి**

**8 అచ్చుతు శరణమే అన్నిటికినిగురి**
**హెచ్చుకుందు మరి యెంచగనేది** ॥పల్లవి॥

**యోని జనకమగు యొడలిది**
**యే నెలవైనా నేటి కులము**
**తానును మలమూత్రపు చెలమ**
**నానాచారము నడచీనా** ॥అచ్చుతు॥

**పాప పుణ్యముల బదుకిది**
**యే పొద్దు మోక్షం బెటువలె దొరకు**
**దీపన బాధల దినములివి**
**చూపట్టి వెదకగ సుఖమిందేది** ॥అచ్చుతు॥

**మరిగిన తెరువల మనసు యిది**
**సరవినెన్న విజ్ఞానంబేది**
**యిరవుగ శ్రీ వేంకటేశ్వరుడే**
**వెరవని కంటే వెలితిక నేది** ॥అచ్చుతు॥

**ఉపోద్ఘాతము:**

జీవితం అన్నాక హెచ్చుతగ్గులు వుంటూనే బ్రతకాలి. ప్రతిసారీ ఆధిక్యంలో వుంటామనే నమ్మకంలేదు. మరి దేన్ని మంచి అని యెంచుతాము, దేన్ని చెడు అని యెంచుతాము? తల్లి కడుపులోంచి అందరూ ఒకేలా పుడుతున్నారు. ఒకడి గొప్ప యేమిటి, ఒకడి తక్కువేమిటి? అసలు వీడు అమ్మకడుపులో మలమూత్రాల చెలమలో కదూ తాను భూమ్మీదకువచ్చేదాకా గడిపింది? వీడు

పుట్టినదగ్గరనుంచి చచ్చేదాకా పాపపుణ్యాలతోనే బ్రతికాడు. మోక్షం యెలా వస్తుంది? అచ్చుతశరణమే అన్నిటికినీ గురి అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

అన్నిటికి (సమస్తమునకు) గురి (లక్ష్యము), ఒక్కటే సుమా! అది అచ్చుతు శరణమే. మరొకటి కాదు. ఎంచగ (లెక్కించి చూస్తే) మరి ఇందులో హెచ్చు కుందులు (యెక్కువ తక్కువలు) లేవు. శరణాగతులందరూ ఆయనకు సమానమే. ఈ హెచ్చుతగ్గులు మనము కల్పించుకొన్నవి.

ఈ శరీరం యొక్క ఆవిర్భావం యెక్కడనుండి వచ్చింది? ఏ నెలవైనా ( ఏ చోటునైనా) అంతేకాక తేడా వున్నదా? ఇక యెక్కడి కులము? ఆలోచించండి. పోనీ ఈ జీవి తల్లి గర్భంలో యెంత హీనంగా వున్నాడో చూడండి. మల మూత్రాల చెలమ (రొంపి)లో గడిపాడు కదా! ఇంకా వీడి ఆచారాలు యేమిసాగుతాయి?

ఈ జీవి అమ్మకడుపులోంచి బయటకు వచ్చింది మొదలు అనేక పాప పుణ్యాలు రెండూ చేస్తూనే వున్నాడు. ఏదో ఒకటి అనుభవిస్తూనే వుండే వీడికి మోక్షం యెట్లా దొరుకుతుంది? వీడి పాపపుణ్యాలననుసరించి వీడిదినములన్నీ యేదోవొక బాధతో నెట్టుకు రావలసిందే. ఇక ఇందులో చూపించి వెదకాలంటే సుఖము అనేది దొరుకుతుందా?

ఇకపోతే ఈ జీవుడికి ఒక మనస్సు అఘోరిస్తుంది. దాంట్లో కలికమేసి చూసినా విజ్ఞానం (భగవత్ జ్ఞానం) అన్నదే కనబడదు. ఇక మరి ఈ జీవుడి గతి ఇంతేనా? కాదు, యేదో ఒక నాటికి శ్రీ వేంకటేశ్వరుడే, వెరవని (ఉపాయమని) కంటే (తెలుసుకొంటాడు.) ఇరవుగ వెలితి ఇకనేది? (ఇక వాడికే లోటూ వుండదు).

**పద్యవివరణ:**

చం.॥ **వెరవక పాపపుణ్యముల వేదనజెందుచు జీవితాంతమున్**
**యెరుగకనే సుఖంబు చరియించును జీవుడు తల్లి గర్భమున్**
**తెరలిన కాలమున్ మఱచు, దిక్కని వేంకటనాథు నమ్మడే?**
**హరిశరణార్థులే ఘనులు, అన్నిటికిన్ గురి ఆ శరణ్యమే.**





సంఖ్య: IV/526 రాగం : రామక్రియ
కీర్తన : వీఁడివో కొలువున్నాఁడు విట్ఠలేశుఁడు

**రామక్రియ**

**9 వీఁడివో కొలువున్నాఁడు విట్ఠలేశుఁడు**
**మూఁడుమూర్తులతేజపుమూలమీతఁడు** ॥పల్లవి॥

**పంతముతో పాండవపక్షపాతి యీతఁడు**
**వింతలేని విదురునివిందు యీతఁడు**
**మంతుకెక్కినద్రౌపదీమానరక్షకుఁ డీతఁడు**
**చెంతనే వుద్ధవుపాలి చింతామణి యీతఁడు** ॥వీఁడివో॥

**మందగొల్లెతలకెల్లా మంగళసూత్ర మీతఁడు**
**కందువ నక్రూరునిభాగ్యం బీతఁడు**
**నందగోప యశోదల నవనిధాన మీతఁడు**
**అందపురుక్మిణీ మనోహరుఁడీతఁడు** ॥వీఁడివో॥

**దేవకీవసుదేవులదివ్యపద వీతఁడు**
**భావింప నందరిపరబ్రహ్మ మీతఁడు**
**కైవశమై దాసులకు కల్పవృక్ష మీతఁడు**
**శ్రీవేంకటాద్రిమీఁదిశ్రీపతి యీతఁడు** ॥వీఁడివో॥ **526**

**ఉపోద్ఘాతము:**

వీడేవో విట్ఠలేశ్వరుడై కొలువుదీరియున్నాడు. ఈతని మూల తేజస్సునకు కారణమేమంటే, బ్రహ్మవిష్ణు మహేశ్వరులని పిలువబడే ఆ ముప్పరికి మూలమైన పరబ్రహ్మము ఈ విట్ఠలదేవుడే అంటున్నారు అన్నమయ్య. అటుపైన ఆ స్వామి లీలలన్నీ వివరిస్తున్నారు. కైవశమై దాసుల పాలిటి కల్పవృక్షమైన శ్రీవేంకటేశ్వరుడు కూడా ఈ విట్ఠలుడేనట.

**తాత్పర్య వివరణ:**

ఈ విఠ్ఠలేశుడు వీడివో (విడిదియై ఇదో) వీడే కొలువుదీరియున్నాడు. ఈతడు మూడు మూర్తుల (త్రిమూర్తులని పిలువబడే) బ్రహ్మవిష్ణు మహేశ్వరుల తేజోమూలము (తేజస్సునకు ఆదిమూలము).

ఈతడు తననందరూ పాండవపక్షపాతి అని విమర్శిస్తూ వున్నా లెక్కసేయక ధర్మం వైపే వున్నాడు. కడజాతి వాడైనా విదురుడు ధర్మమూర్తిగావున ఆతని ఇంటనే విందు స్వీకరించిన ధర్మమూలము. సభకీడ్వబడి కౌరవుల చేత వలువలొలువబడిన ద్రౌపది పాలిటి మానసంరక్షకుడీ, దేవదేవుడే. అర్జునునివలె తనకే శరణాగతుడైన ఉద్ధవునికి ఉద్ధవగీత వినిపించి ధన్యుని చేసి ఆతని పాలిటి చింతామణియైనాడు.

నందవ్రజమున గొల్లెతల మందకు, వారి మనోకామనలు తీర్చి మంగళసూత్రమై మానసికముగా మగడైనాడు. అక్రూరునికి ఒకే సమయంలో రెండుచోట్ల కనుపించి తాను అవతార స్వరూపుడనని గ్రహించే భాగ్యము ప్రసాదించాడు. ఇక యశోదా నందగోపులకు ఈ శ్రీకృష్ణుడేనవనిధానము (కుబేరుని నవనిధులవంటి సౌభాగ్యము). ఆ తరువాత రుక్మిణీదేవి తనను వలచి బ్రాహ్మణునితో సందేశం పంపించి మనోహరా నన్ను కాపాడమంటే పరిణయమాడిన యదువల్లభుడు.

ఇతడు తనను కన్న దేవకీవసుదేవులకు తన పుత్రపౌత్ర వాత్సల్యం అనుభవప్రాప్తే కాక అంత్యమున మోక్షముకూడా ప్రసాదించాడు. భీష్మాదులందరూ అందుకే ఆయనను పరబ్రహ్మగా భావించారు. ఈనాడు కలియుగంలో శ్రీవేంకటాద్రిమీద శ్రీపతియై తన దాసులకు తాను కైవశమై (స్వాధీనుడై) వారిపాలిట కల్పవృక్షమై వారి కోరికలను తీరుస్తున్నాడు ఇతడే.

**పద్యవివరణ:**

ఉ.॥ **పాండవపక్షపాతియట పాయకద్రౌపదిమానదాతయున్**
**మెండుగ గోపకన్నెలకు మేటిమగండట విట్ఠలేశుడున్**
**నిండుగ మూడుమూర్తులకు నిక్కపు మూలము బ్రహ్మమీతడే**
**అండగు వేంకటేశ్వరుడు ఆర్తులదాసుల కల్పవృక్షమౌ.**





సంఖ్య: IV/527 రాగం : లలిత
కీర్తన : ఈతని మహిమలు యెంతని చెప్పెద

**లలిత**

**10 ఈతని మహిమలు యెంతని చెప్పెద**
**చేతులమొక్కెదఁ జెలఁగుచు నేను** ॥పల్లవి॥

**శ్రీనరసింహుడు చిన్మయమూరితి**
**నానావిధకరనఖరుఁడు**
**దారుణదైత్యవిదారుఁడు విష్ణుఁడు**
**తానకమగు మా దైవంబితఁడు** ॥ఈతని॥

**అహోబలేశుఁడు ఆదిమపురుషుఁడు**
**బహుదేవతాసార్వభౌముఁడు**
**సహజానందుఁడు సర్వరక్షకుఁడు**
**యిహపరములొసఁగుయేలిక యితఁడు** ॥ఈతని॥

**కేవలుఁడగు సుగ్రీవనృసింహుఁడు**
**భావించ సుజనపాలకుఁడు**
**శ్రీవేంకటేశుఁడు చిత్తజజనకుఁడు**
**వేవేలకు నిలువేలుపు యితఁడు** ॥ఈతని॥ **527**

**ఉపోద్ఘాతము:**

అహోబలంలోని సుగ్రీవనృసింహునిపై చక్కటి కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఈ స్వామి మహిమలెంతని చెప్పగలను? నావల్ల అయ్యే పనియేనా? అందుకనే రెండు చేతులూ యెత్తి మ్రొక్కుతాను, అని అంటున్నారు. దైత్యులను మట్టుబెట్టటానికి వచ్చిన విష్ణువే ఇతడు. ఈ నరసింహుడు చిన్మయమూర్తి. అహోబలంలో వెలసిన ఆదిపురుషుడు. ఈ

సుగ్రీవ నరసింహుడు కైవల్యపుదాత. అంతేకాదు ఆ యేడుకొండలపై వెలసిన శ్రీవేంకటేశ్వరుడు కూడా ఆయనే అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఈతని (ఈ నృసింహుని) మహిమలు యెంతని చెప్పెద (వివరించెదను)? నేను చెలగుచు (అతిశయించుచూ) చేతులెత్తి ఈ స్వామికి మ్రొక్కెదను.

ఈ శ్రీ నరసింహుడు చిన్మయమూర్తి (చిదానందస్వరూపుడు). ఈయన నానావిధ (అనేక విధములగు) నఖములను (గోళ్ళను) ఆయుధములుగా వాడిన నఖరుడు. దారుణ (భయంకరమైన) దైత్య (రాక్షసుని) విదారుడు (చీల్చి సంహరించినవాడు). ఈయనే విష్ణువు. ఇతడే తానకమగు (సుస్థిరుడైన) మా దైవము (ఇలవేల్పు).

ఈ అహోబలేశ్వరుడు ఆదిమపురుషుడు (ఆదిమూర్తి). దేవతలందరికీ ఈయనే సార్వభౌముడు (చక్రవర్తి). ఈయన ఎపుడూ సహజానందము (ఆత్మానందం)లో వుంటాడు. ఇహపరములు (ఇహలోకమున) ప్రాపంచిక సుఖములు, పరలోకమున దివ్య సుఖములు ఒసగులోకపాలకుడు ఈతడే.

కేవలుడగు (పరమాత్మయైన) ఈ సుగ్రీవనరసింహుడు ఆలోచిస్తే సజ్జనులకు యేలికవంటివాడు. ఈ మహానుభావుడే మన్మథుని తండ్రిగారైన శ్రీవేంకటేశ్వరుడు కూడా. ఇతడు వేవేలకున్ (వేలాదిమంది భక్తులకు) ఇలవేలుపు (ఇంటి దైవము).

**పద్యవివరణ:**

తే.గీ.|| **మహిమలెంతని చెప్పెద మనవిజేసి**
**చెలగి మ్రొక్కెదనితనికి చేతులెత్తి**
**ఈ అహోబలేశుడు దీర్చు నిహముపరము**
**వేంకటేశుడు యీతడే శంకలేల?**





సంఖ్య: IV/282 రాగం : ముఖారి
కీర్తన : కొలువరో మొక్కరో కోరి తలచరో

**ముఖారి**

**11 కొలువరో మొక్కరో కోరి తలఁచరో**
**చెలఁగి మనల రక్షించీని వీఁడె** ||పల్లవి||

**పాయపువాఁడు నల్లఁబల్లిచెన్నుఁడు**
**వేయినామములవెన్నుఁడు**
**పాయకకొల్చినభక్తప్రపన్నుఁడు**
**యీయెడనే వరములు యిచ్చీని వీఁడే** ||కొలు||

**పరిపూర్ణుఁడు మహానుభావుఁడు**
**తిరమగు దేవాధిదేవుఁడు**
**పరమానందస్వభావుఁడు**
**గరిమెఁ గరుణతోఁ గాచీని వీఁడె** ||కొలు||

**తెలియుఁ డీతఁడె దేవాగ్రగణ్యుఁడు**
**వలనుగ యోగీంద్రవరేణ్యుఁడు**
**అలరఁగ శ్రీవేంకటాచలేశపుణ్యుఁడు**
**నలిఁ బ్రసన్నుఁడై నవ్వీని వీఁడె** ||కొలు|| **282**

**ఉపోద్ఘాతము:**

నల్లబల్లి అనే గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామిపై చక్కటి కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. మనల్ని రక్షించగల అనాథరక్షకుడు వీడే. వీనిని ధ్యానించండి పూజించండి. మీ కోరికలు నెరవేరుటకు మొక్కండి అని ప్రబోధిస్తున్నారు. నవ్వులొలికిస్తున్న ఈ ప్రసన్నమూర్తే అక్కడ తిరుమలలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరుడూను అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రజలారా! కొలువరో (ఈ నల్లబల్లి చెన్నకేశవుని సేవించండి). కోరి మొక్కరో (మీకు అభీష్టములైన కోర్కెలను కోరుకొని అవి నెరవేరాలని ఈ స్వామికి మొక్కండి). తలచరో (ఈ దేవుని ధ్యానించండి). వీడె (ఈ దేవదేవుడే) చెలగి (అతిశయించి) మనందరినీ రక్షించును.

ఈ నల్లబల్లి చెన్నుడు పాయపువాడు (మంచి కోడె వయసులో వున్నవాడు). ఈయనే వేయినామములతో కీర్తించబడెడి శ్రీకృష్ణపరమాత్మకూడా. ఎన్నడూ తనపై నమ్మకం పాయక (వీడక) కొలిచే తన భక్తులకు అతిప్రసన్నుడు. ఇదిగో చూడండి వీడె ఇక్కడికిక్కడే వరములనెలా ఇచ్చేస్తున్నాడో!

ఈ చెన్నకేశవుడు పరిపూర్ణుడైన మహానుభావుడు. తిరమగు (సుస్థిరమైన) దేవదేవుడు. ఎప్పుడూ పరమానందము తన స్వభావంగా కలవాడు. వీడె ( ఈస్వామే) గరిమన్ కరుణతో (అద్భుతమైన దయాస్వభావముతో) గాచీని (సంరక్షిస్తాడు).

ఓ మానవులారా! ఈతడే దేవతలందరిలోనా అగ్రగణ్యుడని తెలియండి. వలనుగ (అనుకూలుడై) యోగీంద్రులకు, వరేణ్యుడు (ముఖ్యుడు). ఈయనే శ్రీవేంకటాచలమున నెలకొన్న పుణ్యుడు (పుణ్యాత్ముడు). వీడె (ఈయనే)c నల్లబల్ల చెన్నుడై భక్త ప్రసన్నుడై నలి నవ్వులొలికిస్తున్నాడు (మొలక నవ్వులు చిందిస్తున్నాడు).

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **నల్లబల్లిలోన నగుమోము చెన్నుడు**
**వేయిపేర్లవాడు వెన్నుడితడు**
**కొలువుదీరిగాచు తలచేటి భక్తుల**
**ఇతడె తిరుమలయ్య ఇది నిజంబు**





సంఖ్య: IV/525 రాగం : బౌళిరామక్రియ
కీర్తన : వీడివో కలశాపుర వీరహనుమంతుడు

**బౌళిరామక్రియ**

12 **వీఁడివో కలశాపుర వీరహనుమంతుఁడు**
**వాఁడిమిమెరసినట్టివజ్రపాణి యితఁడు** ॥పల్లవి॥

**చలపట్టి జంగచాఁచి జలధి దాఁటినవాఁడు**
**తలకొన్న రాముని ప్రతాపపువాఁడు**
**యెలమి సీతకుంగరమిచ్చి మెప్పించినవాఁడు**
**కలగుండు వడ లంకఁ గాలిచినవాఁడు** ॥వీఁడివో॥

**మగిడి రాఘవునకు మణి దెచ్చినట్టివాఁడు**
**గగనము మోచిన కాయమువాఁడు**
**మొగి సూర్యునిచే శాస్త్రముల చదివినవాఁడు**
**పగటున మీఁదిబ్రహ్మపట్టమేలేవాఁడు** ॥వీఁడివో॥

**యిప్పుడూఁ బ్రాణముతోనే యిల దేవుఁడైనవాఁడు**
**చెప్పఁగొత్తైనమహిమఁ జెన్నొందువాఁడు**
**ముప్పిరి శ్రీవేంకటేశుమూలబలమైనవాఁడు**
**వొప్పుగు వరా లిందరి కొసగేటివాఁడు** ॥వీఁడివో॥

**ఉపోద్ఘాతము:**

కలశాపురంలో వెలసిన వీరాంజనేయస్వామిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆచార్యులవారు హనుమంతుడు రామబంటుగా చేసిన ఘనకార్యాలను మననం చేస్తూ కొసమెరుపుగా ముప్పిరి శ్రీవేంకటేశు మూలబలమైనవాడు అని వేంకట మకుటంతోనే కీర్తన ముగిస్తున్నారు. ప్రస్ఫుటంగా కనుపిస్తున్న ఈ స్వామి వజ్రమంతటి కఠినమైన చేయి మెఱిసిపోతున్నదట. అంతేకాదు వరాలివ్వటంలో కూడా ఈ హనుమంతుడు దిట్టయే.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రజలారా! వీడివో (ఇదిగో వీడే) కలశాపురమున వెలసిన వీరహనుమంతుడు. ఇతడు వాడిమి మెరసినట్టి (తేజస్సుతో మెరిసిపోతున్న) వజ్ర పాణి (వజ్రసదృశమైన అరచేయి కలవాడు).

ఈ మహానుభావుడు, చలపట్టి (కృతనిశ్చయుడై) జంగచాచి (తన జంగను, అనగా పిక్కను బార చాచిన వాడై) ఇతడు నూరుయోజనముల జలధిని దాటినాడు. ఇతడు శ్రీరాముని ప్రతాపమును తలకొన్నవాడు (కార్యరూపం దాల్చినవాడు). ఎలమి (సంతోషముతో) సీతమ్మకు శ్రీరాముని ఉంగరమును అందించి మెప్పు పొందిన వాడు. కలగుండువడ (గొప్ప క్షోభ కలుగునట్లు) లంకానగరమును కాల్చివేసినవాడే ఈ వీరహనుమంతుడు.

ఈ రామబంటే, మగిడి (కిష్కింధకు మరలివచ్చి) రాఘవునకు సీతమ్మ చూడామణిని ఆనవాలుగా అందించినాడు. తన శక్తి యేపాటిదో చూపుటకు గగనము మోచిన (ఆకాశమునే మోసిన) తన శరీరమును పెంచి చూపించాడు. సూర్యుడు యెలా ప్రయాణిస్తుంటే అలా తన తలత్రిప్పి శాస్త్రములన్నిటినీ ఆయన నుండి నేర్చుకొన్నాడీ హనుమంతుడు. అందుకనే రాబోయే కల్పములో ఈయన బ్రహ్మపదవిని నిర్వహించబోతున్నాడు.

ఇల (భూలోకంలో) ఈ కలశాపురములో యిప్పుడూ నేటికీ ప్రాణమున్న వానిలా ఊపిరిపీలుస్తూ సాటిలేని దేవుడై అతిశయించి యున్నాడు. రకరకములైన వినూత్న మహిమలను ప్రదర్శించువాడు ఈ స్వామి ముప్పిరి (సంతోషంతో) శ్రీవేంకటేశ్వరునికి మూల బలము ఈయనే. తన భక్తులకు ఒప్పయిన అనేక వరములను ఈ వీరహనుమంతుడు అనుగ్రహిస్తున్నాడు.

**పద్యవివరణ:**

కం.॥ **వీడే కలశాపురమున**
**వాడిమిమెరసేటివజ్రపాణి, చెలగుచున్**
**కూడిన వేంకటపతికిని**
**తోడుగు బంటాయె హనుమతొలగని నీడై**





సంఖ్య: IV/209 రాగం : కేదారగౌళ
కీర్తన : ఇందిరానాథుడవు ఇందరికి నేలికవు

### కేదారగౌళ

**13 ఇందిరానాథుఁడవ యిందరికి నేలికవు**
**చిదరవందరలైన చింతలు మరేలా** ॥పల్లవి॥

**వుండుమంటే నుండవీ(డినవి?) వూరకే బ్రహ్మాండాలు**
**నిండుమంటే నిండినవి నీరధులెల్లా**
**మెండగుప్రతాపమిదె మించి నీ వినోదమిదె**
**వొండుదైవాలఁ గొలువ నూరకే మరేలా** ॥ఇంది॥

**పుట్టుమంటేఁ బుట్టిరి పూఁచినదేవతలెల్ల**
**అట్టే యణఁగిరిగా అసురలెల్ల**
**పట్టిన నీ చలమిదె బహుళస్వతంత్ర మిదె**
**వెట్టిదైవాలపనులు వేరే మరేలా** ॥ఇంది॥

**కమ్మంటే నాయను కైవల్యపదవులు**
**రమ్మంటే వచ్చె వేదరాసులెల్లను**
**కమ్మిన శ్రీవేంకటాద్రి కడపరాయఁడ నీకు**
**యిమ్ముల నీమహి మిదె యితరములేలా** ॥ఇంది॥ **209**

**ఉపోద్ఘాతము:**

కడప (దేవునిగడప) లో వెలసిన శ్రీవేంకటేశ్వరునిపై చక్కటి కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఇందరికి ప్రభువువైన ఇందిరానాథుడవు నీవే. నీవు నా యేలికవై నన్ను కాపాడుతుంటే నన్ను చిందరవందర (గజిబిజి) చేసే చింతలు (దిగుళ్ళు) మరేల (మరెందుకు) అంటున్నారు. దేవతలంతా నీవు పుట్టమంటే పుట్టారు. రాక్షసులంతా నీవు చావమంటే చచ్చారు. నీవు సర్వ స్వతంత్రుడవు. ఆ వెట్టి దైవాలు నీకు సరితూగుతారా స్వామీ! అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రభూ! నీవు ఇందిరానాథుడవు. ఇందరికీ ఈ త్రిభువనాలలోవున్న సర్వులకు యేలికవు (దొరవు). నీవు మాకు రక్షకుడవైతోడుండగా మాకు చిందరవందరలైన (గజిబిజి చేసే) చింతలు (దిగుళ్ళు) మరేల? (ఇంకా యెందుకు?)

ఈ సృష్టిలో అనేకమైన బ్రహ్మాండాలు వున్నాయి. అవన్నీ నీవు వూరకనే వుండవద్దు అంటే మరుక్షణంలో వుండవు. అసలు ఈ సముద్రాలలోకి నీరెలావచ్చింది? అవి నీవు నిండమంటే నిండాయి. రేపు నీవు వద్దంటే వాటిలో ఒక్కచుక్క నీరుండదు. ఈ సృష్టి అంతా నీ వినోదం కోసం నీ ప్రతాపము చూపుటకు నీవు చేసికొనినదే. నీవు వుండగా వూరకే పరదేవతలను కొలువవలసిన అవసరం నాకేమిటి?

ఓ దేవదేవా! ఈ దేవతలంతా నీవు పుట్టమంటే పుట్టారు. త్రేతాయుగంలో కోతులుగా కూడా పుట్టారు కదా! అట్టే (అదేవిధంగా) అసురులంతా నీవు చావమంటే చచ్చారు. నీ చలమిదే (నీ పట్టుదల నీదే). నీవు అన్ని విధములా సర్వస్వతంత్రుడవు. నీవుండగా వెట్టి దేవాలతో (చిల్లర దేవుళ్ళతో) పనులు యెందుకయ్యా?

ప్రభూ! నీవు కైవల్యపదవుల (మోక్షము) కమ్మంటే నాయెను (కావాలనుకొన్నవారికి ఇయ్యగలవు). ఎవ్వనికైనా వేదవిద్య రావాలంటే రాదు. అది నీవు దయగొని వీనికి వేదవిద్యరావాలి అనుకొంటే వస్తుంది లేకపోతే రానేరాదు (ధారణయే వుండదు కదా!) కడపలో ఆవరించిన శ్రీవేంకటేశ్వరా! నీకు ఇమ్మేల (మనోజ్ఞమైన సృష్టిఅంతా) నీ మహిమే. ఇతరములు అనవసరము.

**పద్యవివరణ:**

ఉ.॥ **చిందరవందరైన పలు చింతలికన్ మరియేల, నమ్మెడీ**
**ఇందరి నేలినట్టి విభుడీతడె యెంచిన ఇందిరాపతే,**
**ఎందుకు వెట్టి దైవముల యేపుగ గొల్చుట? వేంకటేశుడే**
**విందగు రాయడై కడపవీధులనేగెను బ్రోవయెల్లరన్.**





సంఖ్య: XV/76 రాగం : బౌళి
కీర్తన : గోవింద కేశవ నీకు కుయ్యో మొఱ్ఱో

**బౌళి**

**14 గోవింద కేశవ నీకు కుయ్యో మొఱ్ఱో**
**వోవల నీపాలఁజిక్క దోహో నా మనసు ॥పల్లవి॥**

**వొకటిపైఁ గాంక్షించు వొకటిపై వేసారు**
**వొకవేళ దుర్మాన మొడిగట్టును**
**వికలుఁడై యంతలోనే విషయపుబారిఁ జిక్కు**
**అకటా యిన్నిటాఁ దుమురాయఁబో నా మనసు ॥గోవింద॥**

**తలపోను నొకవేళ తమకించు నొకవేళ**
**వొలుఁ గోపము చల మొకవేళ**
**కలఁగించు నొక వేళ గర్వించు నొకవేళ**
**పొలసి యిన్నిటా వీదిఁబోయఁ బో నా మనసూ ॥గోవింద॥**

**సంతసించు నొకవేళ జయమందు నొకవేళ**
**పంతమాడు నొక మట్టుపడినవేళ**
**యింతలో నీవు శ్రీవేంకటేశ కావకయుండితే**
**రంతుల నేమీఁ జెప్పరాదువో నా మనసూ ॥గోవింద॥**

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య కుమారుడు పెదతిరుమలయ్య చెప్పిన చక్కటి కీర్తననాస్వాదించండి. తండ్రి అంత పరిపుష్టి కలుపైనా భక్తిశృంగార అధ్యాత్మ కీర్తనలు చెప్పడంలో ఈయన దిట్టయే. నన్నేం చెయ్యమంటావు గోవిందా! నా ఈ పాపిష్టి మనస్సు నీపట్ల చిక్కదాయె. నేనెంత కుయ్యో! మొఱ్ఱో అని యేడ్చినా దీని దారి దీనిదే. ఇంత చంచలమైన, విషయలోలత్వముగల, కోపిష్టి గర్వపోతు మనస్సు నాకెందుకు పెట్టావు స్వామీ! నీవు కావకుండితే రంతులన్ యేమీ జెప్పరాదువో నా మనస్సు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

హే! గోవిందా! హే! కేశవా! నీకు కుయ్యో! మొఱ్ఱో (కుయ్యో! మొఱ్ఱో అని నీ కొఱకు యేడుస్తున్నానయ్యా!) ఇదేమిటి ప్రభూ! ఈ నా మనస్సు వోవల (ఒప్పుగా) నీపాల జిక్కదు (నీయందులగ్నముకాదు!) ఓహో! యేమి నా దౌర్భాగ్యము!!

ప్రభూ! ఈ నామనస్సుందే... ఇది ఒకటిపై గాంక్షించు (ఒకదాన్ని కోరుకుంటుంది). కానీ ఇంకోదానికోసం వెంపర్లాడుతుంది. ఒక్కొక్కప్పుడు దుర్మార్గమైన పనులకు ఒడిగడుతుంది. మళ్ళీ అంతలోనే వికలత్వమునొంది విషయలోలత్వము నొందుతుంది. అకటా! (అయ్యో!) నా మనస్సు యిన్నిటా ఇన్ని విధాలుగ తుమురాయెబో (ముక్కలు ముక్కలయిపోయింది కదా!)

ప్రభూ! ఈ మనస్సువున్నదే ఒక్కొక్కప్పుడు నిన్ను తలపోస్తూ వుంటుంది.) ఒక్కొక్కప్పుడు తమకిస్తుంది. (చలించిపోతుంది). ఒక్కొక్కప్పుడు విపరీతమైన కోపమునకు లోనవుతుంది. ఒకప్పుడు మత్సరముతో వుంటుంది. ఒక్కొక్కప్పుడు పోట్లాడుతుంది. ఒక్కొక్కప్పుడు విపరీతమైన గర్వమును పొందుతుంది. ఓ దేవా! పొలసి (కావాలని) నా మనస్సు నన్నిలా వీధిపాలు చేసిందయ్యా!

ఈ నా మనస్సు ఒక్కొప్పుడు విజయగర్వంతో గొప్ప సంతోషంతో వుంటుంది. ఒక మట్టుపడినవేళ (అణగారివున్నవేళ) పంతముకూడా నా మనస్సు పడుతుంది. అంతెందుకు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు కనుక దీన్ని దయదలచకుండావుంటే ఈ పాటికి రంతుల (భోగాసక్తమై) యేమయ్యేదో ఈ మనస్సు నేను చెప్పలేను.

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **ఏమిసెబుదునయ్యా! హే! వేంకటేశ్వరా!**
**పట్టదాయెనిన్ను పాపి "మనసు"**
**కుయ్యో! మొఱ్ఱో! నీకు గోవింద కేశవా!**
**పెద్ద తిరుమలయ్య వెతను బొందె.**





సంఖ్య: I/310 రాగం : ఛాయానాట
కీర్తన : తలప వెనక నుయ్యి తగరు ముందట

**ఛాయానాట**

**15 తలఁప వెనక నుయ్యి తగరు ముందట (?) దీనఁ**
**దొలఁగ నాకుఁ దెరువుదోప దేమి సేతు** ॥పల్లవి॥

**మమకార(ము) విముక్తి మార్గదూరము నీపై**
**మమతసేయక నాకు మనరాదు**
**మమత మేలో నిర్మమత మేలో దీని**
**క్రమము నక్రమము నేఁ గాన నేమిసేతు** ॥తలఁ॥

**కర్మమార్గము జన్మగతికిఁ జేరువ ని-**
**ష్కర్మము పాతకమునకుఁ దొడవు**
**కర్మిగావలెనో నిష్కర్మి గావలెనో యీ**
**మర్మంపుమదము మాన దేమిసేతు** ॥తలఁ॥

**శరణాగతరక్షకుఁడ వైనయట్టి**
**తిరువేంకటగిరిదేవుఁడా**
**పరిపూర్ణుఁడవో నీవు పరిచ్ఛిన్నుఁ డవో ని-**
**న్నరసి భజింప లేనైతి నేమిసేతు** ॥తలఁ॥

**ఉపోద్ఘాతము:**

తగురు అంటే పొట్టేలు అని అర్థం. ఒకటి పరిస్థితి యెట్లా వున్నదంటే వాడిని పొడవడానికి కొమ్ములు తిరిగిన పొట్టేలు వాడి ముందునుంచి వస్తున్నది. పోనీ వెనుకకు తిరిగి పారిపోదామా అంటే వెనుక భాగాన పెద్ద దిగుడు బావి వున్నది. నాకు వేరే దారి కనుపడుట లేదు అని వాపోతున్నారు అన్నమ్య. నేను దిక్కుతోచనివాడనవుతున్నాను స్వామీ! మమకారం వదులుకోకపోతే విముక్తి లేదు, ముక్తి రాదు అంటారు. మరి

నీపై మమకారం చూపించకుండా నేను వుండలేను. అంటే ఇకనాకు ముక్తి వచ్చే దారే లేదా ప్రభూ! అన్నమయ్య శరణాగతి అసామాన్యము.

**తాత్పర్య వివరణ:**

ప్రభూ! తలప (ఆలోచిస్తే) నా అవస్థ చాలా దయనీయంగా వున్నది. నా వెనుక పెద్ద నుయ్యి (దిగుడు బావి) వున్నది. వెనకడుగేస్తే దాంట్లో పడిపోతాను. ఇక నా ముందర తగరు (కొమ్ములు తిరిగిన పొట్టేలు) కుమ్మటానికి సిద్ధంగా వున్నది. దీనన్ (దీనుడను) తొలగనాకు తెరవు దోపదు (తప్పించుకోటానికి దారి తెలియటంలేదు). ఏమిసేతు (యేమి చేయగలను?)

పెద్దలేమంటారంటే, మమకారము యెవరిపైన పెంచుకోరాదు. అది విముక్తి మార్గదూరము (ముక్తి మార్గం నుండి మనల్ని దూరం చేస్తుంది.) కానీ నాకేమో నీపై మమకారం వదులుకోవటం సాధ్యంకావటం లేదు. మరి నేను సందిగ్ధంలోవున్నాను. మమత మేలా? నిర్మమతమేలా? ఏది సక్రమమైనది? ఏది అక్రమమైనది? నాకేమీ గోచరమగుటలేదు. నేనేం చేయను తండ్రీ!

సరే! కర్మమార్గముననుసరిద్దాంలే అనుకుంటే దానివల్ల యేవేవో జన్మలను పొందటం తప్పించి నాకు ఒరిగేదేమున్నది? పోనీ యేమీ చేయకుండా, నిష్కర్మిగా వుందామంటే, అది పాతకమునకు తొడవు (పాపానికి హేతువు). అందుకని కర్మిగా వుండాలో నిష్కర్మిగా వుండాలో, దాని రహస్యమేమిటో కర్మిష్ఠినైతే కోరికోరి మదోన్మత్తుడనవటం దేనికా, అనిపిస్తున్నది.

శరణాగత రక్షకుడవైన ఓ తిరువేంకటేశ్వరా! నీకూ నాకూ పోలికేమిటి ప్రభూ! నీవు పరిపూర్ణుడవు. నీలో లోపం అనేదానికి ఆస్కారమే లేదు. మరి నేనో? నేనొక పరిచ్ఛిన్నుడను (సక్రమమైన మార్గాన్ని వదలివేసినవాడను). నిన్నరసి (నిన్ను చూచి కూడా) భజించలేకున్నాను. నేనేమి సేతును? నాకు దిక్కెవరు?

**పద్యవివరణ:**

చం.॥ **తలపగనుయ్యి నా వెనుక దారి యొకింతనెరుంగనైతిన**
**న్నిలువున కుమ్మగా "తగరు" నిల్చునియున్నది నాదు ముందరన్**
**తొలగనశక్తుడైతినిక తోపదు యేమియు వేంకటేశ్వరా!**
**కొలుతును కావుమా శరణుకోరిన కాదన నీకు కాదురా!**





సంఖ్య: I/411 రాగం : దేవగాంధారి
కీర్తన : మిక్కిలి పుణ్యులు హరి మీదాసులే హరి

**దేవగాంధారి**

**16 మిక్కిలి పుణ్యులు హరి మీదాసులే హరి**
**తక్కిన వారు మీ కృప దప్పిన వారు హరి** ॥పల్లవి॥

**వున్నతపు సంపదల నోలలాడే యట్టివాఁడు**
**మున్నిటి జన్మాన నీకు మ్రొక్కినవాఁడు హరి**
**పన్ని పదనిపాట్లఁబరులఁగొలిచే వాఁడు**
**వున్నతి మిము సేవించ నొల్లని వాఁడు హరి** ॥మిక్కి॥

**పూని దేవేంద్రాదులై పొడవు కెక్కిన వారు**
**శ్రీనాథ మిమ్మునే పూజించినవారు హరి**
**నానానరకముల నలఁగుచుండే వారు**
**నానాఁడే నీ మహిమ నమ్మని వారు హరి** ॥మిక్కి॥

**పావనులై నిజభక్తి ప్రపన్ను లయ్యిన వారు**
**శ్రీ వేంకటేశ మిమ్ముఁ జేరినవారె హరి**
**వేవేలు దేవతల వెంటఁదగిలేటివాఁడు**
**కావించి మిమ్మెఱఁగని కర్మి యాతఁడే హరి** ॥మిక్కి॥

**ఉపోద్ఘాతము:**

"నానాఁడు" అంటే ప్రతిదినము అని అర్థం. నానాఁడే అంటే 'ఏనాడూ' అనే నేటి కాలము మాటకి అన్నమయ్య కాలం నాటి రూపం. ఓ ప్రభూ! నానా నరకబాధలతో నలిగిపోయే వారెవరంటే యేనాడూ నీ మహిమను నమ్మనివాడు అంటున్నారు. మనం అష్టకష్టాలు పడుతున్నవారిని చూస్తుంటాం. వారంతా హరినిగాక పరులను సేవించే వారే అంటున్నారు. ఒక్క హరిదాసులు తప్పించి తక్కినవారంతా నీ దయను పోగొట్టుకొన్నవారే స్వామీ! అని నమ్మకంగా చెబుతున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీహరీ! ఈ ప్రపంచంలో మిక్కిలి పుణ్యులు ఎవరయ్యా? అంటే మీ దాసులు మాత్రమే. తక్కినవారంతా మీ కృప దప్పినవారే (పోగొట్టుకొనిన వారలేనయ్యా) శ్రీహరీ!

ఈ ప్రపంచంలో కొంతమంది వున్నతమూ, అనంతము అయిన సిరి సంపదలలో నోలలాడుతుంటారు? ఎందుకో తెలుసా? అట్టివారు మున్నిటి జన్మలో (వారి గత జన్మలో) నీకు భక్తితో మొక్కినవారు. వాడి కర్మకొద్దీ అరిషడ్వర్గాలకు లోనై ఈ జన్మలో వాడు దుర్మార్గుడే కావచ్చును.కానీ గత జన్మలో నీ భక్తి వున్నందున ఈ జన్మలో సిరి సంపదలుంటాయి. మరికొంతమంది వుంటారు. వారు పన్ని (తప్పక) పడరానిపాట్లు పడుతూ పరులకు దాస్యం చేస్తుంటారు. ఉన్నతముగా మిమ్ము (శ్రీహరిని) సేవించనొల్లని (ఒప్పుకోని) వారే ఆ తిప్పలు పడుతున్నవారంతా.

ఓ శ్రీహరీ! దేవేంద్ర పదవినలంకరించి, పొడవుకెక్కినవారు (మంచి ఔన్నత్యమును పొందినవారు) వేరెవరో కాదయ్యా! శ్రీనాథా వారంతా పూని మిమ్ము భక్తితో కొన్ని జన్మలుగా నిత్యమూ పూజించినవారే సుమా! మరికొంతమంది వున్నారు. వారు నానా నరకయాతనలు, అష్టకష్టాలుపడుతూ నలిగిపోతుంటారు. వారెవరో తెలుసా? గత జన్మలో నానాడే (ఏనాడూ) నీమహిమను నమ్మని నాస్తికులు.

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ భక్తితో పావనులై, ప్రపన్నులైన (శరణాగతులైన) వారు మిమ్ము చేరుకొంటారు. ఓ హరీ! తక్కిన భ్రష్టులంతా, వేవేలు దేవతలు (రకరకాల దేవతల) నాశ్రయించి వారి వెంట తగులుతుంటారు. అట్టివాడు కర్మిష్టియై యజ్ఞయాగాలు ఆర్భాటంగా చేస్తాడు కానీ కావించి (సంగ్రహించి) యెన్నడు మీ తత్త్వమునెరుగడు.

**పద్యవివరణ:**

కం.॥ **మిక్కిలి పుణ్యులు హరి నీ**
**లెక్కకు మిక్కుటములైన లెంకలు దాసుల్**
**తక్కినవారలు మీ కృప**
**ఒక్కింతయులేనివారు ఉర్వీరమణా!**





సంఖ్య: IV/4 రాగం : బౌళి
కీర్తన : నిజమో కల్లో నిమిషములోననె

**బౌళి**

**17 నిజమో కల్లో నిమిషములోననె**
**భజించువారల భాగ్యముకొలఁది** ॥పల్లవి॥

**వొకఁడు కనుదెరచి వున్నది జగమను**
**వొకఁడు కన్నుమూశొగి లేదనును**
**సకలము నిట్లనె సర్వేశ్వరుఁడును**
**వెకలినరులు భావించినకొలఁది** ॥నిజ॥

**కడుపు నిండొకఁడు లోకము దనిసె నను**
**కడుపు వెలితైనఁ గడమను నొక్కఁడు**
**తడవిన నిట్లనే దైవ మిందరికి**
**వెదగు నరులు భావించినకొలఁది** ॥నిజ॥

**ముదిసి యొకఁ దనును మోక్షము చేర్వని**
**తుదఁ బుట్టొకఁడది దూరమనును**
**యెదుటనే శ్రీవేంకటేశ్వరుఁ డిట్లనే**
**వెదకి నరులు భావించినకొలఁది** ॥నిజ॥

**ఉపోద్ఘాతము:**

భగవంతుని వునికి నిజమా? కల్లయా? కొందరికి వారి జీవితాంతమూ తపస్సు చేసినా కానరాడు. కొందరికి నిమిషములో ప్రత్యక్షమవుతాడు. ఇదంతా యెందువలన జరుగుతున్నది? ఆ దేవదేవుని భజియించేవారి సుకృతమును బట్టి జరుగుతున్నది అంటున్నారు అన్నమయ్య. అసలిదంతా యెందుకు జరుగుతున్నది? దేవుడు వున్నాడా లేడా? అది వారి వారి భావన మీద ఆధారపడివున్నది. కళ్ళు తెరచిన వాడు ప్రపంచం వుందనుకొంటాడు. కళ్ళు మూసుకొన్నవాడు ప్రపంచమనేదే లేదంటాడు. సర్వేశ్వరుడు కూడా అంతే వెదకితే కనుపిస్తాడు. లేదులే అని వెదుకకుంటే కనబడదు.

**తాత్పర్య వివరణ:**

భగవంతుని వునికి నిజమో? కల్లయొ (అబద్ధమో) చెప్పుటెట్లు? కొందరికి నిమిషములో తన దర్శన భాగ్యం కలిగిస్తాడు. కొందరికి జన్మంతా ప్రయత్నించినా కనబడదు. అదంతా ఆ స్వామిని భజించేవారి భాగ్యము కొలది (సుకృతాన్నిబట్టి) వుంటుంది.

కళ్ళు తెరచుకొనియున్న ఒకడు, నిజమే ఈ జగము సత్యమే అంటాడు. కాని కళ్ళుమూసికొనిన ఇంకొకడు ఒగి (నమ్మకంగా) అసలీ జగత్తు లేనేలేదు అంటాడు. సకలము ఇదే విధంగా వుంటుంది. సర్వేశ్వరుడు కూడా ఇంతే. వెకలి (ఆసక్తితో) నరులు భావించినట్లే సర్వేశ్వరుడూ వుంటాడు. లోకమురీరే ఇంత.

ఒకనికి కడుపు నిండి తనిసినాడు (తృప్తి చెందినాడు) అనుకోండి. వాడికి లోకమంతా తృప్తి చెందినట్లు కనిపిస్తుంది. అదే కడుపులో తిండి సరిగా లేక వెలితివుంటే వానికి ప్రపంచమంతా కడమ (కొఱత)తో వున్నట్లే తోస్తుంది. తడవిన (విచారిస్తే) ఇందరికీ (లోకులందరికీ) దైవము కూడా ఇంతే సుమండీ! వెడగునరులు అవివేకులైన మానవులు భావించిన విధంగానే భగవంతుడుంటాడు.

ముసలివాడైన ఒకడు తనకు మోక్షము చేరువయైనదని అనుకొంటాడు. ఇంకొకడు తనకు పుట్టుకయే తిరిగి వుండదంటాడు. ఏమో యెవరికి తెలుస్తుంది? అంతా భావనయే కదా! మన యెదురుగావున్న ఈ శ్రీవేంకటేశ్వరుడూ ఇంతే కదా! శోధించి నరులు భావించిన కొలదీ ఆ స్వామి వుంటాడు. నిజమో కల్లయొ యెవరు తెలియగలరు?

**పద్యవివరణ:**

మ.॥ **నిజమో కల్లయొ నేర్వలేము జగమే నిక్కంబు భావించినన్**
**త్యజియింపన్ సరికాదురా యెఱిగి సత్యంబిట్లు శోధించగా**
**అజునిన్ కన్న సురేంద్రవందితహరీ! ఆలింపుమమ్మెల్లరన్**
**భజియింపంగనె మానవాళి దయతో భజించు పాపంబులన్.**





సంఖ్య: XV/416 రాగం : కుంతలవరాళి
కీర్తన : మానరాదు నీ కింక మముగావవలెను

**కుంతలవరాళి**

**18 మానరాదు నీ కింక మముఁ గావవలెను**
**పేనిపట్టి నీకు నీవే బిరుదులై వున్నవి** ॥పల్లవి॥

**సరవి నిన్ను భక్తరక్షకుఁ డని నారదుఁడు**
**పరువడి లోకములఁ బాడిపాడి చాటినాఁడు**
**సరగ నీ యర్థములకు శాసనాలై వేదములు**
**మొరయుచు బ్రహ్మనాల్గుమొగముల నున్నవి** ॥మాన॥

**శరణాగతవజ్రపంజరుఁ డని వాల్మీకి**
**సురలకు రామకథ చూపి చెప్పె గుఱిగాను**
**పొరి నీ సుద్దు లివే పురాణపత్రికలై**
**పెరుగుచు వ్యాసుల పెట్టెలలో నున్నవి** ॥మాన॥

**తారకబ్రహ్మ మనవి తగఁ గాశిలో శివుఁడు**
**యేరుపరచి ప్రాణుల కెప్పుడుఁ జెప్పుచున్నాఁడు**
**యీ రీతి శ్రీవేంకటేశ యిందులకు సాక్షులు నీ వరాలు**
**ఆరూఢి గరుడగంభ మండ నేఁ దున్నవి** ॥మాన॥

**ఉపోద్ఘాతము:**

ఇది తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారి కీర్తన. పల్లవి కొద్దిగా భావించవలసివుంటుంది. ఓ దేవా! నీ కినుక మానరాదా? మమ్ము రక్షించరాదా? నీకున్న బిరుదేమిటి? ఆర్తజనరక్షకుడు కదా? మరి మమ్మల్ని యెందుకు రక్షించవు? ఓ శ్రీవేంకటేశ్వరా! నీకున్న బిరుదులు నారదుడు, బ్రహ్మదేవుడు, వాల్మీకి, వ్యాసుడు, శంకరుడు యేనాడో పొగిడారు. నీ

గరుడధ్వజ దర్శనము చేతనే మాకు అనేక వరాలు లభిస్తున్నాయి. ఇంకా మేము యెవ్వరిని యేమికోరవలెనయ్యా! అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రభూ! నీ కింక (కినుక లేక కోపము) మానరాదు (విడిచిపెట్టరాదా!) మమ్ము గావవలెను. (మమ్మల్ని రక్షించవలసినది నీవేకదా!) పేనిపట్టి (నియోగింపబడి) నీకున్ ఇవే బిరుదులైవున్నవి. (నీ చేతనే నీకు బిరుదులై ప్రసిద్ధి చెందినవి).

నారదుడు నిన్ను సరవి (క్రమముగా) భక్త రక్షకుడు అని లోకములందు, పరువడి (క్రమముగా) పాడి పాడి (సన్నుతించి) చాటినాడు (ప్రచారము చేశాడు.) నీచేత శాసించబడిన వేదశాస్త్రములు నీ శాసనమువలె మొరయుచు (ధ్వనించుచు) చతుర్ముఖ బ్రహ్మగారి నాలుగు మొగములనుండి వెలువడి ప్రసిద్ధముగానున్నవి.

వాల్మీకి మహర్షి శ్రీరామచంద్రమూర్తిగా రావణ వధకు అవతరించినావని దేవతలకు రామకథ ముందే వినిపించి, గుఱిగాను (నమ్మకంగా) నీవే శరణాగతులకు వజ్రపంజరమువలె రక్షకుడవవుదువని చాటినాడు. విశేషించి నీ కథలు (లీలలు) పురాణ పత్రికలై పౌరాణిక గాధలై వ్యాపించుచూ, వ్యాసులవారి పెట్టెలలో (అష్టాదశ పురాణాలలో) వున్నవి. అందరూ నేడు ఆ పురాణాలనే వ్యాపింప చేయుచున్నారు.

కాశీ నగరంలో పరమశివుడు దేహం వదలిన ప్రాణులకు యేరుపరచి (ఏర్పాటుగా) తారకబ్రహ్మ శ్రీరామచంద్రుడని రామనామం వారి అంత్యకాలంలో వారితో చెప్పించి ముక్తి ప్రసాదిస్తాడు. ఈ విధముగా ఓ శ్రీవేంకటేశ్వరా! యిందులకు (వీటన్నిటికీ) నీవు మాకిస్తున్న ఈ వరములే సాక్షి. నేడు ఆ రూఢి (యెక్కిన) నీ గరుడ ధ్వజమే ఆ వరములన్నీ అయివున్నవి ప్రభూ!

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **మమ్ముగావ కినుక మానరాదా ప్రభూ!**
**ఆర్తరక్షకుండవనెడి బిరుదు**
**పెద్దతిరుమలయ్య వేదరాసులు సాక్షి**
**విడువతగదు యనెను వేంకటేశ!**





సంఖ్య: III/34 రాగం : వసంతవరాళి
కీర్తన : ఇహముఁ బరముఁ జిక్కె నీతనివంక

**వసంతవరాళి**

**19 ఇహముఁ బరముఁ జిక్కె నీతనివంక**
**అహిశయనునిదాసు లంతవారు వేరీ** ॥పల్లవి॥

**సిరికలిగినవారు చింత లన్నిటనుఁ బాసి**
**నిరతపువర్గ (గర్వ?) ముతో నిక్కేరటా**
**సిరికి మగఁడయిన శ్రీపతి యేలి మ-**
**మ్మరయుచున్నాఁడు మాయంతవారు వేరీ** ॥ఇహ॥

**బలవంతుఁ డైనవాఁడు భయము లిన్నిటఁ బాసి**
**గెలిచి పేరువాడుచుఁ గెరలీ నటా**
**బలదేవుఁడైన శ్రీపతి మాయింటిలోన**
**అలరివున్నాఁడు మాయంతవారు వేరీ** ॥ఇహ॥

**భూమి లేలేటివాఁడు భోగములతోఁ దనిసి**
**కామించి యానందమునఁ గరఁగీనటా**
**సేమముతో భూపతైన శ్రీవేంకటేశుఁడు మాకు**
**ఆముకొని వుండఁగా మాయంతవారు వేరీ** ॥ఇహ॥

**ఉపోద్ఘాతము:**

కొద్దిపాటి సిరిసంపదలుంటే నిర్విచారంగా వుండటమే కాక గర్వముతో నిక్కుతూ వుండటం మానవసహజమే. కాని ఆలోచించి చూడండి కొద్దిపాటి వైభవానికే అంత గర్వమైతే సిరికి మగడైన శ్రీపతి మారక్షకుడు, మా యజమాని, మరి మాకెంత నిక్కువుండాలి చెప్పండి. మానవులందరికీ ఇహము (ఈ భూలోక వైభవాలూ) పరమూ (పరలోక సద్గతులు) ఈ

దేవదేవుని వలననే చిక్కుతున్నాయి. మేము స్వయంగా ఆ శేష శయనుని దాసులము. మా అంతటి వాళ్ళెవరండీ? అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రజలారా! ఈతని వంక (ఈ శ్రీహరి మూలంగా) మాకు ఇహము (ఈ భూలోకంలో సౌఖ్యములు) పరమున్ (పరలోక ప్రాప్తికి తగిన అర్హతా) చిక్కె (లభ్యమవుతున్నాయి). అందువలననే అహిశయనుని (ఆదిశేషునిపై శయనించు శ్రీహరి) దాసులంతటి ఘనులు వేరీ (ఏరీ ఎక్కడున్నారు?)

ఈ ప్రపంచంలో సిరి సంపదలు కలిగినవారు ఎట్టి చింత (దిగులు) లేక అధికమైన గర్వముతో నిక్కి వుంటారట. అది వారికి సహజము. మరి మా సంగతియేమిటి? మేము ఆ సిరికే (శ్రీదేవికే) మగడయిన శ్రీపతి యేలికలో వున్నందును ఆయనే స్వయంగా మా రక్షకుడు. మరి మా అంతటి వారు వేరీ (ఏరీ ఎక్కడున్నారు?)

బలవంతుడైనవాడు ఒక్కసారి భయము వదలి గెలిచి పేరు సంపాదించగానే అందరూ అతనినే ఆశ్రయిస్తారు. శ్రీపతి అందరికంటే బలవంతుడైన మా ఇలవేల్పువలె అలరియున్నాడు. ఇక మా అంతటి గొప్పవారు వేరీ (ఏరీ ఎవరున్నారు?)

ఏదో కొద్దిపాటి భూమివుంటే దానిని యేలేటి వాడు (పరిపాలించేవాడు) భోగములలో దనిసి (వైభోగములలో తేలుతూ) కామించి (అనేకమైన కోరికలతో) ఆనందపరవశుడై కరగీనట (మమేకమై వుంటాడట). మరి భూదేవీ రమణుడైన శ్రీవేంకటేశ్వరుడు మమ్ము ఆముకొని (పైకొని) వున్నాడు. ఇక మాబోటి వారు వేరీ (ఏరీ ఎక్కడున్నారు?)

**పద్యవివరణ:**

కం.॥ **చిక్కును ఇహపరములు, మరి**
**దక్కును ఈ శేషశాయి దయ దాసులకున్**
**తక్కినవారలు సరియా?**
**చక్కని శ్రీవేంకటేశు శరణార్థులకున్**





సంఖ్య: XV/23 రాగం : పాడి
కీర్తన : రామచంద్రా రామభద్రా రఘువీరా

**పాడి**

**20 రామచంద్రా రామభద్రా రఘువీరా**
**నీ మహిమ దెలిసేరా నేఁటివారు** ॥పల్లవి॥

**అరయ జటాయువున కట్టె మోక్ష మిచ్చితివి**
**హరునివిల్లు విరిచి అలరితివి**
**యిరవై రాతికిఁ బ్రాణ మిచ్చితి వింతటి నిన్ను**
**నరుఁడంటా నుండిరిగా నాఁటివారు** ॥రామ॥

**నెమ్మది సరయువులో నించితి వైకుంఠము**
**పమ్మి మారుతికి బ్రహ్మపట్ట మిచ్చితి**
**దుమ్ములుగ రాక్షసులఁ దుత్తుమురు సేసితివి.**
**నమ్మరిగా రాజవంటా నాఁటివారు** ॥రామ॥

**యెందునుఁ జెడని పట్ట మిచ్చితి విభీషణుని**
**కంది పరశురాముని నంగవించితి**
**యిందునే శ్రీవేంకటేశ యెఱుఁగక దశరథ-**
**నందనుఁడే యనిరిగా నాఁటివారు** ॥రామ॥

**ఉపోద్ఘాతము:**

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారి రామరసాయనామృతాన్ని ఆస్వాదించండి. ఓ రఘువీరా! ఆనాటి వారు నీ మహిమ దెలిసేరా అంటే రామాయణ గాథల్లో ఆ సంగతి సందిగ్ధంగానే వున్నది. శివధనస్సును విరిచినా, అహల్యా శాపవిమోచనం గావించినా, సరయూ నదిలో వైకుంఠాన్నే నింపి చూపినా, పదివేలమంది ఖరదూషణాది రాక్షసులను చూస్తుండంగా ఒంటి చేతో మట్టికరిపించినా, పరశురాముని వివశుణ్ణి

చేసినా ఓహో! రాజశేఖరుడు మహాపరాక్రమశాలి ఈ దశరథ నందనుడు అన్నారుకానీ ఈయనే విష్ణువు అన్నారా? పోనీ నేటివారికైనా నీ మహిమపూర్తిగా తెలిసిందా అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ రామచంద్రా! రామభద్రా! రఘువీరా! నేటి ప్రజలకు నీ మహిమ తెలిసిందంటావా? ఏమో! కాని నాటివారు మాత్రం నీవు నరుడవనే నమ్మారు.

ప్రభూ! ఆనాడు అరయ (అందరూ చూస్తుండగానే) జటాయువునకు అట్టే మోక్షమిచ్చితివి (సునాయాసముగా ముక్తి నొసగినావు). శివధనస్సును విరిచి అతిశయించినావు. రాయివలె పడివున్న స్త్రీకి (అహల్యకు) ప్రాణమిచ్చితివి (చైతన్య మొసగినావు). ఇంతటి (ఇటువంటి) నిన్ను, నాటి అయోధ్యా వాసులంతా నిన్ను నరునిగానే భ్రమపడినారు.

అందరూ చూస్తుండంగానే వైకుంఠాన్ని సరయూనదిలా చూపావు. నెమ్మదిగా నీవూ నీ తమ్ముళ్ళు ఒక్కొక్కరే వైకుంఠం చేరటం అందరూ చూశారు. నీకు అంత సేవ చేసిన మారుతికి (హనుమంతునికి) బ్రహ్మపదవిని అనుగ్రహించినావు. దుమ్ములగు (ధూళియొనర్చి) రాక్షసులను తుత్తురుము (పొడిపొడి) చేసినావు. మానవుడు యెంత రాజవంశస్థుడైనా అంతమంది రాక్షసులను చంపటమేమిటని అనక నీవు రాజువలనే నాటివారు నమ్మారు.

అవన్నీ అటుంచి విభీషణునికి రాక్షసుడైనా అభయమిచ్చి చిరంజీవిని చేసి శాశ్వతంగా లంకారాజ్యమిచ్చావు. పరశురాముడు తాను బ్రాహ్మణుడైనా నిన్ను అవమానించాడని అంగవించితివి (అతిక్రమించితివి). కలియుగంలో ఈనాడు కూడా తిరుమల శ్రీవేంకటేశ్వరుడవై వుంటే యెరుగక నీవు దశరథనందనుడవే దేవుడవు కాదు అనుకొన్నారు.

**పద్యవివరణ:**

తే.గీ.॥ **రామచంద్ర! వో రఘువీర! రామభద్ర!**
**నీ మహిమనేర్వరైతిరే నేటివారు**
**దశరథ సుతుండ యని నిన్ను తలచినారు**
**యెరుగరైతిరి నీమాయ తిరుమలేశ!**





సంఖ్య: IV/13 రాగం : శంకరాభరణం
కీర్తన : అతడేమిసేసినా మాకదే గురి

**శంకరాభరణం**

**21 అతఁ డేమిసేసినా మాకదే గురి**
**మతిలో నాతఁడుండఁగా మాయలు మా కేఁటికి** ॥పల్లవి॥

**ఆసలకెల్లా గురి హరి యొక్కఁడేకాని**
**వేసరక కన్నవారి వేఁడనోపను(ము)**
**చేసేటిసేఁతకు గురి శ్రీవిభుఁడేకాని**
**వాసి దప్పి హీనులసేవలు సేయ నోపము** ॥అతఁడేమి॥

**ముచ్చటకెల్లా గురి ముఱహరుఁడే కాని**
**చెచ్చెర నెవ్వరికైనాఁ జెప్పనోపము**
**నిచ్చలు మాబ్రదుకెల్లా నీలవర్ణునికే కాని**
**రచ్చల దుష్టులతోడిరాఁపులకు నోపము** ॥అతఁడేమి॥

**పరము నిహమునకు పరమాత్ముఁడే గురి**
**పరుల కఠినమైనబాఁతి యేఁటికి**
**సిరులకెల్లా గురి శ్రీవేంకటేశుఁడే కాని**
**అరపిరికితనపుటలమట లేదు** ॥అతఁడేమి॥

**ఉపోద్ఘాతము:**

"బాఁతి" అంటే ప్రేమ అని అర్థం. ఇంకొకరిపై ప్రేమ (ఇష్టము) వుండటంలో తప్పు లేకపోవచ్చు కాని వారికి బానిస అయ్యేంత ప్రేమ పనికిరాదు. ఆ ప్రేమ పరమాత్మునిపై వుంటే ఇహమున ఆనందం, పరమున ముక్తి దక్కుతాయంటున్నారు అన్నమయ్య. ఆ శ్రీహరి యేమి చేసినామాకు ఆయనపై గురి సడలదు. ఆయన మామనస్సులో వున్నంత కాలము ఈ భ్రమలు మాయలు అంటే మాకేం భయం? వాటిజోలి మాకెందుకు అంటున్నారు. వాళ్ళనీ వీళ్ళనీ దేబిరించాల్సిన అవసరం

మాకేమిటి? దుర్మార్గులతో దుస్సాంగత్యము మాకేటికి? మాకు శ్రీహరి చాలు ఇంకేమీ వద్దు. మా ఆసలకు, చేతలకు, ముచ్చటకు, బ్రతుకుకు కూడా గురి ఆ శ్రీహరియే అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

అతడు (ఆ శ్రీహరి) యేమి సేసినా మాకు అదే గురి (సమ్మతము). మా మతిలో తలపులలో అతడు వుండగా మాయలు మాకేమిటి? (పరులు యెన్ని మాయలు పన్నినా మాకెందుకు?)

ప్రపంచంలో మనిషికి ఆశ కలుగుటకు గురి (కారణము) శ్రీహరి ఒక్కడే. కాని వేసరక (విసుగులేక) కన్నవారి (కనబడ్డ ప్రతివాడినీ) వేడనోపము (యాచించుటకు ఇష్టపడము). మేము చేసే యేపనికైనా గురి (కారణము) శ్రీవిభుడే (లక్ష్మీవల్లభుడే) కాని వాసి దప్పి (అపకీర్తిపాలయి) హీనులైనవారికి సేవలు చేపట్టుము.

ముచ్చటలాడుటకు గురి (లక్ష్యము) అనగా, మనం మాట్లాడగలుగుటకు కారణం శ్రీహరియే కానీ ఆయన సంకల్పం లేకపోతే మాట పెగిలి చెచ్చెర (శ్రీఘ్రముగా) ఎవ్వరికైనా చెప్పజాలము. నిచ్చలు (ప్రతిదినము) మేము బ్రతికి బట్టకడుతున్నది నీలవర్ణుడైన శ్రీపతి కరుణ వల్లనే అందుచేత మాకు దుష్టులతో రాపులు (ఘర్షణలు) రచ్చకెక్కుటకు ఇచ్చగించము.

పరమునకు (పరలోక ప్రాభవానికి) ఇహమునకు (ఈ భూలోక వైభవానికి) గురి (కారణభూతుడు) సర్వాంతర్యామియైన ఆ పరమాత్ముడు. అటువంటప్పుడు ఇంకొకరికి లొంగిపోవలసినంత "బాంతి" (ప్రేమ) అవసరం కదా! దానివలన లాభమేమిటి? సిరులంతటికీ శ్రీపతి ఆ శ్రీవేంకటేశ్వరుడే, గురి (కారణభూతుడు). కాని (అయినా) అరపిరికి తనపు (కీడు తెచ్చె పిరికితనంతో) అలమట (చింత చీకాకు) లేదు (అవసరం లేదు). ఆయనే దిక్కనండి.

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **హరియేమి సేసినా 'గురి'**
**తిరముగ మది ఆతడుండ్రతెళ్ళము "మాయన్"**
**పరమాత్ముడిహపరంబుల**
**"గురి" లోకుల బ్రతుకు కొఱకు గొొలుతురె ఛీ! ఛీ!**





సంఖ్య: III/276 రాగం : లలిత
కీర్తన : వెఱవకుమనసా విష్ణుని యభయము

**లలిత**

**22 వెఱవకు మనసా విష్ణునియభయము**
**నెఱవుగ నెదుటనె నిలిచనది.** ॥పల్లవి॥

**శ్రీపతికరుణే జీవరాసులకు**
**దాపును దండై తగిలినది**
**పైపై దేవునిబలుసంకల్పమే**
**చేపట్టి రక్షించఁ జెలఁగేది.** ॥వెఱవక॥

**నలినోదరునిజనామాంకితమే**
**యిలపై దాసుల నేలేది**
**కలిభంజనుశంఖచక్రలాంఛన-**
**మలవడి శుభముల నందించేది.** ॥వెఱవక॥

**శ్రీవేంకటపతిసేసినచేఁతలే**
**వేవేలువిధుల వెలసేది**
**భూవిభుఁ డీతఁడు పూఁచినమహిమలే**
**కైవశమై మముఁ గాచేవి.** ॥వెఱవక॥

**ఉపోద్ఘాతము:**

భక్తి ప్రబోధన చేసే చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఓ మనసా! నీకు విష్ణుదేవుని అభయహస్తము అండగా వున్నది. కావున భయపడకు. స్వామి అభయహస్తము నీకు తోడై నిలుస్తుంది అంటున్నారు. శ్రీవేంకటపతి చేతలు అంత తేలికగా గ్రహింపుకురావు. మమ్మల్ని రక్షించేది ఆ ధరణీధరుని మహిమయే అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ మనసా! నీవు వెఱవకు (భయపడకుము). నీకు విష్ణుని (శ్రీహరియొక్క) అభయము (భయపడకు అని అనునయించే) హస్తము తోడున్నది. ఆ హస్తము నెఱవుగ (పూర్తిగా) నీ యెదుటనే నిలిచియున్నది.

శ్రీపతియొక్క కరుణయే సమస్త జీవరాసులకు (జీవులన్నింటికీ) దాపునుదండై (తోడు విడనాడని అండయై) తగిలినది (తగులుకొనియున్నది). పైపై దేవుని (సర్వోన్నతుడైన ఆ దేవుని) బలమైన సంకల్పమే (నిర్ణయమే) చేపట్టి (పూనుకొని) రక్షించి అతిశయిస్తుంది.

నళినోదరుడు (పద్మనాభుడైన) శ్రీహరి నిజనామ సంకీర్తనమే ఈ అవనిపై ఆయనదాసులను యేలేది (పరిపాలిస్తుంటుంది). కలిభంజనుడు (కలిపురుషుని ఖండించగల) ఆ శ్రీహరి లాంఛనములైన శంఖచక్రముల ముద్రలు, అలవడి శుభముల (తగిన శుభలములను) అందించును.

శ్రీ వేంకటేశ్వరుని యొక్క సేసినచేతలు (లీలలు) వేవేల విధముల (అనేక విధములుగ) వెలసేది (ద్యోతకమవుతుంటాయి). ఈతడు భూ విభుడు (ధరణీవల్లభుడు). ఈయన పూచిన (అలరిన) మహిమలే మమ్ము కైవశమై (అనుగుణ్యమై) కాచేది (రక్షిస్తుంది).

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **విష్ణుని "యభయమ్మె" వెనుదన్ను జీవికి**
**నెఱవుతోటి యెదుట నిలిచియుండు,**
**వేంకటేశుడుండ వెఱవకు మనసా! ధ-**
**రణి విభుండి యెకడె రక్షమాకు**





సంఖ్య: II/229 రాగం : నాట
కీర్తన : దానవారితోడి పగ ధరించరాదు మీకు

**నాట**

**23 దానవారితోడి పగ ధరించరాదు మీకు**
**కాను కిచ్చి శరణని కప్పము లియ్యరో** ॥పల్లవి॥

**భ్రమసి వార్ధిఁబడ్డాను పాతాళము దూరినాను**
**సమయింపక మానఁడు శత్రులార**
**రమణ భూమిచొచ్చిన బ్రహ్మచే వరముగొన్న**
**తమిఁ జంపక మానఁడు దైతేయులాల** ॥దాన॥

**రాసి మిన్నులో దాఁగిన రాచమూకలలో నున్న**
**కోసివేసీఁ దల లరికుమతులాల**
**ఆసఁ ద్రికూట మెక్కినా ఆ చక్రవాళ మంటినా**
**తోసి సాధించకపోఁడు దుర్మతులాల** ॥దాన॥

**సతులమాఁటున నున్నా సరి నెందెందు వోయినా**
**రతి మెట్టకమానఁడు రాకాసులాల**
**యితఁడు శ్రీవేంకటేశుఁ డెదురులే దితనికి**
**గతియని మొక్కరో వో కపటులాల** ॥దాన॥

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య చేసే ఈ విచిత్ర ప్రయోగం మనము మరెక్కడా చూడము. కవి రాక్షసులకు మంచిని ఉద్బోధిస్తుంటాడు. ఈ కీర్తనలో ఒరే రాక్షసుల్లారా! దానవుల శత్రువైన శ్రీహరితో పగ ధరించియుంటే మీ మరణం మీరే ఆహ్వానించుకొన్నట్లుంటుంది. ఇప్పటికైన ఆ దేవదేవుని శరణాగతిని బొంది ఆయనకు కానుకలిచ్చి మంచి చేసికొనండి. ఆయనకు లొంగి కప్పములు (కట్నములు) చదివించండి, అంటున్నారు. ఇక్కడ

దానవులంటే రావణాదులే కాదు నేటి కాలపు భూకబ్జాదారులు కూడా. స్వామి, వారినైనా మంచిగా మారితే కరుణిస్తాడంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఒరే! కపటులైన రాక్షసులారా! నామాటవినండి. మీకు దానవుల అరి (శత్రువైన) శ్రీహరి తోడి పగ ధరించరాదు. (దాల్చియుండుట తగదు). ఇప్పటికైన మీరు మారండి. సన్మార్గులై శ్రీహరి శరణుబొంది ఆ స్వామికి అనేక కానుకలిచ్చి కప్పములు (కట్నములు) చెల్లించండి.

ఒరే! నామాట వినండిరా. భ్రమపడి మీరు సముద్రంలో పడిదాగినా, పాతాళలోకములో దూరి దాగినా, శత్రువులైన మిమ్ము సమయింపక (సంహరింపక) వదలడు. రమణ భూమిచొచ్చినా (చక్కగా భూమిలో దూరినా) బ్రహ్మగారిచేత ఏవేవో వింతవింత వరాలు పొందినా, ఓ దైత్యులారా! మీ వరాలను నిరుపయోగం చేసి మిమ్ము సంహరింపక మానదుగాక మానడు.

ఒరే! మీరు ఆకాశంలో ఇంద్రజిత్తులా దాగికొన్నా వదలడు. రాచమూకలలో నున్నా (కంసుడు, జరాసంధుడు వంటి రాజులుగా పుట్టినా) వెదకి వెదకి చంపుతాడు. ఓ కుమతులైన (దుష్టబుద్ధిగల) శత్రుమూకల్లారా! మీతలలు కత్తిరించి వేస్తాడు, జాగ్రత్త! మీరు పేరాశతో త్రికూట పర్వతమునెక్కినా, చక్రవాళమంటినా, (చక్రవాళ పర్వతమునెక్కినా) దుర్మతులైన మిమ్మల్ని త్రోసివేసి సాధించక వదలడు.

ఒరే! ఆయన దేనినీ లెక్కచేయడు. మీరు స్త్రీలవలె ఆడవాళ్ళలో దాగినా లాభంలేదు. ఇంకా యెక్కడెక్కడో దాగినా ప్రయోజనం లేదు. ఓ రాకాసులారా! మిమ్ము మెట్టక (తొక్కివేయక) వదలడు. ఎందుకంటే ఈయనే శ్రీవేంకటేశ్వరుడు. ఇతనికి యెదురు లేనే లేదు. ఓ కపటబుద్ధులారా! ఇప్పటికైనా ఈయనే గతి అని మొక్కండిరా!

**పద్యవివరణ:**

మ.॥ **భళిరా! దానవవైరితోడి పగ మీపాపంబు పండించురా**
**నళినీకాంతుడు వేంకటేశ్వరుడు యీ నాడే తలల్ ద్రెంపగా**
**పెళుసౌ రక్కసులార! పూని వెడలెన్, విష్ణుండజేయుండురా**
**నళినాక్షున్ శరణంచుమ్రొక్కి, యిదరో నాణ్యంబుగా కప్పముల్.**





సంఖ్య: II/21 రాగం : మలహరి
కీర్తన : కంచుగాదు పెంచుగాదు కడుబెలుచు మనసు

**మలహరి**

**24 కంచూఁగాదు పెంచూఁగాదు కడుఁబెలుచు మనసు**
**యెంచరాదు పంచరాదు యెట్టిదో యీ మనసు** ॥పల్లవి॥

**పట్టఁబసలేదు చూడ బయలుగా దీ మనసు**
**నెట్టనఁ బారుచునుండు నీరూఁగా దీ మనసు**
**చుట్టిచుట్టి పాయకుండుఁ జుట్టమూఁగా దీ మనసు**
**యెట్టనెదుటనే వుండు నేఁటిదో యీ మనసు** ॥కంచూ॥

**రుచులెల్లాఁ గానుపించు రూపులేదు మనసు**
**పచరించు నాసలెల్లాఁ బసిఁడిగా దీ మనసు**
**యెచటాఁ గరఁగదు రాయీఁగాదు మనసు**
**యిచటా నచటాఁ దానే యేఁటిదో యీ మనసు** ॥కంచూ॥

**తప్పక నాలోనుండు దైవముఁగాదు మనసు**
**కప్పి మూఁటగట్టరాదు గాలీఁగాదు మనసు**
**చెప్పరాని మహిమల శ్రీవేంకటేశుఁ దలఁచి**
**యిప్పు డిన్నిటా గెలిచె నేఁటిదో యీ మనసు** ॥రాచా॥

**ఉపోద్ఘాతము:**

ఓ మానవులారా! ఈ మనస్సు వున్నది చూశారా! ఇది యెంతో పెళుసు (FRAGAIL) స్వభావం కలది. అయినా ఇది కంచువంటి లోహము కాదు. పెంచు, అనగా మట్టితో చేసిన పెంకువంటిదీ కాదు. అసలు దీన్ని

యెంచరాదు, అనగా అంచనా వేయలేము. అలాగని దీనిగురించి ఇంకొకళ్ళతో పంచుకోలేము. నిజంగా ఇది యెట్లాంటిదో తెలియకుండావున్నది అంటున్నారు అన్నమయ్య. చూశారా పల్లవే ఇంత కొరకరాని కొయ్యగా వుంటే ఈ మనసు మర్మం అంతా విప్పి చెబుతుంటే అన్నమయ్య భావనా శక్తికి జోహారు అనక తప్పదు. ఈ మనస్సును గెలువదలచినవారికి శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించక తప్పదు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ జనులారా! మానవుని మనస్సును భగవంతుడు దేనితో తయారుచేసినాడో తెలియరాకున్నది. ఇది కంచువంటి లోహమూ కాదు అయినా దానికున్న పెళుసుతనం దీనికీ వున్నది. ఇది పెంచూ (పెంకు) వంటి మట్టి పదార్థముకాదు. అయినా పెంకుకున్న పెళుసుతనం ఈ మనస్సుకూ వున్నది. ఇది ఇట్టిది అని యెంచరాదు (అంచనా వేయలేము) అంతేకాదు దీని ప్రవృత్తిని ఇంకొకరితో పంచుకోలేము. ఎట్టిదో ఈ మనస్సు తెలియుట లేదు.

ఈ మనస్సును పట్టుకొనవీలులేదు, యొందుకంటే ఇది బయట లేదు. పోనీ ఎదురుగా ప్రవహించే 'నీరు' అందుమా అంటే అదీకాదు. మనల్ని చుట్టి అంటిపెట్టుకొనే వుంటుంది కాని చుట్టము కాదు. మన యెదుటనే వున్నా ఈ మనస్సు పట్టరానిదిగా వున్నది. ఏమి మనస్సిది?

ఈ మనస్సునకు ఒక రూపము అంటూ లేదు. కాని రుచులు (ఇష్టాయిష్టాలు) దీనికి యెన్ని వున్నాయో చెప్పలేం. ఇది యెన్ని ఆశలు కలిగిస్తుందో చెప్పనలవి కాదు. కాని బంగారము వంటి గొప్ప విలువైనదీ కాదు. ఇది యెంత పాషాణమంటే దీనిని కరిగించడం బహుకష్టము. కాని ఇది రాయీకాదు రప్పాకాదు. ఇచ్చటా (ఈ ఇహలోకమున) అచ్చటా (ఆ పరలోకంలోనూ) దీనిదే పెత్తనం. ఎట్టిదో కదా! ఈ మనస్సు?





ఇంకొక వింతయేమంటే ఇది నాలోనే తప్పకయున్నది. కాని అందరూ అనుకొనే భగవత్ స్వరూపమైన అంతరాత్మ కాదు. పోనీ మూటగట్టి అవతల పారేద్దామా అంటే బంధించలేము. పోనీ అగోచరముకాబట్టి 'గాలి' అనుకొందామా అంటే వీలులేదు. అయితే ఇంతపనికిరాని మనస్సుకూడా ఆ శ్రీవేంకటేశ్వరుని తలచి ఇప్పుడన్నిటిలోనూ గెలుపొందింది. ఆహా! ఈ మనస్సు యెట్టిదో కదా!

**పద్యవివరణ:**

**సీ.॥ కంచుపెంచూగాదు, కడబెలుచు మనసు**
**యెంచిపంచగరాదు, యెట్టిదొ ఇది?**
**చుట్టియు కాదుర చుట్టము, నెట్టన**
**పట్టరానిది కదా! పాడుమనసు,**
**రుచులెల్ల చూపించు, పచరించు నాసలు**
**కరుగదు రాయియుగాదు మనసు**
**తగనుండు దేహాన దైవమా? అదికాదు**
**కట్టమూటగరాదు గాలికాదు**

**ఆ.వె.॥ చెప్పరాని మనసు శ్రీనివాసుదలంచి**
**ఇన్నిటా గెలుచును ఈ మనస్సు**
**ఎట్టిదో తెలియగ యేరికినిని గాదు**
**మాయదారిదయ్య! మనిషి మనసు.**

సంఖ్య: XV/393 రాగం : లలిత
కీర్తన : ఎంతప్రతాపమో నిదియెంచి చూచితే

**లలిత**

**25 ఎంతప్రతాపమో నీది యెంచి చూచితే**
**వింతలేల నిన్ను సేవించు టింతెకాక** ॥పల్లవి॥

**ముప్పిరి నీ సంకల్పము ముంచి బ్రహ్మేంద్రాదులైన**
**తప్పించలేరు మతి దాఁటా లేరు**
**యెప్పుడైనా దైత్యులపై యెత్తిన నీ చేచక్రము**
**తిప్పలేరు నీ మహిమ తెలియా లేరు** ॥ఎంత॥

**ఆముక నీవు మన్నించే నంటే ననాదికర్మాలు**
**యేమిటా మానుప లేవు యిప్పించా లేవు**
**నేమించక లోకాలపై నీవు పరాకై వుండితే**
**ప్రేమం బెడరేఁచ లేవు పెనఁగా లేవు** ॥ఎంత॥

**చేరి నీవు మమ్మేలితే చేసిన యపరాధాలు**
**మారుకొనలేవు మతి మలయా లేవు**
**గారవాన నలమేల్మంగపతి శ్రీవేంకటేశ**
**యీ రీతి నీవే కాక యితరులు లేరూ** ॥ఎంత॥

**ఉపోద్ఘాతము:**
ఇది తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారి కీర్తన. "ఓ శ్రీవేంకటేశ్వరా! నీ ప్రతాపము గురించి ఏమిచెప్పను? నీది ఎంత ప్రతాపము యెంచి చూడాలిగాని దానికి పరిమితులున్నవా? అందుకని ఇది ఎట్టి వింతరా అని ఆశ్చర్యంతో తబ్బిబ్బయ్యే బదులు నిన్ను సేవించుటయే శ్రేయస్కరం" అంటున్నారు. నీవు మమ్ము కరుణతో యేలితే మా అపరాధములు మమ్మల్నేమీ చేయలేవు అంటున్నారు. నేను నీ భజనను వదలను స్వామీ! అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! నీది ఎంత ప్రతాపమో యెంచి చూచితే అవతలివారు నీకు దాసానుదాసులై నిన్నే సేవించుటలో యేమాత్రమూ వింతలేదు. ఇంతేకాక మరేమియూలేదు.

ప్రభూ! నీ ముప్పిరిసంకల్పము (వివశుల్ని చేసే నీ నిర్ణయాన్ని) బ్రహ్మేంద్రాదులైనా పూని తప్పింపలేరు. మరి దాటాలేరు (అతిక్రమించను కూడా లేరు). ఎప్పుడైనా నీవు ఆగ్రహించి దైత్యులపై నీ చక్రాయుధాన్ని ప్రయోగిస్తే దాన్ని తిప్పలేరు మరల్చుట యెవ్వరికీ సాధ్యంకాదు. అంతేకాదు నీ మహిమ నేనాటికీ గ్రహించలేరు.

ఆముక (పైకొని) నీవు ఎవ్వరినైనా మన్నించేనంటే (వీని పాపవిముక్తుని చేస్తానంటే) వాడిని అనాదికర్మలు (వాడి పూర్వకర్మలు) యేమిటామానుపలేవు (ఏమీ చేయలేవు). యిప్పించాలేవు వాడికి వాటి ఫలముల పీడను కూడా ఇప్పించలేవు). నీవు లోకాలను సేవించక (కాపాడదలచక) పరాకైతే (విముఖడవైతే) ఈ జగములను పెరరేచలేవు (ప్రేరేపించేదెవరు?) అసలు జీవన పోరాటమే జరగదు.

దేవా! నీవు మమ్ము యేలితే (కరుణించి పరిపాలించితే) మేము తొల్లి చేసిన పాపములు మమ్మేమీ చేయలేవు. మారుకొనలేవు (యెదుర్కొనలేవు). మతి (అలాగని) మలయాలేవు (తిరగబడలేవు). అవి సమసిపోతాయి. దేవి అలమేల్మంగ విభుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా ఈ రీతి నీవు కాక వేరెవ్వరూ లేరు. నీ ప్రతాపము ఇంకొకరికెలా వుంటుంది తండ్రీ!

**పద్యవివరణ:**
తే.గీ.॥ **ఎంతటిది నీ ప్రతాపము యెంచి చూడ!!**
**వింతలేల నిన్‌సేవించుటింతె గాక,**
**నీవు తలచినగాదన నెవరికగును?**
**పెద్దతిరుమల కీర్తించె వేంకటేశ!**

సంఖ్య: III/286 రాగం : బౌళి
కీర్తన : మమ్మ్ముజూడనేమున్నది మావంక నీకే లాభము

**బౌళి**

**26 మమ్ముఁజూడ నేమున్నది మావంక నీ కేలాభము**
**కమ్ముక దయదలఁచి కరుణింతుగాక ||పల్లవి||**

**శ్రీకాంతుఁడ నీ పాదసేవకు లయినవారు**
**పాకశాసనాదులును బ్రహ్మాదులు**
**పైకొని నరుఁడ నేను బంటఁగాఁగ నెంతవాఁడ**
**కైకొని నీపుణ్యానకుఁ గాచు టింతేకాక ||మమ్ముఁ||**

**నారాయణుఁడ నిన్ను నమ్మినట్టిదాసులు**
**నారదాది సనక సనందనాదులు**
**వీరిలో నే నెంతవాఁడ వికటపుజీవుఁడను**
**యీ రీతి నీమూకఁగూడ నేలుటింతేకాక ||మమ్ముఁ||**

**శ్రీవేంకటేశ నీపై చేరి భక్తి సేసేవారు**
**కావించి యనంతముఖ్యగరుడాదులు**
**దేవ నే నొక్కనీచుఁడ దీనరక్షకుఁడవు నీ-**
**వీవిధ మెంచుక మమ్ము నీడేరింతుగాక ||మమ్ముఁ||**

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్యకాలంనాటి తెలుగు నుడికారానికీ నేటి తెలుగు నుడికారానికి యెంత తేడా వున్నదో గమనించండి. ఈ పల్లవిని నేటి తెలుగులో "మమ్మల్ని చూచుట కేమున్నది? మావలన నీకేమి లాభము? మమ్ము కమ్ముకొని దయదలచి కరుణింతువుగాక!" అని చెప్పవచ్చును. ఓ ప్రభూ! బ్రహ్మాది దేవతలు నీ పాదసేవకులు అయినప్పుడు మానవమాత్రుడను నేను నీబంటునవటంలో ఆశ్చర్యమేమున్నది? నారద, సనకాదులు నీవు నమ్మిన దాసులు. అట్టి యెడ నేను దుర్మార్గుడైన జీవుడను కదా! నన్ను నీవు





అటువంటిమూకలో కలుపుకోవాలంటే, నన్ను నీవే యేలుకోవాలి అంతేగానీ నాకేమి అర్హతవున్నదయ్యా? అని ప్రశ్నిస్తున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రభూ! మమ్ము జూచుటకు యేమున్నదయ్యా? మా వంక (వలన) నీకేమి లాభము? కమ్ముక (కమ్ముకొని) మమ్ము దయదలచి కరుణింతువు గాక! లేనిచో నాకు దిక్కెవరు తండ్రీ!

ఓ శ్రీకాంతుడా! పాకశాసనుడు (దేవేంద్రుడు), బ్రహ్మాదులు (చతుర్ముఖ బ్రహ్మ మొదలైనవారు) నీపాద సేవకులు, అయినవారు. నరుడనైన నేను నీబంటును కాకపోతే నేనెంతవాడను స్వామీ? ఏదో పుణ్యానికి నన్ను కనికరించి నీవు కైకొని (పూనుకొని) కాచుట న్యాయము. ఇంతేకాని నీకు చెప్పగలవాడనా స్వామీ?

ఓ శ్రీమన్నారాయణుడా! నారదాది హరిదాసులు సనక సనందనాది మహర్షులు నిన్ను నమ్మినట్టి నీ దాసులు. వీరితో పోల్చి చూస్తే నేనేపాటివాడను? నేను ఒక వికటపు జీవుడను (గొప్ప వంకర స్వభావము కల జీవుడను). అయితే నీ దాసులైన "మూక" అనంతమైనది కావున నన్ను కూడా ఈ రీతి వారితో పాటు యేలుకుంటే చాలు కదా! ఇంతకంటే నేను కోరింది మాత్రమేముంది తండ్రీ!

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ భక్తుల పట్టిక చూద్దామా అంటే అందులో అనంతుడు (ఆదిశేషుడు) గరుత్మంతుడు మొదలైన హేమాహేమీలున్నారు. ఓ దేవా! నేను భక్తిలేని పాపిష్ఠివాడిని, నీచుడిని అయినా నీవు దీనరక్షకుడవు కదా! బ్రహ్మాదులు, సనకాదులు, గరుడాదులను కాసేపు మరచి ఈ విధముగా కాస్త మమ్ముకూడా ఈడేర్చేవంటే మేము కూడ బ్రతికిపోతాము కదా! స్వామీ!

**పద్యవివరణ:**

కం.|| **మము జూడనేమి యున్నది?**
**తమరే దయదలచి కరుణ ధరియించవలెన్**
**అమలంపుదాసుడను ప్రభు!**
**భ్రమలేటికి పోల్చనేల బ్రహ్మాదులతో**

సంఖ్య: IV/364 రాగం : సామంతం
కీర్తన : అల్లదెకో విజయధ్వజము జగ-

## సామంతం

**27 అల్లదెకో విజయధ్వజము జగ -**
**మెల్లఁ జేకొనియె నీతఁడు** ||పల్లవి||

**తొక్కనిచోట్లుదొక్కెటితురగపు**
**రెక్కలమీఁదటిరేవంతుఁడు**
**చక్కఁగ నసురల సంహరించి యిదె**
**దిక్కులుగెలిచెను దేవదేవుడు** ||అల్లదె||

**వోదక శంఖము నొగిచక్రముతో**
**సూదుకుఁ దిరిగేటి శూరుఁడు**
**యీడనుండి సురలిందరిఁ గాచెను**
**మేడెపుమనలక్ష్మీవిభుఁడు** ||అల్లదె||

**శరణనవారలఁ జయ్యనగాచిన**
**శరణాగతరక్షణఘనుఁడు**
**తిరమై యింతకు దిక్కై నిలిచెను**
**గరిమెల శ్రీవేంకటవిభుఁడు** ||అల్లదె||

**ఉపోద్ఘాతము:**

'కో' అనే మాటను మనం 'కో' అంటే కోటిమంది దొరుకుతారు అనే సందర్భంలో వుపయోగిస్తాము. "ఓహో! అల్లదే ఎగురుతున్న ఆ విజయకేతనాన్ని చూడండి. ఈతడు జగమెల్లా చేకొనినాడు" అని కీర్తిస్తున్నారు అన్నమయ్య. స్వామి తురగవాహనమునెక్కి వూరేగుతున్నాడు. రేవంతుడు అంటే రౌతు అని అర్థం. ఇది రెక్కల గుఱ్ఱములా వున్నది. ఈ





రేవంతుడు దానిపైనెక్కి అసుర సంహారానికి బయలుదేరాడు. ఈయన దశదిశలను గెలిచిన దేవదేవుడు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

అల్లదేకో (ఓహో! అల్లదిగో) విజయధ్వజము (శ్రీ వేంకటేశ్వరుని విజయకేతము)

ఈతడు జగమెల్లా జేకొనియె (ప్రపంచాన్నంతా కైవశం చేసికొనినాడు). ఈయన గొప్ప రేవంతుడు (అశ్వచోదకుడు). ఇక ఈ తురగము (గుఱ్ఱము) యెటువంటిది? తొక్కని చోట్లు (చొరరాని చోట్లకు) దొక్కేటిది (పోగలిగినది). ఎందుకంటే ఇది రెక్కలువున్న గుఱ్ఱము చక్కగా (చక్కగా) ఇదె అసురులను సంహరించి ఆ దేవదేవుడు దిక్కుల నన్నింటినీ గెలిచినాడు.

ఈయన యెటువంటి శూరుడో తెలియునా? సూదుకు దిరిగేటిశూరుడు (తనశత్రువులపై పగతో తిరిగి తిరిగి సంహరించే శూరుడు.) మరి దానికోసం ఈయన వోదక (వెనుదీయక) వుపయోగించే ఆయుధాలేమిటో తెలియునా? పాంచజన్యమనే శంఖము, సుదర్శనమనే చక్రము. వాటినుపయోగించిన ఆయన యీడనుండియే (ఇక్కడనుంచే) సురలను (దేవతల) నందరినీ కాపాడుతాడు. అందుకే మన ఈ లక్ష్మీపతి "మేడెపు"వాడు (అందమైన నగిషీలు చెక్కిన జుమికీలు అనే కర్ణాభరణములను ధరించిన శ్రీహరి.

ఈ స్వామికున్న ఇంకొక విశిష్ట లక్షణం యేమంటే యెవడన్నా శరణు మహాప్రభో! అంటే వారిని, చయ్యనగాచీ (సై... అని కాపాడుతాడు). అట్టి శరణాగతత్రాత ఈ ఘనుడు. ఈ తిరుమలలో తిరమై (స్థిరపడి) యింతటికీ దిక్కై నిలిచియున్నాడు. ఈయన గరిమేల (మహిమాన్వితుడైన) శ్రీవేంకటనాథుడు.

**పద్యవివరణ:**

చం.|| **తురగపు వాహనంబుగొని తోయజనాభుడు ఊరనేగెబో**
**తిరుగును శంఖచక్రములదీటుగ దాల్చుచు వేంకటేశుడే**
**శరణన గాచు'సై'యనుచు సజ్జన రక్షకుదేగుదెంచెరా!**
**సురులను గాచునిందరిని సొంపగు శ్రీసతివల్లభుండవో!!**

సంఖ్య: IV/237 రాగం : శంకరాభరణం
కీర్తన : ఏటిబిడ్డ గంటివమ్మ యెశోదమ్మ

**శంకరాభరణం**

**28 ఏఁటి బిడ్డఁ గంటివమ్మ యెశోదమ్మ**
**గాఁటపుదేవతలెల్లఁ గాచుకున్నా రితని** ॥పల్లవి॥

**చెక్కుమీఁటి పాలువోయ చేరి వోరు దెరచితే**
**పక్కననుఁ బొడచూపె బ్రహ్మాండాలు**
**అక్కున నలముకొంటే నంగజతాపము మోఁచె**
**మక్కువకు వెరతుము మాయపు బాలునికి** ॥ఏఁటి॥

**పొత్తులలో నుండఁగానె భుజాలు నాలుగుదోఁచె**
**యిత్తల బాలునికేవి యిటువంటివి**
**యెత్తుకొన్న వేకమై యెవ్వరికి వసగాఁడు**
**హత్తిచూడ వెరతు మీ యారడిబాలునికి** ॥ఏఁటి॥

**తేఁటి వీనితోడిముద్దు దేవలోకము పనులు**
**మీఁటి యేవి చూచినాను మితిలేనివి**
**ఆఁటడిగొల్లెతలము అట్టె కూడి యాడితిమి**
**వెఱు సేయ వెరతు(ము?) శ్రీవేంకటాద్రిబాలుని** ॥ఏఁటి॥

**ఉపోద్ఘాతము:**

తానూ ఒక గోపికయై అన్నమయ్య యశోదాదేవితో ఎటువంటి బిడ్డను కన్నావమ్మా! అని శ్లాఘిస్తున్నారు. నీ బిడ్డను కనులార వీక్షించి మనసారా నమస్కరిద్దామని దేవతలందరూ యెలా వేచియున్నారో చూడు అని ఆశ్చర్యపోతున్నారు. వీడి చెక్కిలి మీద చిటికె వేసి నోరుతెరిస్తే నోట్లో పాలుపోద్దామనుకొంటే... అయ్యబాబోయ్... ఆ చిన్నారి నోటిలో మాకు అండపిండ బ్రహ్మాండమంతా కనుపించిందమ్మా! వీడు మీ ఆరడి బాలుడ కాడు స్వయంగా శ్రీవేంకటేశుడే నమ్మా! అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఓ యశోదమ్మా! ఏటి బిడ్డ గంటివమ్మా? (ఎటువంటి బిడ్డను కన్నావమ్మా నీవు?) గాటపు దేవతలెల్లా (సర్వాధికులైన దేవతలంతా) ఇతని కోసం కాచుకొని వున్నారు.

వీడి లీలలు యెన్నని చెప్పమంటావమ్మా? మేము వానిని చేరి చెక్కిళ్ళు మీటి, వాడి నోరుతెరచి నోట్లో పాలుపోద్దామని ప్రయత్నించాము. వాడు పక్కున నవ్వాడు. మాకు ఆ నోట్లో బ్రహ్మాండమంతా కనుపించి భయంవేసిందమ్మా! అందాల ముద్దుల పాపాయి కదా! అని వీడిని అక్కున జేర్చుకొని హత్తుకొంటే మాకు మదనతాపము కలుగుతున్నది. ఇదేమివింత? వీడిపై మక్కువ ఎక్కువై మాకు భయమేస్తున్నది. ఈ మాయలమారి బాలుడంటే కంగారుగా వున్నది.

పొత్తులలోనుండగానే (కన్నతల్లి దేవకీదేవి పొత్తిళ్ళలో వున్నప్పుడే) ఇతడు చతుర్భుజుడైన శ్రీమన్నారాయణునిగా కనుపించినాడు. ఇత్తలబాలునికి (ఈలోకపు పాపడికి) యిటువంటివి సాధ్యమా? ఒకసారి యశోద చెలికత్తెలు ఈ బాలుని ఎత్తుకొందామని ప్రయత్నించి వాని చేయిని కూడా యెత్తలేక యెవరికీ వశముగాక బిత్తరపోయారట. వత్తి చూచిన (కూడి పరికిస్తే) ఈ ఆరడిబాలుడు (ఆరాటపెట్టే బాలుని వంటివానిని చూశామా?)

వీడు స్వయంగా దేవలోకము గరుత్మంతునిపై వెళ్ళి ఇంద్రుని తల్లి అదితికి నరకాసురుని వధించి తెచ్చిన కుండలాలు తిరిగి ఒప్పగించి ఆమె కృతజ్ఞతలు పొందాడు. ఏమి చూచినా ఇవన్నీ మానవమాత్రులు చేయకలిగిన పనులు కావు. నీ పిల్లవాడు స్వయంగా గొల్లెతలమైన మమ్ము కూడిన వేళమేమూ వానితో ఆడితిమి. ఈ వేంకటాద్రిబాలుని యెడబాయుట మాకు భయావహము.

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **ఎట్టిబిడ్డ గంటివే వో యశోదమ్మ!**
**కాచుకున్నవారు వేచి సురులు**
**నాల్గు భుజములున్న నారాయణుండయ్య,**
**గొల్లపడుచురతుల కూడె నితడు.**

సంఖ్య: IV/171 రాగం : శంకరాభరణం
కీర్తన : వినోదకాడవౌదువు విఠలేశ్వరా

**శంకరాభరణం**

**29** వినోదకాఁడవౌదువు విఠలేశ్వరా
వినుతించ నెట్టువచ్చు విఠలేశ్వరా ॥పల్లవి॥

పసులఁగావఁగానె బ్రహ్మ నిన్ను నుతించే
వెస నీమహిమ యెంత విఠలేశ్వరా
పసిబాలవయసున బండిఁదన్ని విరిచితి
వెసగె నీమాయలెల్లా యివె విఠలేశ్వరా ॥వినో॥

వెన్న నీవు దొంగిలఁగ వేదాలు వొగడీని
విన్న కన్న సుద్ది గాదు విఠలేశ్వరా
చన్ను దాగి రాకాసిప్రాణము హరించితివి
యెన్నికకెక్కె నీబిరు దిటు విఠలేశ్వరా ॥వినో॥

గొల్లెతలఁగూడి చేకొంటివి బ్రహ్మచర్యము
వెల్లవిరాయఁ బనులు విఠలేశ్వరా
బల్లిదపు శ్రీవేంకటపతివై పాండురంగాన
చల్లఁగా నెలకొంటివి జయ విఠలేశ్వరా ॥వినో॥

**ఉపోద్ఘాతము:**

కడపజిల్లాలోని పాండురంగము అనే వూరిలో వెలసిన విఠలేశ్వరునిపై చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. బ్రహ్మ భ్రమచెంది చిన్నారి విఠలుని పరీక్షించెదనని గోపబాలురను వారు కాస్తున్న దూడలను మాయంచేశాడు. చిన్నారి విఠలుడు తానే గోపబాలుడై తానే దూడలై గోకులంలో అందరినీ అలరించాడు. చివరికి బ్రహ్మకే అసలేం జరుగుతున్నదో అర్థంకాక నాలుగు తలల జుట్టు పీక్కోవాల్సినంత పనయిందట. అట్టి నీ మహిమ





యెంతటిదయ్యా విఠలేశ్వరా! అని కీర్తిస్తున్నారు. వినోదకాడైన ఈ విఠలేశ్వరుని యెంత వినుతించినా తక్కువే, మరి.

**తాత్పర్య వివరణ:**

ఓ విఠలేశ్వరా! నీవు గొప్ప వినోదకాడవౌదువు. (అందరికీ గొప్ప వినోదమునందించే అలవాటు వున్నవాడవు). నిన్ను వినుతించ నెటువచ్చు (ఏవిధముగా సన్నుతింపగలము?) మేము అశక్తులము నీ మహిమ నెరుగలేకున్నాము.

ఓ విఠలా! పరమాత్ముడవైన నీవు పశులకాపరివైతే చతుర్ముఖ బ్రహ్మగారు నీ మహిమను వెసనెరింగి (బాగా అర్థమై) నిన్ను అనేక విధములుగా కీర్తించాడు. ఓ విఠలేశ్వరా! నీవు పసిపాపగా వున్నపుడే ఒక పెద్ద బండిని ఒక్క చిన్న తన్నుతో ముక్కలుగా విరిచావు. చూస్తుండంగానే శకటాసురుడనే రాక్షసుడు చచ్చాడు. నీ మాయలన్నీ ఇదే తీరున వుంటాయి స్వామీ!

ఓ దేవా! నీవు వెన్న దొంగతనం చేస్తే వేదము నిన్ను పరమాత్మ అని కీర్తించింది. ఇటువంటి సుద్దులు (పురాణాలు) యెవరు విన్నారు? ఎవరు కన్నారు? చన్నుద్రాపవచ్చిన (పాలుత్రాగించదలచిన) రాకాసి (రాక్షసి పూతనను) ప్రాణములను హరించి వేశావు. ఓ విఠలేశ్వరా! నీ బిరుదు (కీర్తి) ఇటు (ఈ విధముగా) ఎన్నిక కెక్కినది సుప్రసిద్ధమైనది.

ఓ విఠలేశ్వరా! రాసక్రీడలో గోపికలనలరించిన నీవే వారితో కలిసి బ్రహ్మచర్యదీక్ష చేబూని ఆనందం శరీరాలది కాదు ఆత్మలకు సంబంధించినది అన్న సత్యం నిరూపించావు. నీ పనులు అలా విఖ్యాతమైనాయి. ఈ పాండురంగమునందు నీవే వీరాగ్రేసరుడవైన వేంకటేశ్వరుడవై చల్లగా వెలసియుంటివి, ప్రభూ! ఓ విఠలేశ్వరా, నీవే జగద్రక్షకుడవు తండ్రీ!

**పద్యవివరణ:**

కం.॥ **అవుదువు వినోదకాడవు**
**జవరాండ్రనుకూడు బ్రహ్మచారీ విఠలా!**
**చవులూర నిను నుతింతుము**
**ఎవరికి వేంకట విభుండు ఈవని తెలియున్.**

సంఖ్య: IV/499 రాగం : నాట
కీర్తన : సరిలేరితనికి సాహసవిక్రమడీత-

**నాట**

**30 సరిలే రితనికి సాహసవిక్రముఁ డీతఁ-**
**దరయ కలశాపురహనుమంతుఁడు** ||పల్లవి||

**వుదధి లంఘించినాఁడు వుబ్బున మైనాకముచే**
**పొదలి నట్టనడుమఁ బూజగొన్నాఁడు**
**సదరాననే లంక సాధించి వచ్చినాఁడు**
**అదివో కలశాపురహనుమంతుఁడు** ||సరి||

**సంజీవి దెచ్చినాఁడు సమరరంగమందు**
**భంజించి (న) వానరుల బదికించినాఁడు**
**అంజనీదేవికిఁ గొడుకైనాఁడు యేపనుల -**
**నంజఁడు కలశాపురహనుమంతుఁడు** ||సరి||

**బలురాకాసులనెల్లా పట్టి చదిపినవాఁడు**
**ఇల రామునికిఁ గడు హితుఁడైనాఁడు**
**చెలఁగి శ్రీవేంకటేశు సేవ సేయుచున్నవాఁడు**
**అలరి కలశాపురహనుమంతుఁడు** ||సరి|| **499**

**ఉపోద్ఘాతము:**

కలశాపురమున వెలసిన హనుమంతుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. సాహస విక్రముడీతడు. కలశాపుర హనుమంతుని సరిబోలినవారు లేనేలేరు అంటున్నారు అన్నమయ్య. హనుమంతునిపై చెప్పిన కీర్తనలన్నింటిలోనూ ప్రత్యేకత యేమంటే హనుమ శ్రీవేంకటేశుని బంటు అని స్వామి భక్తులకు హనుమంతుడే అంతులేని వరాలనిస్తాడు అని కీర్తిస్తుండటం పరిపాటి. ఈ కీర్తనలో "భంజించి వానరుల బదికించినాడు" అనే చరణంలో వ్రాయసకాని





పొరబాటు సుస్పష్టమే. "భంజించిన వానరుల బదికించినాడు" అని వుంటే బాగుంటుంది. అంజు - అంటే భయపడటం అని అర్థం.

**తాత్పర్య వివరణ:**

అరయ (పరికించగా) ఈతడు, కలశాపురమున వెలసిన హనుమంతుడు. ఈతడు సాహసవిక్రముడు (సాహసవంతుడైన పరాక్రమశాలి). నిజంగా ఇతనికి సరిలేరు (సమానమైనవారు లేరు).

ఈయన వుదధి లంఘించినాడు (సముద్రమును దూకినాడు). ఉబ్బున (సంతోషించినవాడై) మైనాకముచే (మైనాకుడను పర్వతరాజుచే) పొదలి (పెరిగిన తన రూపం చూపించి) అతనిచే సముద్ర మధ్యముననే పూజలు స్వీకరించినాడు. సదరాననే (బాహాటంగానే) రావణాదులు చూస్తుండంగానే లంకను సాధించినాడు (గెలిచినాడు). అదివో చూశారా ఈ కలశాపుర హనుమంతుడు యెంత పరాక్రమవంతుడో!

సమరరంగమందు (యుద్ధరంగములో) లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు, ఈయన సంజీవి పర్వతమునే యెత్తుకవచ్చి లక్ష్మణునే కాదు అంతవరకు రణరంగంలో భంజించిన (చనిపోయిన) వానరులనందరినీ బ్రతికించినాడు. అంజనీదేవికి కొడుకైన ఈ కలశాపుర హనుమంతుడు, యే పనులన్ (యెట్టి సాహ కార్యమునకైనా) అంజడు (భయపడడు.)

ఈయన బలురాకాసులనైనా (బలవంతులైన రాక్షసులనైనా) పట్టి చదిపినవాడు (చిదిపివేసినాడు). భూలోకంలో శ్రీరామచంద్రమూర్తికి కడుహితుడైనాడు (పరమ ఆప్తుడైనాడు). ఇట్లు అలరిన ఈ కలశాపుర హనుమంతుడు, చెలగి (వికాసముతో) శ్రీవేంకటేశ్వరుని సేవ చేయుచున్నాడు. వీనిని సేవించి తరించండి.

**పద్యవివరణ:**

చం.|| **సరియగు వారులేరిలను సాహసవిక్రముడీతడే యహో!**
**అరయనశక్యమౌ హనుమ అంజన సూనునవక్రవిక్రమం**
**బరికుల భంజనుండు సమరాంగన దక్షుడు రామబంటుతా**
**నిరవుగ నిల్చె శ్రీరమణు యేలికలో కలశాపురంబునన్.**

సంఖ్య: IV/466 రాగం : శుద్ధ వసంతం
కీర్తన : చేకొన్న భక్తులపాలి చింతామణి

**శుద్ధ వసంతం**

**31 చేకొన్న భక్తులపాలిచింతామణి**
**సాకారమై వున్నాఁడు సర్వేశ్వరుఁడు ॥పల్లవి॥**

**వాఁడిగోళ్ళచేత వడి హిరణ్యునిఁ జంపి**
**వేడుకనెత్తురులెల్ల వెదచల్లుచు**
**పోఁడిమి నరసింహుఁడై పొడచూపె నల్లవాఁడె**
**మూఁడుమూర్తులకును మూలమీతఁడు ॥చేకొన్న॥**

**కొండమీఁదఁ గూచుండి కోప ముపసంహరించి**
**అండనున్నదేవతల కభయమిచ్చి**
**మెండుగ సులభుఁడై మెరయుచు నున్నవాఁడు**
**దండిజగములకెల్ల దైవ మీతఁడు ॥చేకొన్న॥**

**వేవేలుచేతులను వెస నాయుధాలు వట్టి**
**చేవమీరి ప్రతాపాన సిరులు మించి**
**యీవల నహోబలాన నిరవై యున్నవాఁడు**
**శ్రీవేంకటాద్రిమీఁది సిద్ధమూర్తి యీతఁడు ॥చేకొన్న॥ 466**

**ఉపోద్ఘాతము:**
సర్వేశ్వరుడైన శ్రీ నరసింహుడు సాకారముతో ఈ అహోబలంబున వున్నాడు. ఈ దేవదేవుడు తాను ఆదరించిన తన భక్తులపాలి చింతామణియై అభీష్టములను నెరవేరుస్తుంటాడు అంటున్నారు అన్నమయ్య. పనిలోపనిగా ఆస్వామిని సహజాలంకారయుక్తముగా వర్ణిస్తూ కొసమెరుపులాగా శ్రీవేంకటేశుడై శ్రీవేంకటాద్రి మీద వెలసిన సిద్ధమూర్తి కూడా ఈ అహోబలేశ్వరుడే అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

చేకొన్న (స్వీకరించిన) తన భక్తులపాలి చింతామణియై, వారి అభీష్టములను నెరవేరుస్తూ, సర్వేశ్వరుడైన పరమాత్ముడు సాకారమై నరసింహ రూపమున ఈ అహోబలమునన్నాడు.

ఈయన యెలావున్నాడో చూడండి. తన వాడిగోళ్ళచేత (పదునైన కొనదేలిన గోళ్ళతో) హిరణ్యకశిపుని వడిజంపి (శ్రీఘ్రముగా సంహరించి) పెల్లుబికిన వాని నెత్తురును వేడుకతో యెల్లా (అన్నిచోట్లా) వెదచల్లుచూ, పోడిమి (హిరణ్యకశిపుని షరతులకు ఒప్పునట్లుగా) నరసింహుడై పొడచూపె. అల్లవాడే (అదిగోవాడే) త్రిమూర్తులకు మూలమైన పరమాత్ముడు ఈ అహోబలేశ్వరుడే.

హిరణ్యుడు ప్రహ్లాదుని పెట్టిన హింసకు ఆగ్రహోదగ్రుడైన ఈ ఉగ్రనరసింహుడు ఈ గరుడాద్రి కొండమీద కూర్చొనగానే శాంతుడై కోపమునుపసంహరించుకొని భయపడవద్దని తన అండజేరిన దేవతలకు నభయమొసంగినాడు. మెండుగా సులభుడై (సులభముగా అనుగ్రహించువాడై) జగములకెల్లా దండిదైవము (రక్షకుడైన పరమాత్మ) ఈతడు (ఈ అహోబల నృసింహుడు).

ఈయనకు వేవేల చేతులున్నాయి (అనేక హస్తములు వున్నాయి). అన్ని చేతులలోనూ, వెస (వేగముగా) శంఖ చక్రాది ఆయుధములను చేబూనినాడు. చేవమీరి (ధైర్యోపేతుడై) ప్రతాపవైభవము వుప్పొంగగా ఇక్కడ అహోబలేశ్వరుడై వున్నాడు. భక్తులారా! శ్రీవేంకటాద్రి మీది సిద్ధమూర్తి (దేవదేవుడు) ఇతడే.

**పద్యవివరణ:**

కం.॥ **ఈ కడ నహోబలంబున**
**చేకొని ఆశ్రితులపాలి చింతామణియై**
**శ్రీకరుడు వేంకటేశుడె**
**సాకారనృసింహుడాయె సర్వేశ్వరుడున్.**

సంఖ్య: XV/338 రాగం : నాట
కీర్తన : వెదకితే నీవంటి వేల్పు లెవ్వరున్నారు

**నాట**

**32 వెదకితే నీ వంటివేల్పు లెవ్వ రున్నారు**
**అదన నీ దాసుఁడైన యతఁడే పుణ్యుఁ డయ్యా** ॥పల్లవి॥

**యేలేది పరమపద మీశ్వరుఁడ విందరికి**
**మేలిమి శ్రీభూమీసమేతుఁడవు**
**పాలింతువు లోకమెల్ల బ్రహ్మంతవాఁడు కొడుకు**
**వాలాయించి నిన్నుఁ గొల్చువాఁడే ధన్యుఁ డయ్యా** ॥వెదకి॥

**పండేది పాలజలధి పంపుసేసేది చక్రము**
**నిండువన్నెపైఁడికోక నీ మేనిది**
**వుండుదు వందరిలోన యోగమాయ నీ మహిమ**
**అండ నిన్ను నమ్మినవాఁ డన్నిటాఁ బూజ్యుఁ డయ్యా** ॥వెదకి॥

**సురలు నీ యాజ్ఞవారు సూర్యచంద్రులు కన్నులు**
**బిరుదుటెక్కెములు చూపే వేదములు**
**వురమున నలమేల్మంగ యొప్పెను శ్రీవేంకటేశ**
**గరిమ నీ శరణన్నఘనుఁడే నేర్పరయ్యా** ॥వెదకి॥

**ఉపోద్ఘాతము:**

ఇది తాళ్ళపాక పెదతిరుమలయ్య రచన. శ్రీ వేంకటేశ్వరుని "యెంత వెదకినా నీవంటి దేవుడు కనుపించడయ్యా! ఈ ప్రపంచంలో గొప్ప పుణ్యాత్ముడెవరంటే, నీదాసుడే సుమా!" అంటున్నారు. పెదతిరుమలయ్య కీర్తనలలోని కొన్ని అచ్చతెలుగు పదములకు వివరణ, నేటికాలంలో నిఘంటువులు, కొంత పౌరాణిక వాఙ్మయ పరిచయం, చాలా చాలా శ్రీహరికృప లేకపోతే జరిగేపనికాదు. ఇది నేను స్వానుభవంతో చెబుతున్నమాట. కావాలంటే ఈ కీర్తననొకటికి రెండుసార్లు చదవండి మీకే అర్థమవుతుంది.





**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! వెదకి చూస్తే, నీవంటి దైవము యెవ్వరున్నారు? అదన (అధికముగా) నిన్ను సేవించు నీదాసుడైన వాడే పుణ్యాత్ముడయ్యా!

ప్రభూ! నీవేమన్నా సామాన్యుడవా? నీవు యేలికవై పరిపాలించేది పరమపదము (మోక్షస్థానమైన వైకుంఠం). ఈ సర్వజీవులకు నీవే ఈశ్వరుడవు. బంగారు వన్నెగల శ్రీదేవికి, సిరులభూదేవికి నీవు పతిదేవుడవు. పదునాల్గు భువనములను పాలించునాథుడవు నీవే. ఇక నీ కొడుకులేమన్నా తక్కువ తిన్నారా? చతుర్ముఖ బ్రహ్మగారు నీ పెద్దకొడుకు. ఆయనే లేకపోతే సృష్టే లేదు. ఇక ఆయన వ్రాసిన నుదుటి వ్రాతకు తిరుగే లేదు. తండ్రీ! వాలాయించి (నిరంతరము) నిన్నే కొలుచుచూ జీవించేవాడు ధన్యుడయ్యా.

ఓ దేవా! నీవు పండేది (పరుండి విశ్రాంతి తీసికొనేది) క్షీరసాగరములో. శత్రుసంహారానికి నీవు పంపుసేసేది (నీవు నియోగించేది) సుదర్శనచక్రము. నీ మేనిది (శరీరంపై ధరించేది) నిండు వన్నె పైడికోక (బంగారు పసుపు వర్ణముగల పట్టు పీతాంబరము). ఇక నీవు నిరంతరం వుండేది అందరి అంతర్యామిగా. నీ మహిమకు ప్రతిరూపమే నీ యోగమాయ. దానికి తిరుగులేదు. నిన్ను నమ్మినవానికి చెడు జరుగనే జరుగదు. వాడే పూజ్యుడు.

దేవతలందరూ నీ ఆజ్ఞను శిరసావహించేవారే. సూర్య చంద్రులు కన్నులుగా గల నీ దృష్టి నుండి తప్పుకొనుట సాధ్యమే కాదు. వేదములన్నియూ నీ బిరుదు టెక్కెము (విజయ కేతనములు). హృదయ పీఠమున అలమేల్మంగ స్థితుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! మహిమాన్వితుడవైన నిన్ను శరణుచొచ్చినవాడే నిజమైన నేర్పరి.

**పద్యవివరణ:**

తే.గీ.॥ **వెదకితే లేరు నీవంటి వేల్పులెవరు?**
**నీదు దాసుడే పుణ్యుడు వేదవినుత!**
**సూర్యచంద్రులు నయనాలు సురులు బంట్లు**
**పెద్దతిరుమల వినుతించె, వేంకటేశ!**

సంఖ్య: IV/530 రాగం : నాట
కీర్తన : అదెవచ్చె రాఘవు డాతని దాడి ముట్టె

**నాట**

**33 అదె వచ్చె రాఘవుఁ డాతని దాడి ముట్టె**
**యెదిరించరాదు మీకు నేది దెరు విపుడు ||పల్లవి||**

**భువిలోన రాముఁడై పుట్టెనట విష్ణుఁడు**
**అవల మీకు దిక్కేది యసురలాల**
**తివిరి మిమ్ము వెదకె దివ్యబాణాలాతనివి**
**రవళి నెందు చొచ్చేరు రాకాసులాల ||అదె||**

**చలపట్టి కొండలచే సముద్రము గట్టెనట**
**తల చూపరాదు మీకే దైత్యులాల**
**వలగొని దేవతలు వానరులై వచ్చిరట**
**నిలువరా దిఁక మీకు నిశాచరులాల ||అదె||**

**రావణుఁ జంపెనట రణములోఁ జిక్కించుక**
**దావతిఁ బారరో మీరు దానవులాల**
**యీవేళ శ్రీవేంకటేశుఁడితడే విభీషణుని**
**లావున శరణనరో లంకావాసులాల ||అదె|| 530**

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తన చదివాక వావిలిపాడు వీరరాఘవునిపై మన అన్నమయ్య చెప్పిన కీర్తనేమో అనిపించింది. వీరరాఘవుడు లంకను ముట్టడించాడు. ఒరే రాకాసుల్లారా! ఆయనను యెదిరించడం మీవల్ల అయ్యేపనికాదు. ఇక మీకు వేరే దారి యేమున్నది! పారిపోండి అని హితవు చెబుతున్నారు. రావణుడే చచ్చాక మీకు దిక్కెవరురా? ఆయనను శరణనండి అంటున్నారు





ఈ శ్రీవేంకటేశుడే ఆనాటి విభీషణ వరదుడు కూడా, కాబట్టి ఓ లంకవాసుల్లారా! ఈయనే దిక్కనండి అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

అదె వచ్చె రాఘవుడు (వీరరాఘవుడు) లంకపై ఆతని దాడి (ఆక్రమణ) ముట్టె (ముట్టడించింది). మీకు యెదిరించరాదు (నిలువరించ నసాధ్యము). ఏది తెరువు యిపుడు (ఇప్పుడు మీకు తప్పించుకొనేదారియేది).

ఒరే! రాక్షసుల్లారా! శ్రీమహావిష్ణువే రావణ సంహారం కోసం భూమిమీద రాముడై పుట్టాడట. అవల (ఆపైన) మీకు దిక్కేదిరా? ఆయన బాణాలు దివ్యమైనవి. అవి మిమ్ము తివిరి వెదకి (పనిగట్టుకొని వెదకి) మరీ చంపుతాయి. రవళి (పొలోమని పారిపోయి) యెందు చొచ్చేరురా (యెక్కడకు పోగలరురా?)

ఓ దైత్యులారా! చలపట్టి (పట్టుబట్టి) కొండరాళ్ళు చేత సముద్రమును గట్టెనట (సేతు బంధనము చేశాడట). ఇక మీకే తల చూపరాదు (పొడచూపరాదు). వలగొని (అటు తిరిగి ఇటు తిరిగి) దేవతలంతా వాలి, సుగ్రీవుల వంటి వానర ప్రముఖులై జన్మించారంట. ఓ నిశాచరులారా! మీకు నిలుచునే చోటుండదు. నామాట వినండి.

ఒరే! దానవుల్లారా! మీకు ఒక దుర్వార్త. రణములో శ్రీరాముడు మీ యేలికయైన రావణుని జిక్కించుకొని (పట్టుకొని) తుదముట్టించాడట. మీరంతా దావతి బారరో (ఏడుస్తూ పారిపోండిరా!) ప్రస్తుతం మీ రాజైన విభీషణుడు చిరంజీవి, రామ భక్తుడు. ఓ లంకవాసులారా! మీరుకూడా లావున (ధైర్యంతో) ఈవేళ శ్రీవేంకటేశుడై నిలిచిన ఆ దేవదేవుని శరణనరో!

**పద్యవివరణ:**

కం.|| **అదిగో రాఘవుడొచ్చెను**
**యెదిరించగరాదు మీకు నేది తెరువికన్?**
**తుదముట్టె రావణుండును**
**పదిలంబుగ బారరోరి! పాపులు దనుజుల్.**

సంఖ్య: XXVIII/324 రాగం : శంకరాభరణం
కీర్తన : అలమేల్మంగవునీవు అక్కున నుందానవు

### శంకరాభరణం

**34 అలమేల్మంగవు నీవు అక్కున నుందానవు**
**లలి నీగుణమెఱిఁగి లాలించీఁగాక** ||పల్లవి||

**కొచ్చి కొచ్చి పలుమారుఁ గొసర నేమిటికే**
**మచ్చికతో నాతఁడే మన్నించీఁగాక**
**కచ్చుపెట్టి రతులకుఁ గక్కసించనేఁటికే**
**యిచ్చకము సేయఁగానే యెనసీఁగాక** ||అల||

**విన్నపాలు సేసి సేసి వేసిరించనేఁటికే**
**తన్నుఁదానే నీపై దయదలఁచీఁగాక**
**చన్నుఁ గొండలనే వొత్తి చండిసేయ నేఁటికే**
**యెన్నికతో వేఁడుకొంటే నియ్య కొనీఁగాక** ||అల||

**పిక్కటిల్లఁ జేయివట్టి పెనఁగఁగ నేఁటికే**
**యిక్కడ శ్రీవేంకటేశుఁ దేలీఁగాక**
**తక్క నిన్నుఁ బెండ్లాడీ తమకించ నేఁటికే**
**చక్కఁగా సేవ చేసితే చనవిచ్చీఁగాక** ||అల||

**ఉపోద్ఘాతము:**

అన్నమయ్య శృంగారకీర్తన మాధుర్యం వర్ణింపనలవిగానిది. ఆరువందల యేళ్ళనాటి తెలుగు కీర్తన ప్రతిపదార్థ వివరణ అంత ఆషామాషీ వ్యవహారంకాదు. "అక్కున నుందానవు" అంటే 'అక్కుననున్నదానవు' అని అర్థం చేసికోవాలి. "కొచ్చి కొచ్చి పలుమారు గొసరనేమిటికే" అంటే "గుచ్చి గుచ్చి ఆయనగారిని అనేకమార్లు ప్రార్థించటం యెందుకమ్మా?" అని ప్రశ్నించడం అన్నమాట. ఇలా వివరిస్తూ పోతే ఉపోద్ఘాతమే కొండవీటి





చాంతాడంత అవుతుంది. స్వామి ఆమె "గుణమెరిగి లాలించీగాక" అంటే ఆమె చిత్తప్రవృత్తి యెలావుందో తెలిసి లాలిస్తాడట.

**తాత్పర్య వివరణ:**

తల్లీ! నీవు అలమేల్మంగవు. శ్రీవేంకటేశ్వరుని అక్కున (వక్షస్థలమున) నుందానవు (వున్నదానవు). లలి (ప్రేమాస్పదమైన) నీగుణగణములన్నియు యెఱిగినవాడు కనక నీ స్వామి నిన్ను తప్పక లాలించునమ్మా!

దేవీ! కొచ్చి కొచ్చి (గుచ్చి గుచ్చి) ఆయనగారిని అనేక మారులు కొసర నేటికే (బ్రతిమిలాడుకోవటం దేనికమ్మా?) మచ్చికతో (నీకు అనుకూలుడై) ఆతడే మన్నిస్తాడు లేవమ్మా! కచ్చుపెట్టి (ఆశపడి) ఆయనతో సురతమునకు కక్కసించనేటికే (ఆశతో వేదన జెందుట దేనికమ్మా?) నీవు కాస్త ఇచ్చకము చేయగానే (వలపు కురిపించగానే) యెనసీ గాక (పొందుకు చేరడా)? దిగులు నీకెందుకమ్మా?

అమ్మా! ఆయనగారికోసం అన్ని విన్నపాలు చేయటం దేనికి? ఆయన కరుణాసాగరుడు. తనంతట తానే నిన్ను దయతలుస్తాడు లేవమ్మా! చింతించకు. దేవీ! నీ కుచగిరులు ఆయనకు వొత్తి నీ ఆగ్రహం ప్రదర్శించటం దేనికమ్మా? తగిన విధంగా వేడుకొంటే ఇయ్యకొనీగాక! (నీవు చెప్పినట్లే వింటాడు లేవమ్మా!)

దేవీ! పిక్కటిల్ల (అతిశయముగా) ఆయనే నీచేయి పట్టుకొంటే పెనగులాడుటెందుకమ్మా? ఇది ఎవరి సామ్రాజ్యమనుకొంటున్నావు? ఇది శ్రీవేంకటేశ్వరుని యేలుబడి. అయినా, తక్క నిన్ను బెండ్లాడి (కావాలని వలచి వలపించుకొని నిన్ను పరిణయమాడి) ఇంత తమకించుటెందుకమ్మా (చలింపజేయుట దేనికమా?) నీవు చక్కగా సేవిస్తే నీకు అనుకూలుడు కాడా?

**పద్యవివరణ:**

తే.గీ.|| **నీవు అలమేలు మంగవు నీలవర్ణు**
**అక్కుననెయున్నదానవు, చక్కనైన**
**నీదు గుణమెరిగిన హరి నిన్ను ప్రేమ**
**తాను లాలించె నోయమ్మ! తమకమలర.**

సంఖ్య: XXVIII/496 రాగం : ఆహిరినాట
కీర్తన : త్రివిక్రమమూర్తియైన దేవునివలె నున్నాడు

**ఆహిరినాట**

**35 త్రివిక్రమమూర్తియైన దేవునివలె నున్నాఁడు**
**భువి సేవించేవారిపాలి పుణ్యఫల మీతఁడు** ॥పల్లవి॥

**అంచె నుదయాస్త గిరులందు నొక జంగ చాఁచి**
**వంచించక మిన్ను దాఁక వాలమెత్తి**
**ముంచి బ్రహ్మలోకము మోవఁగఁ బ్రతాపమున**
**పెంచినాఁడు తనమేను పెద్దహనుమంతుఁడు** ॥త్రివి॥

**తిరముగ హస్తములు దిక్కులు నిండఁ బరపి**
**వరుసఁ గర్ణము లిరువంకఁ జిక్కించి**
**దుర దుర మస్తకము ధ్రువమండలము సోఁక**
**పెరిగినాఁ డిదివో పెద్దహనుమంతుఁ** ॥త్రివి॥

**అక్కజపు రోమము లన్నిలోకము లొరయ**
**మొక్కుచు శ్రీవేంకటేశుమోహపు బంటై**
**పక్కన నజాండ కప్పరము నిండాఁదాను**
**పిక్కటిల్లినాఁ డిదివో పెద్దహనుమంతుఁడు** ॥త్రివి॥

**ఉపోద్ఘాతము:**

ఈ పెద్దహనుమంతుడు శ్రీమహావిష్ణువు యొక్క త్రివిక్రమ మూర్తివలె దిక్కులు పిక్కటిల్లునట్లు ఆద్యంతములు లేనట్లు వున్నాడు. ఈయన పుడమిలో తనను సేవించు వారి పాలిట పుణ్యఫలము. అంతేకాదు ఈయన ఒక్కొక్క రోమములో ఒక్కొక్కలోకము ఇమిడి యున్నది. ఈ అనంతమూర్తి రామబంటు త్రేతాయుగంలో కానీ నేడు శ్రీవేంకటేశ్వరుని మోహపు బంటై యెట్లు మొక్కుచున్నాడో చూడండి అంటున్నారు అద్వితీయుడు అన్నమయ్య.





**తాత్పర్య వివరణ:**

ఇదిగో పెద్దహనుమంతుడైన ఈ స్వామి, త్రివిక్రమమూర్తి (త్రిభువనములను ఆక్రమించిన) వామనమూర్తివలె పెరిగియున్నాడు. ఈతడు భువి (పుడమిపై) తనను సేవించేవారి పాలిటి పుణ్యఫలమై తోచుచున్నాడు.

అంచె (వరుసతో) తూర్పు పడమర గిరులలో తాకునట్లు తన జంగ (రెండు పిక్కలను) చాచి, వంచించక (సంకోచించక) మిన్నుదాక (ఆకాశమును తాకునట్లు) వాలమెత్తి (తన తోకను పైకెత్తి) యున్నాడు. బ్రహ్మలోకము ఆయనప్రతాపమునకు మోవగా (అబ్బురపడగా) ఈ పెద్దహనుమంతుడు తన మేను (శరీరము) పెంచినాడు.

ఈ పెద్ద హనుమంతుడు తిరముగ (స్థిరముగ) తన హస్తములను దిక్కులు నిండునట్లుగా బరపి (పరచి) ఆ వరుసలో తన కర్ణములను (చెవ్వులను) ఇరువంకల (రెండువైపులా) చిక్కించి (రిక్కించి) తన మస్తకమును (శిరస్సును) దురదుర (శీఘ్రముగా) ధ్రువమండలము సోక (తాకునట్లు) పెరిగినాడు. ఇదివో ఈ విధంగా ఆయన సూర్యుని గురువుగా వేదములను నేర్చినాడు.

అట్టి విశ్వరూప ప్రదర్శనమున ఆయన రోమములు (వెంట్రుకలు) మిక్కిలి పొడవై లోకములన్నింటినీ ఒరిపిడికి గురి చేసినవి. ఆ విశ్వవ్యాప్త హనుమంతుడు తన యజమాని అయిన మోహనాకారుడు శ్రీవేంకటేశ్వరుని నమ్మినబంటై ఈ భూమండలం ప్రక్కనున్న అజాండము (విశ్వము) కప్పరమునిండ (కప్పుకొనినట్లు నిండిపోయి) తాను పిక్కటిల్లినాడు (నిండి వ్యాపించినాడు). అదిగో ఆ పెద్ద హనుమంతునికి భక్తితో మొక్కండి.

**పద్యవివరణ:**

చం.॥ **పెరిగెను చూడుడీహనుమ విష్ణుత్రివిక్రమరూపమట్లుగా**
**గిరులను తూర్పుపశ్చిమల క్రిందుగ జేసెను జంగచాచుచున్**
**వరుసగ జిక్కజేసి తన బారగువీనులు నేర్చెవేదమున్**
**తిరుమల తేని బంటితడు దిక్కుల నిండిన పావనే భళా!**

సంఖ్య: IV/225  రాగం : లలిత
కీర్తన : బంటుకు బంటవుదురా పాపముగాక నీ-

**లలిత**

**36 బంటుకు బంటవుదురా పాపముగాక నీ-**
**బంటుకు బంట్లమై బదికేము నేము ॥పల్లవి॥**

**పాతాళముననున్నబలివాకిలి గాచేవు**
**దూతవై పాండవులపొందున నుంటివి**
**యీతల యేలిక బంటు యీవరుస దప్పె నిఁక**
**చేతనే నిన్నుఁగొలువఁ జింతయ్యీ నిందుకే ॥బంటు॥**

**పాండవులదూతవై పనిసేసితివి వారు**
**అండ నీదూతలయ్యేది అమరుఁగాక**
**నిండి గురు దైవమనే నియమము దప్పె నిదే**
**మెండునీదాసులకెల్ల మేర మితి యేదయ్యా ॥బంటు॥**

**పరగ నౌలే నీవు భక్తవత్సలుండ వౌదు**
**తిరమై యెరఁగకాడితిమి యిందాఁకాను**
**అరుదైన శ్రీవేంకటాద్రీశుఁడవు నీకు**
**సిరులనే శరణంటిఁ జేసినట్టు సేయవే ॥బంటు॥ 225**

**ఉపోద్ఘాతము:**

ఓ దేవదేవా! మేమంతా నీ బంట్లము. నీవే మాకు బంటువై మమ్మల్ని సేవిస్తావుట కదా! ఇంతకంటే మాకు పాపము యేముంటుందయ్యా! నీబంటు అయిన శ్రీ రామానుజగురుదేవులకు మేము బంటమై బ్రతికితే మేము తరించినట్లే. ఇంకా మేము కోరేదేముంటుంది అంటున్నారు





అన్నమయ్య. మేము అజ్ఞానంవల్ల తెలియక నీగురించి యేమన్నా అంటే మమ్ము మన్నించవయ్యా!

**తాత్పర్య వివరణ:**

ఓ దేవా! మేమంతా నీబంట్లము. నీ బంట్లకు నీవే బంటువౌతావా? ఇంతకంటే పాపము మాకు వుంటుందా? మరి మా పాప నివారణార్థం నీ బంటయిన శ్రీరామానుజాచార్యులవారికి బంట్లమై నేము (మేము) బ్రతికేమయ్యా!

ప్రభూ! పాతాళముననున్న బలిచక్రవర్తి వాకిలికి కాపలాదారువైనావు. రాజ్యం పోగొట్టుకొన్న పాండవులకు పొందున (స్నేహబంధంతో) వుంటివి. ఈ విధంగా ఎవరు ఎవరికి బంటయినట్లు భావించాలి? నీవు వారికి బంటువా వారు నీ బంట్లా? ఈ వరుస తప్పినట్టయింది కదా! ఇందుకే నిన్ను కొలవాలంటే చింతించాల్సివస్తోంది. నీవు మాకు బంటువు అయితే మాకు పాపం రాదా?

నీవు పాండవుల దూతవై పనిచేశావు. అసలు వారంతా వారి పూర్వజన్మలలో నీ దూతలే కదా! యముడు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వనీదేవతలు నీ పనుపున నే భూమిపై అవతరించారు కదా! ఈ విధముగా గురువు దైవము అనే నియమం కూడా నీవు పాటించలేదు. అందుకే మెండైన నీ దాసులకు మితము(హద్దు) యేమీలేవయ్యా!

ఔలే (అవునులే) నీవు భక్త వత్సలుడవనుమాట నిజము. ఏదో యెరుగక ఆడితిమి (అన్నాము లేవయ్యా!) ఇందాకాను ఇప్పటిదాకా నీ భక్త వాత్సల్యం అర్థం చేసికోలేక యేదో వాగాను లేవయ్యా! అరుదైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు వైభవంతో శరణార్థినయ్యాను. ఇక నీకు తోచినట్లు చేయవయ్యా! నీ చిత్తము మా ప్రాప్తము.

**పద్యవివరణ:**

ఉ.॥ **బంటుకు బంటువౌదువట, పాపముగాకిదియేమిటయ్యా? నీ**
**బంటుకు బంట్లమై బ్రతికి పావనులౌదుము, యేలనందువా**
**బంటులు పాండవుల్, తమరు వాకిలిగా చెడి ఆ బలీంద్రుడున్**
**పంటగచూప, నీ శరణు బట్టితి ధన్యుడ వేంకటేశ్వరా!**

సంఖ్య: XXVIII/172　　రాగం : గౌళ
కీర్తన : శిష్టులను మన్నించే శిశు వీతడు

**గౌళ**

**37 శిష్టులను మన్నించే శిశు వీతఁడు**
**దుష్టుల నణఁచి భూమిఁ దుదకెక్కు నీతఁడు ॥పల్లవి॥**

**దేవకీదేవివసుదేవులకు జనియించె**
**భావించఁ గృష్ణుఁడు పరబ్రహ్మము నేఁడు**
**శ్రావణ బహుళాష్టమి సమకూడె నడురేయి**
**యీవేళ రోహిణి యిన్నిటను మంచిది ॥శిష్ట॥**

**గండముతోఁ బుట్టె నదె కంసునికి మేనల్లుఁడు**
**పాండవుల కందరికి బావమఱఁది**
**దుండగపు భూభారము తొలఁగదొబ్బు నీతఁడు**
**యెండనీడ కన్నులవాఁ డిఁక నింతా మంచిది ॥శిష్ట॥**

**ఆవు లీతనిపేరిట నచ్చివచ్చు లెంచి చూడ**
**వేవేలు గొల్లెతలకు విటుఁ డవును**
**శ్రీవేంకటాద్రి నున్నాఁడు చేరి యలమేల్మంగతో**
**యీవలఁ బెద్దలు చెప్పి రిఁక నింతౌ మంచిది ॥శిష్ట॥ 172**

**ఉపోద్ఘాతము:**

ఒకానొక శ్రావణ బహుళాష్టమి (శ్రీకృష్ణాష్టమి) నాడు అన్నమయ్య వినిపించిన కృష్ణరసాయనామృతమిది. తనివిదీరా ఆస్వాదించి తరించండి. మీరు చూస్తున్న ఈ శిశువు శిష్టరక్షణ దుష్ట శిక్షణ చేయుటకు అవతరించిన పరబ్రహ్మ. కంసవధ చేసినా పాండవుల బావగా భారతయుద్ధం నడిపించినా, భూభారాన్ని నిర్మూలించుటకే. ఆలమందలను కాచినా, వేవేలు గొల్లెతల





విటుడైనా ఈ జగద్గురునకు సాటియెవరు? నేడు అలమేలుమంగతో తిరుమల శిఖరాలజేరి మనకోసం నిలిచియున్నాడు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఈతడు (ఈ శ్రీకృష్ణుడు) శిష్టులను (సద్వర్తనులను) మన్నించు (ఆదరించు) శిశువు (బాలకృష్ణుడు). ఈతడు దుష్టుల నణచి (దుర్మార్గులను పరిమార్చి) భూమిపై తుదకెక్కెను (విఖ్యాతి చెందినాడు).

నేడు (ఈ కృష్ణాష్టమినాడు) పరబ్రహ్మము (ఆదిమధ్యాంతరహితుడైన పరమాత్మ) దేవకీదేవి వసుదేవులకు కృష్ణుడు అని జగములు భావించునట్లు జన్మించినాడు. ఈ బాలుడు శ్రావణ బహుళ అష్టమి నాడు, నడురేయి (అర్ధరాత్రివేళ) సమకూడె (పుట్టినాడు). ఈ రోజున రోహిణీ నక్షత్ర ప్రభావము యిన్నిటను (ఈ లీలలన్నిటికీ) యెంతో మంచిది.

ఈ బాలుడు కంసుడు అనే తన మేనమామ గండముతోటి పుట్టి ఆ దుష్టునకు మృత్యువైనాడు. శిష్టులైన పాండవులకు బావమరిదియై యెన్నో మేళ్ళు చేసినాడు. ఈతడు దుష్టుల వలన భూమికి కలిగిన భారమును తొలగదొబ్బినాడు (తొలగించివేసినాడు). ఈయన, యెండనీడ కన్నులవాడు (రవిచంద్ర నేత్రుడు). ఇక నింతా మంచిది (ఇకపై సర్వమూ మంచే జరుగుతుంది).

ఎంచి చూడగా ఆవులంటే ఈ కృష్ణయ్య పేరుతో మమేకమై గోపాలకృష్ణుడు అనునట్లు అచ్చివచ్చినది. వేవేల (అసంఖ్యాకులైన) గోపికలకు ఈ కృష్ణమోహనుడు గొప్ప విటుడు. నేడు తన దేవేరి అలమేలుమంగతో చేరి శ్రీవేంకటాద్రిపైనున్నాడు. ఇవన్నీ మాకు మా పెద్దలు చెప్పినారు. ఇక ఇంతౌ (ఈ జరుగబోయేదంతా) మంచిది అనేమాట నిజము.

**పద్యవివరణ:**

తే.గీ.॥ **శిష్టులను బూని మన్నించు శిశువితండు**
**దుష్టులనణచి అవనిలో తుదకునెక్కె**
**గురుడు జగతికి కృష్ణుండు గోపి విటుడు**
**నేడు తిరుమలనున్నాడు నెలతగూడి.**

సంఖ్య: XXVIII/371 రాగం : సాళంగనాట
కీర్తన : ఏమని చెప్పగవచ్చు నీతని ప్రతాపము

## సాళంగనాట

38 ఏమని చెప్పఁగవచ్చు నీతని ప్రతాపము
భూమిలో నారదాదులు పొగడే రీతనిని ||పల్లవి||

పిడుగులు రాలఁజొచ్చె పెనుఁగంభము వగిలే
వెడలె నందులోల వీరసింహము
కడుపుచించి పేగులు గక్కన జంద్యాలు వేసె
పడె హిరణ్యదైత్యుఁడు పగదీరె నదివో ||ఏమ||

ఘోర చక్రము గెరలె కోలువెల్ల బెదరెను
ఆరభటి గావించె నాదిసింహము
ధీరుఁడై నెత్తురు నలుదిక్కులకు వెదచల్లె
పారిరి రాకాసులెల్ల పగదీరె నదివో ||ఏమ||

సురలు జయవెట్టిరి శుభములు భువి నిండె
తిరమాయ శ్రీవేంకటదేవ సింహము
గరిమఁ బ్రహ్లాదునిఁ గాచె దాసుల రక్షించె
పరసేనలు సమసె పగదీరెనిదివో ||ఏమ||

**ఉపోద్ఘాతము:**

ఇతని (ఈ నరసింహుని) ప్రతాపమును యేమని చెప్పవచ్చును? ఇతను భూమిపై నవతరించిన విధమును నారదాదులే కీర్తించినారు అంటున్నారు అన్నమయ్య. అనేక కీర్తనలలో మాదిరిగానే సహజమైన ఆ





నృసింహదేవుని వర్ణనలో సహజత్వం వుట్టిపడుతుంటుంది. ఏడిరా విష్ణువు? ఇందుగలడందులేడని సందేహము వలదు అంటున్నావే? అయితే దీంట్లో చూపించరా అని అక్కడనే వున్న స్తంభాన్ని తన గదతో మోదాడు హిరణ్యకశిపుడు. అప్పుడు ప్రహ్లాదవరదుడు నారసింహుడై దాంట్లోంచి వెలువడి ఆ హిరణ్యకసిపుని గోళ్ళతో చీల్చి, సంధ్యాసమయంలో తన ఒడిలో వుంచుకొని ప్రేగులు వూడపీకి చంపివేశాడు. భీభత్స రస ప్రధానమైన కీర్తన ఇది. చదివి తరించండి.

**తాత్పర్య వివరణ:**

ఇతని (ఈ నారసింహుని) ప్రతాపమును (శౌర్యమును) యేమని చెప్పగవచ్చును (మాటలలో చెప్పగలమా)? ఈతనిని భూమిపై చేరిన నారదాది మునులు పొగడేరు (కీర్తించేరు).

ఆ హిరణ్యకశిపుడు తన గదతో అక్కడనున్న స్తంభమును మోదగా ఆపెనుగంభము (పెద్ద స్తంభము) వగిలె (పగిలిపోయింది). పిడుగులు రాలుతున్నట్లు ధ్వనులావిర్భవించాయి. దాంట్లో నుండి వీరసింహము వెలువడింది. వస్తూనే ఆ దానవుని కడుపు చించి (పొట్టను చీల్చి) గక్కురన (గబుక్కున) వాని పేగులు జంద్యాల మాదిరి వేసికొనినాడు. అదివో హిరణ్యకశిపుడు పడె (చచ్చిపడ్డాడు) విష్ణుని పగదీరె (పగ చల్లారింది).

ఘోరమైన హరి సుదర్శన చక్రము కెరలె (విజృంభించినది). కోలువెల్లా బెదరె (హిరణ్యకశిపుని కొలువు కూటమి అంతా) భయపడింది. ఆది-నరసింహము ఆరభటి (మ్రోతమోగేట్లు) చేసినాడు. ధైర్యంతో నాల్గు దిక్కులా రక్తము వెదజల్లబడినది. రాకాసులెల్లా పారిరి (పారిపోయారు) అదిగో ఆ నరసింహుని పగదీరె (పగ చల్లారినది).

దేవతలందరూ జయజయధ్వానములు పలికిరి. భూమిపై శుభములు పొడజూపినవి. శ్రీవేంకటమున నెలకొన్న దేవసింహము (కృతయుగంలో నరసింహమైనట్టి ఈ కలియుగపు దివ్య సింహుడు శ్రీవేంకటేశ్వరునిగా) తిరమాయ (స్థిరపడినాడు). ఆనాడు ప్రహ్లాదునిగాచినట్లు నేడు తన దాసులను రక్షించుచున్నాడు. పరసేనలు (శత్రుసేనలు) సమసె (అణగిపోయినవి). అదిగో విష్ణుమూర్తి పగతీరినది.

**పద్యవివరణ:**

సీ.॥ **పెనుగంభము వగిలె పిడుగులు రాలెను**
**వీరసింహమొకటి వెడలెనురికి**
**వొగి చీల్చి కడుపును ప్రేగుల జంద్యాలు**
**చేసి, హిరణ్యుని చించి చంపె**
**ధీరుడైనెత్తురు దిక్కుల వెదజల్లె**
**పారంగ దనుజులు బావురనుచు**
**గాచెను ప్రహ్లాదు గరుణించెదాసుల**
**పరసేన సమసెను పగయుదీరె**

ఆ.వె.॥ **ఏమి చెప్పవచ్చునితని ప్రతాపము**
**నారదాదులితని శరణువారు**
**వేంకటాద్రి సింహ విభవంబుదెల్వుడీ**
**సురులకెల్ల కలుగు శుభములన్ని.**





సంఖ్య: XXVIII/173 రాగం : దేవగాంధారి
కీర్తన : వేల గట్టినట్టి వేవేలు చక్కిలాలు

## దేవగాంధారి

**39 వేలఁ గట్టినట్టి వేవేలు చకిలాలు**
**కోలలెత్తుకొని కొట్టీ వీఁడె** ॥పల్లవి॥

**వుట్టులు జతనము వోవో చెలులాల**
**రట్టడి కృష్ణుఁడు రావాడీని**
**గుట్టుతోనే వచ్చి గోపాలులుఁదాము**
**చుట్టి వెన్నలుఁబాలు జుట్టీ వీఁడె** ॥వేలఁ॥

**దొంతులు జతనము దొడ్డల సతులాల**
**ఇంతలోఁ గృష్ణుఁడు ఇదె వచ్చీని**
**రంతుసేసుకొని రయమున వీదుల**
**వింతగా నడుకులు వెదకీ వీఁడె** ॥వేలఁ॥

**వాడలు జతనము వల్లవాంగనలాల**
**వేడుకఁ గృష్ణుఁడు వెలసీని**
**యీడనే శ్రీవేంకటేశుఁ డలమేల్మంగఁ**
**గూడి నీతో ముద్దు గునిసీ వీఁడె** ॥వేల॥

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తనలో "వేలఁగట్టిన" అంటే వేలికి కట్టిన అని కాదు. వ్రేలాడ గట్టిన అని అర్థం. ఆ రోజుల్లో చక్కిలాలు చేసి ఎత్తుగా గోడలకి వ్రేలాడగట్టేవారన్నమాట. వేవేలు అంటే అసంఖ్యామైన అని అర్థం. అసంఖ్యాకమైన చక్కిలాలను ఎత్తుగా వ్రేలాడదీస్తే వీడు కఱ్ఱలెత్తి కొట్టి క్రిందపడేసి తన స్నేహితులతో తినేశాడట. అట్లాంటి అఘాయిత్యాలు

చేసిన ఆ దొంగ పిల్లాడు నేడు శ్రీవేంకటేశ్వరుడై మా తల్లి అలమేలుమంగ దగ్గర ముద్దులు గుడుస్తున్నాడు చూడండి అంటున్నారు అన్నమయ్య. ఇందులో శృంగారంపాలు కాస్త యెక్కువే.

**తాత్పర్య వివరణ:**

ఓ అమ్మలారా! ఈ కృష్ణుడు యేమిచేశాడో చూశారా? అనేకమైన వేలగట్టినట్టి (వ్రేలాడగట్టినట్టి) చక్కిలాలను, వీడే కోలలెత్తికొని (కఱ్ఱలను యెత్తి) కొట్టి చిన్న చిన్న ముక్కలు చేశాడు. తిన్నన్ని తిన్నాడు.

వోవో చెలులారా! మేము ఉట్లలో దాచుకొన్న వాటికి ఈ రట్టడి (అఘాయిత్యపు) కృష్ణుడు రావాడీని (ఉపద్రవం కలిగిస్తాడు). గుట్టుతోనే (రహస్యంగా) వచ్చి గోపాలులు తానూ కలిసి చుట్టి (చుట్టుముట్టి) వీడే పాలు, వెన్నా జుఱ్ఱుకొన్నాడు. సరే ఇదంతా ఒక యెత్తయితే వాడి శృంగార చేష్టలు యేమి చెప్పను?

దొడ్డల సతులారా! (దొడ్డవారైన ఓ వనితల్లారా!) భార్యాభర్తా దొంతుల జతనము (రతిక్రీడ) కు సిద్ధంగా వుంటే ఇంతలో కృష్ణుడు యెక్కడినుండో వూడిపడి, రయమున (శీఘ్రంగా) రంతు సేసుకొని (రతిపూర్తిచేసికొని) వింతగా ఏమీ తెలియనట్లు వీధిలో అటుకులు పడిపోలేదు కదా! అన్నట్లు వెతుకుతాడు. ఎంత జిత్తులమారో చూడండి.

ఓ వల్లవాంగనలాలా! (ఓ గొల్ల భామల్లారా!) గొల్లవాడలలో ఈ వేడుక కృష్ణుడు యేజతనము (ప్రయత్నమూ) లేకుండానే వెలసీని (యెక్కడినుంచో వెలుస్తాడు). ఈడనే (ఈ తిరుమలలోనే) తాను శ్రీవేంకటేశుడై ఓ అలమేల్మంగ తల్లీ! వీడే నీతో ముద్దు గునిసీ (ముద్దులు కుడుస్తున్నాడు).

**పద్యవివరణ:**

ఆ.వె॥ **వ్రేలఁ గట్టినట్టి వేవేల చకిలాలు**
**కోలలెత్తి పడగ గొట్టె వీడు**
**ముద్దు గునిసినాడు ముదిత శ్రీదేవితో**
**వేంకటేశుడిపుడు వేడుకాయె.**





సంఖ్య: XXVIII/494 రాగం : దేవగాంధారి
కీర్తన : వినయాలు సేసేవు వేంకటేశుడ

**దేవగాంధారి**

**40 వినయాలు సేసేవు వేంకటేశుఁడ**
**వెనువెంటఁ బాయక వేంకటేశుఁడ** ॥పల్లవి॥

**విరుల వేసే వదేమో వేంకటేశుఁడ**
**వెరగయ్యీ నీ చేతఁకు వేంకటేశుఁడ**
**విరివాయ నీసుద్దులు వేంకటేశుఁడ**
**అరుదుగ వింటిమోయి అన్నీ వేంకటేశుఁడ** ॥విన॥

**వేడుకకాఁడ వౌదువు వేంకటేశుఁడ**
**వీడుదోడాడేవు మాతో వేంకటేశుఁడ**
**వీడెపు మోవి నవ్వేవు వేంకటేశుఁడ**
**జాడలెల్లా గంటిమోయి సారె వేంకటేశుఁడ** ॥విన॥

**వేసాల వాఁడవుగదో వేంకటేశుఁడ**
**వేసారపు రతులను వేంకటేశుఁడ**
**వేసేవు నాపైఁ జేయి వేంకటేశుఁడా నన్ను**
**సేసవెట్టి పెండ్లాడేవు శ్రీవేంకటేశుఁడా** ॥విన॥

**ఉపోద్ఘాతము:**

జానపదుల బాణీలో సాగే కీర్తన శ్రీవేంకటేశ్వరునిపై వినిపిస్తున్నారు అన్నమయ్య. ఓ వేంకటేశుడా లేనిపోని వినయములను యెందుకు చూపిస్తావు? నీ అసలు రంగు మాకు తెలియదా? నీవు జగద్వల్లభుడవు క్షణం తీరిక నీకు వుండదు. నిజమే. కానీ నీవు మా వెనువెంటనుండుట మానకయ్యా! అంటున్నారు. తనని తానే నాయికగా వూహించుకొంటున్న అన్నమయ్య నీవే నాపై చేయివేస్తే నేను కరిగిపోకుండా వుండగలనా అటువంటి ది నీవేసేసవెట్టి నన్ను పెండ్లాడేవు. నాకింకా కావలసినదేముంటుంది అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ వేంకటేశుడా! నీవు లేనిపోని వినయాలు సేసేవు (వినయములను ప్రదర్శిస్తున్నావు). నీవు జగత్పాలకుడవు నిజమే, కానీ యెన్నటికీ నా వెనువెంట (తోడు) బాయక (వదలిపెట్టకు).

ఓ వేంకటేశుడా! నాపై విరులు వేసేవదేమో (పూలను విరజిమ్ముతున్నావు యెందుకనో!) నీ చేతలు వెరగయ్యీ (ఆశ్చర్యం కలిగిస్తున్నాయి). ఓ స్వామీ! నలుగురూ నానావిధాలుగా చెప్పుకొంటుంటే నీ సుద్దులు (నీ గురించిన కథలు) విరివాయ (పెల్లుబికిపోతున్నాయి). ఓ వేంకటేశుడా అవన్నీ మేమూ అరుదుగా (ఆశ్చర్యంతో) విన్నాము లేవయ్యా!

ఓ వేంకటేశుడా! నీవు వేడుకకాడవవుదువు (నీవు విలాసపురుషుడివి అనుమాట నిజము). నీవు కావాలని మాతో వీడుదోడాడేవు (విభేదించేవు) తాంబూలం వేసికొన్న పరిమళ భరితమైన నోటితో ఎఱ్ఱని పెదవులతో నన్ను చూచి నవ్వేవు. ఓ వేంకటేశుడా ప్రతిసారీ నీజాడలెల్లా (పద్ధతులన్నీ) గమనిస్తూనే వున్నాము.

ఓ వేంకటేశుడా! నీవు వేసాలవాడవు గదో (నటనలో ఆరితేరినవాడవు కదా!) కానీ రతి అంటే మాత్రం నీవు యెన్నటికీ వేసారవు (విసుగు జెందవు) . నీకు అంతమంది కావలసినవారున్నా నా అదృష్టం కొలదీ నీవు నాపై (మీద) చేయివేసి అనుగ్రహించావు. సేసవెట్టి (నాపై అక్షతలు చల్లి) నన్ను పరిణయమాడినావు. నేను ధన్యురాలిని ప్రభూ!

**పద్యవివరణ:**

**కం||** వినయాలు చేతువేలా?
**వెనుదీయక నటనజూపి వేంకటరమణా!**
**వెనువెంట బాయకయ్యా!**
**అనవరతము నిన్ను గొలుతు అద్రిజవినుతా!**





సంఖ్య: XXVIII/490 రాగం : శంకరాభరణం
కీర్తన : ఇహపరములకును యేలికవు

**శంకరాభరణం**

**41 ఇహపరములకును యేలికవు**
**బహురూపంబుల ప్రహ్లాదవరదా** ||పల్లవి||

**వేయిగరంబుల వివిధాయుధంబుల**
**దాయల నడచిన దైవమవూ**
**నీయందు నున్నవి నిఖిల జగంబులు**
**పాయక మమ్మేలు ప్రహ్లాదవరదా** ||ఇహ||

**కదిమి దుష్టులను గతము సేసితివి**
**త్రిదశులఁ గాచిన దేవుఁడవు**
**వదల కిందరికి వరము లొసంగఁగ**
**బ్రదికితి మిదివో ప్రహ్లాదవరదా** ||ఇహ||

**శ్రీ వల్లభుఁడవు చిత్తజగురుఁడవు**
**కావలసినచోఁ గలుగుదువు**
**శ్రీవేంకటాద్రిని శ్రీయహోబలానను**
**భావింతు నీమూర్తి ప్రహ్లాదవరదా** ||ఇహ||

**ఉపోద్ఘాతము:**

అహోబలంలో వెలసిన ప్రహ్లాదవరద నారసింహుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. అహోబలంలో ఈయన నవనారసింహుడై తొమ్మిది విలక్షణ రూపాలలో వెలసినాడు కావున బహురూపంబుల ప్రహ్లాద వరదుడని కీర్తిస్తున్నారు. మానవులందరికి ఇహమున (ఈ భూలోకంలో) ఈప్సితములు నెరవేరాలి. పరమున అంటే మరణానంతరం ఊర్ధ్వలోకాలో సుఖశాంతులు,

తుట్టతుదకు ముక్తి కావాలి. ఇవన్నీ అనుగ్రహించగలిగినవాడీ నారసింహుడు. ఈయనే తిరుమలేశుడు కూడా అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రహ్లాదవరదా! నారసింహా! నీవు ఇహపరంబుల రెండిటికీ యేలికవు (అధిపతివి). బహురూపంబుల (నవవిధములుగానున్న నవనారసింహుడైన) ఆర్తరక్షకుడవు.

ఓ దేవదేవా! నీకున్న వేయి హస్తంబులలో వివిధమైన ఆయుధములను ధరించియుంటివి. మా దాయల (సమీపముననే) నడచిన దైవమవు (దేవుడవు). నిఖిలజగంబులు (సమస్త లోకములు) నీలోనే వున్నవి. అట్టి ఓ ప్రహ్లాదవరదా! పాయక (వదలక) మమ్మేలుమయ్యా!

ఓ ప్రభూ! నీ ఘనకార్యములనేమని చెప్పను? నీవు కదిమి (ఆక్రమించి) దుష్టులను గతము చేసితివి (గతించిన వారిగా చేసినావు). త్రిదశులను (వృద్ధాప్యము అను నాల్గవ దశ లేక మూడే దశలు గల దేవతలను) రక్షించిన దేవుడవు. మమ్మల్ని త్యజించక నేటికి అనేక వరములొసంగుచున్న ప్రహ్లాదవరదుడవు నీవే. అందుకే మేము బ్రతికి బట్టకట్ట గలిగాము ప్రభూ!

ఓ మహానుభావా! నారసింహా! నీవే శ్రీవల్లభువడవు (శ్రీసతి యెప్పుడూ తోడు నీడై వుండు శ్రీపతి అయిన వాడవు). చిత్తజుడైన మన్మథుని గురుడవు (కన్నతండ్రివి). ఓ ప్రభూ! ఆ తిరుమల శిఖరాలపై నున్న శ్రీవేంకటేశ్వరుని గానూ ఈ శ్రీ అహోబలమున ప్రహ్లాదవరదుడైన నిన్నే నేను భావించుచున్నాను. నీ మూర్తి మా యెదుట అహోబలేశుడే. నీవే శ్రీహరివి.

**పద్యవివరణ:**

కం. **త్రిదశుల గాచిన దేవుడు**
**ఇదిగో మన ఇహపరాల యేలిక యితడే**
**బ్రదికితిమి సప్తగిరిపతి**
**యెదురాయె నహోబలంపుయీా నరసింగై.**





సంఖ్య: XIII/417 రాగం : మాళవగౌళ
కీర్తన : కంటిమివింటిమి అట్టే కానీవయ్యా

**మాళవగౌళ**

**42** **కంటిమి వింటిమి అట్టే కానీ వయ్యా**
**వెంటనే యశోదకు విన్నవించే మయ్యా** ॥పల్లవి॥

**చల్లలమ్మే గొల్లెతలో సాములెల్లాఁ జేసితివి**
**చెల్లునయ్యా నేఁడు నీకు చేసినవెల్లా**
**గొల్లు(ల్ల?) కంపు నీమెయి నంటె గోరురేక లాపె కంటె**
**యెల్లవారము నిన్ను నేమనే మయ్యా** ॥కంటి॥

**మగనాండ్ల సిగ్గులు మానమే కొల్లలాడితి**
**తగునయ్య తలఁచిన తలఁపెల్లాను**
**తగిలెఁ బయ్యద నీకు తమక మాపెకు రేఁగె**
**యెగసక్కే లాడఁగా మాకేమి చలమయ్యా** ॥కంటి॥

**దొడ్డివారి వావులెల్ల దోమటి దొడికితివి**
**అడ్డము లేదయ్య నీకు నన్నిటాను**
**జడ్డు నీకాఁగిట మించె సేస లాపెమీఁద నిండె**
**వొడ్డి శ్రీవేంకటేశ నేమొనరితి మయ్యా** ॥కంటి॥

**ఉపోద్ఘాతము:**

జానపదశైలిలో కొనసాగిన ఈ గొల్లెతల గోల మధురాతి మధురంగా వినిపిస్తున్నారు అన్నమయ్య. నీగురించి మీ అమ్మ యశోదకు అన్నీ చెప్పేస్తాము. నీవంటిమీదనుంచి వచ్చే గొల్లకంపు నీ గోరురేకలు మేము ఆవిడకు చూపించలేమనుకున్నావాయేమి అంటున్నారు? గొప్పవారితో పెట్టుకొనే సంబంధాలు నిలుస్తాయా యేమి? కానీ నీవామె కౌగిలి వదలవు కదా! నీవే వేంకటేశుడవు నీకు ఒదిగి వుండేమయ్యా! అంటున్నారు. అతి కష్టంమీద గ్రాహ్యమయ్యే శృంగారకీర్తన ఇది.

**తాత్పర్య వివరణ:**

ఓ కృష్ణా! నీ అల్లరి చేష్టలను కంటిమి (కొన్ని చూస్తూనేవున్నాము), వింటిమి (కొన్ని వివరంగా విన్నాము). అట్టే కానీవయ్యా! (నీ ఇచ్ఛవచ్చినట్లు కానిమ్ము). మేమూ వూరకుండబోము. నీ తల్లి యశోదకు వెంటనే విన్నవించేమయ్యా! (వివరంగా మనవి చేస్తాము).

నీవు చేసినది యెటువంటి చెడ్డపని? నీవు చల్లలు అమ్ముకొనే గొల్లపడుచుతో సాములెల్లా జేసితివి. (సాహసకృత్యాలు చేసినావు). నేడు నీవు చేసిన కొంటెపనులెల్లా నీకే చెల్లునయ్యా (తగునయ్యా!) నీవు చేసిన కొంటె పనులకు సాక్ష్యం కూడా మావద్ద వున్నది. నీమెయినంటే (నీ ఒంటిని వదలని) ఆ గొల్లకంపు నీవంటిపై యువతి గోటి గీతలు యెల్లవారము (అందరమూ) కంటిమి. నిన్నేమనేమయ్యా!

నీవు మగనాండ్ల (భర్తచాటు భార్యలను) కూడా వదలవు. వారి సిగ్గులూ, మానము (మర్యాద) కొల్లలాడేవు (కొల్లగొడతావు). నీవు తలచిన తలపెల్లా తగునా అయ్యా? వచ్చిన చిక్కేమిటంటే, తన పైటకొంగు నీకు తగిలించి ఆవిడ మైమరిచిపోతోంది. నీతో యెగసక్కేలాడగా (సరసాలాడటానికి) మాకేమి చలమయ్యా (మాకేమిపట్టిందయ్యా?)

కృష్ణా! నీవు అవతలివారు దొడ్డివారా (దొడ్డవారు అనగా బాగా స్థితిపరులు) అని చూడక, వావులెల్లా (సంబంధాలన్నీ) దోమటి తొడికితివి (దొంగవేషాలు వేసి, పెట్టుకుంటున్నావు). అన్నిటాను (దేంట్లోనూ) నీకు అడ్డూ అదుపూ లేవా యేమయ్యా? నీ బిగికౌగిలి, జడ్డు (సంకటము) గా వున్నది. మించిపోయినీ తలంబ్రాలు ఆమెను నిండా ముంచెత్తాయి. ఓ శ్రీవేంకటేశ్వరా! మేమంతా నీకు ఓడిపోయి ఒనరితిమయ్యా (లొంగిపోయామయ్యా!)

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **వెంటనే యశోద వినగ జెప్పేమయ్య!**
**గొల్లవాడ తమరి కొంటెపనులు**
**కంటిమన్ని మేము వింటిమి, కానిమ్ము**
**వేంకటేశుడువు వెలితియేల?**





సంఖ్య: XIII/385 రాగం : సాళంగనాట
కీర్తన : మొక్కరో సేవించరో మునులాల ఋషులాల

**సాళంగనాట**

**43 మొక్కరో సేవించరో మునులాల ఋషులాల**
**దిక్కులు సాధించీ నదే దేవదేవుఁడు** ॥పల్లవి॥

**(అ)ఆరదముమీఁద నెక్కి అమరులు గొలువఁగ**
**సిరితో వీధుల నేఁగీ శ్రీవిభుఁడు**
**గరుడ ధ్వజముతోడ ఘనచక్రాయుధముతో**
**దొరదైవ మదిగో పొందుగ మెరసీని** ॥మొక్కరో॥

**గొడుగులుఁ బడిగెలు కోటానఁ గోట్లాడఁగా**
**వెడలె వెడలె నదే విష్ణుదేవుఁడు**
**నడుమను రంభాదులు నాట్యములాడఁగాను**
**అడరి వుత్సవమందీ నాదిమూరితి** ॥మొక్కరో॥

**సారె నింటింటి విందులు చవులు చూచుకొంటాను**
**సారెకు రథము దోలీ సర్వేశుఁడు**
**ఆరీతి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి**
**కోరిన వరములిచ్చీఁ గుంభిణీరమణుఁడు** ॥మొక్కరో॥ **385**

**ఉపోద్ఘాతము:**

శ్రీవేంకటేశుడు భూదేవి అలమేల్మంగలతో కూడి తిరువీధులలో వూరేగింపుగా పోతున్నాడు. అన్నమయ్య ఆనందానికి అవధులు లేవు. ఆయన కళ్ళకు బారులు తీరి స్వామికి మొక్కుదామని వచ్చిన మునులు సేవించుదామని వచ్చిన ఋషులు కనిపిస్తున్నారు. (మనబోటి అల్పులకు కనుపించరు). అత్యుత్సాహంతో అయ్యలారా దిక్కులను సాధించిన ఈ

దేవదేవునికి మొక్కండయ్యా అంటున్నారు. ఈ శుభ సందర్భంలో కోరిన వరాలిస్తాడయ్యా! ఇంకా ఆలోచంచకండి స్వామిని సేవించండి అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ మునులారా! మ్రొక్కుడయ్యా! ఓ ఋషులారా! సేవింపుడయ్యా! ఇదే తగిన సమయము. దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుడు తన దేవేరులతో వూరేగుతున్నాడు. ఆయన దిక్కులన్నీ సాధించిన (గెలిచిన) మొనగాడు. శ్రీవిభుడు (శ్రీకాంతుడు). అరదము (రథము) పైనెక్కి దేవతలు కొలుస్తుండగా సిరితో (వైభవముతో) వీధులలో నేగీ (తిరువీధులలో వూరేగింపుగా పోతున్నాడు.) అదిగో ఆయన గరుడధ్వజము. అదిగో ఘనమైన సుదర్శన చక్రకము. పొందికగా మెరసిపోతున్న ఆ దొరదైవము (పొడవుకు పొడవైన పురుషోత్తముడు) అదిగో చూచితరించండి.

కొందరు స్వామికి గొడుగులు పట్టుకొని వెంటబోతున్నారు. కొందరు పడిగెలు (స్వామి తాంబూలము వుమియుటకు వీలైన పాత్రలు) ధరించి వూరేగింపులో పోతున్నారు. కోటానుకోట్లుగా వున్న జనసందోహంతో అదిగో విష్ణుదేవుడు వెడలెవెడలె (పోతున్నాడయ్యా!) ఆ మధ్యలో రంభాది అప్సరసలు పరవశించి, చక్కగా నర్తించుచున్నారు. ఆదిమూర్తియైన స్వామి అదరి (అతిశయమున) ఉత్సాహముతోనున్నాడు.

ప్రతి ఇంటిముందూ ఆగి వారిచ్చిన నివేదన, విందుగా చవులు చూచుకొంటూ (రుచిచూస్తూ) ముందుకు పోతున్నాడు. తానే స్వయంగా ఆ సర్వేశ్వరుడు రథము తోలుతున్నాడు. ఆ విధముగా శ్రీవేంకటేశ్వరుడి అలమేల్మంగమ్మతో కూడి భక్తులకు అంతులేని వరములనిస్తూ ముందుకు పోతున్నాడు. ఎందుకంటే ఆయన కుంభినీ రమణుడు (భూకాంతుడు) కదా!

**పద్యవివరణ:**

తే.గీ.॥ **మొక్కి సేవింపుడితనిని మునులు ఋషులు,**
**దేవదేవుడు సాధించె దిక్కులన్ని**
**వీదులను యేగె సతులతో వేంకటపతి**
**కోరు వరముల నిచ్చును కొఱతలేక.**





సంఖ్య: XIII/344 రాగం : శంకరాభరణం
కీర్తన : ఔదువయ్య జాణవు ప్రహ్లాదవరద

**శంకరాభరణం**

**44** **ఔదువయ్య జాణవు ప్రహ్లాదవరద**
**ఆదిగొని మొక్కీని ప్రహ్లాదవరదా** ॥పల్లవి॥

**యెదురుఁగొండలెక్కిన యిందిరఁ బెండ్లాడితివి**
**అది జాణతనము ప్రహ్లాదవరద**
**వుదుటఁ గోపముమాని వూరకే నవ్వు నవ్విత-**
**వదన నాపెఁజూచి ప్రహ్లాదవరదా** ॥ఔదు॥

**మొగము చూచితేనే మోహముపైఁ జల్లితివి**
**అగడాయఁ బనులు ప్రహ్లాదవరద**
**తగిలి కొంగువట్టితే తమకించేవింతలో**
**అగవుదగవుల ప్రహ్లాదవరదా** ॥ఔదు॥

**చేయి చాఁచగా నా పెను సిగ్గువీడఁ గూడితివి**
**ఆయ మెఱుఁగుదువు ప్రహ్లాదవరదా**
**యీయెడ నహోబలాన నిట్టే శ్రీవేంకటాద్రిని**
**అయిత్తము పెండ్లిండ్లు ప్రహ్లాదవరదా** ॥ఔదు॥ **344**

**ఉపోద్ఘాతము:**

ఆదిగొనుట అంటే కన్నువేయుట అని అర్థం. ఓ ప్రహ్లాదవరదా! నీవు గొప్ప చతురుడవు అవుదువులే. అందుకనే ప్రత్యేకంగా నీపై కన్నువేసి నీకు మొక్కేమయ్యా! అంటున్నారు అన్నమయ్య. నీ గరుడాద్రి, భవనానికి నదికి ఇద్దరిని వుంటే నదికి ఆవలిగట్టున వున్న కొండమీద ఇందిరాదేవి వున్నది. ఈయనగారు నదిని దాటి వెళ్ళి ఆమెను తాను వైభవంగా పెండ్లాడుతాడు. ఆయన అంతటి జాణ

అంటున్నారు. అంతేకాదు శ్రీవేంకటాద్రిమీద ఈ ప్రహ్లాదవరదునికే ఆయుత్తపు (సిద్ధముగానున్న) నిత్యకళ్యాణములు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రహ్లాదవరదా! నీవు జాణవు (చతురుడవు) ఔదువయ్యా! (అయ్యెదవులేవయ్యా!) మేము నీకు ఆదిగొని (నీపై కన్నువేసి), నీకు మొక్కేమయ్యా!

ఓ ప్రహ్లాదవరదా! యెదురు గొండలెక్కిన (గరుడాద్రి కెదురుగాన్ను శ్రీగిరి కొండలెక్కి వెలసిన) యిందిరను (ఆదిలక్ష్మిని) పెండ్లాడినావు. అది జాణతనముకాదా ప్రభూ! నీ వుదటు కోపమును (ఉప్పొంగు ఆగ్రహమును) మాని (వదలివైచి) వూరకే నవ్వు నవ్వితివి (నవ్వులు వెదజల్లుచున్నావు). స్వామీ! అదన (తగిన సమయం చూసికొని) ఆపెను రహస్యముగా చూచుచున్నావు.

ఓ ప్రహ్లాదవరదా! ఆమె నీ ముఖమును పరిశీలనగా చూస్తే నీ జగన్మోహన వదనం కనబడునట్లు చేసి మోహమును, పైచల్లితివి (గుప్పించితివి). నీ చేతలు ఆగడాయె (నింద్యములాయె). ఇదెక్కడి చోద్యమయ్యా! ప్రహ్లాదవరదా? ఆమె తగిలి (పురికొల్పి) నీకొంగు (ఉత్తరీయపు అంచును) పట్టుకొనగానే, ఇంతలోనే తమకించేవు (పరవశిస్తావు). ఆపై అగవుతగవులయ్యేవు (శోభనమునకు సంసిద్ధుడయ్యేవు).

ఓ ప్రహ్లాదవరదా! నీవు శృంగారరాయడవు. ఆమె తన చేయి నీకు తన చేతిని అందించగానే సిగ్గును వదలి ఆమెను కూడితివి. నీవు ఆయమెరుగుదవయ్యా (మర్మములన్నియు తెలిసినవాడు.) ఇపుడు ఈ అహోబమున అక్కడ ఆ వేంకటనగమున పెండ్లిడ్లకు ఆయిత్తమై (సంసిద్ధుడవై) నిత్యపెండ్లికొడుకని పేరుగాంచితివి. ఓ ప్రహ్లాదవరదా! నీకు నీవే సాటి.

**పద్యవివరణ:**

కం.॥ **ఔదువు జాణవు నీవే**
**ఆదిగొనేమయ్యమేము అవుభళసింహా!**
**ఆదిమలక్ష్మీవల్లభ!**
**యేదీ ప్రహ్లాదవరద! యెదురికనీకున్**





సంఖ్య: XIII/92 రాగం : సాళంగనాట
కీర్తన : దేవతలు చెలగిరి దిక్కులెల్లా సంతోషించె

**సాళంగనాట**

**45 దేవతలు చెలఁగిరి దిక్కులెల్లా సంతోషించె**
**ఆవల నసురలెల్ల నడఁగిరి యపుడే** ॥పల్లవి॥

**అందమై మధురలోన నదివో కృష్ణావతార-**
**మందెను శ్రావణబహుళాష్టమి నేఁడు**
**దిందుపడిరి దేవకీదేవి వసుదేవుఁడును**
**అందిరి బ్రహ్మానంద మంతరంగములను** ॥దేవ॥

**నడుమ రేపల్లెలోన నందగోప యశోదల**
**కొడుకై పెరిగెనదే గోవిందుఁడు**
**అదరి గోపికలును ఆవులమందలును**
**వుడివోనివేడుకల నుప్పొంగఁ కలిగెను** ॥దేవ॥

**ఇప్పుడు శ్రీవేంకటాద్రి నిదె తిరుపతిలోన**
**వుప్పతిల్లి దేవుఁడై వున్నాఁడిదే**
**చిప్పిలి సేవకులును శ్రీసతిదేవియును**
**కప్పి నానాగతులఁ బొగడఁగఁ దొడఁగిరి** ॥దేవ॥

**ఉపోద్ఘాతము:**

ఒకానొక కృష్ణాష్టమి సందర్భంగా అన్నమయ్య వినిపించిన శ్రీకృష్ణావతారదృశ్యాన్ని ఈ కీర్తన ద్వారా ఆస్వాదించండి. దేవతలు కేరింతలు పెట్టారట సంతోషంతో. అందువల్ల దిక్కులన్నీ ఆనందించాయట. అటుపైన రాక్షసులు రాక్షస అంశలతో జన్మించిన రాజలోకం అంతా క్రమంగా నశించాయట. ఆ కృష్ణమూర్తే ఇప్పుడు తిరుపతిలో వుప్పతిల్లి దేవుడై

వున్నాడట. ఇట్లాంటి కీర్తనలు అసంఖ్యాకంగావున్నప్పటికి, ఇది అన్నమయ్య భక్తియజ్ఞం కాబట్టి దీని మాధుర్యం దీనిదే.

**తాత్పర్య వివరణ:**

దేవతలు చెలగిరి (ఉత్సాహంతో కేకలు పెట్టారు). దిక్కులన్నియు సంతోషించినవి. ఆవతల (తదనంతరం) అప్పుడే అసురులెల్లా (రాక్షసజాతి అంతా) అడగిరి (నశించిపోయారు).

నేడు శ్రావణ బహుళ అష్టమి. శ్రీకృష్ణునిగా శ్రీమహావిష్ణువు అవతరించినాడు. అదిగో అందమైన మధురానగరంలో ఆ కృష్ణావతారము జరిగినది. దేవకీదేవి వసుదేవుడు, దిందుపడిరి (ఆనందంతో మూర్ఛపోయినట్లయ్యారు). వారు అంతరంగమున బ్రహ్మానందమును పొందారు. పరమాత్మ తమ కన్నబిడ్డ అయితే ఇంకా కోరేదేముంటుంది?

అటుపిమ్మట వసుదేవుడు పరమాత్మ ఆజ్ఞప్రకారం ఆ బాలుని రేపల్లె మధ్యలోనున్న నందగోపుని భవనం చేర్చి ఆయన భార్య యశోదాదేవి పొత్తిళ్ళలో వున్న యోగమాయతో మార్పిడి చేశాడు. తిరిగి మధురకు పోయాడు నాటినుండి పరమాత్మ యశోదా నందగోపుల కొడుకై పెరిగినాడు. అదరి (అతిశయించి) గోపికలు, రేపల్లెలోని ఆవులమందలు, వుడివోని (తొలగని) సంబరాల్లో వుప్పొంగి పోయిరి.

ఇప్పుడు ఇదె శ్రీవేంకటాద్రి నెలకొన్న తిరుపతిలో గోవిందరాజస్వామివలె వుప్పతిల్లి (ఉత్పత్తియై) దేవుడైవున్నాడు. చిప్పిలి (ఉప్పొంగి) సేవకులును శ్రీమన్నారాయణుని పరివారమూ, శ్రీలక్ష్మీదేవీ క్రిందకు దిగివచ్చి అనేకవిధములుగా ఆ గోవిందుని బొగడగ నొడగిరి (కీర్తించనారంభించిరి.)

**పద్యవివరణ:**

చం.॥ **చెలగిరిదేవతల్ దిశల చిప్పిలె సంతస సౌరభమ్ములున్**
**తొలగిరి దైత్యులున్ యమునిి తోవనుబట్టిరి పాసిజీవముల్**
**వెలసెను కృష్ణమూర్తి ఇలవేడుకజేయగ నందగోపులున్**
**అలరెను నేడు వేంకటము ఆతడె వేంకటరాయడౌటచే.**





సంఖ్య: I/134 రాగం : ముఖారి
కీర్తన : ఎంతసేయగలేదు యిటువంటివిధి యభవు

**ముఖారి**

**46 ఎంత సేయఁగలేదు యిటువంటివిధి యభవు-**
**నంతవానిని భిక్షమడుగుకొనఁజేసె** ॥పల్లవి॥

**కోరి చంద్రునిఁ బట్టి గురుతల్ప గునిఁ జేసె**
**కూరిమలరఁగ నింద్రుఁ గోడిఁ జేసె**
**ఘోరకుడువఁగఁ ద్రిశంకుని నంత్యజునిఁ జేసె**
**వీరుఁడగు నలుఁ బట్టి విద్రూపుఁ జేసె** ॥ఎంత॥

**అతివ నొద్దుగఁ జూదమాడ ధర్మజుఁ జేసె**
**సతి నమ్ముకొన హరిశ్చంద్రుఁ జేసె**
**కుతిలపడ శూద్రకుని గొంట్టెముచ్చుగఁ జేసె**
**మతిమాలి కురురాజు మడుఁగుచొరఁజేసె** ॥ఎంత॥

**పదనిపాట్లఁ బరచి బ్రహ్మతల వోఁజేసె**
**తొదరి కాలునికాలు దునియఁ జేసె**
**అదర నీవిధికి విధియగు వేంకటేశుకృప**
**పదయకుండఁగ భంగపడకపోరాదు** ॥ఎంత॥ 134

**ఉపోద్ఘాతము:**

ఇటువంటి ఘోరమైన 'విధి' ఎంతైనా చేయగలదు అంటున్నారు అన్నమయ్య. దీనికి అసాధ్యమంటూ యేదీవుండదు. పుట్టుకేలేని పరమశివుడంతటి వాడిచేత బిచ్చం యెత్తించిందండీ ఆ విధి, అంటూ విధి వంచితుల నేకరువుపెడుతున్నారు.

చక్కటి సీసపద్యంలో కూడా దీన్ని వివరించాను. కుతిలపడు శద్రకుని గొఱ్ఱెముచ్చుగజేసిందట విధి. బాగా ఆలోచిస్తేనే గాని దీని అంతు చిక్కలేదు. ఈ శూద్రకుడినే దక్షప్రజాపతి అని కూడా అంటారు. వీరభద్రుడు ఆయన తలత్రుంచి అగ్నిగుండంలో వేశాడు. శివుడు కరుణించి అతనికి గొఱ్ఱెతల పెట్టాడు. అట్లా ఆతని మత్సరము నశించింది. ఆ శ్రీవేంకటేశుని కృపలేకపోతే ఆ విధిచే భంగపాటు తప్పదంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

అశక్యమైన 'విధి'యనునది, ఎంతసేయగలేదు? (ఎంతటి పని చేయలేదు?) ఇటువంటి 'విధి' యెంతైనా చేయగలదు. పుట్టుకయేలేని అభవుడైన పరమశివునియంటివానిని అది కాశికానగరములో భిక్షమడుగుకొను బిచ్చగానిగా చేసినది కదా!

లక్ష్మీదేవితోబుట్టువైన సద్గుణ సమోన్నతుడు చంద్రుడంతటివానిని 'గురుతల్పగుని' గురుపత్నితో ఏకశయ్యాగతుని చేసి పంచమహాపాతకములలో ఒకదానిని అంటగట్టినది. కూరిమి అలరగ (ప్రేమోన్మాదియైన) దేవేంద్రుడంతటి వానిని అహల్య కొరకు కోడివలె కూయునట్లు జేసినది. "త్రిశంకు" వంటి ఇక్ష్వాకుకుల సంజాతుని ఘోరమైన అంత్యజుని (ఛండాలుని) జేసినది. వీరాధివీరుడు, అందగాడుయైన "నల" మహారాజుని విద్రూపుని (కురూపిని) చేసినది.

అంతేకాదు అసాధ్యమైన 'విధి' ధర్మరాజంతటి ధర్మమూర్తితో పెండ్లామును పందెముగానొడ్డి ఓడిపోయి, వలువలు విప్పింపజేసినది, హీనునిగావించినది. హరిశ్చంద్రునంతటి శ్రీరామచంద్ర పూర్వజునిచేత తన స్వంత భార్యను అంగడిలో అమ్ముకొనునట్లు చేసినది. కుతిలపడు (ఈర్ష్యతోబాధపడు) శూద్రకుని (దక్షప్రజాపతి) అంతటివానిని శివద్వేషిగాజేసి, గొఱ్ఱెముచ్చు (గొఱ్ఱెతల కలిగిన బ్రతుకు నంటగట్టినది.) కురుసార్వభౌముడైన, మానధనుడు





సుయోధనుని జేత మడుగున దాగించి ఇంకా బ్రతికియేమి వుపయోగమని తిట్టించినది.

ఆవిరి (పదరాని) పాట్లతో బ్రహ్మదేవునంతటివానిని అసత్యవాదిని జేసి, పరమశివునిచేత ఒక శిరస్సును తెగవేయించినది. కాలుని చేత (యమునితో) శివుని తొడరి (ధిక్కరింపజేసి) మార్కండేయుని ప్రాణములు గొనిపోవునాడు త్రిశూలముచే ఒక కాలిని నరికించి కుంటివానిని జేసినది. ఇవన్నీ ఇట్లగుట నిజమే అయినా, అదర (అతిశయించునట్లుగా) ఈ దుస్సహమైన "విధి"కి విధియగు (అశక్యుడగు) శ్రీవేంకటేశ్వరుని, కృప పడయకుండగ (పొందకుంటే) ఆ విధితో భంగపాటు తప్పదు సుమా!

**పద్యవివరణ:**

సీ. అభవునంతటివాని అల భిక్షమెత్తించు,
చంద్రుని గురుపత్ని సంగమించు.
కూర్మితో ఇంద్రుని గూయించుకోడిగా,
అంత్యజుగావించునటు త్రిశంకు,
నగుబాట్లతో జేయు నలరాజును కురూపి,
ధర్మజు జూదానదగులజేయు.
సతినమ్మగాజేయు సత్యహరిశ్చంద్రు,
కురురాజు మడుగున గూలజేయు
కాలునంతటి వాని కాలు కుంటిగజేయు,
బ్రహ్మతలను తెగిపడగజేయు

తే.గీ.॥ **ఎంతసేయగ లేదయ్య యీ విధి మము**
**విధిని యేమందుమోరయ్య! వేంకటేశ!**
**విధికి విధియగు నీకృప వెలయగాను**
**భంగపాటుండబోదయ్య! భయములేదు.**

సంఖ్య: I/2 రాగం : దేసాక్షి
కీర్తన : వేదవేద్యులు వెదకేటిమందు

## దేసాక్షి

**47. వేదవేద్యులు వెదకేటిమందు**
**ఆదినంత్యములేని ఆమందు** ॥పల్లవి॥

**అడవిమందులుఁ గషాయములు నెల్లవారు**
**కడగానక కొనఁగాను**
**తొడిఁబడ నొకమందు దొరకె మాకు భువి-**
**నడియాలమైనట్టి ఆమందు** ॥వేద॥

**లలితరసములుఁ దైలములు నెల్లవారు**
**కలకాలము గొనఁగాను**
**చెలువైన దొకమందు చేరె మాకు భువి-**
**నలవిమీఱినయట్టియామందు** ॥వేద॥

**కదిసినజన్మరోగముల నెల్లవారు**
**కదలలేక వుండఁగాను**
**అదన శ్రీతిరువేంకటాద్రిమీఁదిమందు**
**అదివో మాగురుఁ డిచ్చె నామందు.** ॥వేద॥ **2**

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తనలో అన్నమయ్య మహామహులైన వేదనిష్ణాతులు ఏమందుకోసం వెదకుతారో, ఏమందు అనాదిగావుండి భవిష్యత్తులోకూడా నిరంతరం వుపయోగంలో వుంటుందో, పుట్టుకలు అనే అందరికీ వచ్చే మాయరోగానికి ఒక తిరుగులేని మందును సూచిస్తున్నారు. దాని విశిష్టత చెప్పనలవికానిది అంటున్నారు. దాన్ని మామూలు నాటు వైద్యులు ఇవ్వలేరు, స్వయంగా మా గురుదేవులిచ్చారు. తిరుగులేని ఆ మందు తిరుమల శిఖరాలమీద దొరుకుతుంది అంటున్నారు. ఇంతకీ యేమిటామందు?





**తాత్పర్య వివరణ:**

ఓ ప్రజలారా! ఇప్పుడు మీకు ఒక గొప్ప మందు (ఔషధం) స్వీకరించమని సూచిస్తున్నాను. అది యెంతటిదో తెలియునా? వేదమును కూలంకషంగా నేర్చినవారు యెక్కడ దొరుకుతుందా అని వెదకేమందు అదే.

దానికి 'ఆది' యెన్నడో తెలియదు. 'అంత్యము' లేనేలేదు. మీకు ఇదివరలో తెలియక, యెన్నో అడవి మూలికల మందులూ, కషాయములూ కడగానక (అంతులేకుండా) కొనగాను (తీసికొన్నాము). ఆపై మాకు, తొడిబడన్ (సంభ్రమం కలిగించునట్లు) ఒకమందు దొరికింది. అది అడియాలమైనమందు (బాగా గుర్తుపెట్టుకోదగ్గ మందు). ఎన్నడూ మరువరాదు.

బాగా స్థితిపరులు, ధనికులు లలితరసములు (చక్కటి రసాయనాలను) తాగుతారు. వారు మంచి తైలములనుపయోగిస్తారు. ధనవంతులైనందువల్ల కలకాలము వారు బ్రతికున్నంతకాలము వారు యెంతో శ్రమపడతారు. ఆ బాధ దేనికండీ? మావద్ద ఒక చెలువైన (అందమైన) మందు వున్నది. అది ఈ భూమిమీద, సులభంగా మాకు దొరికింది. ఆ మందు 'అలవిమీరిన'యట్టి మందు (పరిమితిలేని మందు). ఎంతైనా, యెప్పుడైనా, యెక్కడైనా ఆ మందు తీసికొనవచ్చును.

ఒక రోగంవున్నది. దానిపేరు 'జన్మ'. ఆ రోగం రానివాడు వుండడు. సన్మార్గులకూ వస్తుంది, దుర్మార్గులకూ వస్తుంది. అది వచ్చినవారు కదలలేరు (తప్పించుకోలేరు). కదిసిన జన్మలను (అనుబంధాలను కలిగించే జన్మలు) తప్పనే తప్పవు. అయితే మా గురుదేవులు ఈ జన్మల మాయరోగానికి ఒక గొప్ప మందును సూచించారు. అది శ్రీవేంకటాద్రిమీద, అదన (నిరంతరం) దొరుకుతుంది. ఆ మందుపేరు శ్రీవేంకటేశ్వరుని శరణాగతి.

**పద్యవివరణ:**

తే.గీ.॥ **వేదవేద్యులు పనివడి వెదకు మందు**
**ఆదినంత్యములేకుండ అలరు మందు**
**అదన శ్రీవేంకటాద్రిపై అమరుమందు**
**అదియె మాగురుడిచ్చినయట్టి మందు.**

సంఖ్య: I/116 రాగం : ఆహిరి
కీర్తన : తోరణములే దోవెల్లా

**ఆహిరి**

**48 తోరణములే దోవెల్లా**
**మూరట బారట ముంచినలతల ॥పల్లవి॥**

**కూరిమిమటములు గోపురంబులును**
**తేరుపడగెలే తెరువెల్లా**
**కోరినపండ్లుగురిసేటితరువులు**
**తోరములైన వెదురు జొంపములు ॥తోర॥**

**ఆటలుఁ దిరుపులు నందపుటురుపులు**
**పాటలు వనవైభవమెల్లా**
**కూటువ నెమళ్ళ కోవిల గుంపుల**
**పేటలఁ దేటలపెనుఁగూటములు ॥తోర॥**

**వింజామరలును విసనకఱ్ఱలును**
**గొంజెగొడుగులే కొండెల్లా**
**అంజనగిరిరాయఁడు వేంకటపతి**
**సంజీవని పరుషల కొదవఁగను ॥తోర॥ 119**

**ఉపోద్ఘాతము:**

పరుషలు అంటే బాటసారులు అని అర్థం. ఇక్కడ తిరుమల సందర్శించే భక్తులు అని విశేషార్థం చెప్పుకోవాలి. తిరుమల శిఖరాలమీద ఆనాటి వైభవాన్ని వర్ణిస్తున్నారు అన్నమయ్య. ప్రకృతి సిద్ధమైన ఆశోభ, పండ్లతోటలు, నెమళ్ళ ఆటలు, కోయిలల పాటలు గురించి యెంత చెప్పినా తక్కువే అవుతుంది. ఈ కీర్తనలో మనము యెన్నడూ వినని, గొంజెగొడుగులు, పేటల దేటల పెనుగూటములు, తోరములైన వెదురు జొంపములు – వంటి మాటలకు అర్థాలు అంత తేలికగా అంతుచిక్కవు.



హరి నీమయమే అంతాను

**తాత్పర్య వివరణ:**

శ్రీవేంకటేశ్వరుని ఊరేగింపు తిరుమలలో సాగుతున్నది. ఆ తోవెల్లా (దారియంతా) తోరణములే (మామిడి ఆకులతోనూ, రంగు రంగుల పూదండలతోనూ, ద్వారముల వద్ద కట్టు దండలు) కొన్ని తోరణములు లతలతో కట్టారు. ముంచిన (కమ్ముకొనిన) ఆ లతలు కొన్ని మూరెడువున్నాయి), కొన్ని బారెడు వున్నాయి.

ఆ తిరుమల నిండుగా యాత్రికులకొరకు, కూరిమితో (ప్రేమగా) కట్టిన 'మటములు' (మఠములనెడి యాత్రికుల నివాస మంటపములు) వున్నవి. ఎక్కడ చూచినా గోపురాలే కనబడుతున్నాయి. తెరువెల్లా (దారినిండా) తేరుపడగలె (రథములయొక్క జెండాలే). అక్కడ తరువులు (చెట్లు) కోరినపండ్లను (కావలసి ఫలములను) ఇస్తున్నాయి. కొందరు, వెదురు జొంపములను (వెదురు కొమ్మలను) తోరణములుగా కట్టారు.

ఇక ఆ ఊరేగింపులో, ఆటల తిరుపులు (నృత్యంచేస్తూ తిరిగే వారు) వారంతా అందమైన వరుపులు (అలంకరణ) కలవారు. ఆ వనమంతా వారి పాటలతో మారుమ్రోగుతున్నది. వైభవము తాండవిస్తున్నది. వారి కూటమిలో వనములలోని నెమళ్ళూ చేరి ఆడుతున్నవి. పాడేవారితోపాటు కోయిలలు కూడా గొంతు కలిపినవి. పేటల దేటల పెనుగూటములు (స్వచ్ఛమైన హారములను ధరించినవారు గుంపులు గుంపులుగా నడుస్తున్నారు.)

ఊరేగింపులో వింజామరలతో వీచేవారూ, విసనకఱ్ఱలతో స్వామికి విసిరేవారూ, గొంజెగొడుగులు (వారికి అవసరమైతే ముడుచుకొనే గొడుగులు) పట్టుకొని స్వామిని సేవించేవారూ, ఆ కొండనిండా కనుపించుచున్నారు. అంజనాద్రీశుడైన శ్రీవేంకటేశ్వరుడు పరుషలకు (యాత్రికులైన బాటసారులకు) సంజీవని (ప్రాణమును నిలబెట్టే దివ్యౌషధమై) ఒదవగ (అమరియున్నాడు).

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **తోరణములె చూడుదోవెల్ల దండిగా**
**మూరబారలున్న ముంచు లతలు**
**అంజనాద్రిపతియె అమరిన సంజీవి**
**గిరుల వరుసమీద పరుషలకును.**

సంఖ్య: I/144 రాగం : సామంతం
కీర్తన : సులభమా మనుజులకు హరిభక్తి

### సామంతం

**49 సులభమా మనుజులకు హరిభక్తి**
**వలనొంది మరికదా వైష్ణవుఁడౌట ॥పల్లవి॥**

**కొదలేనితపములు కోటానఁగోటులు**
**నదన నాచరించి యటమీఁద**
**పదిలమైనకర్మబంధము లన్నియు**
**వదలించుకొనికదా వైష్ణవుఁడౌట ॥సులభ॥**

**తనివోనియాగతంత్రములు లక్షలసంఖ్య**
**అనఘుఁడై చేసినయటమీఁద**
**జననములన్నిట జనియించి పరమపా-**
**వనుఁడై మరికదా వైష్ణవుఁడౌట ॥సులభ॥**

**తిరిగితిరిగి పెక్కు తీర్థములన్నియు-**
**నరలేక సేవించినటమీఁద**
**తిరువేంకటాచలాధిపుఁడైన కరిరాజ-**
**వరదునికృపఁగదా వైష్ణవుఁడౌట. ॥సులభ॥**

**ఉపోద్ఘాతము:**

పెద్దలు చెప్పేది పరమసత్యమైనది ఒక మాట వున్నది. హరి భక్తి మనిషికి కలుగవలెనంటే అది అంత తేలికైన పనికాదు. జన్మాంతరవాసనలవల్ల అది (హరిభక్తి) కలుగుతుంది. అలాగే జన్మాంతపుణ్యంవలన హరి భక్తి మన మనస్సులో స్థిరపడుతుంది. ఇంతటితో సరిపోదు జన్మాంతర సాధన దీక్షవలన మాత్రమే మోక్షం లభిస్తుంది. అయితే ఆ జన్మలు మానవ జన్మలవ్వాలని నియమం కూడా యేమీలేదు. ఏజీవియైనా యెప్పటికైనా వైష్ణవుడు కావాలంటే తిరువేంకటేశ్వరుని కృప కలిగి తీరవలసిందే. గజేంద్రమోక్షం గాథ మనకు నొక్కి వక్కాణించేది ఈ





మాటనే. ఎన్ని తపస్సులు చేసినా కర్మబంధం అంత తేలికగా వదలదు. ఎన్ని యాగ తంత్రములు చేసినా, యెన్నో జన్మలు పొందటమేగాని పరమపావనుడైన వైష్ణవుడవాలంటే హరికృప వుండితీరాలి అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

మనుజులకు హరిభక్తి కలుగవలెనంటే సులభమా? (అంత తేలికయైన పనియా?) వలనొంది (వైష్ణవదీక్షకు అనుకూలుడై) మరి కదా! (తదుపరి కదా!) నిజమైన వైష్ణవుడౌట.

కొదలేని (అంతులేని) కోటానుకోట్ల సంఖ్యలో తపములనాచరించిన, యటమీద (ఆపైన) అదన (అప్పుడు) పదిలమైన (భద్రంగా వెంటవచ్చే) కర్మబంధములనన్నింటినీ వదిలించుకొనవలెను. అప్పుడు కదా నరుడు వైష్ణవుడై వర్ధిల్లగలడు.

ఇట్లు తపస్సు చేసేవారి గురించి చెప్పుకొన్నాం. వీరు, తనివోని (తృప్తి అనేది లేకుండా) లక్షల సంఖ్యలో యాగతంత్రములను (గొప్ప తంత్రముతో కూడిన యాగములను) నిర్వహిస్తారు. ఆ యాగములను చేయుటవలన అనఘుడై (పుణ్యుడై) అనేకము చేసినమీదట, అన్నిరకములైన జన్మలను పొందిన అనంతరం పరమపావనుడై (గొప్ప పుణ్యాత్ముడై) జీవిస్తాడు. అప్పుడు కదా! అతడు వైష్ణవుడై తరించేది?

ముందుగా జీవికి తీర్థయాత్రలపై మక్కువ ఆ హరిభక్తి వలననే కలుగుతుంది. అప్పుడు తిరిగి తిరిగి పెక్కు (అనేక) తీర్థములను అరలేక (తొందరపాటులేక) సేవిస్తాడు. అటుమీద (ఆపైన) కరిరాజవరదుడైన (గజేంద్రప్రాణ సంరక్షకుడైన) తిరువేంకటేశ్వరుని కృపను సంపాదిస్తాడు. అప్పుడు కదా! వాడు నిజమైన వైష్ణవుడవుతాడు అది అంత సులభమనుకున్నారా యేమిటండీ?

**పద్యవివరణ:**

చం.॥ **సులభముకాదు మానవుడు సొంపగువైష్ణవభక్తుడౌటయున్**
**వలనుతనొందినన్ మనునువైష్ణవుడై, చనుపెక్కు తీర్థముల్**
**కొలుచును వేంకటేశ్వరుని కోరికలొగ్గుచు దాస్యదీక్షచే**
**కలుగును అట్టి జన్మ ఘనకర్మల యాగపు తంత్రపంక్తులన్.**

సంఖ్య: I/83 రాగం : ముఖారి
కీర్తన : ఎందు బొడమితిమో యెఱగము మా-

### ముఖారి

50 ఎందుఁ బొడమితిమో యెఱఁగము మా-
కందువ శ్రీహరికరుణేకాక ॥పల్లవి॥

ఏఁటిజన్మమో యెఱఁగము పర-
మేఁటిదో నే మెఱఁగము
గాఁటపుకమలజుఁ గాఁచినయా-
నాఁటకుఁడే మానమ్మినవిభుఁడు ॥ఎందుఁ॥

యెవ్వారు వేల్పులో యెఱఁగము సుర-
లెవ్వరో నే మెఱఁగము
రవ్వగుశ్రీ సతిరమణుఁడు మా-
కవ్వనజోదరుఁ డంతరియామి ॥ఎందుఁ॥

యింకానేఁటిదో యెఱఁగము యీ-
యంకెలబాముల నలయము
జంకెల దనుజులఁ జదిపినతిరు-
వేంకటేశుఁడు మావిడువనివిభుఁడు ॥ఎందుఁ॥ 83

**ఉపోద్ఘాతము:**

ఇప్పుడు ఈ జన్మలో ఇక్కడున్నాము కానీ మనం ఎక్కడనుంచి వచ్చామో ఈ జన్మతరువాత మరణానంతరం యెక్కడకు పోతామో మనమెవ్వరమూ యెఱుంగము. మా శ్రీహరి కరుణాసాగరుడు. అనన్యమైన ఆయన కరుణే లేకపోతే మేము యేమైపోయేవారమో అని అంటున్నారు అన్నమయ్య. శ్రీవేంకటేశ్వరుడు మేము నమ్ముకొన్న దైవము. అందుచేత అంకెల బాముల





నలయము అంటున్నారు. అంటే... మేము, యెన్నో జన్మలను పొందినా శ్రమపడము, యెందుకంటే మేము తిరుమలేశుని శరణాగతులము.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! మేము ఎందు బొడమితిమో (ఎక్కడినుంచి పుట్టామో) తెలియదు. మా యొక్క కందువ శ్రీహరి (సమర్థుడైన విష్ణువు) యెంతో కరుణామయుడు. ఆయన కరుణేకాక మాకు దిక్కేమి వున్నది?

మేము అజ్ఞానులము అని వేరే చెప్పవలసిన పనిలేదు. మాకు దొరికిన ఈ జన్మ యెటువంటిదో యెరుగము. మాకు రేపు ఏమవుతుందో తెలియదు కదా! ఒకవేళ ఈ జన్మ అంతమై పరలోక ప్రాప్తి కలిగితే ఆ పరలోకమెట్లుండునో యెరుగము. గాటపు (సృష్టికర్తయైన) కమలజుని (బ్రహ్మదేవుని) సోమకాసురుని బారినుండి కాచిన (రక్షించిన) ఈ నాటకుడే (జగన్నాటక సూత్రధారియే) మా నమ్మిన విభుడు (జగపతి).

అనేకులు ఈస్వామి ఆశ్రితులు. వీరిలో యెవ్వారువేల్పులో (దేవతలో) సుర లెవ్వారో (ఊర్ధ్వలోకాలలో వుంటూ తమ కర్మశేషం అనుభవిస్తున్నవారెవరో) మేము యెరుగము. వజ్రమువలె విలువైన శ్రీరమాపతి మాదైవము. అంతెందుకు అంతర్యామిగా మాలోవున్నది మాకుసర్వస్వమైన ఆ వనజోదరుడే (ఆ పద్మనాభుడే) సుమా!

సరే! యిప్పటివరకు అయినదేదో అయినది. ఇకపై యేమవుతుందో అదైనా యెరుగము. ఈ అంకెల బాముల నలయము (ఈ, యెన్నోచెప్పలేని జన్మల పీడతో అలసిపోము.) జంకెల దనుజుల (భయంకరమైన రాక్షసులను) చదును చేసిన శ్రీవేంకటేశ్వరుడు, మమ్ము యెడబాయని విభుడు మా భర్త.

**పద్యవివరణ:**

ఉ.॥ **ఎందుజనింతుమో యెఱుగ మించుకయైనను శ్రీహరే కదా!**
**కందువగాచినాడతడు గాటపు బ్రహ్మను, నాటకీడు, బో!**
**ముందుగ నమ్మి మొక్కెదము మోదముతో తిరువేంకటేశ్వరున్**
**యెందును దైత్యమూకలకునెన్నడు జంకము వీడ మీ హరిన్.**

సంఖ్య: I/84 రాగం : రామక్రియ
కీర్తన : వెలయ నిన్నియును వృథా వృథా

**రామక్రియ**

**51 వెలయునిన్ని యును వృథా వృథా**
**తలఁపున శ్రీహరిఁ దడసినను ||పల్లవి||**

**ఎడయనిపుణ్యము లెన్నియైనా**
**విడువక సేయుట వృథా వృథా**
**బడిబడి నే శ్రీపతి నాత్మలోఁ**
**దడవక యితరము దడవినను ||వెలయు||**

**యెరవులతపముల నెంతైనా**
**విరవిరవీఁగుట వృథా వృథా**
**హరినచ్యుతుఁ బరమాత్మునిని**
**మరిగి తలఁచక మఱచినను ||వెలయు||**

**దైవము వెఱఁగక తమకమున**
**వేవేలైన వృథా వృథా**
**శ్రీవేంకటగిరి చెలువునిని**
**సేవించక మతిఁ జెదరినను. ||వెలయు||**

**ఉపోద్ఘాతము:**

ఎన్నిచేసినా, యేమిచేసినా అంతా వృథా వృథా. బూడిదలోపోసిన పన్నీరు వలె శుద్ధ దండుగ. మనకి ఈ జన్మనిచ్చిన శ్రీహరినే తలపులో యెప్పుడోకానీ తలుచుకోకపోతే ఇక మనిషిగా బ్రతికి యేమివుపయోగం అంటున్నారు అన్నమయ్య. శ్రీపతి నీ ఆత్మలో నిలుపుకోలేనప్పుడు యెన్ని పుణ్యకర్మలు చేసినా యేమి ప్రయోజనం చెప్పండి. అంతా వృథా వృథా అని అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఓ ప్రజలారా! తలపున (మీ ఆలోచనలో) అనగా మీ మనస్సులో శ్రీహరి, తడసినను (ఆలస్యముగా కూడా మీకు స్ఫురణకు రాకపోతే...) ఇన్నియునూ వెలసి (వుండి) కూడా అంతయునూ వృథావృథా! (శుద్ధ దండుగే).

ఎడయక (యెడబాటన్నది లేక) విడువక యెన్నైనా పుణ్యములు చేయుట వృథా వృథా! ఎందుకంటారా? శ్రీపతిని బడిబడి (దృఢముగా) ఆత్మలో తడవక (వెదకకుండా) అన్యమైన వాటి గురించి తడలిన (విచారించినచో) యేమి ప్రయోజనం వుంటుంది చెప్పండి?

ఎరవుల తపములు (మన తత్త్వానికి సరిపడని తపోదీక్షలు) యెంతైనా (యెన్ని చేసినా), వాటితో విరవిర వీగుట (త్రెళ్ళి త్రెళ్ళి నిక్కటం) వృథా వృథా (శుద్ధ దండుగ). ఎందుకంటే మన రక్షకుడైన హరిని, అచ్యుతుని, పరమాత్ముని యెన్నడూ మరువరాదు. మరిగి (భోగవస్తువులకు అలవడి) ఆ దేవదేవుని తలవక మఱచిపోతే ఈ బ్రతుకునకేమి ప్రయోజనం చెప్పండి?

జగద్రక్షకుడైన దైవమును (పరమాత్మను) తాము యెఱుగక తమకమున (జగన్మాయలో) వేవేలైన (అనేకపెడదారులు బట్టినచో) అంతా వృథా వృథా. శ్రీవేంకటగిరిమీదనున్న చెలువుని అప్పుని, శ్రీవేంకటేశుని సేవించక మతి చెదరిన (మనోవైక్లబ్యము) పొందితే బ్రతుకంతా వృథావృథా... శుద్ధ దండుగ.

**పద్యవివరణ:**

కం.|| **తలపున శ్రీహరి తడసిన**
**వెలసియునిన్నియును మాకు విడువదగినవే,**
**విలువేమిరా? వృథా వృథ**
**కొలువైవున్నట్టి ఏడుకొండలతేడా!**

సంఖ్య: I/156 రాగం : లలిత
కీర్తన : ఎనుపోతుతో నెద్దు నేరుగట్టినయట్లు

**లలిత**

**52 ఎనుపోతుతో నెద్దు నేరుగట్టినయట్లు**
**యెనసి ముందర సాగ దేఁటిబ్రదుకు** ॥పల్లవి॥

**కడలేనియాసచే కరఁగికరఁగి చిత్త-**
**మెడమవంకకు వచ్చె నేఁటిబ్రదుకు**
**పొడవైనమమతతోఁ బొదలఁ బొదల మాన-**
**మిడుమపాట్లఁ బడె నేఁటిబ్రదుకు** ॥ఎనుపోతు॥

**తెగుదెంపులేనిభ్రాంతికిఁ జిక్కి యాచార.**
**మెగసి గొందులు దూరె నేఁటిబ్రదుకు**
**పగగొన్న మోహతాపము వేరుగ విజ్ఞాన-**
**మిగురువెట్టక మానె నేఁటిబ్రదుకు** ॥ఎనుపోతు॥

**భావింప రోఁతలోఁ బడి పొరలెడిసౌఖ్య-**
**మేవగింపఁడు జీవుఁ డేఁటిబ్రదుకు**
**శ్రీవేంకటేశుపై చిత్త మొక్కటె కాని**
**యేవంక సుఖము లే దేఁటిబ్రదుకు** ॥ఎనుపోతు॥

**ఉపోద్ఘాతము:**

'ఏరు' అంటే, దున్నుటకు ఎద్దులను కట్టి సిద్ధపరచిన నాగలి అని అర్థం. వ్యవసాయంలో ఏరుకి మంచి జోడీగా వున్న యెద్దులను కడతారు. అవి చకచక దున్నేస్తాయి. కాని భగవంతుడు ఒక్కొక్కప్పుడు ఆ ఎద్దుకు జతగా ఎద్దుకు బదులు దున్నపోతును జోడీగా కడతాడు. ఇక ఆ జంటలో ఒకటి ముందుకు లాగితే ఒకటి వెనకకు లాగుతుంది. ఇక ఆ రైతు తిప్పలు తిరుమలేశునికే యెరుక. ఇట్లా సాగే ఇదేమి బ్రతుకు? ముందుకు





పోనే పోదాయె. ఏమిటీగతి?ఓ శ్రీవేంకటేశా! మనసుకు సుఖమే లేదయ్యా! ఇదేం దరిద్రపు బ్రతుకు అంటున్నారు అన్నమయ్య. నందకాంశ సంభూతునికే అట్లయితే నాబోటి వాడి సంగతేమిటి?

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రభూ! వ్యవసాయం కోసం పొలము దున్నుటకు నాగలికి, ఎనుబోతుతో (దున్నపోతుతో) యెద్దును 'ఏరు' గట్టినయట్లు (నాగలికి కట్టినట్లయింది.) ఎనసి (పూని) ముందుకు సాగదు. ఇదేమిబ్రతుకయ్యా? స్వామీ!

అంతుపొంతులేని ఆశ చేత నా మనస్సు కరిగి కరిగి యెడమ వైపుకు ఈడ్చుకొనిపోయింది. ఇదేం బ్రతుకయ్యా? పొడవైన (అధికమైన) మమతతో (మమకారంతో) పొదల పొదల (బలిసీ బలసీ) మానము (అభిజాత్యము) ఇడుమపాట్లబడె (ఆపదలతో కూడిన అవస్థలొచ్చాయి). ఇదేమి బ్రతుకయ్యా?

తెగతెంపులేని (యెడతెగని) భ్రాంతికి వశమై నా ఆచారమంతా యెగసి గొందులు దూరె (సిగ్గులేక పెడదారులు పట్టినది). ఛీఛీ! ఇదేమి బ్రతుకయ్యా? ఇక నా మోహతాపము నాపై పగబూని వేరేవిధముగా నా శాస్త్ర విజ్ఞానమును ఇగురబెట్టెను (ఇగిరి ఆవిరియైపోయేట్లు చేసింది). నా బ్రతుకు ఇట్లా కాలిపోయిందేమి ప్రభూ?

ఇక నాలోవున్న జీవుడు సరేసరి. వాడు రోత కలిగించే బ్రతుకుగడుపుతూ ఏనాడూ దానిని రోతగా భావించక ఏమాత్రమూ ఏవగించుకోకుండా అదే సౌఖ్యమని పొంగిపొరలుతుంటాడు. ఇదేమి బ్రతుకయ్యా స్వామీ? శ్రీవేంకటేశ్వరునిపై తగిలియున్న నా చిత్తము ఒక్కటి తప్ప, యేవంక చూచినా సుఖము లేనేలేదు. ఇదేమి బ్రతుకురా ఏడుకొండలవాడా?

**పద్యవివరణ:**

కం.॥ **ఎనుబోతు నెద్దుతో జత**
**పనివడ 'నేరు' నకు గట్టి పనిచిన యటులే**
**చని ముందు బ్రతుకుసాగదు**
**మనమున సుఖమసలులేదు, మనసిజగురుడా!**

సంఖ్య: I/93 రాగం : నాదరామక్రియ
కీర్తన : ఈసురలీమును లీచరాచరములు

**నాదరామక్రియ**

**53 ఈసుర లీమును లీచరాచరములు**
**యీసకలమంతయు నిది యెవ్వరు** ||పల్లవి||

**ఎన్నిక నామము లిటు నీవై యుండఁగ**
**యిన్ని నామములవా రిది యెవ్వరు**
**వున్నచోటనే నీవు వుండుచుండఁగ మరి**
**యిన్నిటాఁ దిరుగువా రిది యెవ్వరు** ||ఈసు||

**వొక్కరూపై నీవు వుండుచుండఁగ మరిఁ**
**తక్కిన యీరూపములు తా మెవ్వరు**
**యిక్కడనక్కడ నీవు యిటు ఆత్మలలోనుండ**
**మక్కువ నుండువారు మరి యెవ్వరు** ||ఈసు||

**శ్రీవేంకటాద్రిపై చెలఁగి నీ వుండఁగా**
**దైవంబులనువారు తా మెవ్వరు**
**కావలసినచోట కలిగి నీ వుండఁగ**
**యీవిశ్వపరిపూర్ణు లిది యెవ్వరు** ||ఈసు|| 93

**ఉపోద్ఘాతము:**

ఈ మధురమైన కీర్తనలో అన్నమయ్య, వివిధ నామరూపాలతోనున్న దేవతలు, మునులు, చలనముగల జీవులు, చలనములేని జీవులు యెవ్వరు? అని ప్రశ్నిస్తున్నారు. కానీ నీవు పరమాత్మవలె అంతా నిండియుండగా ఈ రూపాలతో తిరుగుతున్నవారెవ్వరు? అందరిలోనూ అంతర్యామివి నీవే అయినప్పుడు ఇన్ని రూపాలెందుకు? ఈ తిరుమల





శ్రీవేంకటేశ్వరుడవై నీవుండగా ఇంకొక దేవుడెలావుంటాడు? ఈ విశ్వపరిపూర్ణుడవు నీవు కాక వేరెవ్వరున్నారు తండ్రీ? అని ప్రశ్నిస్తున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! ఈ సురలు (దేవతలు), మునులు, ఈ సృష్టిలో చలనముగల జీవులు, చలనము లేని జీవులు, ఈ సర్వమంతయునూ యెవ్వరు?

"పరమాత్మ' అనే యెన్నికయైన నామము (విశిష్ఠమైన పేరు) నీవై వుండగా ఇంకా ఇన్ని వేర్వేరు నామములతో పిలువబడే జీవులెవ్వరు? నీవు స్థిరుడవు. నీవు వున్నచోటు వీడవు. మరి అటువంటప్పుడు యిన్నిటా ఈ శరీరాలతో తిరుగుతున్నవారెవరు?

వేదము నీవు ఒక్కడవే అని చెబుతున్నది. మరి తక్కిన ఇన్ని రూపాలతో సృష్టిలో చలామణి అవుతున్న వారెవ్వరు? ఆత్మరూపి, అంతర్యామివై నీవే వున్నప్పుడు ఇన్ని ఆత్మలెక్కడివి? ఇక్కడ (ఈ భూమిమీదా) అక్కడా (ఆ దేవలోకాలలోనూ) ఆత్మవై నీవేవున్నప్పుడు మరి పరమాత్మయెవ్వరు?

ఈ శ్రీవేంకటాద్రిపై నీవు శ్రీవేంకటేశ్వరుడవై అతిశయించుచుండగా ఇంకా దైవము అని పిలువదగినవారెవ్వరు? కావలసినచోట, కావలసిన రూపంలో నీవే మాతో వుండగా ఇంకా విశ్వ పరిపూర్ణులని పిలువదగినవారెవ్వరు? ఓ ఏడుకొండలవాడా! నీవే తప్ప ఇతఃపరం బెరుగను ప్రభూ!

**పద్యవివరణ:**

ఉ.|| **ఎవ్వరు యీసురుల్ మునులు యీ జగమందు చరాచరంబులున్**
**ఎవ్వరు సృష్టిలో మనిరి యిన్ని తెరంగుల నామ రూపులన్**
**ఎవ్వరు నిత్యముండెదరు యేపుగ కాయములందు ఆత్మయై**
**ఎవ్వరు లేరు, నీవొకడ వియ్యది సత్యము వేంకటేశ్వరా!**

సంఖ్య: I/99 రాగం : నారణి
కీర్తన : ఏణనయనల చూపులెంత సొబగై యుండు

**నారణి**

**54 ఏణనయనలచూపు లెంత సొబగై యుండు**
**ప్రాణసంకటములగుపనులు నట్లుండు** ||పల్లవి||

**ఎడలేనిపరితాప మేరీతిఁ దా నుండు**
**ఆడియాసకోరికెలు నటువలెనె యుండు**
**కడలేనిదుఃఖసంగతి యెట్లఁ దా నుండు**
**అడరు సంసారంబు నట్లనే వుండు** ||ఏణ||

**చింతాపరంపరలఁ జిత్త మది యెట్లుండు**
**వంతఁ దొలఁగని మోహవశము నట్లుండు**
**మంతనపుఁ బనులపయి మనసు మరి యెట్లుండు**
**కంతుశరమార్గములగతి యట్ల నుండు** ||ఏణ||

**దేవుఁడొక్కఁడెయనెడి తెలివి దన కెట్లుండు**
**శ్రీవేంకటేశుకృపచేఁత లట్లుండు**
**భావగోచరమైనపరిణ తది యెట్లుండు**
**కైవల్యసౌఖ్యసంగతులు నట్లుండు** ||ఏణ||

**ఉపోద్ఘాతము:**
"ఏణ" అంటే నల్లని పెద్దపెద్ద కన్నులున్న "జింక" అని అర్థం. ఏణనయనలంటే స్త్రీలని అర్థం. ఏణ నయనల చూపులు ఎంతో శోభాయమానంగా వుండి పురుషుని భ్రమింపజేయుటవలన, వాడు ఆమెకోసం ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నాడు. ప్రాణమునకు నష్టం తెప్పించే పనులు కూడా అట్లే వుంటాయి. శ్రీవేంకటేశ్వరుని కృప వుంటేనే దేవుడొక్కడే అనే జ్ఞానం కలుగుతుంది అని అంటున్నారు అన్నమయ్య.





**తాత్పర్య వివరణ:**

ఏణనయనల (నల్లజింకవలె పెద్ద పెద్ద కన్నులున్న స్త్రీల) చూపులు యెంత సొబగై యుండు (మనోహరంగా వుంటాయో) ఆలోచించండి. అంతమాత్రంచేత వారిని నమ్మవచ్చునా? ప్రాణ సంకటములైన (ప్రాణహాని కలిగించే) పనులు కూడా అట్లుండు (అట్లాగే పైకి నిరపాయకరమైన పనులవలెనే వుంటాయి.)

ఎడలేని పరితాపము (విరామం లేని సంతాపము) తాను ఏరీతి నుంటుందంటే, ఆడియాస (దురాశ)తో కూడియున్న కోరికలూ అలాగే వుంటాయి. ఎందుకంటే ఇవి ఒకదానివల్ల ఇంకొకటి వస్తాయి కదా! మరి కడలేని (అంతులేని) దుఃఖపు కూటమి యెందుకు కలుగుతున్నది? నరులు ఈ సంసార సాగరంలో మునిగి నానా ప్రయాసలు పడుతున్నందువలన.

చిత్తము (మనస్సు) చింతాపరంపరల (ఒకదానివెంట ఇంకొకటి వచ్చే వేదనలతో) యెందుకుంటుంది? అది విచారము మానలేని మోహవశమైనందున అని గ్రహించవలెను. మరి మనస్సు, మంతనపు పనులపై (రహస్యపు చెడుపనులపై) యెందుకుంటుంది? కంతుశర మార్గముల గతి (మన్మథుని బాణములు తగిలి) చెడుమార్గములలో వెళ్ళినందువలన. ఇవన్నీ స్వయంకృతాపరాధములేకదా! ఇంకొకరి ననటం దేనికి?

ఇక, మానవులకు పరమాత్మ ఒక్కడే అనే జ్ఞానం ఎట్లా కలుగుతుంది? శ్రీవేంకటేశ్వరుని అమితమైన కరుణ వానిపై పడుటచేత, "ఏకం సత్ బహుధా వదంతి' అనే జ్ఞానం కలుగుతుంది. భావమునకు మాత్రమే గోచరించే పరిణత (పరిణామవైభవం) యెట్లా కలుగుతుంది? కైవల్య సౌఖ్యసంగతుల (మోక్షానంద ప్రాప్తి) చేత మాత్రమే కలుగుతుంటుంది.

**పద్యవివరణ:**
ఆ.వె.|| **ఏణనయన చూపులెంత సొబగు నుండు**
**ప్రాణసంకటంపు పనులు యటులె**
**వేంకటేశు కరుణ వెలయక నెఱుగము**
**సకల మోక్షదాత యొకడె యనుచు.**

సంఖ్య: I/60 రాగం : సామంతం
కీర్తన : ఏదిచూచినా నీవే యిన్నియును మరి నీవే.

**సామంతం**

**55 ఏది చూచినా నీవే యిన్నియును మఱి నీవే**
**వేదవిరహితులకు వెఱతు మఱుగాన** ॥పల్లవి॥

**ఇరవుకొని రూపంబులిన్నిటానుఁ గలనిన్నుఁ**
**బరికించవలెఁగాని భజియింపరాదు**
**గరిమచెడి సత్సమాగంబు విడిచిన నీ-**
**స్మరణవిజ్ఞానవాసన గాదుగాన** ॥ఏది॥

**యిహదేవతాప్రభలనెల్ల వెలుఁగుట నీకు**
**సహజమనవలెఁగాని సరిఁ గొలువరాదు**
**అహిమాంశుకిరణంబు లన్ని చోట్లఁ బరగు**
**గ్రహియింపరా దవగ్రాహములు గాన** ॥ఏది॥

**యింతయునుఁ దిరువేంకటేశ నీవునికిఁ దగఁ**
**జింతింపవలెఁగాని సేవింపరాదు**
**అంతయు ననరుహమును నరుహంబనఁగరాదు**
**అంతవానికిఁ బరుల కలవడదుగాన** ॥ఏది॥ **60**

**ఉపోద్ఘాతము:**

వేదమునెరింగి, భగవంతుని తత్త్వం తెలిసికొన్న జ్ఞానికి అంతా ఆ శ్రీహరిమయమే. అన్నమయ్య ఆ సత్యాన్ని యేనాడో బోధించారు. ఆ సత్యం తెలిసినవారికి ఏది చూచినా శ్రీహరియే. ఈ సృష్టిలోవున్నవన్నీ శ్రీహరే. అయితే వేద విరహితులు మాత్రం కుతర్కంతో మాకు కనబడనిదేవుడు లేనేలేడు అంటారు. మాకు అటువంటి దుర్మార్గులతో కలియుట అంటేనే భయం. అన్నిరూపాలలోనూవున్నది ఆ శ్రీహరియే అని చూడవలసిందే అది సత్యమే. కానీ ఆ రూపాలన్నింటినీ, వైష్ణవులైన మీరు భజించకూడదు. ఇది మా సిద్ధాంతం. దీనిలో కుతర్కానికి ఆస్కారమే లేదు, అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా నాకు ఏది చూచినా నీ రూపమే కనుపిస్తున్నది. మరి ఇన్నింటిలోనూ నీవే వున్నట్లు తోచుచున్నది. కాని వేదవిరహితులు (వేదములను, భగవంతుని నమ్మని నాస్తికులు) కొందరుంటారు. వారికి నేవెఱతునయ్యా! (వారంటే మాత్రం నేను భయపడతాను).

ఆ నాస్తికులకు పెరధర్మములవారికి నావిదే విన్నపములు. రకరకములైన ఈ దేవతారూపంబులలో నున్న "నిన్ను" పరికించవలెనేగాని (గమనించి దర్శించవలెను, అంతే కాని)భజియింపరాదు (వారి భజన చేయరాదు). ఎందుకంటే, ఎవడైన హరిభక్తుడు గరిమచెడి (భ్రష్టుడై) సత్సంగమును విడిచిపెడితే నీయొక్క స్మరణ వాడికి విజ్ఞాన వాసన కలిగించదు. అందుకని సత్సంగము ద్వారా సదా నీ స్మరణలో వుండాలికాని కుతర్కములు పనికిరావు.

ఇహదేవతలు (ఇహలోకంలో ప్రాపంచిక కోరికలు కోరినట్లే తీర్చే దేవతలు) అనేక వైభవాలతో దీప్తించుచుందురు. వారికాశక్తి అనుగ్రహించినదీ నీవే. ఆ వైభవం అందువలన వారికి సహజమే అనుకొనవలెను. అంతేగాని వారిని గొలువరాదు. ఆ హిమాంశుడైన చంద్రుని కిరణములు పడని చోటు బయట వుంటుందా? ఆ కిరణాలలో దారి చూసుకోవాలిగాని శృంగారభావాలను పొందరాదు. ఎందుకని? అవి అవగ్రాహములు (భక్తి జ్ఞానములకు అడ్డంకులు). అందుచేత.

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంతయునూ(ఇదంతా) నీవునికి (నీ అస్థిత్వము) తగినట్లు ఇట్లు భావించుట దోషముకాదు. కానీ యెవరిని పడితే వారిని సేవించరాదు. నీ సృష్టిలో అన్నీ అర్హమే అయినప్పటికీ విష్ణువిరహితములు సేవించుటకు అనర్హాంబులు. వాటిని అర్హములననేకూడదు. ఎందుకంటే, అంత (సర్వమూ హరియే అనే భావన) వానికి (ఆ వేదవిరహితులైన ఇతరులకు) ఆ భావన అలవడదుకదా! అందుకని.

**పద్యవివరణ:**

తే.గీ.॥ **ఏది చూచినా నీవెగానెందునైన**
**వేద విరహితులను జూడ వెఱతునయ్య!**
**వెలయ నీవునికిన్నిటా వేంకటేశ!**
**అర్హమవనిది సృష్టిలో అసలులేదు.**

సంఖ్య: I/170 రాగం : శ్రీరాగం
కీర్తన : ఈతడఖిలంబునకు నీశ్వరుడై సకల

## శ్రీరాగం

**56 ఈతఁ దఖిలంబునకు నీశ్వరుఁడై సకల-**
**భూతములలోనఁ దాఁ బొదలువాఁ డితఁడు** ॥పల్లవి॥

**గోపాంగనల మెఱుఁగుగుబ్బచన్నులమీఁద**
**చూపట్టుకమ్మఁగస్తురిపూఁత యితఁడు**
**తాపసోత్తములచింతాసౌధములలోన**
**దీపించుసుజ్ఞానదీప మితఁడు** ॥ఏత॥

**జలధికన్యాపాంగలలితేక్షణములలో**
**కలసి వెలుఁగుచున్న కజ్జలం బితఁడు**
**జలజాసనునివదనజలధిమధ్యమునందు**
**అలర వెలువడినపరమామృతం బితఁడు** ॥ఏత॥

**పరివోనిసురతసంపదలనింపులచేత**
**వరవధూతతికి పరవశ మైనయితఁడు**
**తిరువేంకటాచలాధిపుఁడు దానై యుండి**
**పరిపాలనము సేయ భారకుం డితఁడు** ॥ఏత॥ **170**

**ఉపోద్ఘాతము:**

తేనెలూరే అన్నమయ్య కీర్తననాస్వాదించండి. ఈ పొడవుకు పొడవైన పురుషోత్తముడు సృష్టికంతటికీ ఈశ్వరుడు. ప్రతిప్రాణిలోను తానే ఆత్మ రూపంలో వ్యవహరిస్తుంటాడు. ఆయన భక్తులమైన మనందరి కోసం యెన్నో అవతారాలెత్తి దుష్టశిక్షణ, శిష్టరక్షణచేసి మనందరినీ అలరించాడు. నేడు ఈ మహానుభావుడే తిరువేంకటాధినాథుడై జగములను





పరిపాలించుచున్నాడు. మనందరి "బరువు" తానే భరిస్తూ భారకుడని పేరు పొందాడు, అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఈతడే అఖిలంబునకు (సమస్తమునకు) ఈశ్వరుడై (అధినాథుడై) వ్యవహరించుచున్నాడు. సకల భూతములలోనూ (సర్వప్రాణులలో) తానే ఆత్మరూపములో పొదలువాడు (వర్ధిల్లుతుంటాడు)

జవ్వనులైన గోపకన్నెల మెఱుగు ఘనస్తనములపై కనుపించు, కమ్మగస్తూరిపూత (కమ్మటి కస్తూరిమైపూత) యితడే (ఈ శృంగారరాయుడే). అలాగని ఈయన కేవలం విలాస పురుషుడా? కానేకాదు. ఉత్తమోత్తములైన తాపసుల, చింతాసౌధములలో (భావనా భవంతులలో) వెలుగుతున్న సుజ్ఞానమనే దీపము ఈ యోగీశ్వరేశ్వరుడే సుమా!

జలధికన్య (క్షీరసాగర తనయయైన శ్రీమహాలక్ష్మి) అపాంగలలితేక్షణముల (అందమైన కడకంటి చూపుల) లోనున్న వెలుగులు విరజిమ్ము కజ్జలంబు (కాటుక) ఇతడే (ఈ రమాకాంతుడే). జలజాసనుని (బ్రహ్మదేవుని) ముఖములనే సంద్రములమధ్య వెలసి అలరుచున్న పరమజ్ఞానామృతము ఈతడే.

పరిమితులులేని సంభోగసమాగములలో వధూవరులకు వైభవము నింపుతూ పరవశత్వము కలిగించునది యెవరనుకున్నారు? ఈ జగన్నాథుడే. ఇదిగో నేడు తిరుమల శిఖరాలపై శ్రీవేంకటేశ్వరుడై తానేయుండి పరిపాలనము చేయుచున్న భారకుడు (అందరి భారమును వహించేవాడు) ఈ దేవదేవుడే.

**పద్యవివరణ:**

ఉ.॥ **ఈతడు జూడనీయఖిలమింతటికీశ్వరుడెంచగా తగన్**
**భూతములన్నిటిన్ బొదలు భారమణీమణి నాథుడీతడే**
**ప్రీతిని బొంది గోపికల బింకపుచన్నుల కమ్మఁ బూతయున్**
**యీతడె, వేంకటాధిపుడు యిందరి భారకుడీమహాత్ముడే.**

సంఖ్య: I/172 రాగం : బౌళి
కీర్తన : ఏమివలసిన నిచ్చు నెప్పుడైనను

**బౌళి**

**57 ఏమివలసిన నిచ్చు నెప్పుడైనను**
**యేమరక కొలిచిన నీతఁడే దైవము ||పల్లవి||**

**ఘనముగా నిందరికిఁ గన్నులిచ్చుఁ గాళ్లిచ్చు**
**పనిసేయఁ జేతులిచ్చు బలియుఁడై**
**తనుఁగొలువుమని చిత్తములిచ్చుఁ గరుణించి**
**వొనర లోకానకెల్ల నొక్కఁడే దైవము ||ఏమి||**

**మచ్చిక తనుఁగొలువ మనసిచ్చు మాటలిచ్చు**
**కుచ్చితములేనికొడుకుల నిచ్చును**
**చొచ్చినచోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు**
**నిచ్చలు లోకానకెల్ల నిజమైనదైవము ||ఏమి||**

**పంతమాడి కొలిచినఁ బ్రాణమిచ్చు ప్రాయమిచ్చు**
**యెంతటిపదవులైన నిట్టె యిచ్చు**
**వింతవింతవిభవాలవేంకటేశుఁ డిదె మా-**
**యంతరంగముననుండే అరచేతిదైవము. ||ఏమి|| 172**

**ఉపోద్ఘాతము:**

చాలామంది దేవతలు వారి నర్చించి యేది కోరుకుంటే ఆ వరమునను గ్రహిస్తారు. అందులో విశేషమేముంది? కానీ ఈ తిరుమల నాథుడున్నాడే ఏది కోరుకుంటే అది, యెన్నిసార్లైనా, యెప్పుడడిగినా ఇస్తాడు. ఎందుకంటే ఈయన పరమాత్మ. ఈయనకు పరిమితి లేదు. కాకపోతే ఒక నిబంధన వున్నది. ఈయనను మరువరాదు. తిరుమలకు వచ్చి మొక్కు తీర్చుకొనే వారు గమనించవలసినదిదే. మీ కోరిక తీరాక ఆయనను మఱచితే ఆయనా మిమ్మల్ని పట్టించుకోడు. "పంతమాడి





కొలిచిన ప్రాణమిచ్చు" నంటున్నారు అన్నమయ్య. ఈయన వింత వింత వైభవాల వేంకటేశ్వరుడయ్యా! ఘటనా ఘటన సమర్థుడు అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఈ మహానుభావుని ప్రత్యేకతేమంటే, ఈయన తన ఆశ్రితులకు, ఏమివలసిన (ఏది కావలెనన్నా) యెప్పుడైనను (యెప్పుడుపడితే అప్పుడు) ఇస్తాడు. ఎందుకంటే ఈతడే దైవము (పరమాత్మ). కాకపోతే ఈతనిని ఏమరక కొలువవలెను (మఱచిపోకుండా కొలవాలి). అవసరం తీరాక మఱచినచో ఆయనా మిమ్మ్రలిన వదిలేస్తాడు.

ఘనముగా తన ఆశ్రితులకు ఈయన కళ్ళుపోతే కళ్ళిస్తాడు. కాళ్ళులేని అవిటివాడైతే కాళ్ళిస్తాడు. పనిచేసికొని బ్రతికేవారికి చేతులనిస్తాడు. బలియుడై (బలవంతుడై) తనను కొలిచేటందుకు చిత్తము (మనస్సులోని కోరిక) కూడా ఆయనే ఇస్తాడు. ఈవిధంగా తన భక్తులను అనుగ్రహిస్తాడు. ఈ లోకమునకెల్లా ఇటువంటి దైవము యెవరంటే, ఈయన ఒక్కడే.

మచ్చికతో (స్నేహభావనతో) తనను కొలిచినచో ఈయన ఇవ్వలేని వైభవం వుంటుందా? అసలు ముందుగా తనను కొలిచేటందుకు కోరికను కూడిన మనస్సును ఇచ్చేది ఈతడే. కొలిచేటందుకు మాటలనుకూడా ఇస్తాడు. తన భక్తుల శేషజీవితము నిశ్చింతగా గడచిపోవుటకు వారికి మోసము నెరుగని నిర్మలులైన కొడుకులనిస్తాడు. వెళ్ళిన భక్తుల దగ్గరకే వెళ్ళి వారికి శుభములనిస్తాడు. సుఖ సంపదలనిస్తాడు. ఏనాడైనా లోకమునకెల్లా నిజమైన దేవుడెవరంటే, నిస్సందేహంగా ఈయనే.

పంతమాడి (పట్టుదలతో) ఈ స్వామిని కొలిస్తే బ్రాణమిచ్చు (అవసరమైతే ప్రాణదానంచేసి గండం గట్టెక్కిస్తాడు). ప్రాయమిచ్చు (ఆయుర్దాయం తక్కువవుంటే దాన్నీ ఇస్తాడు). ఎంతటి ఉన్నత పదవులు కోరినా, ఇట్టే (సులభంగా) ఇస్తాడు. ఎన్నో వింత వింత వైభవముల నొసగే ఈ వేంకటేశ్వరుడు, ఇదే మా అంతర్యామిగా వుండే మా అరచేతి దైవము (ఎప్పుడు కావాలంటే అప్పుడనుగ్రహించే దైవము).

**పద్యవివరణ:**

కం.|| **ఏమి వలసినను యిచ్చును**
**ఏమరకన్ గొల్వుడితనియిచ్చుసమస్తం-**
**బీమహివేంకటనాథుడె**
**ఏమైనా యిచ్చు దైవమెప్పుడునైనన్**

సంఖ్య: IV/279 రాగం : దేవక్రియ
కీర్తన : ఏమి చెప్పేది ప్రతాప మెట్టి విలుకా డితడు

## దేవక్రియ

**58** ఏమి చెప్పేది ప్రతాప మెట్టి విలుకాఁ డితఁడు
రాముఁడు వీఁడే మ్రొక్కుఁడు రణరంగధీరుఁడు ॥పల్లవి॥

విడిసెఁ గపిబలము వెస సముద్రము దరి
నడచె లంకపైఁ బౌఁజు నానాగతుల
తొడిగె రాముఁడు వింట దొనలోని బ్రహ్మాస్త్రము
పడె రావణుతలలు పంక్తులై ధరణిని ॥ఏమి॥

చొచ్చిరి లంకలోను సుగ్రీవాంగదాదులు
తెచ్చిరి రాకాసి చెర తెప్పలుగాను
యిచ్చిరి జయధ్వనులు యింద్రాదిదేవతలు
మెచ్చిరందరు సీతాసమేతుఁడాయ నితఁడు ॥ఏమి॥

మగుడెఁ బుష్పకముపై మహిమ నీతనిదండు
తగఁ బట్టము తా నేలె తమ్ములతోను
అగపడి శ్రీవేంకటాద్రిపై నిల్చి నితఁడు
జగదేకమూర్తి కౌసల్యాసుతుఁ డిపుడు ॥ఏమి॥ 279

**ఉపోద్ఘాతము:**

నేడు శ్రీరామనవమి. భద్రాద్రిపై సీతారామకళ్యాణం జరుగుతుంటే ఈ వివరణ వ్రాస్తున్నాను. అన్నమయ్య చెప్పిన మధురమైన కీర్తన వివరిస్తూ పులకించిపోతున్నాను. ఈ శ్రీరాముడు యెట్టివిలుకాడయ్యా!! ఈయన ప్రతాపము నేమని చెప్పేది? వీడే రాముడు, రణరంగ ధీరుడు. ఈయనకు మ్రొక్కండయ్యా! అంటున్నారు. అక్కడ తిరుమలలో వున్న శ్రీవేంకటేశ్వరుడే ఈ జగదేకమూర్తి, కౌసల్యాసుతుడూను అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఆహా! ఈ శ్రీరామచంద్రుని ప్రతాపము గురించి యేమి చెప్పేది? ఇతడు యెట్టి విలుకాడో యేమని చెప్పేది? వీడె (ఈతడే) రాముడు. ఇతడు రణరంగమున, ధీరుడు (అసహాయ శూరుడు). ఈయనకు మ్రొక్కరో.

అంతట సముద్రపుదరిని (ఒడ్డున) వెసె (వేగముగా) కపి బలము (వానరసేన) విడిసినది. ఆ లంకంపై ఫౌజు (కపిసేన) నానాగతుల (అనేకదిక్కులకు) నడిచింది. అప్పుడు ఆ యుద్ధమున రాముడు తన వింటిదొనలో బ్రహ్మాస్త్రమును తొడిగినాడు. ఆ అస్త్రమును రావణునిపై వేసినాడు. అంత రావణుని తలలు పంక్తులై ధరణని భూమిపై పడెను.

రావణవధానంతరము సుగ్రీవుడు అంగదులతో కూడిన వానరసైన్యము లంకను చొచ్చినది (ప్రవేశించినది). రాకాసి చెర (రావణాసురుని చెరసాల) తెప్పలుగాను (అంతరించిపోగా) జానకీదేవి విముక్తురాలైనది. ఇంద్రాది దేవతలు నింగినుండి ఇదంతా చూచి జయజయధ్వానములు పెట్టిరి. అందరూ ఆహా అని మెచ్చుకొన్నారు. ఇతడు (ఈ శ్రీరాముడు) సీతాసమేతుడాయెను (సీతతో జతకలిసినవాడైనాడు).

ఆ తరువాత, మగుడ (అయోధ్య మరలివచ్చుటకు) ఈతని దండు (రాముని కపి సైన్యము) మహిమగల పుష్పకము అను విమానమునెక్కి అయోధ్య చేరి పట్టాభిషిక్తుడై తమ్ములతో రాజ్యమును పరిపాలించాడు. ఈనాడు శ్రీవేంకటాద్రిపై అగపడి ఇతడు నిలిచియున్నాడు. ఈతడే జగదేకమూర్తియైన కౌసల్యాకుమారుడు.

**పద్యవివరణ:**

ఉ.॥ **ఏమని చెప్పవచ్చునిక యీతని వీరప్రతాపమెంచుచున్**
**రాముడు వీడె ఘోర రణరంగపు ధీరుడు మ్రొక్కుడీతనిన్**
**కోమలి జానకీరమణి గూడి తనేలెనయోధ్య, నేడు బల్**
**దీమసమూర్తి యీ గిరుల తిమ్మడు వేంకటరాముడాయెబో.**

సంఖ్య: I/167 రాగం : సాళంగనాట
కీర్తన : వాసివంతు విడిచినవాడేయోగి

**సాళంగనాట**

**59 వాసివంతు విడిచినవాఁడే యోగి: యీ-**
**ఆసలెల్లా విడిచినాతఁడే యోగి** ॥పల్లవి॥

**గద్దించి పారెడుతురగమువంటిమనసు**
**వద్దని మరలించినవాఁడే యోగి**
**వొద్దనే కొండలవంటి వున్నత దేహగుణాలు**
**దిద్ది మట్టుపెట్టువాఁడే ధీరుఁడైనయోగి** ॥వాసి॥

**ముంచుకొన్న యింద్రియపుమోహజలధిలోన**
**వంచన మునుఁగనట్టివాఁడే యోగి**
**పొంచి పుణ్యపాపములు పొట్టువంటికర్మములు**
**దంచి పారఁజల్లువాఁడే తత్త్వమైనయోగి** ॥వాసి॥

**వెగటుకామాదుల వెళ్లఁగొట్టి శాంతుఁడై**
**వగలుడిగినయట్టివాఁడే యోగి**
**నిగిడి శ్రీవేంకటపతినిజదాసుఁడై భక్తిఁ**
**దగిలి నిలుపువాఁడే ధన్యుఁడైనయోగి** ॥వాసి॥ **167**

**ఉపోద్ఘాతము:**
శ్రీవేంకటేశ్వరుని నిజదాసుడై భక్తి పారవశ్యంలో బ్రతికే యోగియెలావుంటాడో వర్ణిస్తున్నారు అన్నమయ్య. "వాసి" అంటే కీర్తి. ప్రతిమంచిపని, అది చేసిన వానికి "వాసి"ని తెస్తుంది. ఒక్కసారి అది వచ్చాక "వంతు" అంటే పోటీపెరుగుతుంది, నీకీర్తి గొప్పదా? నా కీర్తి గొప్పదా? దాని వలన "ఆసలు" పెరుగుతాయి. దానివల్ల యెంతగొప్ప యోగి అయినా భ్రష్టుడవుతాడు. కాబట్టి యోగి అయిన ప్రతివాడూ మొదట చేయాల్సినపని, వాసి-వంతు- ఆస విడిచిపెట్టడం. తరువాత





యేమేం చేయాలో కీర్తనలో వివరిస్తున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ హరిభక్తులారా! వాసి (కీర్తి, వంతు (పోటీమనస్తత్వము) విడిచిపెట్టినవాడే అసలైన యోగి. ఆశ కోరికలను విడిచిపెట్టినవాడే అత్యుత్తమ యోగి.

మనస్సు గద్దించి (యెదిరించి) పారెడు తురగము (పరుగులువెట్టు పొగరుబోతు గుఱ్ఱము) వంటిది. దానిని వద్దని (అట్లా వుండరాదని) మంచి స్వాధీనమున వుంచు వాడే నిపుణుడైన యోగి. కొండలవలె ఉన్నతమైన దేహగుణాలను ఒద్దని, ప్రేరేపించే మానసిక వైక్లబ్యములను దిద్ది (సవరించి) మట్టుబెట్టేవాడే (తుదముట్టించేవాడే) గొప్పయోగి. అతడే ధీరుడు (ధైర్యవంతుడు).

ఇంద్రియములు ముంచుకొని (లొంగదీసికొని) మోహము అనే మహాసముద్రంలో పడవేస్తాయి. వంచించబడిన మనిషి దానిలో మునిగిపోతాడు. అట్లా మునిగిపోనివాడే మోక్షార్హుడైన యోగి. పాపపుణ్యాలనే ధాన్యపు గింజల మీద "పొట్టు" వంటివి నరులు చేసే కర్మములు. పొట్టు ఒలిస్తేగానీ, గింజ మంచిదో (పుణ్యమో), చెడ్డదో తెలియదు. తత్త్వవేత్త అయిన యోగి ఆ గింజలను పొట్టుతో సహా దంచిపారవేయవలెను.

వెగటు (హేయమైన) కామము మొదలైన వానిని వెళ్ళగొట్టి శాంతి పొందినవాడే సఫలుడైన యోగి. పగ, కపటము విడనాడినవాడే పరమయోగి. అతిశయించి శ్రీవేంకటపతికి నిజదాసుడై భక్తిన్ తగిలి (భక్తిమార్గంలో జీవిస్తూ) వైష్ణవ ధర్మాన్ని నిలుపువాడే ధన్యుడై, హరిమెచ్చినయట్టి యోగి.

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **వాసి వంతు విడచి వరలువాడే యోగి,**
**ఆసలెల్ల విడచి అలరు యోగి**
**నిగమవేద్యుడు హరి నిజదాసుడై భక్తి**
**దగిలియుండు వాడె ధన్యయోగి.**

సంఖ్య: IV/303 రాగం : భూపాళం
కీర్తన : తెలియదు గాకద్రిష్టము జీవుడు

**భూపాళం**

**60 తెలియఁదుగాక ద్రిష్టము జీవుఁడు**
**సులభమిదివో యిచ్చోటనే పరము ॥పల్లవి॥**

**మనసునఁ దలచిన మర్మములు గరఁగి**
**చొనుపుచు నింద్రియసుఖ మిచ్చు**
**అనువుగ నిటువలె హరిఁదలపోసిన**
**తనకు బ్రహ్మానందము సమకొనదా ॥తెలి॥**

**మాటలాడినను మరిగి మానవులు**
**యీటున మెచ్చిత్తురేమైనను**
**నాఁట నిట్ల హరినామము నొడివిన**
**గాఁటపువరములు కలుగునె కాదా ॥తెలి॥**

**చేసినపుణ్యము చేతఁజుట్టుకొని**
**రాసి వెనుతగిలి రక్షించు**
**వేసర కిటు శ్రీవేంకటేశ్వరుని**
**ఆసల కైంకర్యము ఫలించును ॥తెలి॥ 303**

**ఉపోద్ఘాతము:**

మన దేహంలోవుండే జీవుడున్నాడే, వాడు వాడి ద్రి (ది) ష్టము (భాగ్యము) యెట్లా వుండబోతున్నదో తెలియదు కదా! వాడు జీవితకాలంలో అనేక భ్రమలకు లోనై, కామక్రోధాది అరిషడ్వర్గాల పాలై తీరని వేదన అనుభవిస్తుంటాడు. మోక్షము యెక్కడో వుందనుకొని దానికోసం ఆరాటపడుతుంటాడు. కానీ ఆ 'పరము' ఈ భూమిమీదనే సులభంగా లభించగలదని గ్రహించలేకున్నాడు అంటున్నారు అన్నమయ్య. మనస్సును తలచి వెంపర్లాడేవాడికి ఇంద్రియ సుఖములు ఆనందాన్నిస్తాయి.





సందేహంలేదు. కానీ శ్రీహరిని తలచి ఆయన కోసం ఆరాటపడే వాడికి బ్రహ్మానందం కలుగుతుంది. దుఃఖం రానేరాదు.

**తాత్పర్య వివరణ:**

జీవుడు తన ద్రి(ది)ష్టము (భాగ్యము) యెట్లావుండబోతున్నదో తెలియదు గాక! తెలియదు. ఇదివో సులభమైన మార్గం వున్నది. పరము (ముక్తి) ఇచ్చోటనే లభిస్తుంది. మీరూ ఇలాగే చేయండి మరి.

మనస్సును తలచిన (ఆశించి నమ్ముకొంటే) మర్మముల (మర్మాంగముల యందు) కరగిపోయి, చొనుపుచు (చొరబడి) అత్యంత ఇంద్రియ సుఖములనిస్తుంది. కానీ జవసత్త్వాలుడిగాక ఈ సుఖమే తీరని దుఃఖమవుతుంది. ఇటువలె (ఈ విధముగా) అనువుగ (తేలికగా) శ్రీహరిని తలపోసిన (నమ్ముకొని మీ ఆలోచనలలో నిలుపుకొంటే) తనకు (ఆ భక్తునికి) తప్పక బ్రహ్మానందము కలుగుతుంది కదా! మరి ఈ ఐహిక ఆనందాలతో పనేమిటి?

మానవులైన రాజులు, ధనవంతులు మాటలాడినను (వారిని పొగడుతూ మాటలు చెబుతే) మరిగి (వశులై) యీటున మెచ్చి (ఊరకనే మెచ్చుకొని) ఏమడిగినా ఇత్తురు. కానీ అవన్నీ యెలా వచ్చాయో అలాగే పోతాయి. అయితే నాటుకొని పోవునట్లు శ్రీహరినామమును తలపోసిన (ధ్యానించుచున్న) వానికి, గాటపు వరములు (అధికమైన వరములు) దొరుకుతాయి కదా! ఇక ఈ రాజులు దొరలు ఇచ్చే వెందుకయ్యా?

మనము చేసిన పుణ్యము, మన చేతికి చుట్టుకొన్నట్లు రాసి (కుప్పలుగా) వెనుతగిలి (మన వెనువెంటనే వుండి) రక్షిస్తుంటుంది. ఇటు (ఈ విధముగా) వేసరక (విసుగు చెందక) ఆసల (ఆశక్తితో) శ్రీవేంకటేశ్వరుని కైంకర్యము (ఊడిగము) ఫలించును (అద్భుతమైన ఫలితములను ఇస్తుంది).

**పద్యవివరణ:**

కం.॥ **తెలియదు దిష్టము జీవుడు**
**సులభంబగు పరము గలదు చూడుడిచటనే**
**ఫలియించు వేంకటేశుని**
**కొలువే కైంకర్యదీక్ష కొనసాగంగా**

సంఖ్య: IV/306 రాగం : భైరవి
కీర్తన : ఈతడు విష్ణుడు రిపులెక్కడ చొచ్చేరు మీరు

భైరవి

**61 ఈతఁడు విష్ణుఁడు రిపు లెక్కడ చొచ్చేరు మీరు**
**చేత చక్రమెత్తినాఁడు శ్రీవేంకటేశుఁడు** ||పల్లవి||

**జలధులు చొచ్చిచొచ్చి సారెఁ బ్రతాపించినాఁడు**
**చలమునఁ బాతాళము సాధించినాఁడు**
**బలుభూమిదూరి వొక్కకొలికికిఁ దెచ్చినాఁడు**
**నిలిచి యంతరిక్షమునిండి భేదించినాఁడు** ||ఈతఁ||

**చేరి బ్రహ్మాండము తూఁటుసేసి చూచినాఁడు**
**వీరుఁడై రాచమూఁకల వెదకినాఁడు**
**ఘోరపు త్రికూటాదికొండలు జయించినాఁడు**
**వారించి చక్రవాళపర్వతము దాఁటినాడు** ||ఈతఁ||

**మట్టి దైత్యపురాల మర్మాలు విదళించినాఁడు**
**చుట్టువేదెమున యింతా సోదించినాఁడు**
**యిట్టె శ్రీవేంకటాద్రినిరవై యెక్కినవాఁడు**
**రట్టుగాఁ దనదాసులనిట్టె రక్షించినాఁడు** ||ఈతఁ|| **306**

**ఉపోద్ఘాతము:**

ఇది దశావతారవర్ణనగల అన్నమయ్య కీర్తన. చాలా శ్రమపడితేగాని ఇటువంటి కీర్తన వివరించడం కుదరదు. ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుడే





విష్ణువు. తన చేత సుదర్శన చక్రమును ధరించియున్నాడు. ఒరే! శత్రుమూకల్లారా! యెక్కడ దూరినా మీ అంతు చూస్తాడు. ఆయన దాసులైతే రక్షిస్తాడు. కాబట్టి పది అవతారముల నెత్తి మీపని బట్టిన ఆయన చరణాలే శరణనండి రా దైత్యుల్లారా! అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఈతడు విష్ణుమూర్తి. నేడు శ్రీవేంకటేశ్వరుడై తన చేత చక్రమెత్తినాడు (సుదర్శన చక్రమును ధరించినాడు). మీరు ఆయన రిపులు (శత్రువులు). ఎక్కడ చొచ్చేరు (యెక్కడ దూరి దాక్కుంటారురా?)

**"జలధులు చొచ్చి చొచ్చి సారె ప్రతాపించినాడు"** సప్త సముద్రాలలోనూ దూరి అతిశయముగా తన ప్రతాపము చూపినాడు (మత్స్యావతారము). **"చలమున పాతాళము సాధించినాడు"** మత్సరముతో పాతాళలోక వాసులను సాధించినాడు (కూర్మావతారానంతరము మోహిని అయిన శ్రీహరి). **"బలు భూమిదూరి వొక్క కొలికికి దెచ్చినాడు"** బలవంతంగా భూమిక్రిందకు దూరి నీటినుండి తన ముట్టెపై యెత్తి తీర్చిదిద్దినాడు (వరాహావతారము). **"నిలిచియంతరిక్షము నిండి భేదించినాడు"** హరణ్యకశిపుని వధించిన పిదప ఆకాశమంతా అణుమాత్రం సందులేకుండా నిండిపోయి, వారిని భేదించి మట్టుపెట్టాడు (నరసింహావతారము).

**"చేరి బ్రహ్మాండము తూటుసేసి చూచినాడు"** అండపిండ బ్రహ్మాండమంతా తన రెండు అడుగులతో సందులేకుండా ఆక్రమించి, తూటుసేసి (బలిచక్రవర్తిని చిన్నబుచ్చి) చూచినాడు. మూడవ అడుగునకు చోటేది అన్నట్లు చూశాడు (వామనావతారం). **"వీరుడై రాచమూకల వెదకినాడు"** జన్మతః బ్రాహ్మణుడైనా, క్షత్రియ తేజస్సుతో రాజలోకాన్నంతా

ఇరువదిన్నొక్కమారులు భూమి చుట్టివచ్చి వధించినాడు (పరశురామావతారము). **"ఘోరపు త్రికూటాది కొండలు జయించినాడు"** ఎక్కుటకు సాధ్యముకాని త్రికూటాద్రి మొదలైన కొండలను తానేకాక తన వానరసేనూ యెక్కించి లంకను జయించినాడు (శ్రీరామావతారము). **"వారించి చక్రవాళ పర్వతము దాటినాడు"** దారకుడు రథంతోలగా అర్జునునితో కూడి, పరమాత్ముని దర్శనం చక్రవాళ పర్వతముదాటిన తరువాత చేయించి ఆశీర్వాదములను పొందునట్లు చేశాడు (శ్రీకృష్ణావతారము).

**"మట్టిదైత్యపురాల మర్మాలు విదళించినాడు"** త్రిపురాసురుల పట్టణములను వాటిమర్మములను బట్టబయలుచేసి మట్టుబెట్టినాడు (బుద్ధావతారము). **"చుట్టువేడెమున యింతా సోధించినాడు"** మేలుజాతి అశ్వముమీద ఈ విశ్వమంతా వెదకి దుర్మార్గులను తుదముట్టించినాడు (కల్కి భగవానుడు). నేడు ఇట్టే (సులువుగా) శ్రీవేంకటాద్రి ఇరవై (స్థానముగా) యెక్కియున్న శ్రీవేంకటేశ్వరుడు ఇతడే. ఈ దేవదేవుడు రట్టుగా (బాహాటముగానే) తన దాసులను, ఇట్టే రక్షించినాడు.

**పద్యవివరణ:**

ఉ.॥ **ఈతడు విష్ణుమూర్తి, రిపులెక్కడబోయెదరెందుచొచ్చినన్**
**చేత సుదర్శనం బలర చీల్చునుదైత్యుల వేంకటేశుడై**
**భూతలినెత్తెరూపములు పోల్చుడువీని దశావతారముల్**
**మీతలనొప్పియే మిగల మేలుగ యీ వివరంబు జూడుడీ.**





సంఖ్య: IV/216 రాగం : శోకవరాళి
కీర్తన : విడువుము మనసా వీరిడి చేతలు

## శోకవరాళి

**62 విడువుము మనసా వీరిడిచేఁతలు**
**తడియక శ్రీహరిఁ దలఁచవొ యిఁకను ॥పల్లవి॥**

**నానాఁడే యెనఁబడినాలుగులక్షలు**
**యోనుల వెడలితి నొక్కఁడనే**
**ఆనిన భోగములందలివే పో**
**కానము యిఁకనేమి గడియించేము ॥విడు॥**

**నలుగడ నటు పదునాల్గు లోకములు**
**వెలయఁ జొచ్చితిని వెడలితిని**
**కలిగినదేదో కలుగనిదేదో**
**తెలియ దేమిటికిఁ దరిగేమో ॥విడు॥**

**భువిలోఁ జేసితి పుణ్యముఁ బాపము**
**కవిసి యాఫలము గైకొంటిని**
**యివల శ్రీవేంకటేశుఁడింతలో**
**తవిలి యేలఁగా ధన్యుఁడనైతి ॥విడు॥**

**ఉపోద్ఘాతము:**

వీరిడి చేతలు అంటే అవివేకమైన పనులని అర్థం. ఓ మనసా! అవివేకముతో కూడిన పనులను మానుకోరాదా? ఇకనైనా ఆలశ్యం చేయక శ్రీహరిని ధ్యానించరాదా? అంటున్నారు అన్నమయ్య. ఎన్నడో నా జన్మల సంఖ్యఎనుబది నాలుగు లక్షల సంఖ్యను దాటింది. అవే భోగాలను అనుభవిస్తూ ఒక్కటంటే ఒక్క జన్మలోనూ మోక్షం కోసం ప్రయత్నించలేదు.

ఇదిగో నేడు ఈ శ్రీవేంకటేశ్వరుని శరణని ఆయన నన్ను యేలగా ధన్యుడనయ్యాను అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ మనసా! నీవు సత్వరమే వీరిడి చేతలు (తెలివితక్కువ పనులను) విడనాడుము (విడిచిపెట్టుము). ఇకను (ఇకపై) తడయక (ఆలస్యం చేయకుండ) శ్రీహరిని తలచవో (ధ్యానింపుము).

ఓ ప్రభూ! నేనొక్కడనే, నానాటి బ్రతుకు వెళ్ళబుచ్చుతూ ఎనుబది నాలుగులక్షల, యోనుల వెడలితి (పుట్టుకలను పొందాను). కాని ఒక్క దానిలోనూ నిన్ను తలుచుకోనేలేదు. నాకు ఆ జన్మలలో అనేక ఆనిన భోగములు (నన్ను అణచివుంచే భోగములను) పొందాను. పో! ఇక కానము (ఒళ్ళుపై తెలుస్తుందా?) ఇకనేమి గడించేము? మరి మా ఉన్నతికి మేము ఏమి చేసికొన్నాము? ఏమీ లేదు.

సరే! ఆ విధముగా నాలుగు దిక్కులాగల పదునాల్గులోకాలలోనూ చొచ్చి వాటిల్లో కూడా జీవించి వుంటాను. ఈజన్మలవల్ల నాకు యే మేలు జరిగిందో, యేమేలు కలుగలేదో కూడా తెలియని ఆయోమయంలో వున్నాను. మరి యేమిటికి తిరిగేము (ఈ జన్మల వెంట దేనికోసం తిరిగామో అర్థము కావటం లేదు.)

ఓ దేవదేవా! ఈ భూమిపై పుట్టి కొన్ని పుణ్యములను చేశాను. కొన్ని పాపములను కూడా చేశాను. కర్మ అనుభవించక యెంతటి వారికైనా తప్పదు కాబట్టి నేను చేసిన కర్మల ఫలములను కూడా అనుభవించాను. ఇంతలో ఈ జన్మలోనూ అదృష్టం పండి తిరుమల దర్శించి శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించాను. ఆయన దయామయుడై నన్ను తగిలి యేలగా (శరణిచ్చి ఆదరించగా) ధన్యుడనైతి (దన్యతతో తరించాను).

**పద్యవివరణ:**

కం॥ **విడువము వీరిడి చేతలు**
**తడయక శ్రీహరిని మదిని తలచగరాదో**
**విడువక వేంకటపతియే**
**తడబడు నినుదరికి జేర్చి ధన్యునిజేయున్.**





సంఖ్య: I/107 రాగం : లలిత
కీర్తన : ఎక్కడి దురవస్థలేటి దేహములోన

**లలిత**

**63 ఎక్కడిదురవస్థ లేఁటిదేహము లోనఁ**
**జిక్కి జీవుఁడు మోక్షసిరిఁ జెందలేఁడు** ॥పల్లవి॥

**ఒడలు మాంసపూర మొక పూఁటయిన మీఁదు**
**గడుగకున్నఁ గొరగాదు**
**కదలేనిమలమూత్రగర్హిత మిది, లోను**
**గడుగరాదు యెంతగడిగినఁ బోదు** ॥ఎక్కడి॥

**అలర చిత్తము చూడ నతిచంచలము దీనఁ**
**గలసిన పెనుగాలి గనము**
**మెలుపులేనిచిచ్చు మీఁదమిక్కిలిఁ గొంత**
**నిలుపు లేదు పట్టి నిలుపఁగరాదు** ॥ఎక్కడి॥

**తిరువేంకటాచలాధిపుఁడు నిత్యానంద-**
**కరుఁడు జీవునకు రక్షకుఁడు**
**కరుణించి యొకవేళఁ గాచినఁగాని మేను-**
**చొరకమానెడుబుద్ధి చోఁక దెవ్వరికి** ॥ఎక్కడి॥

**ఉపోద్ఘాతము:**

భగవంతుడా! ఇదెక్కడి దురవస్థ? నాకు, ఎట్లాంటి దేహమిచ్చావయ్యా! దీంట్లో చిక్కివున్న జీవుడు ఎన్నటికీ మోక్షలక్ష్మిని పొందలేకున్నాడే!! అంటున్నారు అన్నమయ్య! ఏమిచూసికొని గర్వించాలి? ఒక్కదినము స్నానం చేయకపోతే కంపుకొట్టే ఒళ్ళు. ఏమాత్రం నిలకడలేని మనస్సు. మరి ఈ జీవుడి గతేమిటి? శ్రీవేంకటేశ్వరుడు కరుణిస్తేగాని వీడు నానా దేహాల్లోకి దూరకమానడు.

**తాత్పర్య వివరణ:**

అయ్యోయ్యో! యెక్కడి దురవస్థలు వచ్చిపడినవి? ఈ నాజీవుడు యేటిదేహములోన (యెటువంటి శరీరంలో) జిక్కె (చిక్కుకుపోయినాడు). ఈ దేహంలో వున్నంతకాలమూ వీడు మోక్షలక్ష్మిని పొందలేడు.

ఈ మానవుని ఒడలు (శరీరం) ఒక మాంసపూరము (మాంసపు రసికారే ముద్ద). ఏపూటకాపూట దీన్ని కడుక్కోకపోతే కంపు భరించలేము. ఈ దేహం బ్రతికున్నంతకాలమూ నీచమైన మలమూత్రాలను విసర్జిస్తూనే వుంటుంది. దీనిని యెంతని కడుగగలము? కడిగినా, గర్హించ దగిన (నిరసించదగిన) మలినం పోతుందా?

ఇక ఈ శరీరంలో అలరియున్న చిత్తము చూద్దామా అంటే... అది అతి చంచల స్వభావంకల పెనుగాలివంటిది. అది కనబడనే కనబడదు. ఏమాత్రమూ మెతక తనము లేని నిప్పు కణిక. పైగా మీదుమిక్కిలి (ఇది చాలదన్నట్లు దీనికి కొంచెం కూడా నిలకడలేదు. పోనీ కట్టేసి వుంచుదామంటే అది సాధ్యంకాదు. దీని వల్ల మనశ్శాంతి వుండటం లేదు.

ఒకటి మాత్రం పరమసత్యము. శ్రీ వేంకటేశ్వరుడొక్కడే నిత్యానందకరుడు. ఈ జీవునకు రక్షకుడు ఆయనే. ఆయన ఈ జీవునిపై కరుణవహించి ఒకవేళ కాచినగాని (రక్షిస్తేగాని) భ్రమకులోనై ఇంకొక జన్మకలిగితే బాగుండుననే బుద్ధి పోదు. చచ్చేటప్పుడు ఆ జన్మనే ఆశిస్తూ మళ్ళీ ఆ తొంపిలోనే పుట్టి చస్తుంటాడు.ఆ స్వామి కృపవుంటేనే... ముక్తి.

**పద్యవివరణ:**

ఆ.వె.‖ **హేయమైన ఒడలు, హీనమౌ చిత్తంబు**
**నిలుపులేదు పట్టి నిలుపలేము**
**ఇట్టి దేహమందు యిటుజిక్కె జీవుడు**
**ఇంక మోక్షమెట్లు వేంకటేశ!**





సంఖ్య: I/199 రాగం : భైరవి

కీర్తన : సడిబెట్టెగటకటా సంసారము

**భైరవి**

**64 సడిఁబెట్టెఁ గటకటా సంసారము! చూడ-**
**జడధిలోపలియీఁత సంసారము** ‖పల్లవి‖

**జమునోరిలో బ్రదుకు సంసారము! చూడ**
**చమురుదీసినదివ్వె సంసారము**
**సమయించుఁబెనుదెవులు సంసారము చూడ**
**సమరంబులో నునికి సంసారము** ‖సడి‖

**సందిగట్టినతాడు సంసారము చూడ**
**సందికంతలతోవ సంసారము**
**చందురునిజీవనము సంసారము చూడ**
**చంద మేవలెనుండు సంసారము.** ‖సడి‖

**చలువలోపలివేఁడి సంసారము చూడ**
**జలపూఁతబంగారు సంసారము**
**యిలలోనఁ దిరువేంకటేశ నీదాసులకు**
**చలువలకుఁ గడుఁజలువ సంసారము** ‖సడి‖

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తనలో క్లిష్టమైన ఈ సంసారంయొక్క అవగుణాలను వర్ణిస్తున్నారు అన్నమయ్య. రకరకాల పోలికలతో ఈ సంసారము యెంత హేయమైనదో

వివరిస్తున్నారు. యముడి నోట్లో బ్రతుకుటయేనట ఈ సంసారము. ఆయన యెప్పుడుగుటుక్కుమని మింగుతాడో యెవరికి తెలుసు? సందికంతల తోవట యీ సంసారము. ఇరుకు సందుల్లోంచి కంతలలోంచి పోక తప్పదు మరి. అయ్యయ్యో! ఈ పాడు సంసారం వూదరగొడుతున్నదే అని వాపోతూ ఓ వేంకటేశ్వరా! నీదాసులకి మాత్ర ఇది చలువలకు చలువ ఈ సంసారం అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

కటకటా! (అయ్యయ్యో!) పాడు సంసారము సడిబెట్టెనే (యెన్ని నిందల పాలు చేసింది!!) చూడబోతే యీ సంసారమంటేనే జడధిలోపలి (సముద్రంలో) ఈత మాదిరిగా అతి క్లిష్టంగా వున్నదే!!

ఈ సంసారమున్నదే ఇది అనుక్షణం మృత్యువును ఒడిలోపెట్టుకోవటం మాదిరే. యముడి నోట్లో బ్రతుకు గడుపుట లాంటిది. ఇది నూనె కారిపోయిన దివ్వె లాంటిది. సమయించు (ఇబ్బందిపెట్టే) వెనుదెవులు (పెద్ద రోగము) వంటిది ఈ సంసారం. ఎప్పటికీ తగ్గేదికాదు? ఇది యుద్ధభూమిలో మనుగడవంటిది. ఎప్పుడు చావు వస్తుందో యెవ్వడూ చెప్పలేడు.

ఈ సంసారమున్నదే, ఇది సందిగట్టిన తాడు (రెండు పడవల మధ్య త్రాటితో కట్టి ఒక పడవనే నడుపుతారు. ఆ త్రాడును సంధిగట్టిన త్రాడు అంటారు. అదెప్పుడు తెగిపోతుందో యెవరికి తెలుసు?) ఈ సంసారం ఇరుకు గొందుల్లోంచి దూరడంలాంటిది. ఈ సంసారము చంద్రుని జీవితం లాంటిది పెరుగుతుంది తరుగుతుంది. దీని చందము (పద్ధతి) యెలావుంటుందో యెవ్వడూ చెప్పలేడు.





ఈ సంసారమనేది వున్నదే, అది చలువలోపలి వేడి (శీతాకాలము యెండవలె, సుఖంగా వున్న ప్రాణాన్ని తపింపజేస్తుంది). ఇది చూడబోతే బంగారు జలపూత (బంగారపు పూత మాత్రమే. లోపలి లోహము రాగి మాత్రమే). అయినా, ఓ శ్రీవేంకటేశ్వరా! నీ దాసులకు మాత్రం యే ఇబ్బందీ వుండదు. వారికి ఈ సంసారము, చలికాలంలో చలిలాగా చల్లగా హాయిగా వుంటుంది.

**పద్యవివరణ:**

సీ.॥ **యమునిజేతికి జిక్కి యల్లాడు బ్రతుకురా**
**చమురు దీసినదివ్వె ఏమిటికిని?**

**సమయించు దెవులు యీ సంసారమను పీడ**
**సమరంబునను దక్కు చావుకాదె?**

**సందిగట్టినతాడు సందికంతలతోవ**
**పెరుగు తరుగులున్న వెన్నెలయ్య.**

**జలపూత బంగారు చలువలోపలివేడి**
**ఏమి సంసారంబు యేడమేలు?**

ఆ.వె.॥ **సడిని బెట్టి నట్టి సంసారమైనను**
**జలధి ఈతవోలె కలతయైన**
**చలువనుందురయ్య! యిల నీదు దాసులు**
**వెరపుమాట లేక వేంకటేశ!**

సంఖ్య: I/202 రాగం : శ్రీరాగం
కీర్తన : వెన్నవట్టుకనేయి వెదకనేలా మరియు

## శ్రీరాగం

**65 వెన్న వట్టుక నేయి వెదకనేలా మరియు-**
**నెన్నివలసినను దమ(యెదిటివే) కావా ॥పల్లవి॥**

**తలఁపునకు విష్ణుచింతన నిమిషమాత్రంబు**
**కలుగుటే కలుగవలెఁగాక**
**వలనైనభోగములు వైభవంబులు మరియు**
**కలవెల్ల తమయెదుటఁ గలిగినవె కావా ॥వెన్న॥**

**పదిలముగ హరినామపఠన మంత్రము నోరు**
**కదియుటే కలుగవలెఁగాక**
**తుదలేనిసంపదలు తొలగనిముదంబులును**
**కదల కెప్పుడుఁ దమకుఁ గలిగినవె కావా ॥వెన్న॥**

**యించుకైనను వేంకటేశుగిరిశిఖరంబు**
**కాంచుటే కలుగవలెఁగాక**
**అంచితంబైననిత్యానందపదవులును**
**మించి తమయెదుటఁ బ్రభవించినవె కావా ॥వెన్న॥**

**ఉపోద్ఘాతము:**

నీ చేతిలో వెన్నవుండగా, నెయ్యి యెక్కడ దొరుకుతుందని వెదకుట యెంత తెలివితక్కువపని? ఆ శ్రీహరి యెన్నికావాలంటే అన్ని తమయెదుటనే వున్నాయి అని మనకిచ్చాడు కాదా! అంటున్నారు అన్నమయ్య. విష్ణుచింతన కలవారికి యే వైభోగమైనా నిమిషంలో సమకూడుతుంది. పైగా అవి వారి యెదుటకే వస్తాయి. మరి ఇంకా





వెంపర్లాటదేనికండీ? నిత్యానంద పదవులన్నీ వేంకటేశుని దాసుల స్వంతం. అది వారి యెదుటనే ప్రభవిస్తుంది అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ మానవులారా! చేతిలో వెన్నునుపట్టుకొని వున్నవారు నెయ్యి యెక్కడ దొరుకుతుందా, అని వెదకితే యెంత హాస్యాస్పదంగా వుంటుంది? ఎన్ని వలసినను (మనకు యేమికావాలంటే దానిని) తమ "యెదిటివే" అన్నట్లు శ్రీహరి మనకిచ్చాడు కాదా?

తలపున (మనస్సున) విష్ణుచింతన నిమిషమాత్రము చేసే యోచన కలుగుట అనేది కలుగవలెను. మరుక్షణం కావలసిన భోగములు, వైభవములు మరియు యెన్ని కావాలంటే అన్ని సిరులు తమ యెదుటనే వున్నట్లు కావా?

పదిలముగా (భద్రముగా) శ్రీహరి నామమంత్రము నోర (నోటిలో) కదియుటే (చేరుటే) సంభవించవలెగాక! ఆపైన తుదలేని సంపదలు (అంతులేని సంపద) యెన్నడూ విడిపోని ముదంబులు (సంతోషములు) కదలకుండానే మనంవున్న చోటికే వచ్చి యెప్పుడూ స్వంతం అయిపోవా? ఇందులో సందేహమేముంది?

ఇంచుకైనను (కొద్దిగానైనా) శ్రీవేంకటాద్రి శిఖరదర్శనం కాంచుటే (కన్నులకు సోకితే) కలుగువలెగాక! మీ అదృష్టం పండితీరుతుంది. అంచితంబైన (పూజింపదగిన) నిత్యానందానుభవము కలిగించు దివ్యపదవులను మించిన పదవులు తమ యెదుటనే ప్రత్యక్షమై మీ స్వంతం అయిపోవా? శ్రీవేంకటేశ్వరుడు తలచుకొంటే మీకు యేది ఇవ్వలేడు చెప్పండి.

**పద్యవివరణ:**

చం.॥ **వెదకుటదేటికిన్ జనులు వెన్నలు వట్టుక నేతికోసమై**
**యెదుటనువున్నవే యగును యేయదికావలెనన్న నిత్యమున్**
**పదిలముగా తలంచిహరి బాడిన మంత్రము నోరు పండదో?**
**వదలక వైభవమ్ములును పాయక దక్కును వేంకటేశ్వరా!**

సంఖ్య: I/116 రాగం : శుద్ధవసంతం
కీర్తన : ఘనుడీతడొకడు కలుగగ గదా వేదములు

## శుద్ధవసంతం

**66 ఘనుఁ డీఁతఁడొకఁడు గలుగఁగఁగదా వేదములు**
**జననములుఁ గులము లాచారములుఁ గలిగె ॥పల్లవి॥**

**కలుషభంజనుఁ డితఁడు గలుగఁగఁగదా జగతిఁ**
**గలిగె నిందరిజన్మగతులనెలవు**
**మలసి యితఁడొకఁడు వొడమఁగఁగదా యిందరికి**
**నిలువ నీడలు గలిగె నిధినిధానములై ॥ఘనుడీ॥**

**కమలాక్షుఁ డితఁడు గలుగఁగఁగదా దేవతలు**
**గుమిగూడి రిందరును గండిగడచి**
**ప్రమదమున నితఁడు నిలుపఁగఁగదా సస్యములు**
**అమర ఫలియించె లోకానందమగుచు ॥ఘనుడీ॥**

**గరిమె వేంకటవిభుఁడొకఁడు గలుగఁగఁగదా**
**ధరయు నభమును రసాతలము గలిగె**
**పరమాత్ముఁడితఁడు లోపల గలుగఁగాఁగదా**
**అరిది చవులును హితవు లన్నియునుఁ గలిగె. ॥ఘనుడీ॥**

**ఉపోద్ఘాతము:**
ఘటనాఘటన సమర్థుడు, ఘనుడు ఈ పరమాత్ముడు శ్రీవేంకటేశ్వరుడు కలుగుట చేతనే ఈ సృష్టిలో వేదములు, జననములు, కులాచారంబులు, జన్మలు, నిధినిధానములు, దేవతలు, రాక్షసులు, పదునాలుగులోకములు కలిగినవి అంటున్నారు అన్నమయ్య. లొట్టలేసుకొంటూ మనం తిండి తింటున్నామంటే రసోత్పత్తి కలిగిస్తున్నదీతడే కదా! మరి ఇతనిని, విడువవచ్చునా?





**తాత్పర్య వివరణ:**

ఘనుడైన ఈ శ్రీహరి యొక్కడు కలుగుట చేతనే కదా! ఈ సృష్టిలో వేదములు, నరుల పుట్టుకలు, వారి కులములు, వారి ఆచారములునూ యేర్పడినవి.

ఇతడు కలుషభంజనుడు (పాప నిర్మూలకుడు). ఎవరిపాపం, యెంత నిర్మూలిస్తాడో తెలియదు. ఆ మిగిలిన పాపపుణ్యాలవల్లనే ఉత్తమ, అధమ జన్మలు కలుగుతున్నాయి. ఈ దేవదేవుడు, మలసి (ఉద్యమించి) నిశ్చయించబట్టే ఈ జీవులన్నిటికీ నిలువ నీడ దొరికింది. వాటి జీవనమున, నిధినిధానము వంటివాడు ఈ పరమాత్ముడే.

కమలాక్షుడైన ఈ దేవదేవుని కృపవలననే దేవతలు అనేకమార్లు గండిగడచి (కష్టాల రంధ్రంలోంచి బయటపడి) రక్షించబడ్డారు. ప్రపంచంలో, ప్రమదములు (సంతోషములు) ఇతడు నిలుపుతుంటే లభిస్తున్నాయి. సస్యములు (పంటలు) యితని వల్ల కలిగి లోకులు తిండి తినగలుగుతున్నారు. అందువలననే వారి ఆనందము ఫలించి సుఖంగా వున్నారు.

గరిమె (మహిమాన్వితుడైన) శ్రీవేంకటేశ్వరుడు వుండబట్టే, ఈ భూమి, ఆకాశము, పాతాళాదిలోకములు కలిగినవి. పరమాత్ముడైన ఈ స్వామి జీవులపైన అమితదయగలవాడై వాటికి అనేకమైన, చవులు (రుచులు) హితవులు (మేళ్ళు) కల్పిస్తుంటాడు. ఈ జీవుల జీవిక బహు రుచికరంగా వుండటానికి ఈ స్వామియే కారణం.

**పద్యవివరణ:**

కం.॥ **ధరయు నభము పాతాళము**
**అరయగ జననములు, కులము లాచారంబుల్**
**సురలు నసురలును శృతులును**
**పరమాత్ముడు వీనివల్ల ప్రాప్తించె జుమీ!!**

సంఖ్య: I/201 రాగం : దేవగాంధారి
కీర్తన : ఎందరివెంటనెట్లు దిరుగవచ్చు

## దేవగాంధారి

67 ఎందరివెంట నెట్లఁ దిరుగవచ్చు
కందువెఱిఁగి చీఁకటిదవ్వుకొనుఁగాక ॥పల్లవి॥

తల రాయిగాఁగ నెందరికి మొక్కెడిని
తెలివిమాలినయట్టిదేహి
కొలఁదిమీరినదేవకోట్లు ధనలోన
కలవాని నొక్కనిచే కొలుచుఁగాక ॥ఎందరి॥

కాలీచపడఁగ నెక్కడికి నేఁగెడిని
పాలుమాలినయట్టిప్రాణి
మేలిమిజగములు మేనిలోఁ గలవాఁడు
పాలిటివాఁడై ప్రణుతికెక్కుఁగాక ॥ఎందరి॥

నూరేండ్ల నెందరి నుతియింపఁగలవాఁడు
చేరఁదావులేనిజీవి
శ్రీరమణీశుఁడు శ్రీవేంకటేశుని
కోరికెఁ దలఁచి నుతి కొల్లగొనుటగాక ॥ఎందరి॥

**ఉపోద్ఘాతము:**

మానవుడు అనేక భ్రమలతో ఎందరివెంట నెట్లా తిరిగినప్పటికీ అతనికి చివరికి మిగిలేది అజ్ఞానాంధకారమే. తలబండబారునట్లు యెంతమందికి మొక్కినా యేమి ప్రయోజనం తనలోనే పరమాత్మ వున్నాడని వీడికి తట్టడం లేదే? ఈ జీవి నూరేండ్లు యెందరిని స్తోత్రించినా



హరి నీమయమే అంతాను

వుపయోగమేమి? వీడు ఒక్కసారికూడా శ్రీవేంకటేశుని కోరిక దీరా కొలిచి నుతించడే!! అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ మానవుడా! నీవు యెందరివెంట (యెంతమంది వెంటపడి) యెట్లా తిరగవచ్చు (తిరగగలవు?) కందువెరిగి (నీ సామర్థ్యం తెలిసి) మసలుకోకపోతే నీకు చివరికి మిగిలేది అజ్ఞానాంధకారమే.

నీ తలబండ బారేటట్లు యెంతమందికి మ్రొక్కుతావు? ఓ తెలివితక్కువ దేహీ! ఈ కోట్లకొలది దేవతలు తన ఆత్మలోనే వున్నా వానిని ఒక్కని కొలిచిన చాలదా? ఇంతమంది దేవతలను పేరుపేరునా కొలుచుట యెంత తెలివితక్కువతనం?

కాలసర్పం పడగలమీదెక్కి పయనిస్తూ యెంత దూరం పోగలవు? ఉచ్చమూ నీచమూ లేని ప్రాణి అంతకంటే హితమేమి చేయగలదు? పదునాల్గు భువనాలూ తన మేనిలోనే కలవాడు తనవాడై ప్రయోజనం కలిగిస్తే చాలదా? ఇంకా యేమి కావాలి?

ఈ జీవి నూరేండ్లు బ్రతికి యెందరిని నుతించినా వాడికి చచ్చాక చేరటానికి తావే వుండదు. వాడు అలా ఆత్మరూపంలో పరుగులు పెడుతూనే వుంటాడు. శ్రీవనితావల్లభుడైన శ్రీవేంకటేశ్వరుని కోరిక దీరా తలచి నుతించిన ఆ కోరికలన్నీ కొల్లగొట్టబడతాయి కదా!

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **ఎంతమంది వెంట నెట్ల తిరుగవచ్చు**
**చీకటొకటె మిగులు చింతపోదు**
**వేంకటేశుడుండ వేల్పులన్యులు యేల?**
**కోర్కెలన్ని దీరు కొల్లగాను.**

సంఖ్య: I/203 రాగం : భైరవి
కీర్తన : పసలేని యీబ్రదుకు

**భైరవి**

**68** **పసలేని యీబ్రదుకు**
**అసలు చొచ్చిచొచ్చి అలసినట్టాయె** ॥పల్లవి॥

**తొల్లిటిజన్మాదులఁ గానినరరూపు**
**పల్లించుకొన్న యీబ్రదుకు**
**కల్లసుఖములచే కనలి కమ్మర**
**ముల్లుదీసి కొఱ్ఱు మొత్తినట్టాయ** ॥పస॥

**బూటకములనెల్లఁ బొరలి సంసారంపు-**
**పాటుదెచ్చినయీబ్రదుకు**
**నీటుగ నెద్దు దన్నీనని గుఱ్ఱము-**
**చాటు కేఁగినయట్టిచందమాయె** ॥పస॥

**పగగొన్న పొగ కోపక మంటఁ బడిపడి**
**పగలు రేలైనయీబ్రదుకు**
**తగువేంకటేశ్వరుఁ దలఁచి నేలనుండి**
**యెగసి మేడమీఁది కేఁగినట్లాయె** ॥పస॥

**ఉపోద్ఘాతము:**

"అసలు" అంటే మూలధనము. మన అకౌంటెన్సీలో ప్రిన్సిపుల్ అన్నమాట. "అసలు" అంటే బురద అని కూడా అర్థము వున్నది. ఈ రెండవ అర్థంలో కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఈ జీవితంలో యేమాత్రమూ పసలేదు. ఎంతకాలం బ్రతికినా ఒకే తీరున నిస్సారంగావున్నది. చివరికి యేమి వుపయోగం కలిగింది? ఏమీలేదు. బురదలో పడి దొర్లి దొర్లీ వూరకనే అలిసిపోయినట్లయింది అంటున్నారు.





ఈ శ్రీవేంకటేశ్వరుడి కృపవల్ల నాకు కూడా మేలు జరిగి నేలపై వుండవలసినవాడు మేడ యెక్కినట్లయింది అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ మానవులారా! ఏమాత్రమూ పసలేని (సారములేని) ఈ బ్రతుకుయెంత నిరుపయోగమైనది!! దీనివలన నాకేమి ఒరిగింది? అసలు (బురదలో) చొచ్చీ చొచ్చీ (దూరీదూరీ) అమితంగా అలసిపోయినట్లయింది.

తొల్లింట నరజన్మలలో మనిషిరూపము దక్కించుకొన్న నేను ఈ బ్రతుకున సాధించేదేమిటి? కల్ల సుఖములచే (నిజముకాని సుఖములతో) కనలి (పీడింపబడి) క్రమ్మర (స్వార్థం) లో నలిగి నా బ్రతుకేమైనదో తెలుసా? గుచ్చుకొనిన ముల్లును తీసివేసి దాని స్థానంలో మేకును గుచ్చుకొన్నట్లయింది.

ఛీఛీ! ఈ బ్రతుకంతా బూటకమే. ఈ సంసారంలో పొరలితే ఇది నాకు యెన్నో పాట్లు (తిప్పలు) తెచ్చిపెట్టింది. మొరటుగా వున్న ఆ యెద్దు తన్నిందని ఈ గుఱ్ఱము నీటుగా వుంది ఇదే నయము అనుకొని గుఱ్ఱమెక్కినవాడి గతియే నాకూ పట్టింది. దాని వేగము నేను తట్టుకోగలనా? నన్ను క్రిందపడవేసి ఈడ్చుకెళ్ళింది ఆ ఆశల గుఱ్ఱము.

పగతో రగిలిపోతూ ఆతాపానికి ఆగలేక మంటలలో మాడిపోయిన ఈ బ్రతుకున పగలూ రేయీ అనే ధ్యాస లేక పగలూ సెగలూ అంటూ గడిచిపోయింది. చివరికి ఆ శ్రీవేంకటేశ్వరునికే ఈ జీవిపై జాలి కలిగి జ్ఞానోదయం కలిగించాడు. ఆయననే ధ్యానించి నేలపైన నుండవలసిన నేను దివ్యసౌధాగ్రముల తిరిగినట్లయినది.

**పద్యవివరణ:**

కం.॥ **పసలేని దయిన బ్రతుకున**
**అసలునబడి చొచ్చి చొచ్చి అలసితిని హరీ!**
**వెస సప్తశిఖరనాయక!**
**కొసకెక్కితి మేడపైకి కొలుచుచు నిన్నే.**

సంఖ్య: I/61 రాగం : శంకరాభరణం
కీర్తన : పదిలము కోట పగవారు

**శంకరాభరణం**

**69 పదిలము కోట పగవారు**
**అదనఁ గాచుకొందు రాఱుగురు** ॥పల్లవి॥

**ఇమ్మైఁ జెప్ప యిందరిచేత**
**తొమ్మిదినెల్లఁ దోఁగినది**
**కొమ్మతీరునఁ గుదురైనకోట**
**దొమ్మికాండ్లైదుగు రుందురు** ॥పది॥

**వొంటికాఁడు రాజు వుడుగక తమలోన**
**వొంటనీనిమంత్రు లొకయిద్దరు**
**దంటతనంబునఁ దమయిచ్చఁ దిరిగాడు-**
**బంటు లేడుగురు బలవంతులు** ॥పది॥

**కలవు తొమ్మిది కనుమల తంత్రము**
**నిలుపఁగలిగినట్టినెరవాదులు**
**తెలిసి కొనేటితిమ్మినాయఁడు చొచ్చె**
**బలిసె యీకోట భయమేల** ॥పది॥

**ఉపోద్ఘాతము:**

ఈ అధ్యాత్మ కీర్తనలో అన్నమయ్య మానవదేహాన్ని రాజుగారి కోటతో పోల్చి అందులోని జీవాత్ముడు రాజు అంటున్నారు. ఆ కోటను కొల్లగొట్టటానికి అనేకమంది పగవారు ప్రయత్నిస్తుంటారు. ఆరుగురు దుర్మార్గులు సమయం యెప్పుడొస్తుందా, యెప్పుడీకోటను ఆక్రమిద్దామా అని యెదురుచూస్తున్నారట. ఈ కీర్తనంతా ఇలాగే సాగుతుంది. తాత్త్విక చింతన కవితాహృదయం లేనిదే ఇటువంటి కీర్తన చెప్పలేరు. కోనేటి తిమ్మినాయుడంటే శ్రీవేంకటేశ్వరుడు. ఆయనే స్వయంగా ఆక్రమించి ఈ కోటను బలిష్టం చేశాడు భయమేల





అటున్నారు. అక్కడక్కడా ఈ రచయిత పప్పులో కాలేస్తే నవ్వుకొని క్షమించేయండి మరి.

**తాత్పర్య వివరణ:**

మానవదేహము అనే ఈ 'కోట' పదిలమైనదే (రక్షణ కలిగినదే). సందేహం లేదు కాని దీనికి పగవారు (శత్రువులు కూడా) అదన (తగిన సమయం కోసం) కాచుకొందురు (వేచివుంటారు). వాళ్ళెంతమందో తెలుసా ఆఱుగురు (వారినే కామ, క్రోధ, మోహ, లోభ, మద, మత్సరాలని పిలుస్తాము).

ఇమ్మైజెప్ప (ఇంపుగా చెప్పవలెనంటే) ఇది (ఈ కోట) ఇదివరలో తొమ్మిది నెలలపాటు యెంతమందితో నిర్మించబడినదో చెప్పలేము. (దీన్ని యెందరు తల్లులు తొమ్మిది నెలలు మోసి ప్రసవించారో?) ఈ కోటకు కొమ్మతీరున (చక్కటి శిఖరముతో) కుదురైవున్నది. ఈ కోటను ఆక్రమించటానికి ఐదుగురు దొమ్మికాండ్లు (బందిపోటు దొంగలు) సిద్ధంగా వున్నారు (వారే పంచేంద్రియములని పిలువబడే కన్ను, ముక్కు, చెవి, నాలుక మరియు చర్మము.

ఈ కోటలో పాపం, రాజుగారు నిజానికి ఒంటరివాడే (ఆతనిపేరు ఆత్మ). కానీ ఆయనను ఒంటరిగా వుండనీయక ఇద్దరు మంత్రులు యెప్పుడూ మంతనాలు చేస్తూనే వుంటారు. వారే మనస్సు, బుద్ధి. వీరి అండతో, దంటతనంబున (ధైర్యముతో) ఏడుగురు సైనికులు బలవంతులై తిరుగాడుతున్నారు (ఏడు ఇంద్రియములు వారే).

పోనీ ఈ కోట గట్టిదా అంటే అదీకాదు. దీనికి తొమ్మిది కంతలు వున్నాయి (నవరంధ్రాలు). మధ్యమధ్యలో తంత్రులు (నరాలున్నాయి). వీరంతా ఈ కోటను నిలుపగల నెరవాదులు (నేర్పరులు). ఇంతటితో ఈ కోట భద్రమనుకొంటే అది పెద్ద తప్పు. దీని అసలు రక్షకుడు కోనేటి తిమ్మనాయుడు (శ్రీవేంకటేశుడు). బలిసివున్న ఈ కోట గురించి ఇక భయమేల?

**పద్యవివరణ:**

కం.॥ **పగవారు! కోట పదిలము**
**వొగి ఆర్గురు కాచుకొనిరి వొదలక యెపుడున్**
**వగవక కొండల తిమ్మని**
**తెగకొల్వుడు భయముబాపి తీర్చును కోటన్.**

సంఖ్య: I/233 రాగం : మఖారి
కీర్తన : ఎవ్వరికైనను ఈవ్రాత । నను

**మఖారి**

**70 ఎవ్వరికైనను యీవ్రాఁత । నను**
**నవ్వులు నేసెఁబో నావ్రాఁత ॥పల్లవి॥**

**తొలిజన్మంబున దోషకారియై**
**నలుగడఁ దిప్పెను నావ్రాఁత**
**యిల దుర్గుణముల కీజన్మంబున-**
**నలఁకువ సేసెఁబో నావ్రాఁత ॥ఎవ్వ॥**

**పరుషునిఁ జే శల్పుని ననిపించుట**
**నరజన్మమునకు నావ్రాఁత**
**తరుచయ్యినపాతక మరుపెట్టుక**
**నరకము చూపెఁబో నావ్రాఁత ॥ఎవ్వ॥**

**పామఱితనమున బహువేదనలను**
**నామన సెనసెఁబో నావ్రాఁత**
**కామితఫలు వేంకటపతినిఁ గొలిచి**
**నామతి దెలిపెఁబో నావ్రాఁత ॥ఎవ్వ॥**

**ఉపోద్ఘాతము:**

విధివ్రాత అని పెద్దలంటుంటారే అది యెవ్వరికైనను తప్పింప నసాధ్యము నేను ఈనాడు నలుగురిలో నవ్వులపాలయ్యానంటే అది నా 'వ్రాత' వల్లనే కదా! అంటున్నారు అన్నమయ్య. దాన్నే విధివ్రాత అంటారు. అది పూర్వజన్మల దోషాలను కూడా వదలక ఈ జన్మలో దేశద్రిమ్మరిని చేసి, అనేక దుర్గుణాలు అంటగట్టి యెంత ఏడిపించాలో అంత యేడిపిస్తుంది. వీడెంత అల్పుడైన పురుషుడురా అని గేలిపాలయేట్లు చేస్తుంది. పండితుడినైనా పామరుని కంటే





అధముని చేస్తుంది. నా నుదిటివ్రాత. ఒక్క వేంకటపతిని నిత్యమూ కొలిచిన హరిదాసుని మాత్రం ఈ'వ్రాత' యేమీ చేయలేదు.

**తాత్పర్య వివరణ:**

ఎవ్వరికైననూ ఈ వ్రాత (విధివ్రాత) యెదురులేనిదే. నావ్రాత (నా నుదుట ఆ విధి వ్రాసిన వ్రాత) నన్ను నవ్వులపాలు, సేసెబో (చేసేసింది పోండి.) అందుకే ఇన్ని అవమానాలను పొందుతున్నాను.

నా నుదుటివ్రాత నా తొలిజన్మంబులలోని దోషముల నన్నింటిని నావెంటనే తీసికొనిపోయి, నలుగడల దిప్పెను (నలుదిక్కులా తిరిగే దేశద్రిమ్మరిని చేసింది.) ఈ జన్మలో నాకు ఇన్ని దుర్గుణాలు వున్నాయంటే మరి వేరే కారణం యేముంది? నేను యెందుకింత "అలకువ" (ఆయాసము) పొందుతున్నాను? నన్నిట్లా చేసింది నావ్రాతయే కదా!

నేను నరజన్మనెత్తిన పిదప నావ్రాత తప్పింపలేక పురుషుడననే మర్యాదను పోగొట్టుకొని అందరి చేత వీడు "అల్పుడు" అనిపించి తల యెత్తుకోకుండా చేసినది నా వ్రాత. తరచుగా నేను చేసే పాతకములను, అఱుపెట్టుక (దక్కించుకొంటూనే) నానుదుటివ్రాత నాకు నరకమును ఈ భూమిమీదే చూపింది.

నా నుదిటివ్రాత వలన పామరితనమున (నిరుపయోగి, అయోగ్యుడు అయిన పామరుని వలె) అనేక వేదనలను అనుభవించాను. తత్త్వజ్ఞానం మఱచిపోయాను. ఇంతలో నానుదుటి వ్రాతలో మార్పువచ్చి కామితఫలదాత (కోరిన కోర్కెల ఫలము కలిగించు) శ్రీవేంకటేశ్వరుని కొలిచితిని. నావ్రాతే నామతిని తెలిపి ఆస్వామి దాసుని చేసినది.

**పద్యవివరణ:**

ఉ.॥ **ఎవ్వరికైన"వ్రాత" యిది హేయపురీతుల గేలి క్రుందగన్**
**నవ్వులపాలుచేసి సిరినాశము జేయును మాన్పసాధ్యమా?**
**అవ్వల పూర్వజన్మముల అంటిన దోషము చేయు ద్రిమ్మరిన్**
**రవ్వగు వేంకటేశ్వరుడె 'రావలదే' యని 'వ్రాత' నాపురా.**

సంఖ్య: I/219 రాగం : ఆహిరి
కీర్తన : హరినెఱగనిపుణ్య మంటేరుగాన

**ఆహిరి**

**71 హరినెఱఁగనిపుణ్య మంటేరుగాన**
**దురితాలే దురితాలే దురితాలే సుండీ** ॥పల్లవి॥

**దొడ్డపుణ్యములు సేసి తుదలేనిసంపదలు**
**అడ్డగించుకొని రాసులగుగురుతు**
**జడ్డులేనిహరికథ చవిలేకుండిన నిట్టే**
**గొడ్డేరే గొడ్డేరే గొడ్డేరే సుండీ** ॥హరి॥

**వలెనని మేలెల్ల వడిఁజేసి కైవల్య-**
**మలమి చేతికిలోననగు గురుతు**
**తలఁపు వైష్ణవభక్తిఁ దగులకుండిన నంతా**
**అలయికే అలయికే అలయికే సుండీ** ॥హరి॥

**తిరమైన తీర్థాలు దిరిగి యందరిలోన**
**ధరఁ బుణ్యుఁడవుట యంతకు గురుతు**
**తిరువేంకటపతిఁ దెలియకుండిన నంతా**
**విరసాలే విరసాలే విరసాలే సుండీ** ॥హరి॥ **219**

**ఉపోద్ఘాతము:**

ఈ కీర్తనలో అన్నమయ్య హరినెఱగనివారు యెన్ని పుణ్యకార్యాలు చేసినా నిరుపయోగమేనంటున్నారు. వారు చేసిన పుణ్యకార్యాలు పాపాలేనని నొక్కి వక్కాణిస్తున్నారు. తొలి జన్మపుణ్యమువలన ఈ జన్మలో కోటీశ్వరుడై పోతాడు. కానీ అదే గురుతు. హరి కథామృతమున రుచి లేకపోతే వాడి జీవితం గొడ్డేరే అంటున్నారు అంటే నీళ్ళు యెండిపోయిన 'ఏరు' అన్నమాట. విష్ణుభక్తిలేని వైష్ణవుని జీవితం అలయిక మాత్రమే, అంతే వృత్త శ్రమ మాత్రమే అంటున్నారు. కీర్తన అంతా చదివితే అన్నమయ్య అద్భుత మేధస్సుకు అబ్బురపడతారు.





**తాత్పర్య వివరణ:**

ఓ భక్తులారా! హరినెఱగని పుణ్యము (హరివిరహితమైన పుణ్యకార్యాలను) అంటేరు గాన (ముట్టుకోరుకదా!) ఎందుకంటే అట్టి పుణ్యకార్యాలన్నీ దురితాలే, దురితాలే, దురితాలే (పాపాలే, పాపాలే, పాపాలే) సుండీ! (సుమా!)

మీ తొలిజన్మలలో మీరు దొడ్డపుణ్యము (అధికమైన పుణ్యము) చేసినట్లు గుర్తు యేమిటో మీకు తెలుసా? ఎన్నడూ అడ్డగించబడని రాసుల కొలదీ దనము సంపద వాడిని చేరుతుంది. అదే కొండ గురుతు. కానీ యెంత ఐశ్వర్యమున్నా జడ్డులేని (ఇష్టాగోష్టులులేని) హరికథాశ్రవణము నందు, చవిలేక (రుచిలేకపోతే) ఆ హరికథంతా, గొడ్డేరే గొడ్డేరే, గొడ్డేరే సుండీ (అంటే యెండిపోయిన ఏరువలె వ్యర్ధమైనది సుమా!)

వలెనని (పూనుకొని) తోటిజీవులకు అంతులేని మేళ్ళను వడిజేసి (శీఘ్రముగా చేసిన) ఏదో ఒకనాడు కైవల్యము అరచేతికి చిక్కుతుంది. అదే (ఆ మోక్షప్రాప్తే) చక్కటి గురుతు. కానీ తలపులో నిరంతరం విష్ణువు లేని పైపై విష్ణుభక్తి దగిలి భజనలతో కాలం వెళ్ళబుచ్చితే, అంతా అలయికే అలయికే అలయికే సుండీ (శ్రమయే శ్రమయే శ్రమయే సుమా!)

అందరిలోనా అతి పుణ్యుని గుర్తించుట యెట్లు? ఆతడు ధరలో (ఈ భూలోకంలో) తిరమైన (ప్రసిద్ధమైన) తీర్ధయాత్రలు చేస్తూ అందరికంటే యెక్కువ పుణ్యం సాధిస్తాడు. అదే గురుతు. తిరువేంకటేశ్వరుని తెలియకుండిన వాడికింకేమి తెలిసినా, అంతా విరసాలే విరసాలే విరసాలే సుండీ (రసహీనమైనవే సుమా!)

**పద్యవివరణ:**

కం.॥ **హరినెఱిగిన గురుతేమిటి?**
**నరుడేధరపుణ్యుడగుట నయముగ సుండీ!**
**తిరువేంకటేశు దెలియక**
**విరసాలే విరివియైన విరసాలె కదా!**

సంఖ్య: IV/496 రాగం : గుజ్జరి
కీర్తన : కొండవంటి దేవుడు నే గొలిచే దేవుడు

## గుజ్జరి

**72 కొండవంటి దేవుఁడు నేఁ గొలిచే దేవుఁడు వీఁడే**
**నిండుకున్నాఁడు తలఁచు నెమ్మదినోమనసా ॥పల్లవి॥**

**నన్నుఁ బుట్టించే దేవుఁడు నాలోనున్నాఁడు దేవుఁడు**
**కన్నచోటులనే వుండే కాచే దేవుఁడు**
**వెన్నతోఁబెంచే దేవుఁడు వివేకమిచ్చే దేవుఁడు**
**యెన్నెని పొగడవచ్చు యీతఁడే మా దేవుఁడు ॥కొండ॥**

**సిరులిచ్చిన దేవుఁడు సేవగొనేటి దేవుఁడు**
**గురుఁడై బోధించి చేకొన్న దేవుఁడు**
**మరిగించిన దేవుఁడు మాటలాడించే దేవుఁడు**
**ఇరవై మాయింటనున్నాఁ డీదేవుఁడు ॥కొండ॥**

**దాపుదండైన దేవుఁడు దరిచేర్చిన దేవుఁడు**
**రూపు చూపె నిదివో బోరున దేవుఁడు**
**శ్రీపతియైన దేవుఏఁడు శ్రీవేంకటాద్రి దేవుఁడు**
**చేపట్టి మమ్మేలినాఁడు చేచేతనే దేవుఁడు ॥కొండ॥ 496**

**ఉపోద్ఘాతము:**

కొండలలో వెలసిన కొండవంటి సమున్నతుడైన దేవుడు ఈ శ్రీవేంకటేశ్వరుడే అని కీర్తిస్తున్నారు అన్నమయ్య. ఈయన ఈ విశ్వమంతా నిండియున్నాడు. మనసారా తలుచుకొంటే చాలు మన్నిస్తాడు. పైకి భజన కూడా చేయనక్కరలేదు. నెమ్మదిలో ధ్యానించవే మనసా! అంటున్నారు. ఆ స్వామి చేసిన ఘన కార్యములను భజనరూపంలో వివరిస్తున్నారు. ఈయనే దాపుదండైన దేవుడట. తను కరుణించదలచుకొన్న వానిని తన దగ్గరకు బలవంతాన పిలిపించుకొని, మరీ అనుగ్రహిస్తాడట. నేను కూడా దీనికి సాక్ష్యమే.





**తాత్పర్య వివరణ:**

నేను కొలిచే ఈ దేవుడు కొండవంటివాడు (కొండ వలె సుస్థిరమైనవాడు) నెమ్మదిని (నా అంతరంగమున) వీడే నిండుకున్నాడు (నిండిపోయి వున్నాడు). ఓ మనసా! వీనిని ధ్యానింపవేలనే?

ఓ మనసా! నాకోసం ఈయన యెంత శ్రమించాడో వినవే. ఈ దేవుడే నన్ను పుట్టించినవాడు. కన్న చోటులనే (నా మనుగడ మొదలు బెట్టిన నా తల్లి గర్భంలోనే) నన్ను నిరంతరం రక్షించిన దేవుడితడే. అమ్మరూపంలో అమిత వాత్సల్యంతో వెన్నతినిపించి గోరుముద్దలు పెట్టి మరీ నన్ను పెంచాడీ దేవుడు. ఈయనను యెంతని పొగడవచ్చును. ఈతడొక్కడే మా దైవము. అంతే... అదే నిజం.

ఓ మనసా! ఎవ్వరికైనా సిరులనీయగల దేవుడితడే. నీవు అశాస్త్రీయంగా సేవించినా ఆక్షేపించక నీ సేవలను స్వీకరిస్తాడు. నేను అజ్ఞానినైనందున జగద్గురువై నాకు జ్ఞానమిచ్చిన గురుదేవుడితడే. అంతే కాదు నన్ను చేకొని జ్ఞానమార్గంలో నడిపాడు. ఈయనను మరిగించిన (నా పాపములను నిర్మూలించిన దైవము). నేను మూగవానిని కాకుండ నా చేత మాటలాడించినదీ దేవుడే. ఇరవై (సుస్థిరుడై) మా ఇలవేల్పువలెవున్న దేవుడితడే.

ఓ మనసా! ఈ దేవదేవుడే నాకు దాపుదండైనవాడు (ఎప్పుడూ నా ప్రక్కనే రక్షించుటకు సిద్ధంగా వుంటాడు). ఎక్కడెక్కడో అగమ్యంగా తిరిగే నన్ను ఒక ఒడ్డుకుచేర్చినదీయనె. నాకు తన రూపము చూపిన శ్రీ లక్ష్మీవల్లభుడైన దేవుడు ఈ శ్రీవేంకటేశ్వరుడొక్కడే. ఈయన మమ్మల్ని చేపట్టినాడు, మమ్మేలినాడు. ఈయన చేజేతనే (నా అరచేతనే)వున్న దైవము.

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **కొండవంటి వేల్పు నిండునామనసంత**
**నేను కొలుచు దేవుడైనవాడు**
**వేంకటేశుడనెడి వెలలేని దేవుడు**
**తీర్చెమమ్ముబట్టి దేవుడితడె.**

సంఖ్య: IV/520 రాగం : మాళవిగౌళ
కీర్తన : రాముడు లోకాభిరాముడుదయించుగాను

**మాళవిగౌళ**

**73 రాముఁడు లోకాభిరాముఁ డుదయించఁగాను**
**భూమిలో వాల్మీకికి పుణ్యమెల్లా దక్కెను ॥పల్లవి॥**

**తటుకన మారీచుతలపైఁ బోయఁ గర్మము**
**కుటిలశూర్పనఖ ముక్కునఁ బండెను**
**పటుకునఁ దెగె దైత్యభామల మెడతాళ్ళు**
**మటమాయదైత్యులకు మరి నూరూ నిండెను ॥రాము॥**

**తరగె రావణు పూర్వతపములయాయుష్యము**
**ఖరదూషణాదులకు కాలము దీరె**
**గరిమ లంకకు నవగ్రహములు భేదించె**
**సిరుల నింద్రజిత్తాకు చినిఁగె నంతటను ॥రాము॥**

**పోరిఁ గుంభకర్ణునికి పుట్టినదినము వచ్చె**
**మరలి గండము దాఁకె మండోదరికి**
**పరగె (గ?) నయోధ్యకు భాగ్యములు ఫలియించె**
**చిరమై శ్రీవేంకటేశుచేఁతలెల్లా దక్కెను ॥రాము॥ 520**

**ఉపోద్ఘాతము:**

అద్భుతమైన ఈ రామగాథ కీర్తనలో కొరుకుడు పడని పద ప్రయోగాలు పుష్కలంగా వున్నాయి. కొన్ని నా భావనకు తట్టినట్లు వివరిస్తున్నాను. అన్నమయ్య భావము ఇది అని చెప్పటానికి వీలులేదు. ఉదాహరణకు "పోరిగుంభ కర్ణునికి పుట్టిన దినము వచ్చె మరలి" అంటే యేమిటి? బాగా ఆలోచించినమీదట నాకు ఇలా తట్టింది. కుంభకర్ణుడు తన పుట్టినరోజునాడు నిద్రలేచి బాగా తిని ఆరు నెలలు మెలకువతో వుంటాడు. ఆపైన ఆరు నెలలు నిద్రపోయి తిరిగి తన పుట్టినరోజునాడు నిద్రలేస్తాడు. అయితే యుద్ధంలో వరుసగా యోధులందరూ చచ్చిపోతే వాడిని బలవంతాన నిద్రలేపారు. వాడు



హరి నీమయమే అంతాను

తన పుట్టిన రోజు వచ్చిందనుకొని నిద్రలేచాడు. కానీ అదే వాడు చచ్చినరోజయింది, అవునా? ఈ లోకాభిరాముడు పుట్టుటవలన కదా! వాల్మీకికి అంతులేని పుణ్యం దక్కింది అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

రాముడు (శ్రీరామచంద్రమూర్తి) లోకాభిరాముడు (లోకమున అందరికంటె మనోజ్ఞమూర్తి). భూలోకంలో ఈయన ఉదయించగాను (మానవజన్మనెత్తగానే) వాల్మీకికి (వాల్మీకి మహర్షికి) జన్మజన్మల పుణ్యం అంతా దక్కినది.

ఈ రఘురాముని మూలంగా మారీచుని తలపై రాక్షసుని వలె జన్మించవలసిన కర్మము పోయన్ (నశించినది). వానికి వైకుంఠప్రాప్తి కలిగినది. కుత్సితురాలైన శూర్పనఖకు ముక్కున రక్తముతో పండిపోయెను. రాక్షసుల భార్యల మెడలలోని మాంగల్యములన్నియు పుటుక్కుమని తెగినవి. మరి ఆపైన మటమాయ (గొప్ప మాయావులైన) దైత్యులకు నూరేండ్లు నిండినవి (మృత్యువు వచ్చేసింది).

రావణాసురుడు కొన్నివేల యేండ్లు చేసిన తపముల ఆయుర్దాయము నశించినది. దానితో వాడూ చచ్చాడు. ఖరదూషణాది రాక్షసులు పదివేలమందీ కాలము తీరి ఒకే క్షణంలో నశించారు. లంకా నగరానికి నవగ్రహముల మహిమ తాకి ఛిన్నాభిన్నమయింది. సిరి సంపదలలో వోలలాడే ఇంద్రజిత్తునకు, చినిగె నంతటను (అంతట వాడి బ్రతుకంటా చినిగిపోయి చిందరవందరయినది).

కుంభకర్ణునికి, పోరి (నాశనము తప్పదన్నట్లు) వాడి పుట్టినరోజు అతివేగముగా మరలివచ్చినది (ఉపోద్ఘాతమును జాగ్రత్తగా చదవండి...) మండోదరి మాంగల్యమునకు గండము సంప్రాప్తించి వైధవ్యము తప్పలేదు. అయోధ్యానగరమునకు భాగ్యములు ఫలించినవి. శ్రీవేంకటేశ్వరుని చేతలెల్లా (లీలలన్నీ) చిరమై (బహుకాలముదాకా) దక్కెను (ప్రకటింపబడినవి).

**పద్యవివరణ:**

తే.గీ.॥ **రాముడుదయించలోకాభిరాముడగుచు**
**పుడమి వాల్మీకికినీదక్కె పుణ్యమెల్ల**
**పాడెరామాయణంబిట్లు భక్తితోడ**
**అన్నమయ్య వేంకటనాథు సన్నుతించి.**

సంఖ్య: IV/127    రాగం : పాడి
కీర్తన : కామధేనువు దేవకల్పితము భువిలోన

**పాడి**

**74 కామధేనువు దేవకల్పితము భువిలోన**
**వోముచును భోగించ యుక్తివలెఁగాని ||పల్లవి||**

**తలఁచినట్లనౌ దైవమువ్రాసినవ్రాఁత**
**పలికినట్లనౌ పలుమంత్రజపములు**
**నిలిపినట్లనౌ నిర్మలచిత్తముకీలు**
**నెలవునఁ బనిగొన నేర్పువలెఁగాని ||కామ||**

**యిమ్మనినట్ల నిచ్చు నేచినకర్మఫలము**
**కమ్మన్నట్లనౌ ఘనతపములశక్తి**
**తెమ్మనినయట్లఁ దెచ్చు ద్రిష్టము యక్షిణీవిద్య**
**చిమ్ములను దనకంత చింతవలెఁగాని ||కామ||**

**వునిచినట్లనుండు నొక్కడే దేహగుణము**
**యెనలేని శ్రీవేంకటేశ్వరుమాయ లివి**
**పెనచిన యిహమేపో బీజము వుద్యోగులకు**
**తనివి నలమేల్మంగదయ వలెఁగాని ||కామ|| 127**

**ఉపోద్ఘాతము:**

కామధేనువు అంటే దేవలోకంలో వుండే గోవు. ఇది క్షీరసాగరమథనమున ఐరావతము మొదలైన అనేక దివ్య వైభవములతోపాటు జన్మించి ఇంద్రునికి పారిజాత కల్పవృక్షములతోపాటు





సంక్రమించినది. కామధేనువు కావలసినవి సృష్టించుటేకాదు, ఎంతమంది శత్రువులతోనైన పోరగల సైన్యమును క్షణంలో సృష్టించగలదు. దీని సంతానం కూడా దివ్యమహిమాన్వితమైన 'నందిని' వంటి గోవులే. అన్నమయ్య యేమంటున్నారంటే... కామధేనువు దేవలోకవాసుల కొరకు కల్పించబడి వుండవచ్చు. భువిలో దానిని చూచిన వాడెవ్వడూ లేడు కదా! అది కల్పితమైనది కూడ కావచ్చును. ఎవ్వరు చూచారు భువిలో వొముచును అంటే రక్షించుచూ కోరుకొన్న భోగములు కావలెననే యుక్తివలె అది వూహింపబడినది. నిజజీవితంలో అటువంటివేవీ లేవు అంటున్నారు. నేర్పు, కృషి, శ్రీవేంకటేశ్వరుని కృప – ఈ మూడు మాత్రమే ఇహమున సుఖముల నివ్వగలదు. ఏ వుద్యోగము నెరవేరాలన్నా అలమేల్మంగ దయకలుగ వలసిందే అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

కామధేనువు దేవకల్పితము (దేవలోకమైన స్వర్గం యొక్క వైశిష్ట్యాన్ని చెప్పే వైభవము.) ఇది కల్పితము అయిననూ ఆశ్చర్యపోనక్కరలేదు). భువిలో అందులోనూ ఈ కలియుగంలో, వోముచును భోగించ మనకు అండయైన భోగములను పొందవలెనంటే యుక్తివలెగాని (ఉపాయముండాలి) అంతేకానీ కామధేనువూ, కల్పవృక్షము కాదు.

ఒక్కటి గుర్తుపెట్టుకోండి. దైవము వ్రాసిన నుదుటివ్రాత తిరుగులేనిది. అది ఆయన ఏవిధముగా తలచినాడో అట్లే అవుతుంది. మంత్ర బలముతో నిత్యమూ జపమునందు నిమగ్నమౌ మహానుభావులు వాక్శుద్ధి కలిగివుంటారు. వారు అన్నది అన్నట్లే జరుగుతుంది. నిర్మలుడైన వాని చిత్తము కీలు (మర్మము) తెలిసి నిలిపినట్లే సుస్థిరంగా నిలుచును. వీటన్నిటినీ, నెలవున బనిగొన (సుస్థిరంగా నియోగించుటకు కావలసినది) "నేర్పు" అంతేకానీ కామధేనువు కాదండీ!

ఏచిన కర్మఫలము (అతిశయించిన కర్మఫలము) యిమ్మనినట్ల నిచ్చును (ఆ సర్వేశ్వరుడు యెట్లా ఇమ్మంటే... అట్లా ఇస్తుంది). ఘనమైన తపోశక్తి కలవారు, కమ్మన్నట్లనే (ఏవిధంగా జరుగమంటే అట్లాగే జరుగుతుంది). యక్షిణీ విద్యసిద్ధించిన మహానుభావులు ద్రిష్టము (భాగ్యము) తెచ్చినట్లే దెచ్చును (ఎట్లా తెమ్మంటే అట్లా తెస్తుంది). "చిమ్ములను దనకెంత చింతవలె గాని"... చిమ్మినట్లుగా తనకెన్ని చింతలు కలిగిననూ ఏ కామధేనువూ కాపాడలేదు. నీ స్వయంకృషే నీకు రక్ష అవుతుంది.

ఒక దేహధారియొక్క స్వగుణము యెన్నటికీ మారదు. అది వునిచినట్లే, ఒక చోట వుంటుంది. ఇదంతా ఆ దేహి గత జన్మ సుకృతమునుబట్టి వుంటుంది. ఇవి అంత తేలికగా అర్థమయ్యే విషయాలు కావు సుమా! ఇవన్నీ యెనలేని (సాటిలేని) శ్రీవేంకటేశ్వరుని మాయలు. ఇదిట్లా వుండగా పైకి మాత్రం పెనచిన ఇహము (చుట్టూకొనివున్న ఈ ప్రపంచమే), పో... అన్నిటికీ కారణము బీజము... ఉద్యోగులందరికీ ప్రపంచమే నిజమనిపిస్తుంది. అలమేల్మంగమ్మ దయవుంటే ఆస్వామి మనని ఈ భ్రమలోంచి బయటపడేస్తాడు.

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **కామధేనువనెడి కామ్యప్రదాయని**
**ఊహబుట్టు భోగ ఉపకరంబు**
**నేర్పు, కృషియు, లక్ష్మి నిలయుని కృపలేక**
**ఇహమునందు పోదు దేహగుణము**





సంఖ్య: IV/128 రాగం : శ్రీరాగం
కీర్తన : గోవింద నీవన్నిటిలో గూడితే జాలుగాని

## శ్రీరాగం

**75 గోవింద నీవన్నిటిలోఁ గూడితేఁ జాలుఁగాని**
**యీవల సంసారమైన (నా?) యిది ధ్రువపట్టమే** ॥పల్లవి॥

**తలఁపులోపల నీవు దగ్గరితేనే చాలు**
**కలలోని కాఁపురముఁ గైవల్యమే**
**పెళకునాలుకకు నీపేరు వచ్చితేఁజాలు**
**పలికినవన్నియు పరమవేదములే** ॥గోవిం॥

**తొడరి నీపూజ చేత దొరకితేనే చాలు**
**పడుచులబొమ్మరిండ్లు బ్రహ్మలోకమే**
**కదలేనినీభక్తి గలిగితేనే చాలు**
**కడజన్మమయినా నిక్కపువిప్రకులమే** ॥గోవిం॥

**కాయముపై నీముద్ర గానవచ్చితేనే చాలు**
**పాయపు రతిసుఖము పరతత్వమే**
**యేయెడ శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి**
**పోయిన నా పాపమెల్లాఁ బుణ్యకర్మమే** ॥గోవిం॥ **128**

**ఉపోద్ఘాతము:**

సంసారముమాయామేయము. సుఖదుఃఖాలు, పాపపుణ్యాలు వంటి ద్వంద్వముల మూలంగా ఈ సంసారము యెప్పుడూ నిలకడలేనిదానివలెనే అనేక భ్రాంతులను కలిగిస్తుంటుంది. కాని గోవిందుని ఆశ్రయించి కూడితే చాలును ఈ సంసారమే ధ్రువమండలప్రాప్తి దక్కినట్లు శాశ్వత కీర్తిగలవానిగా చేస్తుంది. ఓ వేంకటేశ్వరా! నీకు శరణార్థులైన వారికి

చేసినపాపమెల్ల పుణ్యకర్మగానే పరిణమిస్తుంది అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ గోవిందుడా! నీవు అన్నిటిలోనూ కూడియున్నావు అనే భావన కలిగితే చాలును. ఎంతో అస్థిరమైన ఈ సంసారము (జగత్తు), ధ్రువపటమే అవుతుంది (అత్యంత స్థిరమైన) ధ్రువమండలమువలె వుంటుంది.

ఓ నారాయణుడా! నీవు ఒక్కసారి తలపులలోనైనా మాకు దగ్గరితేనే చాలు (దగ్గరయైనచో అంతే చాలును). కైవల్యప్రాప్తికూడా కలలో జరిగినట్లు జరుగుతుంది. బెళకు నాలుకకు (తళతళమని ప్రకాశించు నాలుకకు) నీపేరును పలుకుట వచ్చిన చాలును. అది పలికిన పనికిరానిమాటలు కూడా పరమవేదములవలె మానవునికి అంతులేని పుణ్యాన్నిస్తుంది.

ఓ దేవదేవా! నీపూజతొడరి (యత్నించి) చేతదొరకితేనే (చేజిక్కించుకొంటే) చాలును. జవ్వనుల భ్రుకుటీ విలాసములు బ్రహ్మలోక ప్రాప్తికి అడ్డురావు. కడలేని (అంతులేని) నీ భక్తి కలిగినంతమాత్రమున కడజాతివాడైనా విప్రునికంటే విశేషమైన పుట్టుక కలవానివలె ఉన్నతుడవుతాడు.

ఓ శ్రీహరీ!యెవడన్నా భక్తితో తన శరీరంపై నీ శంఖచక్ర ముద్రలు ధరించితే చాలును. వాని శరీరము పరతంత్రమైనట్లు (పరాధీనమైనట్లు) పాయపురతిసుఖమును (వయస్సుకు సహజమైన రతి) కూడా కాంక్షించదు. ఓ శ్రీవేంకటేశ్వరా! యెచ్చోటనైనా నీ శరణార్థులమైన మాకు అంతా పుణ్యమే. పాపమనేది లేనేలేదయ్యా!

**పద్యవివరణ:**

చం॥ **తలపున శ్రీపతీ! తగిలి దగ్గరయైనను చాలునయ్య నీ**
**విలువగుభక్తి దాపయిన విప్రుని జన్మముతో పనేమి? యీ**
**చెలువగు దేహమందు హరి శ్రీప్రదముద్రలుగాచు, చాలదా**
**నిలకడలేని యీజగతి నిక్కముగా ధ్రువపట్టమేయగున్.**





సంఖ్య: VI/104 రాగం : రామక్రియ
కీర్తన : విచ్చేయవమ్మా వెన్నెలబొమ్మా

**రామక్రియ**

**76 విచ్చేయవమ్మా వెన్నెలబొమ్మా**
**మచ్చికమరునిధాక మగువనీరాక** ॥పల్లవి॥

**పంచలపసిండినిగ్గు వచ్చిదేరే సిగ్గు**
**వంచనవలపుతీపు వాలుకచూపు**
**కంచపుంబాలకూడు కాఁకలనీవాడు**
**మంచపునీతలఁబ్రాలు మట్టెలపాదాలు.** ॥విచ్చే॥

**కోవిలకొసరుఁబాట కొమ్మరో నీమాట**
**తావులచెంగావి నీతళుకుమోవి**
**గోవజవ్వాది కరంగు గుబ్బల నీమెఱుంగు**
**భావజుదాడిరొదలు పాదపునీకదలు.** ॥విచ్చే॥

**ముద్దుల నీనగవు చిమ్ములరతిబిగువు**
**అద్దలింపుఁగసరు మోహంపుఁగొసరు**
**గద్దరినీయలపు వెంకటపతితలఁపు**
**అద్దపునీమోము మోహనరతిసాము.** ॥విచ్చే॥

**ఉపోద్ఘాతము:**

అలమేల్మంగ శ్రీవారి శోభన కార్యక్రమానికి అలంకరించబడి ఆంతరంగిక చెలికత్తెలు తోడుకొని తెస్తుంటే వేంకటరమణుని సన్నిధికి తోడుకొని రాబడింది. అన్నమయ్యకూడా తన భావనా వినీలాకాశంలో శ్రీదేవిని వెంటతీసికొనివస్తున్న ఒక చెలికత్తె అయ్యారు. మధుర శృంగార కీర్తన ఆవిష్కరింపబడింది. ఈ కీర్తనలో కేవలం పాండిత్యంవల్ల అన్నమయ్య మన భావనలకు అందదు. భక్తి, హరికృప, సమయస్ఫూర్తివున్నవాడే ఈ కీర్తన వివరించగలడు. ఒక నిఘంటువుని పెట్టుకొని పనికానిచ్చేస్తానంటే "రాముని తోక పివరుండిట్లనియె" అని చదివిన గ్రంథసాంగునివలె అవుతుంది. అలమేల్మంగను వెన్నెలతో చేసిన బొమ్మ అని వర్ణిస్తున్నారు. ఓ మగువా! నీ రాకను మన్మథుడు మచ్చికతో "ధాకవేసి" (ఢంకా

బజాయించి) అట్టహాసంగా హరికి తెలుపుతున్నాడు. ఆ జగదేకపతి కూడా పరవశంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాడట. ఔరా! అన్నమాచార్యా! లేరయ్య నీసాటి.

**తాత్పర్య వివరణ:**

స్నిగ్ధమైన వెన్నెలబొమ్మవంటి ఓ అలమేల్మంగా! మెల్లగా నీపతి వద్దకు విచ్చేయవమ్మా! (రావమ్మా!) ఓమగువా! నీరాక, మచ్చికతో మిమ్ము అలరించ దలంచిన, మరుని (మన్మధుని) ధాక (ధక్కావలె) స్వామివారికి వినపడుతున్నది కాబోలు.

ఓ దేవీ! నీవు సిగ్గుపడుతుంటే, పసిండికి (బంగారమునకు) పంచల నిగ్గు (పంచవన్నెల కాంతి) సమకూడినట్లయినది. నీ వాలుకన్నుల చూపు, ప్రియుని వంచించే వలపులు కూడా తీపిగానే వుంటాయేమో అనిపిస్తున్నది. నీవాడు (నీ మనోహరుడు) కాకలవున్నాడమ్మా (ఆయన నీవు ఆలోచనలో మెదలగానే వేడెక్కిపోతున్నాడు.) ఆయనకు కంచము నిండా పాలతో నిండిన మధురాన్నం తినిపించవమ్మా! మట్టెల సవ్వడి చేసే నీ పాదాలు నీవు వంగి చూసికొనగానే నీ శిరసునున్న తలంబ్రాలు నీ పాన్పుపై పడినవమ్మా!

కొమ్మరో! (ఓ యువతీ!) నీవు మాట్లాడుతుంటే కోయిల కొసరి కొసరి పాడుతున్నట్లుంది. తళతళ మెరయుచున్న నీ మోవి (అధరము) చెంగావిరంగు తాపినట్లున్నది. గోవ (మనోజ్ఞముగా) జవ్వాది మెత్తిన (మెత్తగా), దానిలో కరిగినట్లున్న నీ చనుగుబ్బలు మెరిసిపోతున్నాయి. కదలెడి నీ పాదముల సవ్వడి భావజుడు (మదనుడు) మీపై దాడి చేస్తున్నట్లున్నది తల్లీ!

దేవీ! ముద్దులొలికే నీ చిరునవ్వు, రతికేళిలో నీ బింకమూ, నీ ప్రియుని నీవు అదిలించి కసురుకొనే వుత్తిత్తి చిరాకు స్వామికి విపరీతమైన మోహాన్ని కలుగజేస్తున్నది. దిట్టతనముగల సురతమున నీ అలయక (నిస్సత్తువ) చూపినా, నీపతి వేంకటపతి తలపు, అద్దమువంటి నీమోమున నీపతి రతిసాము ప్రతిఫలింపచేస్తున్నదమ్మా!

**పద్యవివరణ:**

కం.॥ **విచ్చేయవమ్మా! నీపతి**
**మెచ్చిన బంగారుకొమ్మ! వెన్నెల బొమ్మా!**
**హెచ్చెను హరి పరవశమిక**
**మచ్చిక నీరాక మగువ! మదనుని "ధాకే".**





సంఖ్య: IV/126 రాగం : లలిత
కీర్తన : కావగనీకేపోదు కరుణానిధివిగాన

**లలిత**

**77 కావఁగ (క?) నీకే పోదు కరుణానిధివిగాన**
**దేవ నీ బంట్లము మా తెరు వేఁటి తెరువు** ॥పల్లవి॥

**బందుబంద్దై వూరఁగలపనులెల్లాఁ జేసేము**
**యెందా (డౌ?) తా నీడౌతా నెఱఁగము**
**కొండలరాయఁడ మమ్ముఁ గోరి పుట్టించఁగా నీవు**
**బెండువంటివారము మా బిగు వేఁటిబిగువు** ॥కావఁ॥

**దీనుఁడనై (లమై?) యాసలనే దిక్కులెల్లాఁ దిరిగేము**
**కాని దెందో మంచి దెందో కానము**
**శ్రీనాథ నీవు మాకు జీవమయి వుండుఁగాను**
**మానువంటి వారము మా మనసేటి మనసు** ॥కావఁ॥

**బొందితోడఁ బుట్టితిమి భోగించేమేమైనా**
**యెందుకా (కౌ?) తా నేడకౌతా నెఱఁగము**
**యిందును శ్రీవేంకటేశ యిహముఁ బరము నీవే**
**చెంది నీ దాసులము మా చేఁత యేఁటిచేఁత** ॥కావఁ॥ **126**

**ఉపోద్ఘాతము:**

నేటి తెలుగులో ఇదే పల్లవిని "కావగ నీకు తప్పదు కరుణానిధివి కావున, దేవ నీ బంటులము మా తెరువేటితెరువు" అని చెప్పవలసి వుంటుంది. 600 ఏళ్ళనాటి తెలుగులో ఆ మార్పు సహజమే. మానవసహజంగా మాకు కొంత బిగువు వుంది. మాకు మనస్సు వుంది. కాని ఆ బిగువు యేమిబిగువు? ఆ మనస్సు యేమి మనస్సు? మేము నీ బంటులమయ్యా మా కంటూ స్వతంత్రంగా ఒక గమ్యం వుంటుందా? నీవెట్లా చెబుతే అట్లా చేస్తాము. మేము నీ దాసులము ప్రభూ! మా చేతలు యేమి చేతలు? అంతా నీ దయ మా ప్రాప్తము అంటున్నారు, అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రభూ! నీవు కరుణానిధివి, గాన కావున) నన్ను కావగ (రక్షించక) పోదునీకే (నీకు తప్పదు). ఎందుకంటే, ఓ దేవా! మేము నీ బంట్లము (భృత్యులము), మా తెరువేటి తెరువు? మాకు స్వతంత్రంగా ఒక తెరువు (గమ్యము) వుంటుందా తండ్రీ!

పోనీ మా గత ప్రవర్తన చూద్దామా అంటే యేమి చెప్పను? బందు బండై (ఆకతాయితనమునకు హద్దులు లేకుండా) వూరిలోగల నిరుపయోగమైన పనులన్నీ చేసేస్తాము. యెండయినా నీడయినా లెక్కసేయక ఇచ్చవచ్చినట్లు తిరిగేము. ఓ కొండలరాయడవైన శ్రీవేంకటేశ్వరా! మమ్ము నీవే యేదో మానుంచి కావాలని మమ్ము పుట్టించావు. మేము బెండువంటి వారము (బలహీనులము) మా బిగువు (బింకము) యేపాటి బింకమయ్యా?

స్వామీ! అంతులేని ఆశలతో మా దైన్యము చాటుకొంటూ, దిక్కులన్నీ కలియతిరిగేము. కానీ యేది మంచిదో యేది చెడ్డదో కాననైతిమి. మేము మానువంటవారము, అడవిచెట్టువంటివారము. నీవు అందించే గాలి, నీరు, సూర్యకాంతియే మా జీవనాధారము. ఓ శ్రీనాథా! ప్రకృతి రూపంలో అవన్నీ నీవు అందిస్తుంటే బ్రతుకుతున్నాము. మా మనస్సు యేమి మనసు? అది యెన్నాళ్ళయినా నీ తత్త్వం యెరుగనీయని అజ్ఞానంలోనే మమ్మల్ని వుంచుతుంది.

ఓ దేవదేవా! మేము ఈ బొందితో (శరీరంతో) పుట్టాము కాబట్టి యేమైనా సరే! భోగమే కావాలంటుంది ఈ శరీరము. ఇట్లా యెందుకవుతున్నదో, దీని మర్మం యెక్కడవున్నదో తెలియము. ఓ శ్రీవేంకటేశ్వరా! మాకు ఇహలోకమున కోర్కెలను పరలోకమున మోక్షమును ఇచ్చుచున్నది నీవేనయ్యా! నీకు చెంది దాసులమై (నీ స్వంత దాసులమైనవారము. మా చేతలు యేటిచేతలు? స్వతంత్రించి మేము యేమిచేయగలమయ్యా?

**పద్యవివరణ:**

ఉ.॥ **కావగనీకు తప్పదుర గారవమొప్పగ వోదయానిధీ!**
**దేవర! నీదు బంట్లమురతీరిచి మాతెరువేటిదో ప్రభూ!**
**ఆవల దిక్కులెల్ల తిరుగాడెద మాసల నీల్గినీల్గి వో-**
**శ్రీవనితామనోరమణ! శ్రీపతి! వేంకటరాయ యీయెడన్.**





సంఖ్య: IV/511 రాగం : పాడి
కీర్తన : ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు

**పాడి**

**78** **ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు**
**చెంత రమాదేవిఁగూడె శ్రీనరసింహుఁడు** ॥పల్లవి॥

**సరిఁ గొండలెక్కుకొని సరసము లాడుకొంటా**
**సొరిది మోములు తోఁగి చూచుకొంటాను**
**విరులచెండులఁగొని వేటులాడుకొంటాను**
**సిరితోడ విహరించీ శ్రీనరసింహుఁడు** ॥ఇంతు॥

**భవనాశిలోని నీరు పైఁ జల్లులాడుకొంటాను**
**నవకపుసిరులను నవ్వుకొంటాను**
**జవళిఁ గెమ్మోవులు సన్నలఁ జూపుకొంటాను**
**చివన నిందిరనంటె శ్రీనరసింహుఁడు** ॥ఇంతు॥

**వేమరుఁ దొడలెక్కుక వీడుదోడు లాడుకొంటా**
**ప్రేమమునఁ గాఁగిళ్ళఁ బెనఁగుకొంటా**
**ఆముక శ్రీవేంకటాద్రి నౌభళాన నిలిచిరి**
**శ్రీవమాలక్ష్మితోడ శ్రీనరసింహుడు** ॥**ఇంతు**॥ **511**

**ఉపోద్ఘాతము:**

"భవనాశి" నదీజలములలో తృప్తిగా తన దేవేరి శ్రీమహాలక్ష్మితో జలకములాడిన అహోబల శ్రీనరసింహుడు చివ(వ్వ)న నిందిరనంటినాడట. వారు సొరిదిమోములు తోగి (తొంగి) చూచుకొంటున్నారుట. ఆవిడకు ఉగ్రనరసింహుడు కాదు, అందాల వేంకటరమణుడు కానవస్తాడు. అందుకనే ప్రేమాతిశయముతో ఆ శ్రీహరి మధురోహలలో మునిగి ఈ 'హరి' (సింహము) కౌగిళ్ళ పెనగుకొంటా స్వామిని రంజింపజేస్తున్నదట. నేను

ఇదివరలో చాలాసార్లు చెప్పినట్లు అహోబలేశుని అపరశృంగార మూర్తిగా కీర్తించుట ఒక్క అన్నమయ్యకే సాధ్యము.

**తాత్పర్య వివరణ:**

ఓ ఇంతులాల! శ్రీదేవి ఆంతరంగిక చెలికత్తెలారా! చూడరమ్మా! వీరు ఈ శ్రీమహాలక్ష్మి మరియు శ్రీనరసింహుడు, ఇద్దరు జాణలే (చతురులే). ఈ శ్రీనరసింహుడు, రమాదేవిని (శ్రీలక్ష్మిని) చెంతన్ కూడెన్ (చేరువయై కూడినాడు).

సరిగొండలెక్కుకొని (సరిసంఖ్యలో వున్న కొండలపై నెలకొన్నవారైన) ఒకరితో ఇంకొకరు సరసోక్తులను విసురుకుంటూ సొరిది (ఒకరి తరువాత ఇంకొకరు) మోములు తమ ముఖములను, తోగి చూచుకొంటాను (తొంగి చూసికొనుచు), విరుల చెండులగొని (పూలదండలు విసురుకొంటూ, సిరితోడ (శ్రీదేవితో) నరసింహుడు విహరించుచున్నాడు.

"భవనారి" జలములతో జల్లులాడుకొంటా (జలకములాడుకొనుచు), నవకపు సిరులను (తొమ్మిది సిరులకు రాణియైన) తన దేవేరితో నవ్వుల జల్లులతో నానిపోతూ, తమ జవళిగెమ్మోవులు (జంట అరుణాధరములను సన్నలజూపుకొంటా (సంకేతములుగా కదలించుచూ, ఈ శ్రీనరసింహుడు చివన (చివ్వున) ఇందిరను అంటెను (తాకీతాకనట్లు తాకినాడు).

వేమరు (అనేకమారులు) స్వామితొడపై ఆసీనురాలై వీడుదోడు ఆడుకొంటూ (మాటకుమాట సరసోక్తిగా) చెప్పుకొంటూ వారిద్దరూ ప్రేమాతిశయమున ఒకరి కౌగిట నింకొకరు పెనుగులాడినారు. ఈ విధముగా ఆక్రమించి శ్రీవేంకటాద్రిపైనా మరియు ఈ ఔబళాన (అహోబలమున) శ్రీనరసింహుడు శ్రీమహాలక్ష్మితో నిలిచినాడు.

**పద్యవివరణ:**

కం.॥ **ఎంతో జాణలు యిద్దరు**
**చెంత రమాదేవిగూడె శ్రీనరసింహుం-**
**డింతట వేంకటవిభుడట**
**ఇంతులు చూడండి "హరి"ని ఇందిరపెనకెన్**





సంఖ్య: IV/457 రాగం : సామంతం

కీర్తన : ఆ రూపమునకే హరి నేను మొక్కెదను

## సామంతం

**79 ఆ రూపమునకే హరి నేను మొక్కెదను**
**చేరి విభీషణుని శరణాగతుఁడని చేకొని సరిఁ గాచితివి** ॥**పల్లవి**॥

**ఫాలలోచనుఁడు బ్రహ్మయు నింద్రుఁడు**
**సోలి నగ్నియును సూర్యచంద్రులును**
**నీలోనుండఁగ నెరిఁ గనెఁ గిరీటి**
**మూలభూతివగుమూర్తివి గాన** ॥**అరూ**॥

**అనంతశిరసుల ననంతపదముల -**
**ననంతనయనము లనంతకరముల**
**ఘన నీరూపము గనుఁగొనెఁ గిరీటి**
**అనంతమూరితి వన్నిటఁ గాన** ॥**ఆరూ**॥

**జగము లిన్నియును సకల మునీంద్రులు -**
**నగు శ్రీవేంకటనాథుఁడ నిన్నే**
**పొగడఁగఁ గిరీటి పొడగనె నీరూపు**
**అగణితమహిముఁడ వన్నిటఁగాన** ॥**ఆరూ**॥ **457**

**ఉపోద్ఘాతము:**

విశ్వతోముఖుడైన తన విశ్వరూపం కిరీటికి చూపించి అతని క్లైబ్యాన్ని నశింపజేసి శత్రు సంహారానికి ఆయత్తుని చేశాడు శ్రీకృష్ణపరమాత్మ. బ్రహ్మాది దేవతలు సేవిస్తున్న ఆ మూలభూతిరూపాన్ని చూచి కిరీటి పరవశించాడు. అనంతశిరసులు, కన్నులు, చేతులు గల ఆ విశ్వరూపుని చూచి కిరీటి వినమ్రుడై కర్తవ్యోన్ముఖుడైనాడు. కానీ ఆనాడు శ్రీమన్నారాయణుడే మానవుడిగా వచ్చి రావణుని సంహరిస్తాడని తెలిసిన విభీషణుడు మాత్రం ఆ

మానవుని రూపంలో విశ్వరూపుని చూచి శరణాగతుడయ్యాడు. ఓ శ్రీహరీ! ఆ రూపమునకే నేనూ మొక్కెదనయ్యా! అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీహరీ! విశ్వతోముఖుడవైన విశ్వరూపుడవు నీవు. ఈ శ్రీమన్నారాయణుడే రావణ సంహారానికి మానవునిగా వస్తాడని ముందే తెలిసిన విభీషణుడు, ఆయనకు శరణాగతుడైనాడు. స్వామీ! నీవు వానిని చేకొనిగాచితివి. నేడు నేను కూడా నీకే మొక్కెదను. నన్ను కాపాడుము.

ముక్కంటియైన శంకరుడు, బ్రహ్మ, ఇంద్రుడు, అగ్నిదేవుడూ, సూర్యచంద్రులు నీలోనే వుండుట స్వయంగా ఆ కిరీటి తన కన్నులారా గాంచినాడు. అదెట్లు సాధ్యమైనది? ఆ దేవతలందరికీ మూలభూతి (మూలకారణమైన) మూర్తివి నీవే కాబట్టి కిరీటి ఆవిధంగా చూడగలిగాడు.

ప్రభూ! నీ విశ్వరూపములో కిరీటికి అనంతమైన శిరసులు, అనంతమైన పాదములు, అనంతమైన నయనములు (కన్నులు), అనంతమైన కరములు (చేతులు) కనుపించినవి. ఘనమైన నీ విశ్వరూపము చూచి కిరీటి అచేతనుడై నీకు శరణాగతుడైనాడు. అన్నివిధములా నీవు అనంతమూర్తివి అయినందు వల్ల తను కేవలం నిమిత్తమాత్రుడననే సత్యం అతనికి తెలియవచ్చింది.

ఓ శ్రీవేంకటనాథుడా! నీలో వున్న ఈ జగములు, మునీంద్రులు, సకలము నిన్నే పొగడుచుండగా స్వయంగా ఆ కిరీటి కనులారా కనుగొన్నాడు. నీ చతుర్భుజ రూపమును చూచిన కిరీటి స్వాంతనము పొంది అన్నివిధములా నీవు అగణిత మహిమకలవాడవని నీకుదాసుడై రణరంగమున విజయుడైనాడు.

**పద్యవివరణ:**

తే.గీ.॥ **జగములన్నియు, మునులును, సకలమున్ను**
**విశ్వరూపానగాంచెను విజయుడంత**
**ఆ విభీషణునేలిన ఆర్తత్రాణు**
**విభుని రూపము గొలుతును వేంకటేశ!**





సంఖ్య: IV/68 రాగం : లలిత

కీర్తన : ఏతపములు నేల యేదానములు నేల

**లలిత**

**80 ఏతపములు నేల యేదానములు నేల**
**శ్రీతరుణీపతినిత్యసేవే జన్మఫలము** ॥పల్లవి॥

**దేహపుటింద్రియముల దేహమందే యణcచుటే**
**దేహముతోనే తాను దేవుcడౌట**
**సోహలను వెలిc జూచేచూపు లోనుచూచుటే**
**ఆహా దేవతలc దనందే తాc గనుట** ॥ఏత॥

**వెలి నిట్టూరుపుగాలి వెళ్ళకుండా నాcగుటే**
**కులికి తపోధనము గూడపెట్టుట**
**తలcపు తనందే తగ లయముసేయుటే**
**లలిc బాపబంధముల లయముసేయుట** ॥ఏత॥

**వెనక సంసారమందు విషయవిముక్తుcడౌటే**
**మునుపనే తా జీవన్ముక్తుcడౌట**
**పనిని శ్రీవేంకటేశుపదములు శరణంటే**
**అనువైన దివ్యపదమప్పుడే తా నందుట** ॥ఏత॥ **68**

**ఉపోద్ఘాతము:**

జన్మసాఫల్యం చెందాలంటే ఏతపమో ఏ దానమో చేయవలెనా? అవసరంలేదంటున్నారు అన్నమయ్య. శ్రీసతీవల్లభుని నిత్యసేవగా ఆరాధించువారికి జన్మ సఫలమవుతుందని వేరే చెప్పవలెనా? ఒక మానవమాత్రుడు దేవుడవ్వాలంటే బ్రహ్మవిద్యేమీ కాదు. దేహములో అలజడి కలిగించు ఇంద్రియాలను అణచుటే సశరీరంగా మనిషి దేవత్వం పొందటానికి అర్హతనిస్తుంది. సోహలను (సోహం భావనతో)

బయటకానబడేదిగాక లోనగానబడే ఆత్మను దర్శించుటే దేవతలను తనలోనే దర్శించుటవంటిది. ఒకసారి శ్రీవేంకటేశుని శరణంటే దివ్యపదమును తాను అప్పుడే అందుకొనుటవంటిది.

**తాత్పర్య వివరణ:**

ఏవిధమైన తపములు యెందులకు? ఏవిధములైన దానములు కూడా యెందులకు? శ్రీతరుణీపతి (రమాకాంతుని) నిత్యసేవే (అనుదినము సేవించుటే) జన్మఫలము (జన్మ సాఫల్యత కలిగించును).

దేహమునకు సంబంధించిన ఇంద్రియములను దేహమునందే అణచుటయే సశరీరముగా తానే దేవుడౌట (ద్రైవత్వమును పొందుటవంటిది). సోహం (ఆత్మయే నేను) అనే భావముతో వెలిజూచే చూపు (బాహ్యముగా చూచే చూపు) లోను జూచుటే (అంతర్ముఖునిగా చూచుటయే). దీనినే దేవతలను తనలోనే దర్శించుట అని భావించ వచ్చును.

ఆలోచించి చూస్తే తపోధనము కూడబెట్టుట అంటే యేమిటి? వెలుపలికి రావలసిన 'నిట్టూర్పు' గాలిని వెళ్ళకుండ (బయటకు పోకుండా ఆపుటయే). ఈ విధమైన ప్రాణవాయువు నిరోధమున గొప్ప తపోదీక్షను కొనసాగించవచ్చును. ఆలోచనలను తనలోనే నిరోధించుచు, తనలోనే లయము సేయుటే తన పాపబంధనములను లయము చేయుటతో సమానము.

వెనుక (ఆపైన) సంసారమున విషయసుఖాసక్తుడుగాక విషయ విముక్తుడై యుండుటే మేలు. ఈ విధముగా వుంటే అందరికంటే ముందే జీవన్ముక్తుడవుతాడు. పనివి (పూనుకొని) శ్రీవేంకటేశ్వరా! నీ పదములను శరణంటే, అప్పుడే తనంతటతానే అనువైన దివ్యపదము లభ్యమవుతుంది.

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **ఏతపములు నేల? యేదానములునేల?**
**శ్రీసతీవిభునికి సేవచేయ,**
**జన్మసఫలమౌను సమయపాపములన్ని**
**వేంకటేశు శరణు విలువ బెంచు.**





సంఖ్య: IV/48 రాగం : లలిత
కీర్తన : బ్రహ్మాదులకు నిదేపరచింత

**లలిత**

81 **బ్రహ్మాదులకు నిదే పరచింత**
**బ్రహ్మఁ గన్న తండ్రియైన పరమాత్మచింత** ॥పల్లవి॥

**మూఁడు లోకములకెల్లా మొదలిచింత**
**మేడెపుఁ గర్మములకు మీఁదిచింత**
**తోడ జనించిననాటి తొల్లిటిచింత**
**వోడక మాకుఁ గలిగె నొక్కటే చింత** ॥బ్రహ్మా॥

**అంగములోవెదకేటి యానందచింత**
**నింగివలెఁ బొడచూపే నిర్మలచింత**
**కుంగేటి భోగములకుఁ గొనచింత**
**వుంగిటఁగలిగె మాకు నోహో యీచింత** ॥బ్రహ్మా॥

**కిందు మీఁదు నేకమైన కేవలచింత**
**సందు లేక నిజమైన సహజచింత**
**కందువ శ్రీవేంకటేశుఁ గన్నచింత**
**యిందునే మాకుఁ గలిగె నితఁడే చింత** ॥బ్రహ్మా॥ 48

**ఉపోద్ఘాతము:**

పరచింత అంటే పరమాత్ముని గురించిన చింత అని అర్థం. బ్రహ్మాది దేవతలు యెవరి గురించి చింతిస్తుంటారు అంటే ఈ పరమాత్ముని గురించే చింతిస్తుంటారు అని గ్రహింపునకు వస్తుంది. ఈ శ్రీవేంకటేశ్వరుడు, బ్రహ్మదేవుని కన్నతండ్రి. పరమాత్ముడని అందరూ ఆరాధించి చింతించేది యీతని గురించే అంటున్నారు అన్నమయ్య. చింత అనే పదము నెన్నుకొంటే కీర్తనలో ప్రతి చరణమూ 'చింత'తోనే పూర్తి

అవుతుంది. ఈ కీర్తన అంత తేలిక అనుకోవద్దు. "ఉంగిట గలిగిన మాకు ఓహో యీచింత" – అంటే యేమిటి?

**తాత్పర్య వివరణ:**

ఓ భక్తులారా! బ్రహ్మాదులకు బ్రహ్మ మొదలైన దేవతలకు) ఇదె (ఈ శ్రీమన్నారాయణుని స్మరణే) పరచింత (ముక్తినొసగు చింతనము). బ్రహ్మను కన్నతండ్రి ఈ పరమాత్ముడు. ఈతని చింతయే ఉత్కృష్టమైన చింత.

దేవ, మనుష్య, పాతాళలోక వాసులందరూ మొదట చింతించునది ఈయన గురించే. మేడెపు కర్మల (వదిలించుకోవటం సాధ్యం కాని కర్మల మీది) గురించిన చింతయే ఈ పరమాత్ముని చింత. మనతోపాటే పుట్టి మనతొల్లిటి జన్మల ఫలమును కూడా అందించే చింత. దేనికీ జంకని మాకు ఈనాటికి ఈ పరమాత్ముని చింత ఒక్కటే మిగిలింది.

అష్టాంగసిద్ధులు పొందినవారు ఆనంద స్వరూపుడైన ఈ పరమాత్మను చింతించుచూ వెదకుతుంటారు. ఈయన పంచభూతాలలో ఒకటైన ఆకాశమువలె నిత్యమూ మనని రక్షణగా కప్పివుంటాడు. ఏదో ఒకనాడు కుంగేటి (క్రిందకు పడిపోయేటి) భోగములకు కొనచింత (ఆఖరి చింత). ఉంగిట (కపటము) కలిగిన మాకు, ఓహో ఈతన చింతయే నిర్మలులను చేయును.

ఈతని చింతకలుగగానే పాపపుణ్యములు నశించి కైవల్యం గురించిన చింతన కలుగుతుంది. సహజమైన ఈ పరమాత్ముని చింత సందులేకుండా అతనిని మనసంతా నింపివుంచుతుంది. శ్రీవేంకటేశ్వరుని దర్శించాలనే చింత ఇంతలోనే మాకు కలిగినది. నిజానికి 'చింత' అంటే అదే సుమండీ!

**పద్యవివరణ:**

కం॥ **పరచింత యిదియె సుండీ!**
**వరబ్రహ్మాదులకు చింత పరమాత్మునిదే**
**వరమాయెనితని చింతయు**
**తిరుమలరాయడిని గూడు దీటగు చింతే.**





సంఖ్య: IV/47 రాగం : శ్రీరాగం
కీర్తన : ఎందుగాపురము సేతు నేది నిజమేది గల్ల

**శ్రీరాగం**

**82 ఎందుఁ గాఁపురము సేతు నేది నిజమేది గల్ల**
**ముందర నొక్కదినమే మూఁడు గాలములు** ॥పల్లవి॥

**తనుభోగముల నివే తగ నొక లోకము**
**మనసులో తలపోఁత మరి యొక్క లోకము**
**యెనసిన కలలోని దిది యొక్క లోకము**
**మునుపు వెనకలివే మూఁడు లోకములు** ॥ఎందుఁ॥

**పంచభూతములచేతిబంధ మొక్కదేహము**
**యెంచఁగ నూరుపుగాలి యిది యొక్కదేహము**
**కొంచక త్రిగుణములగురి సూక్ష్మదేహము**
**ముంచె నిదె వొకటిలో మూఁడుదేహములు** ॥ఎందుఁ॥

**జీవునిలోపలివాఁడు శ్రీవేంకటేశుఁడు**
**తావై వెలినున్నవాఁడు తా నొక్కఁడే**
**శ్రీవేంకటాద్రిమీఁదఁ జెలఁగినాతఁ డీతఁడే**
**మావంకల మముఁ గాచె మొక్కితి మాతనికి** ॥ఎందుఁ॥ **47**

**ఉపోద్ఘాతము:**

మాయామేయ జగమునబడ్డాను. ఇందులో అబద్ధం యేదో, నిజముయేదో తెలియకుండావుంది. ఇందులో నేను కాపురము యెట్లావుండగలను? భూత, వర్తమాన, భవిష్యత్తు అనే మూడు కాలములు కూడా, ముందర ఒకే దినముతో మొదలవుతున్నాయి.

మూడు లోకాలు అని అంటుంటారే... అవేవి? ఒకటి మనం భోగిస్తున్న ఈ భూమి, మనస్సు వూహించుకొనేదొకలోకము మరి మూడవలోకము స్వాప్నికము. ఇవేనయ్యా! మూడులోకాలంటే అంటున్నారు అన్నమయ్య.

కాల్పనిక జగత్తులో మూడుదేహాలేమిటో వివరిస్తున్నారు. పరమాత్ముడైన వేంకటేశ్వరుడు జీవాత్మలకు అధిపతి.

**తాత్పర్య వివరణ:**

ఓ దేవదేవా! నేను జీవాత్ముడను. నేనుండే ఈ జగత్తు నిజమో కల్లయో తెలియరాకున్నది. ఇక నేను ఇందుయెట్లు కాపురము సేయగలను? భూత, వర్తమాన, భవిష్యత్ కాలములని నేను విభజించుకొనిన మూడు కాలములు మొట్టమొదట ఒక్కదినమే కదా?

మానవుడు తను భోగిస్తూ సుఖించే ఈ భూలోకమే కన్నులకు కనుపించులోకము. మరియొక లోకము వీనిమనస్సునుండి ఊహలలో పుట్టినది. అదే స్వర్గమనుకొంటున్నాడు వాడు. ఇకపోతే మూడవలోకము వీని స్వాప్నికలోకము. అందులో అన్నీ భ్రమలే. అదే పాతాళము. మునుపు పెద్దలు చెప్పిన ముల్లోకాలు ఇవేనయ్యా- ఇందులో యేదికల్ల? యేది నిజము.

ఈ దేహములు కూడా మూడు వున్నాయి. పంచభూతములైన గాలి, నీరు, వేడిమి, మన్ను (కార్బన్), శూన్యప్రదేశములతో నిర్మించబడినవే దేహములన్నీ. ఇంకొక దేహముంది. అది మన శ్వాసక్రియను నియంత్రిస్తుంది. ఈ ఊర్పులు లేనిచో పాంచభౌతిక దేహము వున్నా మరణించినట్లే. ఈ రెండూగాక త్రిగుణాత్మకమైన సూక్ష్మదేహము ఇంకొంకటుంది. అదే గుణములను కలిగిస్తుంది. మూడు దేహాలంటే ఇవేసుమండీ!

మానవులలో ప్రాణిరూపంలో జీవాత్ముడుంటాడు. వాడే శ్రీవేంకటేశ్వరుడు కూడా. బయటకు అన్ని పనులను చేస్తున్నట్లు కనబడుతున్నవాడూ తానొక్కడే. శ్రీవేంకటాద్రిమీద, చెలగిన (విలసిల్లుతున్న) ఆతడే, ఈతడు (ఈ జీవాత్ముడు కూడా). మేము ఆతనికి మొక్కితిమి. మూడు వంకల మాకు రక్షకుడైనది ఈ శ్రీవేంకటేశుడే.

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **ఏది నిజము? చూడనేదియు కల్లరా?**
**యెందుకాపురంబు నెటుల సేతు?**
**మూడు కాలములును ముందొక్క దినమెబో**
**జీవుడెవరు? ఇముడు శ్రీవిభుండె.**





సంఖ్య: IV/79 రాగం : మంగళకౌశిక
కీర్తన : జీవములు దవ్వువోయ చీమలును పుట్టచొచ్చె

**మంగళకౌశిక**

**83 జీవములు దవ్వువోయ చీమలునుఁ బుట్టచొచ్చె**
**వేవేలయిన నిది విడువనయ్యా** ॥పల్లవి॥

**చింతలిన్నియుఁ బాసె చిత్తమింతట రోసె**
**యెంత లే దీయాసలు యిఁకనేలయ్యా**
**అంతలో గురునిగంటి హరికే శరణంటి**
**దొంతులభవములాల తొలఁగరో** ॥జీవ॥

**గక్కనఁ గడుపు నిండె కన్నుఁ దనిసె నిదె**
**యెక్కడిపలురుచులు యిఁనేలయ్యా**
**చిక్కె విజ్ఞానము నేఁడె జిహ్వానారాయణుఁగూడె**
**వుక్కునఁ బాపములాల వుడుగరో** ॥జీవ॥

**జీవుఁడు పావనమాయ దేవుఁడే జీవనమాయ**
**యీవలి యావని(లి?) కర్మమిఁక నేలయ్యా**
**శ్రీవేంకటేశు భక్తిఁ జేరి శరణంటి నేను**
**భావపుబంధములాల పారరో** ॥జీవ॥ **79**

**ఉపోద్ఘాతము:**

పుట్టలోంచి చీమలు వెలువడినట్లు జీవులందరూ దవ్వువోయి (యెక్కడెక్కడికో పోయి) వేవేలయిన జన్మలను పొందుచూ కర్మఫలమును అనుభవిస్తున్నారు. నేను కూడా ఈ కర్మబంధాన్ని విడువలేకున్నాను. ఓ శ్రీవేంకటేశ్వరా! జీవుడు పావనుడైతే వానికి దేవుడే జీవన గమ్యమవుతాడు. వానిని ఈ జన్మలో చేసిన పాపములుకాని గతజన్మల పాపకర్మలు కాని

ప్రతి బంధకములు కావు. వానికి స్వామిశరణమే భవబంధములను పారద్రోలుతుంది అంటున్నారు అన్నమయ్య.

**తాత్పర్య వివరణ:**

జీవులందరూ దవ్వుపోయ (యెక్కడెక్కడికోపోయి) చీమలకు (చీమలయందు) బుట్టి చొచ్చె (జన్మించసాగిరి). నేనుకూడ యెన్ని వేల చీమ జన్మలెత్తినా, ఇది (ఈ జనన మరణ చక్రాన్ని), విడువనయ్యా! (విడువలేకున్నాను.)

అయితే ఆ దేవదేవుని కృపవలన, నా చింతలన్నియును తొలగినవి. నామనస్సు ఈ బ్రతుకుపై రోసినది. ఈ ఆసలు యెంతలేదు (అంతులేనేలేదు). ఇకన్ యేలయ్యా? (ఇంకా యెందుకయ్యా?) అంతలో నా గురుదేవులను చూచాను. శ్రీహరికే శరణుచొచ్చాను. దొంతుల భవములలో (ఒకదానిపై ఇంకొకటి కుండలు పేర్చినట్లు, కలిగే జన్మములారా!) తొలగరో (నన్ను వదలి తొలగిపోండి.)

ఆహారం తీసికొనిన వెంటనే కడుపు నిండిపోయి ఇక వద్దంటుంది. కాసేపు చూశాక కళ్ళుకూడా అలసి విశ్రాంతిని కోరుకొంటాయి. ఎన్నివిధాలుగా చూచినా రుచులుకూడా కేవలం ఆరు మాత్రమే. మరి ఈ మానవుడు ఇంకా రుచులు కావాలని వెంపర్లాడుతున్నాడు? ఎన్నడైతే నా జిహ్వ (నాలుక) రుచులు విసర్జించి నారాయణుని రుచి తెలుసుకున్నదో, విజ్ఞానము నాకు చిక్కినది. ఉక్కులాంటి నా పాపములారా! మీకు ఉడుగక (కృశించక) తప్పదు.

ఆ శ్రీవేంకటేశుని కృపవలన నాజీవుడే పావనుడైనాడు. నాకు ఆ దేవుడే జీవనమైనాడు. నాకు ఈ జన్మలోగాని, గత జన్మలలోగాని కర్మబంధముల గొడవ యెందుకయ్యా? శ్రీహరిని ఆశ్రయించి శరణని భక్తితో వున్నాను. ఓ భవబంధములారా! పారరో (మీదిక్కువున్న చోటికి పారిపోండి).

**పద్యవివరణ:**

తే.గీ.॥ **చీమజన్మలనెత్తుచు శ్రమనెఱుగక**
**జీవులందరు దవ్వులతావులందు**
**జన్మలెత్తుచుకర్మల సమయు చుంద్రు**
**విడువలేకుంటి నేనిది వేంకటేశ!**





సంఖ్య: IV/83 రాగం : సామంతం
కీర్తన : పుట్టినవ్రతమే పంతము హరితో

**సామంతం**

**84 పట్టినవ్రతమే పంతము హరితో**
**గుట్టున శరణని కొంకఁగఁదగవా** ॥పల్లవి॥

**అవ్వల రోసినయన్నము గుడిచిన**
**నెవ్వరు నవ్వరు యింకనేలా**
**రవ్వగ నొల్లక రాజసము విడిచి**
**దవ్వులఁ జేకొనఁదగవా మనకు** ॥పట్టి॥

**విడిచినభూతము వెస మరలించిన**
**యెడయనియేహిత విఁకనేలా**
**యిడుమలఁ బిలుచుచు నిచ్చిన నొల్లక**
**అడుగఁబోయితే నమరునె మనకు** ॥పట్టి॥

**శ్రీవేంకటపతిసేవవారమై**
**యీవిధిఁ బరులసే విఁకనేలా**
**కైవస మీతఁడు కంటి మితనికృప**
**యీవల నావల నెదురా మనకు** ॥పట్టి॥ 84

**ఉపోద్ఘాతము:**

మాకు కొద్దిగా పట్టుదల యెక్కువ. అట్లాంటిది అనుకోకుండా శ్రీహరితో పంతానికి పోయాము. అదేదో వ్రతము పట్టినట్లు దీక్షగావున్నాము. అయ్యా!మాకెందుకండీ ఈ తిప్పలు. గుట్టుగా ఆ శ్రీహరికి శరణు మహాప్రభో! అని కొంకకన్ తగవా, అంటే, భయపడకుండావుండరాదా? అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో అన్నమయ్య ఇచ్చిన వుదాహరణలు చాలా గొప్పగా వున్నాయి. మనము

శ్రీవేంకటపతి సేవవారమైనాము. మనకు ఇంకొకడిని సేవించవలసిన అవసరం యేమిటి? అంటున్నారు. అదండీ దృఢ భక్తి అంటే. ఎందుకైనా మంచిదని చిల్లర రాళ్ళకు మొక్కుతూవుంటే చెడిపోదువురా ఒరే ఒరే!!

**తాత్పర్య వివరణ:**

మేము శ్రీహరితోనే పంతము పట్టినాము. అదే మా వ్రతము. కానీ ఈ తిప్పలన్నీ మాకెందుకు చెప్పండి? ఏదో గుట్టుగా (రహస్యంగా) శరణు మహాప్రభో! అని అంటే, కొంకగన్ తగవా (భయమును వదిలేస్తే సరిపోతుంది కదా!)

నాకు అన్నంవద్దు అని భీష్మించుకొని ఆ తరువాత రోసిన (పాడైపోయిన) అన్నం తింటే నలుగురూ నవ్వరా? ఇంఒకెందుకు ఈ పట్టుదలలు? రాజసము (దర్పము)విడిచిపెట్టవలసిన గుణము.దానిని శ్రేష్టముగా విసర్జించాలి. దూరపుదేశాలకుపోయి, యెవ్వరినో సేవించటం మంచిపనేనా?

ఎవ్వడినన్నా భూతం పట్టుకొంటే దాన్నివిడిపించినంతమాత్రాన సరిపోదు. అది మళ్ళీ పట్టుకొంటే యేమి ప్రయోజనం వుంటుంది? ఎవరన్నా పిలిచి ఇది తీసికోండి అనిఇస్తే నిరాకరించి మళ్లీ మనఅవసరానికిదాన్నే వారినుండి యాచిస్తే, అమరునె మనకు (గౌరవం వుంటుందా?)

మనము శ్రీవేంకటేశ్వరుని సేవావారము (భృత్యులము) మనకు ఆయనే పతి, మతి, గతి, స్థితి. ఈవిధంగా జీవించెదము. మనకు ఇంకొకరిని సేవించవలసిన అవసరం యేమివున్నది? ఈయన మనకు కైవసమైనాడు (స్వాధీనమైనాడు) ఇతని కృపను కంటిమి (చూచాము). ఈవల నావల (ఈ భూమీమ్మద, ఆ పరలోకాల్లోనూ) యెదురా మనకు (మనకెదురుంటుందా?)

**పద్యవివరణ:**

కం॥ **పట్టినవ్రతమే పంతము**
**గుట్టుగ శరణనుచు హరికి కొంకగ దగవా?**
**దిట్టయినవేంకటేశుని**
**కట్టితి మది మనకుయెదురు కలరే ధాత్రిన్?**





సంఖ్య: IV/189 రాగం : దేవగాంధారి
కీర్తన : పుట్టించినవాడు తానే బుద్ధిచెప్పేవాడు తానే

**దేవగాంధారి**

**85 పుట్టించినవాఁడు దానే బుద్ధిచెప్పేవాఁడు దానే**
**యిట్టె శ్రీహరి నన్నె ట్టీడేరించీనో** ॥పల్లవి॥

**యెంచుకొందు నొకవేళ నేఁటి సంసారమిదని**
**యించుకవడిలోనే మోహింతు నందుకు**
**కంచువంటి దీమనసు కటకటా యేది వాటి**
**చంచలుఁడ హరి నన్నేసంగతి సేసీనో** ॥పుట్టిం॥

**తలఁతు నేనొకవేళ దైవము గనేనని**
**కలిమి నంతటిలోనె కడు మరతు**
**చలపట్టె నిదివో నాజన్మములకేది వాటి**
**కలుషచిత్తుఁడ నన్నేకందువఁ బెట్టీనో** ॥పుట్టిం॥

**జ్ఞానినౌదు నొకవేళ సరిఁ గర్మినౌదును**
**మానువంటిదీగుణము మరేది వాటి**
**కోనల శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి**
**మానిసి నింతే యెట్టు మన్నించీనో** ॥పుట్టిం॥ **189**

**ఉపోద్ఘాతము:**

మానవుని పుట్టించుటయేకాదు, యేదిమంచి యేది చెడు అనే బుద్ధిని ఇచ్చేవాడు కూడా తానే అంటున్నారు అన్నమయ్య. ఈడేర్చటం అంటే సిద్ధింపజేయటం అని అర్థం. శ్రీహరి నన్ను ఇట్టే ఈడేరించేనో అని చింతామతి అవుతున్నారు. సంశయాలతో సతమతమయ్యే ఒక శరణాగతుని ఆవేదన ప్రతిఫలింపజేస్తున్నారు. నేను జ్ఞానినవుతానా లేక జీవనోపాధికి వెంపర్లాడే కర్మిష్టినవుతానా? మానవుని గుణములు మానువంటివి. నరికినా మళ్లీ

చిగురిస్తూనేవుంటుంది. ఇటువంటి మనిషిని కూడా మన్నించేవాడే మన శ్రీవేంకటేశ్వరుడు. అన్నట్లు 'వాటి' అంటే హద్దు.

**తాత్పర్య వివరణ:**

మనలనందరినీ పుట్టించనివాడు తానే. మనకు మంచీ చెడూ గ్రహించగల బుద్ధి (వివేకము) నిచ్చిన వాడు కూడా తానే. ఆ శ్రీహరి నన్నెట్లు ఈడేరించేనో (సిద్ధింపజేస్తాడో కదా!) ఇట్టే (సులభముగా) నాకు యోగ్యత కలిగించుట ఆయనొక్కడికే సాధ్యము.

నేను ఒక్కొక్కసారి ఛీ! ఇదెటువంటి సంసారము అని విముఖుడనవుతాను. అంతలోనే ఈ సంసారాన్ని మోహించి దీని ఉధృతానికి వివశుడనవుతాను. కటకటా! (అయ్యయ్యో!) ఈ మనసు కంచువలె పెళుసు స్వభావం కలది. అది యెప్పుడైనా విరిగిపోవచ్చును. దీనికి హద్దు యేది? శ్రీహరిపూని అతి చంచల స్వభావుడనైన నా సంగతి యేమిచేస్తాడో?

నా గత జన్మల సంస్కారమువలన ఒక్కొక్కసారి దైవమును యెరుగవలెనను కొంటాను. కాని కలిమి కళ్ళకు పొరలు కట్టి అంతలోనే అన్నీ మరచి సుఖవాంఛలో ఇరుక్కుపోతాను. దానితో చలపట్టి (మత్సరం పెరిగి) కలుషచిత్తుడనయ్యాను. దీనికి హద్దు యేదీ. ఇదిగో నా జన్మలకు తెగతెంపెట్లావస్తుంది? మరి ఇంకా నా జీవితంలో యెన్ని చమత్కారాలు జరుగుతాయో, యేమో?

సరే! ఈ జన్మలోనైనా జ్ఞానివలె సిద్ధిపొందుతానో లేక కర్మిష్ఠినై అందరితో సంగత్వం పెట్టుకొంటానో లేక మానువలె యెప్పటికప్పుడు చిగురించే గుణాలతో పరిమితి యెలా సాధ్యమవుతుంది? కోనలలోని శ్రీవేంకటేశ్వరా! నిన్నే కొలిచి శరణంటిని. నేను మానవమాత్రుడను, నీవుగాక నన్నెవరు మన్నిస్తారు తండ్రీ!

**పద్యవివరణ:**

ఉ॥ **పుట్టుకనిచ్చువాడు హరిబుద్ధిని నేర్పినవాడు దానెయౌ**
**ఇట్టె మురాంతకుండు నను యెవ్విధి బ్రోచునే దెల్పనైతి**
**గట్టిగ మోహపాశమును కాదని వీడను కర్మినౌదు నే**
**దిట్టతనంపు మానిసిని దీటుగ నీ శరణంటి శ్రీహరీ!**





సంఖ్య: IV/203 రాగం : నారాయణి
కీర్తన : ఏలికవు నీవట యింకా దైన్యమేల

**నారాయణి**

**86 ఏలికవు నీవట యింకా దైన్యమేల**
**తాలిమి నీచేఁతలకుఁ దగవు గాదనరా** ॥పల్లవి॥

**ఘనకర్మానుభవమే కావలె నొండె నాకు**
**వనజాక్ష నీసేవే వలె నొండె**
**కినుకఁ బూఁటయు సంకెలయు రెండు నేల**
**ననిచి యిందుకు నిన్ను నవ్వేరుసుమ్మీ** ॥ఏలి॥

**పైకొని నేఁ జేసినపాపమె కావలె నొండె**
**తూకొని నీనామముచేఁదుంచుట యొండె**
**సాకిరి చంకదుడ్డు శరణార్తి రెండు నేల**
**మేకొని యీమాట వింటే మెత్తురా నిన్నును** ॥ఏలి॥

**యిరవుగా మరపొండె యెరుక గావలె నొండె**
**సరస రెండును నైన సంగతౌనా**
**గరిమ శ్రీవేంకటేశ కరుణించితివి నన్ను**
**సరిబేసి జంటమాట జరపకు మింకను** ॥ఏలి॥ **203**

**ఉపోద్ఘాతము:**

ఓ దేవదేవా! నీవు ఏలికవు. మాకు నీవుండగా ఇంకా దీనత్వమెందుకుంటుంది? నీవు దయాసాగరుడవు. నీ క్షమాగుణాన్ని ప్రదర్శించే చేతలు న్యాయం కాదనగలవారెవరయ్యా? అంటున్నారు అన్నమయ్య. నేటి తెలుగువారికి సుపరిచితంకాని యెన్నో తెలుగు మాటలున్నాయి ఈ కీర్తనలో. 'ఒండె' అంటే "అట్లా కాకపోతే" అని అర్థం. ఈ నా దౌర్భాగ్యానికి కారణం నేను చేసిన పాపమే కాబోలు. ఒండె, పూనుకొని

నీ నామమును చేదుంచుట. ఒండె, సాకిరి చంకదుడ్డు శరణార్తి రెండునేల? ఈ మాటవింటే నిన్నునుమెత్తురా? అంటున్నారు. అర్థం కావటంలేదు కదూ!

**తాత్పర్య వివరణ:**

ఓ శ్రీహరీ! మాయేలికవు నీవట. మరి మాకు ఇంకా దైన్యమేల (దీనత్వమెందుకయ్యా?) తాలిమి (క్షమాగుణాన్ని ప్రదర్శించు) నీ చేతలకు (పనులను) తగవు కాదనరా (న్యాయం కాదనగలవారెవరున్నారయ్యా?)

నా ఈ దుస్థితికి కారణం ఎంతో అధికమైన కర్మను అనుభవించవలసి వచ్చుటయేమో? ఒండె (అట్లా కాకపోతే) ఓ వనజాక్షా (పద్మనయనా) నాకు నీసేవ ఒక్కటిచాలును. ఒండె, (అట్లా కాకపోతే) నాపై నీఆగ్రహ ప్రదర్శనము నన్ను సంకెలబెట్టుట – రెండూ దేనికయ్యా? స్వామీ నన్నిట్లా చేస్తే నిన్నే నవ్విపోతారు సుమా!

ప్రభూ! ఈ నా దౌర్భాగ్యానికి కారణం గత జన్మలో నేను చేసిన పాపమే కాబోలు. ఒండె, (అట్లా కాకపోతే) పూని నీనామమును చేదుంచుట (నా చేత్తో నేనే వదలివేయటం) కావచ్చును. ఒండే (అట్లా కాకపోతే) సాకిరి (సాక్షిగా)చంకలో దాచుకొన్న దుడ్డు (రొక్కము) మంచిదే, అట్లే నీ శరణార్తీ మంచిదే. కానీ రెండిటినీ ఒకేసారి నమ్ముకోవటం మంచిదా? ఈ మాటని యెవ్వరైనా మెత్తురా?

స్వామీ! మాకు మరపు, ఒండే యెఱుక కావలయును. ఒండే (అట్లాకాక) రెండూ ఒకేసారి వుంటే కుదురుతుందా? ఓ వేంకటేశ్వరా! నీ మహిమతో నన్ను కరుణించితివి. ఇకనైనా లల్లాయి కూతలు, రెండర్థాల మాటలు నాతో జరుపకుము ఇకను (ఇకనైనా). నన్ను దయదలచవయ్యా!

**పద్యవివరణ:**

కం॥ **ఏలికవు నీవు వుండగ**
**ఈ లీలను దైన్యమింకనేలా నాకున్?**
**తాలిమి నీ చేతలకును**
**ఏలా తగవింక వలదు ఇనచంద్రాక్షా!**





సంఖ్య: IV/182  రాగం : వరాళి
కీర్తన : నవమూర్తులైనట్టి నరసింహము వీడె

**వరాళి**

**87 నవమూర్తులైనట్టి నరసింహము వీఁడె**
**నవమైన శ్రీకదిరి నరసింహము** ॥పల్లవి॥

**నగరిలో గద్దెమీఁది నరసింహము వీఁడె**
**నగుచున్న జ్వాలానరసింహము**
**నగముపై యోగానందనరసింహము వీఁడె**
**మిగుల వేదాద్రి లక్ష్మీనారసింహము** ॥నవ॥

**నాఁటుకొన్న భార్గవూటునరసింహము వీఁడె**
**నాఁటకపు మట్టెమళ్లనరసింహము**
**నాఁటి యీ కానుగమానినరసింహము వీఁడె**
**మేఁటి వరాహపులక్ష్మీనారసింహము** ॥నవ॥

**పొలసి యహోబలాన బొమ్మిరెడ్డిచెర్లలోన**
**నలిరేఁగిన ప్రహ్లాదనరసింహము**
**చెలఁగి కదిరిలోన శ్రీవేంకటాద్రిమీఁద**
**మెలఁగేటి చక్కని లక్ష్మీనారసింహము** ॥నవ॥ **182**

**ఉపోద్ఘాతము:**

శ్రీ కదిరినరసింహుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. వీడు నవమూర్తులైన నరసింహము, అంటున్నారు. ఈ నరసింహము

క్రొత్తగానున్న నరసింహమట. ఆ తరువాత అచ్చట గల నవనారసింహులను పేరుపేరునా ప్రస్తుతించారు. చివరికి అన్నమయ్య కొసమెరుపులా ఈ కదిరిలో వున్నదీ, ఆ శ్రీవేంకటాద్రిమీదవున్నదీ చక్కని ఈ లక్ష్మీనారసింహుడే అని ముక్తాయింపునిచ్చారు. ఇంత చక్కటి కీర్తనలో నవనారసింహులను కీర్తించటంలో అన్నీ సరళమైన పదములే అనుకొంటే అంతకంటే తెలివితక్కువతనం వుండదు.

**తాత్పర్య వివరణ:**

వీడే (ఈ దేవదేవుడే) నవమూర్తులైనట్టి (తొమ్మిది రూపములలోనున్న) నరసింహము. ఈ కదిరి నృసింహుడు, నవమైనవాడు (బహు నూతనముగానున్న దేవుడు).

ఈ కదిరి నగరమున గద్దెమీది (సింహాసనముపై) కూర్చున్న నరసింహము వీడేనండీ! అల్లదిగో అక్కడ నగుచున్న (నవ్వులొలకబోస్తున్నవాడే) జ్వాలా నరసింహుడు. ఆ కనుపించుచున్న నగముపై (కొండమీద) యోగముద్రలో వున్న జ్ఞానస్వరూపుడే యోగానంద నరసింహుడు. మిగుల (అతిశయించి) ఈ వేదాద్రి వెలసినవాడే లక్ష్మీనరసింహుడు.

నాటుకొన్న (సుస్థిరముగా నిలిచిన) వీడే భార్గవూటు నరసింహము. ఇదిగో ఈ మట్టెమళ్లలో వెలసిన నరసింహుడు ఆర్తుల ఆపదలను మట్టుబెడతాడు. ఈ కానుగమానిలో వున్న, నాటి (అనాదివాడైన) నరసింహుడు వీడే. వీనికి భక్తితో మొక్కండి. ఈ మేటి వేలుపే వరాహలక్ష్మీనారసింహుడు. ఈయన ఈప్సితప్రదాత.





ఇదిగో ఈయనే అహోబలంలోని ప్రహ్లాదనరసింహుడు. ఇక్కడ కదిరిలో మనని బ్రోచుటకు అవతరించినాడు. బొమ్మిరెడ్డి చెర్ల (పల్లె) అనే ఈవూరిలో నలిరేగిన (యోగ్యముగా స్థిరపడిన) ఈ నరసింహుడు కూడా ప్రహ్లాద నారసింహుడే. ఇదిగో వేంకటాద్రిమీద భక్తుల కొంగు-బంగారమైన ఆ శ్రీవేంకటేశ్వరుడే చక్కగా మెలగేటి ఈ కదిరి లక్ష్మీనారసింహము. మన రక్షకుడు.

**పద్యవివరణ:**

సీ॥ శ్రీ కదిరి నృసింహ నీకు మ్రొక్కెదమయ్య!
నవరూపములుగల నవ్యసింహ!

జ్వాలానృసింహుడు సకల యోగానంద
బలుకేసరివి వేద పర్వతమున

భార్గపూటునృసింహ! మట్టెమళ్ళ నృసింహ!
కానుగమానిలో ఘన నృసింహ!

శ్రీవరాహాలక్ష్మి శ్రీనృసింహ! అహో-
బలసింహ బొమిరెడ్డిపల్లె సింహ

ఆ.వె॥ గద్దెపైన చెలగె కదిరినృసింహుడు
వేంకటేశుడయ్య విదితమాయె
చక్కనైనవాడు సాధు నృసింహుడు
మొక్కుడయ్య! జన్మముక్తినొంద.

సంఖ్య: IV/181 రాగం : కౌశి
కీర్తన : కొండంత పొడవుతోడ కోనేటి రాయుడు వీడె

**కౌశి**

88 కొండంతపొడవుతోడ కోనేటిరాయఁడు వీఁడె
నిండుకొని రథమెక్కి నిలుచున్నవాఁడు ॥పల్లవి॥

పాతాళవాసులైన బలురక్కసులమీఁద
యేతులఁ బరపెఁ దేరు యిదె దేవుఁడు
ఆతల జలధిచొచ్చినట్టిదానవులమీఁద
ఘాతతోడఁ దోలె నదె కడు రభసమున ॥కొండ॥

ఆకాశముదూరినట్టియదటుదైత్యులమీఁద
దాకతో నడపించెఁ బంతాన దేవుఁడు
దీకొని యష్టదిక్కులఁ దిరిగి యసురలపై
భీకరముగా మోగించె బిరుదులు మెరసి ॥కొండ॥

ధరమీఁదు గలిగిన దనుజకోట్ల నెల్ల
సొరిది శ్రీవేంకటేశుఁడు పారఁదోలెను
గరిమ నలమేల్మంగ నురమునఁ బెట్టుకొని
తిరముకొలిపెఁ దేరు దిక్కులెల్ల గెలిచి ॥కొండ॥ 181

**ఉపోద్ఘాతము:**

కోనేటిరాయుడి రథోత్సవము కన్నులపండువగా జరుగుతున్నది. రథమంతా నిండుకొని ఆ స్వామి దానిపై నిలుచునివున్నాడు. ఆయన సామాన్యంగా కనుపించుటలేదు. కొండంత పొడవుతో (కొండ అంత ఉన్నతుడై) కనువిందు చేయుచున్నాడు. ఆయన రథముపై పోతున్నదెందుకని అనుకొంటున్నారు? రక్కసులను, దానవులను, దైత్యులను, అసురులను మరియు దనుజులను పారద్రోలుటకట. అది సరే, ఈపై చెప్పినవాళ్ళంతా



హరి నీమయమే అంతాను

ఒకటికాదా? మరి వాళ్ళమధ్య తేడా యేమిటి?అన్నమయ్యకు సాటి మరెవ్వరూ లేరని అందుకే అంగీకరించాలి.

**తాత్పర్య వివరణ:**

వీడే (ఈ స్వామియే) కొండంత పొడవుతోడ (కొండయంత ఎత్తు కలిగిన) కోనేటిరాయుడు. ఈయన కొండలలో నెలకొనియుండుట చేత తానూ ఒక కొండవలె ఉన్నతుడై వున్నాడు. రథమునెక్కి నిలుచుని వున్న ఆ దేవదేవుడు నిండుకొని (రథమంతా విస్తరించి) యున్నాడు.

ఆయన యెవ్వరెవ్వరిని ముట్టడించడానికి వెళ్ళుచున్నాడో తెలియునా? మొదట పాతాళలోకవాసులైన బలవంతులగు రక్కసులమీదకు ఇదే ఆ దేవుడు తన తేరును (రథమును) యేతుల బరపై (ఉద్ధతితో నడిపినాడు.) ఆతల (ఆ తరువాత) సముద్రములో దాగి నివసించు దానవుల మీదకు అతి రభసముతో (వేగముగా) ఘాతతో (దెబ్బతీయుటకు) అదె తన రథమును తోలినాడు.

ఇకపోతే దైత్యులని దితిసంతానం నుంచి వచ్చిన దుర్మార్గులున్నారు. ఆకాశగమన శక్తిగల వీరు ఆకాశంలో దూరి అదటున (గర్వముతో) వుంటారు. స్వామి దేవుడైనందున వాళ్ళని తుదముట్టించాలని పంతం పట్టి తన రథమును, దాకతో (భీకరముగా) నడిపించాడు. అష్టదిక్కులలో గమ్యంలేక చరించేవారు అసురులు. పైగా దుష్కృత్యాలు చేస్తుంటారు. తన బిరుదు (ప్రతిజ్ఞ) నెరవేరునట్లు స్వామి భీకరముగా విజయదుంధుభిని మోగించినాడు.

భూలోకంలోవున్న కోట్లాది దుష్ట స్వభావులే దనుజులు. భూమిపై నున్న మక్కువచేత శ్రీవేంకటేశ్వరుడు వారందరినీ సొరిది (క్రమముగా) పారద్రోలినాడు. మహిమాన్వితుడైన స్వామి తన దేవేరి అలమేల్మంగను తన ఉరమున నిలుపుకొని, తేరు తిరముకొలిపె (స్థిరముగా) నడిపి, దిక్కులనన్నింటినీ గెలిచినాడు.

**పద్యవివరణ:**

ఆ.వె॥ **కొండయంత పొడవు కోనేటిరాయడు**
**నిండి రథమునెక్కి నిలిచినాడు**
**అసురులున్ను దైత్యులవలరక్కసు లెల్ల**
**దిక్కులందు బారి సొక్కుడికను.**

సంఖ్య: IV/202 రాగం : నాగవరాళి
కీర్తన : దైవమా నీవే దయా ధర్మము దలచుటింతే

**నాగవరాళి**

**89 దైవమా నీవే దయాధర్మము దలఁచు టింతే**
**వావిరి నౌఁగాదన నవ్వల నిఁక నెవ్వరో** ॥పల్లవి॥

**యెంచఁగ నీదేహమిది యింద్రియాదులకుఁ జర(ఁజెఱ?)**
**వంచనతో విడిపించువారలెవ్వరో**
**పంచభూతాలకుఁ జర బ్రదికేటి బ్రదుకెల్ల**
**యించుకంట దయఁజూడ నిఁక నెవ్వరో** ॥దైవ॥

**పోరచి నామన సిది పుణ్యపాపాలకుఁ జర**
**మారుకొని విడిపించ మరి యెవ్వరో**
**తీరనినాజన్మ మిది దినభోగాలకుఁ జర**
**యీరీతి విడిపించ నిఁక నెవ్వరో** ॥దైవ॥

**ఆతుమ యనాదినుండి హరి నీభక్తికిఁ జర**
**ఆతల నెవ్వరికైనా నరుహమౌనా**
**యీతల శ్రీవేంకటేశ యిటు నీవే కాతుగాక**
**ఘాతల నీదాసులకు గతి యెవ్వరో** ॥దైవ॥ **202**

**ఉపోద్ఘాతము:**

ఓ దైవమా! నీవే ఎలాగో ఒకలాగ మమ్మల్ని దయదలచాలి. వావిరి (క్రమముగా) నీవే మమ్మల్ని ఔగాదన, అంటే, ఒకసారి అవును ఒకసారి కాదు అనిన యెడల ఆపైన ఇక మాకు, నెవ్వరో (ఇంక మాకు దిక్కుయెవ్వరు స్వామీ!) అని అంటున్నారు అన్నమయ్య.

జుట్టుపీక్కుంటే నా బుద్ధికి ఆ మాత్రం తట్టింది. అన్నమయ్య భావన మనము అందుకోలేము. ఓ శ్రీహరీ! ఆతుమ అనాదినుండి నీ భక్తికి





“చెర’యైనది. ఇక అదియెవ్వరి నీ అంగీకరించదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే దానిని కాపాడాలయ్యా! అని అంటున్నారు. కీర్తన చూడగానే ఇది తట్టింది అనుకోకండి ఎంతో పరిశ్రమ అవసరమైంది.

**తాత్పర్య వివరణ:**

ఓ దైవమా! ఏదో విధముగా నీవే నన్ను దయాధర్మము అని తలచి రక్షించాలి. ఇంతేకాక మరి దారిలేదు. ఇట్లు అవ్వల (ఆ తరువాత) నీవు, వావిరి (ఒక క్రమములో) ఔగాదన (ఒకసారి అవునని, ఒకసారి కాదని అనినయెడల) ఇకయెవ్వరో (దిక్కుయెవ్వరున్నారయ్యా!)

ప్రభూ! నీవు కల్పించినవన్నీ ఒకదానికింకొటి “చర” (చెఱ). అది తప్పింపలేని బంధనమే. ఎంచి చూచిన ఈ నా దేహమున్నదే... ఇది నా ఇంద్రియాలకు చెఱ. దీనినుంచి కిటుకుతో నన్ను విడిపించే వారెవ్వరో! నేను బ్రతికేటి ఈ బ్రతుకున్నదే... ఇది పంచభూతములకు చెఱ, అయిపోయింది. ఇక కొద్దిపాటి కరుణ చూపుటకు యెవ్వరో?

స్వామీ! పొరచి (వ్యర్థమైన) నా ఈ మనస్సు పాపపుణ్యాలకు చెఱ. అది నిరంతరం ఆ రెంటిలో ఏదో ఒక దాన్ని మూట కట్టుకుంటూనే వుంటుంది. ఈ పీడ నుంచి మమ్ము విడిపించే దిక్కు యెవ్వరో? అంతులేని ఈ నా జన్మవున్నదే... ఇది నేను దినదినమూ వెంపర్లాడే భోగాలకు చెఱ. దీనినుండి నన్ను విడిపించుటకు, ఇక నెవ్వరో?

ఓ దేవదేవా! శ్రీహరీ! నా ఈ ఆత్మవున్నదే... ఇది అనాదిగా (పూర్వమునుంచీ) నీ భక్తికి చెఱ. ఆతల (ఆ తరువాత) యెవ్వరినైననూఅది అర్హులని ఒప్పుకోదు. ఈతల (ఇటుపై) ఓ వేంకటేశ్వరా! నీవే నన్ను కాతువుగాక (రక్షించెదవుగాక!) అట్లా కాకున్న నీ దాసులకు ఘాతల (ఆపదలలో) గతియెవ్వరో? (దిక్కు యెవ్వరున్నారు తండ్రీ!)

**పద్యవివరణ:**

కం॥ **రోతగు ‘చెర’ యే బ్రతుకిది**
**ఆతల నీ భక్తి యెవరికైన అరుహమే**
**ఈ తీరున నౌగాదన**
**నా తరమా? ధర్మమనుచు నడిపించు హరీ!**

సంఖ్య: IV/183 రాగం : శంకరాభరణం
కీర్తన : కొలువుడు వలసితే గొలువక మానుడు

## శంకరాభరణం

**90 కొలువుఁడు వలసితేఁ గొలువక మానుఁడు**
**తెలియ నీతఁడే సుండీ దేవదేవోత్తముఁడు ॥పల్లవి॥**

**పుడిమికాధారము పురుషోత్తముఁడె**
**కుడిచి కట్టెడివారు కోటానఁగోటి**
**విడువుఁ దేఁటికిఁ బారవేసినగుంటికినెల్ల**
**వొడయఁ డీతఁడే సుండీ వున్నతోన్నతుఁడు ॥కొలు॥**

**అమృతమిచ్చినవాఁడు ఆదినారాయణుఁడే**
**సములై జీవించువారు సతానసంఖ్య(?)**
**భ్రమయకుఁ దెండమావిబయళ్లు చెరువులంటా**
**అమర నీతఁడే సుండీ హరి వాసుదేవుఁడు ॥కొలు॥**

**చెలువుఁ డీతఁడె సుండీ శ్రీవేంకటేశుఁడె**
**పలుకుఁ బంతాలవారు పదివేగురు**
**తలఁచకుఁ డీదోమ దంతితోను సరిగా**
**జలజనాభుఁడే సుండీ సకలలోకేశుఁడు ॥కొలు॥ 183**

**ఉపోద్ఘాతము:**

ఈతడే దేవదేవోత్తముడు. తెలియాలంటే ఇదే నిజము. కావాలంటే ఈయనను కొలవండి. వద్దనుకుంటారా కొలవకండి. ఇక మీ కర్మకు మీరే బాధ్యులు అంటున్నారు అన్నమయ్య. సుండీ! అనే మాటకు అర్థం సుమా! అని. ఈతడే చెలువుడైన శ్రీవేంకటేశ్వరుడు సుమా! పంతముతో వరములిచ్చే ఇతర దేవతలు పదివేలమంది వుండవచ్చును. కాని వారికి ఈ దేవదేవోత్తమునికీ పోలికయా? ఏనుగెక్కడ దోమయెక్కడ,





ఆలోచించండి. సకలలోకాలకు ఈశ్వరుడు ఈ జలజనాభుడే సుండీ అంటున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రజలారా! వలసితే (కావలెనంటే) ఇతనిని కొలువుడు (పూజించండి). కాదనుకొంటే కొలువక మానుడు (పూజించటం మానేయండి). ఎవరి భాగ్యానికి యెవ్వరు కర్తలు? కాని తెలిసినయెడల ఈతడే దేవదేవోత్తముడు, సుండీ (సుమా!)

ఈ పుడమికి ఆధారమైనవాడు పురుషోత్తముడైన శ్రీహరి. ఆయన కృపవల్ల తిండి తింటూ, బట్టకట్టగలవారుమాత్రం కోటానుకోటి (కోట్లకొద్దీ) వున్నారు. మీరు పారవేసిన (ఉపయోగించని) గుంటిక (గొయ్యివంటి వ్యర్థులైనా) ఆయనే దిక్కంటే యేటికీ (యెన్నటికీ) విడువడు. ఉన్నతోన్నతుడైన, ఒడయడు (మగడు) ఈతడే సుండీ! (ఈయనే సుమా!)

ప్రపంచానికి అమృతమిప్పించినవాడు ఈ ఆదినారాయణుడే. సములై (మేము ఆయనతో సమానమైనవారము అని జీవించేవారు ఈ లోకంలో సతానసంఖ్య (వందలకొద్దీ సంఖ్యలోనున్నారు). ఓ అమాయకులారా! ఆయన మిమ్మల్ని భ్రమకు గురి చేస్తున్నాడు. ఎక్కడన్నా ఎండమావి, ఆరుబయటవున్న చెఱువుతో సమానమవుతుందా? మనకు అమరిన ఈతడే శ్రీహరి సుండి! ఈయనే వసుదేవ సుతుడైన వాసుదేవుడు.

చెలువుడు (స్నేహశీలి) యైన ఈతడే తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సుండీ! ఈ ప్రపంచంలో మాటమాటకు పంతంపట్టి దర్పంతో పలికేవారు పదివేగురు (పదివేలమందిపైన) వుంటారు. దోమ, దంతి (ఏనుగు) సమానమని ఎన్నడూ తలచవద్దు. వేరెవ్వరు ఈయన సరికాజాలరు. సకలలోకేశ్వరుడు ఈ జలజనాభుడే (ఈ పద్మనాభుడే) సుమండీ!

**పద్యవివరణ:**

చం॥ **కొలువుడు కావలెన్‌యనిన గొల్వక మానుడు మీదు చిత్తమే**
**తెలియగ సత్యమొక్కటియె దేవతలందరిదేవుడీతడె**
**చెలువుడు వేంకటేశ్వరుడు శ్రీధరుడీతనిసాటి యుందురా?**
**తెలియక దంతి దోమలొక తీరుగ జూచెడి వెఱ్ఱి నేమనన్?**

సంఖ్య: IV/200 రాగం : ధన్నాసి
కీర్తన : నాకు గలపని యిదె నారాయణుఁడ నీవు

**ధన్నాసి**

**91** **నాకుఁ గలపని యిదె నారాయణుఁడ నీవు**
**శ్రీకాంతుఁడవు నాకు సిద్ధించుకొరకు ॥పల్లవి॥**

**జలధివంటిదిసుమీ చంచలపు నామనసు**
**కల విం(ద్రియముల నేటిజలచరములు**
**వొలసి భక్తెనెడి వోడ యెక్కితి నేను**
**జలశాయి నీవ నేటిసరకు దెచ్చుటకు ॥నాకుఁ॥**

**కొండవంటిదిసుమీ కొనకెక్కు నామనసు**
**వుండుఁ గామాదులను వురుమృగములు**
**వుండి నీశరణమనువూఁత గొని యెక్కితిని**
**కొండలప్ప నీవనేటికొనఫలముకొరకు ॥నాకుఁ॥**

**టీ(ఠీ?)వులను ధరణివంటిదిసుమీ నామనసు**
**నీవె శ్రీవేంకటేశ నిక్షేపము**
**వావాత నీవనేటి వసిదవ్వి కైకొంటి**
**భూవిభుఁడ నీవనేటి పురుషార్థము ॥నాకుఁ॥ 200**

**ఉపోద్ఘాతము:**

ఓశ్రీమన్నారాయణుడా! నాకువున్నపని ఇదియే. నాకు శ్రీకాంతుడవైన నీవు సిద్ధించుటకొరకు నీపదములను విడువను, అంటున్నారు అన్నమయ్య. దీని పల్లవి, ఆపైరెండుచరణాలు తేలికగానేవున్నాయని మురిసిపోయాను. మూడవ చరణం నన్నుఛిన్నాభిన్నం చేసేసి నామీదనాకే నమ్మకంపోయేట్లు చేసింది.

"వావాత నీవనేటి వసిదవ్వి కైకొంటి" అనే చరణం, మరణం అయింది. ఈక్షణం వరకూ అయోమయమే. ఆపై వెంకన్న దయ.





**తాత్పర్య వివరణ:**

ఓ నారాయణుడా! నాకుగలపని (నా కర్తవ్యం) ఇదే. శ్రీకాంతుడవైన నీవు నాకు సిద్ధించుట కొరకు నిన్ను శరణని యెన్నటికీ వదలను.

ప్రభూ! బహుచంచలమైన నా మనస్సు జలధివంటిదిసుమీ (అల్లకల్లోలమైన సాగరము వంటిది, సుమ్మీ!) ఇందులో ఇంద్రియములనేటి ఘోరమైన జలచరములున్నవి.నా అదృష్టం వలన, ఒలసి (దీనిలో ప్రవేశించాక) భక్తి అనే ఓడను యెక్కగలిగాను. కష్టపడి నౌకాయానం చేస్తూనే వున్నాను. దేనికో తెలియునా స్వామీ! నీవు జలధిశాయివి కావున యెప్పటికైనా నీవు అనే సరకు తెచ్చుకొని నా జన్మ తరింపజేసికొంటాను.

ఓ దేవదేవా! కొనకెక్కు (అధికమగు) నా మనస్సు కొండవంటిది సుమా! ఈ కొండమీద కామ, క్రోధ, మోహ, లోభ, మద, మచ్చరములను గొప్ప మృగములు సంచరించుతూనేవుంటాయి. కానీ నాకేమి భయము లేదు. ఎందుకంటే నేను నీ శరణము అనే వూతను (ఆవలంబమును అంటే సపోర్టును), కొని (పట్టుకొని) కొండనుయెక్కితిని. ఇదంతా యెవరికోసం స్వామీ! ఓ కొండలప్ప! (ఏడుకొండలవాడా!) నీవు అనేటి కొనఫలము (అంతిమఫలము) కొరకేనయ్యా!

ఓ సర్వేశ్వరా! నా మనస్సు, ఠీవులను (వైభవములలో) ధరణి (భూదేవి) వంటిది. దీనివలన దొరికే గొప్పనిక్షేపము (నిధి) శ్రీవేంకటేశ్వరుడవైన నీవే. "వావాత నీవనేటి వసిదవ్వికైకొంటి" అటుపైన నా వావాత (నా నోరారా) నీవు (అంటే శ్రీమన్నారాయణుడు) అనేటి వసిదవ్వి (ఔషధము) కైకొంటి (సేవించితిని). దాని ఫలితంగా భూవిభుడవైన నీవు అనే పురుషార్థమును (మోక్షమును) నేను సాధించితిని.

**పద్యవివరణ:**

ఆ.వె.॥ **నాకుగల పని యిదె నారాయణుడ నీవు**
**శ్రీహరివిదె నీదు సిద్ధికొఱకు**
**మ్రొక్కువాడనయ్య! చక్కని, వేంకన్న**
**భూవిభువడవు నీవు పురుషశ్రేష్ఠ!**

సంఖ్య: IV/199 రాగం : మలహరి
కీర్తన : పరమోపకారులు ప్రత్యక్షదైవములు

**మలహరి**

**92 పరమోపకారులు ప్రత్యక్షదైవములు**
**హరిదాసు లిత్తురు బ్రహ్మానందసుఖము ॥పల్లవి॥**

**పాపుదురు లోకములో పాపపంకమెల్లాను**
**దీపించ శ్రీపాదతీర్థమున**
**వోపుదురు హీనుల వున్నతులఁగాఁ జేయ**
**చేపట్టి కన్నులెదుటిసేవామాత్రమున ॥పర॥**

**చెఱుతు రజ్ఞానమెల్లా జనులు తమ్ముఁజేరిన**
**మఱియుఁ దమప్రసాదమహిమవల్ల**
**తెలిచిత్తురు మోక్షము తెరువు ప్రాణులకెల్లా**
**మొఱఁగి మూలనుండి మొక్కినమాత్రమున ॥పర॥**

**చెల్లఁబెట్టుదు రెందైనా చిల్లరకులమువారి**
**తెల్లమిగా మంత్రోపదేశమున**
**యిల్లిదె శ్రీ వేంకటేశ యెక్కుడుసేసిరి మమ్ము**
**సల్లాపనల తమసహవాసములను ॥పర॥ 199**

**ఉపోద్ఘాతము:**
ఈ లోకంలో హరిదాసులందరూ తమ ఆశ్రితులకు బ్రహ్మానందమునొసగెదరు. ఎందుకంటే వారు పరుమోపకారులు. వారు ప్రత్యక్షదైవమువంటి వారు, అంటున్నారు అన్నమయ్య. అటువంటి గురుపుంగవుల శ్రీపాదతీర్థము ఎంత మహిమాన్వితమో వివరిస్తున్నారు. వారు మోక్షమును కూడా ప్రసాదించగల సమర్థులు అంటున్నారు. చిల్లరకులమువారు అంటే (హీనకులజులని భావము). ఆ గురువుల విశిష్ఠత యేమంటే హీనకులజుడైనా వానిని శ్రీవేంకటేశుని చేర్చుటకు మంత్రోపదేశము చేయగలరు అంటున్నారు.





**తాత్పర్య వివరణ:**

ఓ జనులారా! ఈ హరిదాసులున్నారే, వారు ప్రత్యక్ష దైవమువంటివారు. వారు పరమోపకారులు (అతి శ్రేష్ఠమైన వుపకారమును చేయగలిగినవారు). అందుచేత వారు వారినాశ్రయించిన శిష్యులకు పరమానందసుఖమును అనుభవపూర్వకముగా నిత్తురు.

వారు (హరిదాసులు) లోకములోని పాపమనే బురద కడిగివేయగల సమర్థులు. శోభాయమానముగా వారు తమ శ్రీపాదతీర్థమునొసగి ఆ పంకిలమెల్లా పాపుదురు (పారద్రోలుతారు). హీనులైన మనబోటివారికి, మన కన్నులయెదుటనే వారిసేవామాత్రమున గొప్ప ఉన్నతి నొసగ సమర్థులు. వారు అనుగ్రహించి మనలను చేపట్టితే చాలును.

వారు (హరిదాసులు) తమను ఆశ్రయించిన జనులను, కేవలము తమ ప్రసాదము యొక్క మహిమతో వారి అజ్ఞానాంధకారమును పటాపంచలుచేసి చెఱతురు (మళ్ళీ తలెత్తకుండా చేస్తారు). వారు ఈ ప్రాణులకెల్లా మోక్షమార్గమును తెలిచి (బాహాటముగానే) ఇయ్యగల సమర్థులు, మనము చేయవలసినదల్లా... ఒకమూలనిలబడి మ్రొక్కితేచాలును.

వారు (హరిదాసులు) యెందైనా, చిల్లరకులమవారిని (అంత్యజులను) తెల్లమిగా (స్పష్టముగా) మంత్రోపదేశము (ఓం నమోనారాయణాయ అనే మంత్రోపదేశము చేత) వారి పాపములనెల్లా చెల్లబెట్టెదరు. ఓ శ్రీవేంకటేశ్వరా! కేవలము తమ సహవాసముచేత సల్లాపముచేత (చక్కటి బోధనతో) ఇల్లిదే (ఇదిగో) మమ్ముకూడా యెక్కుడు సేసిరి (అన్నమాచార్యులవారిని చేశారు) తండ్రీ!

**పద్యవివరణ:**

కం॥ **పరమోపకారులట భువి**
**పరికించగ దైవములట ప్రత్యక్షముగా**
**హరిదాసులిత్తురయ్యా!**
**చిరబ్రహ్మానందసుఖము శ్రీగిరినిలయా!**

సంఖ్య: IV/198 రాగం : బౌళి
కీర్తన : ఇంతలేకుంటేనది యెక్కడి సుజ్ఞానము

**బౌళి**

**93** **ఇంత లేకుంటే నది యెక్కడి సుజ్ఞానము**
**దొంతుల తనజన్మము తొల్లిటిదే కాదా** ||పల్లవి||

**యెదిటివా రెరిఁగితే యేమీ ననక మరి**
**చెదరకుండుటే పో శ్రీవైష్ణవం**
**కదిసినకాంతలను కనకము వొడగంటే**
**పదరకుండుటే పో పరమసాత్వికము** ||ఇంత||

**క్రియయెరఁగనివారు కీడు సేసితేఁ దాను**
**దయఁ జూచుటే హరిదాస్యఫలము**
**రయమునఁ దామసము రాజసము గలిగితే**
**భయపడి తొలఁగుటే ప్రపన్నగుణము** ||ఇంత||

**వొరసి యెవ్వఁడు దను నుబ్బించి పొగడిన**
**నిరతితో వీఁగనిదే నిచ్చ(శ్చ?)లబుద్ధి**
**యిరవై శ్రీవేంకటేశ్వరుదాసులఁ గని**
**శరణని మొక్కుటే సర్వజ్ఞగుణము** ||ఇంత|| **198**

**ఉపోద్ఘాతము:**

జీవుల జన్మలన్నీ దొంతుల జన్మలే. ఒకదానిపై ఇంకొకటిబెట్టిన కుండలదొంతివలె ఈ జన్మలు కూడా దొంతిలాగ దేని కర్మ అనుభవం దానిదే అన్నట్లుంటాయి. ఒక్కొక్కసారి ఆ కర్మయేదో ఒక జన్మలో అనుభవించాల్సివస్తుంది. దీని వెనుక ఇంత తిరకాసువున్నది. ఇంత లేకుంటే బహుశా అది సుజ్ఞానము కాదేమో అంటున్నారు అన్నమయ్య. అలాగే





అలవోకపదములలో శ్రీవైష్ణవం, పరమసాత్వికము, హరిదాస్యము, ప్రపన్నగుణము, నిశ్చలబుద్ధి, సర్వజ్ఞగుణము అంటే యేమిటో వివరిస్తున్నారు.

**తాత్పర్య వివరణ:**

ఓ భక్తులారా! కుండలన్నియు ఒకదానిపై నింకొకటి దొంతులుగా అమర్చబడినయెడల, ఏ కుండలో యేమున్నదో తెలియుట అసంభవము కదా! అట్లే మన తొల్లిటి జన్మలలో మనము యేమేమి కర్మలు చేశామో యెవరికి తెలుసు? మనబోటి జీవులకు ఆ కర్మను అనుభవించక తప్పదు. ఇంత తిరకాసువున్నది ఇందులో.ఇంత లేకుంటే బహుశా అది సుజ్ఞానము కాదేమో!!

ఎదుటివారు ఎరిగితే (నమస్కరిస్తే) యేమీననక (ప్రత్యుత్తరమీయక) మరి చెదరక (గర్వించక) మౌనముగా "కృష్ణార్పణం" అనుకోవటమే పో, శ్రీవైష్ణవం అంటే. తమను సమీపించి నమస్కరించిన కాంతలను బంగారమును, వొడకంటె పదరకుండుటే (వోర కంటకూడా చూడకపోవుటయే) "పరమసాత్విక" గుణము.

క్రియనెరుగనివారు (శిక్షాస్మృతి తెలియనివారు) కీడుసేసితే (అపకారము చేస్తే) తనూ వానిని దయజూచుటే నిరంతర హరిదాస్యమువలన కలిగే ఫలితము. రయమున (ఏదో తొందరపాటులో) తామస రాజసుగుణములు ప్రకోపించితే, వెంటనే భయపడి తొలగుటే (అక్కడనుండి నిష్క్రమించుటయే ప్రపన్న గుణము అంటారు.

ఒరసి (తనకు చేరువయై) యెవరన్నా తనను వుబ్బించి పొగిడితే, నిరతితో (ఆసక్తితో) వీగనిదే (చెదరిపోని) బుద్ధినే నిశ్చల బుద్ధి అంటారు పెద్దలు. ఇరవై (స్థిరచిత్తులై) శ్రీవేంకటేశ్వరునిదాసులను చూచి శరణాగతులై వారి పదములను తాకి మ్రొక్కుటయే సర్వజ్ఞత్వము అని పిలువబడుచున్నది.

**పద్యవివరణ:**

కం|| **దొంతుల తొల్లిటిజన్మల**
**ఇంతటిసుజ్ఞానమంత యెక్కడిదయ్యా?**
**యెంతయు నేరిచి నను శ్రీ-**
**కొంతుని శరణనక సిద్ధి కలుగునెధాత్రిన్?**

సంఖ్య: I/477 రాగం : నాట
కీర్తన : ఇందులోనేకానవద్దా యితడు దైవమని

**నాట**

**94** **ఇందులోనే కానవద్దా యితఁడు దైవమని**
**విందువలె నొంటిమెట్టవీరరఘురాముని** ||పల్లవి||

**యెందు చొచ్చె బ్రహ్మవర మిల రావణుతలలు**
**కందువ రాఘవుఁడు ఖండించునాఁడు**
**ముందట జలధి యేమూల చొచ్చెఁ గొండలచే**
**గొందిఁబడఁ గట్టివేసి కోపగించేనాఁడు** ||ఇందు||

**యేడనుండె మహిమలు యిందరి కితఁడు వచ్చి**
**వేడుకతో హరివిల్లు విఱిచేనాఁడు**
**వోడక యింద్రాదు లెందు నొదిగి రీతనిబంటు**
**కూడఁబట్టి సంజీవికొండ దెచ్చేనాఁడు** ||ఇందు||

**జముఁ డెక్కడికిఁ బోయ సరయువులో మోక్ష-**
**మమర జీవుల కిచ్చె నల్లనాఁడు**
**తెమలి వానరులై యీదేవతలే బంట్లైరి**
**తిమిరి శ్రీవేంకటపతికి నేఁడు నాఁడు** ||ఇందు|| **477**

**ఉపోద్ఘాతము:**

ఒంటిమెట్ట అనే గ్రామంలో వెలసిన వీరరఘురాముని మీద చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ ఒంటిమెట్టయే పోతనగారి భాగవతావిష్కరణ జరిగిన వూరని పోతన రాయలసీమవాడని నేటికీ కొందరు నమ్ముతారు. ఈ రఘురాముని చూస్తేనే పరమాత్ముడైన శ్రీమన్నారాయణుడితడే అని గ్రహించవచ్చును, అంటున్నారు. ఇక ఆ తరువాత అన్నమయ్య ఆనవాయితీగా శ్రీరామగాధ మళ్ళీమళ్ళీ వివరించి మనల్ని పునీతులను చేస్తారు. ఈ





వానరులంతానాడు శ్రీరామునికి నేడు శ్రీవేంకటపతికి బంట్లైరి అంటున్నారు. ఎందుకంటే వారు నిజానికి దేవతలే.

**తాత్పర్య వివరణ:**

ఇందులోనే (ఈ సంఘటనలతోనే) ఈతడు దైవమని కానవద్దా (గ్రహించవలదా)? విందువలె (కన్నులకువిందువలె) కనుపించుచున్న ఈ ఒంటిమిట్ట వీరరఘురాముడు రావణసంహరణార్ధం అవనికి దేవతలు కపులుగా తన ఆయుధములు సోదరులుగా నరజన్మనెత్తినారు.

ఈ రాఘవుడు రామరావణ యుద్ధములో అప్రతిహతముగా రావణుని తలలను ఖండించుచున్నప్పుడు వానికి బ్రహ్మ ఇచ్చినవరములన్నీ యెందు, చొచ్చినవి? ఆ శ్రీరాముడు జలధిపై కోపించగా ముందుగా సముద్రుడు యేమూలదాగుటకు వీలులేక గొందిబడి, కొండలచే వారధిగట్టివేసి కపిసేనతో దాటమని అభ్యర్ధించెను.

పరశురాముని దర్పమణచుటకు, వేడుకతో హరివిల్లు సంధించి, తాను హరుని విల్లు విఱిచినది యాదృచ్ఛికమని చెప్పినప్పుడు ఇందరికీ ఇతని మహిమలు యేడనుండి వచ్చినవని అనిపించనేలేదు. ఈతని తమ్ముని ప్రాణరక్షణకు మారుతి సంజీవని కొండ తెచ్చిననాడు ఇంద్రాది దేవతలు జైజై అన్నారేకానీ వారంతా యెక్కడికిపోయారయ్యా?

అల్లనాడు (ఆనాడు) తన అవతారపరిసమాప్తి సమయమున సరయూనదిలో తన నమ్మిన బంట్లను ముంచి ఆ జీవులందరికి మోక్షమును అనుగ్రహిస్తుంటే యముడంతటివాడు యేమీ చేయలేక చూస్తూ వుండిపోయాడు. ఈ దేవతలే తెమలి (చలించి) వానరులవలె అవతరించి శ్రీరామబంట్లయిరి. వారు నేడు, నాడూ ఆ శ్రీవేంకటేశ్వరుని బంట్లే సుమా!

**పద్యవివరణ:**

ఉ|| **ఈతడె వొంటిమిట్ట గల ఈప్సిత దాతగు వీరరాఘవుం**
**డీతని జూచి దైవమనియెంచని మందుని కేమి చెప్పుదున్**
**సీతమనోవిభున్ పొగడి చెప్పిన కీర్తన, వేంకటేశుడే**
**ఆతల రాముడై కపుల ఆలముదీర్చెను దేవతల్ కదా!**

సంఖ్య: I/408 రాగం : గుజ్జరి
కీర్తన : ఎక్కడిపాపములెక్కడి పుణ్యము

**గుజ్జరి**

**95 ఎక్కడిపాపము లెక్కడిపుణ్యము-**
**లొక్కట గెలిచితి మోహో నేము** ॥పల్లవి॥

**ప్రపన్నులెదుటనుఁ బడినయాతుమకు**
**చపలత మరి నాశము లేదు**
**ఉపమల గురుకృపనొనరినమనసుకు**
**రపముల మఱి నేరములే లేవు** ॥ఎక్క॥

**ఘనతరద్వయాధికారగుదేహికి**
**మినుకుల భవభయమే లేదు**
**చనవుల హరిలాంఛనకాయమునకు**
**వెనుకొనుకర్మపువెట్టియు లేదు** ॥ఎక్క॥

**శ్రీవేంకటేశ్వరుఁ జేరినధర్మికి**
**ఆవల మఱి మాయలు లేవు**
**కైవశమాయను కైవల్యపదమునుఁ**
**జావుముదిమితో సద్దే లేదు** ॥ఎక్క॥ **408**

**ఉపోద్ఘాతము:**

ఓహో! మేము ఒకేసారి శ్రీపతికృప గెలిచాము. ఇక మాకు పాపములెక్కడివి, పుణ్యములెక్కడివి అని అంటున్నారు అన్నమయ్య. ఆత్మకి సహజమైన చిత్త చాపల్యము వుంటుంది. అది దుస్సాంగత్యంలో వుంటే దానికి నాశనము తప్పదు. కానీ ప్రపన్నుల యెదుట శరణాగతినొందితే గురుకృపవలన చెల్లుబడివేయటం, వేయకపోతే నేరారోపణలు వంటి ఉపమలతో అంటే ఉపాయాలతో నిమిత్తం వుండదు అంటున్నారు. మరి ఈ





పీకులాటంతా యెందుకు శ్రీవేంకటపతిని జేరిన ధర్మికి కైవల్యం తప్పక సిద్ధిస్తుంది కదా! అంటున్నారు. చావుముదితో సద్దే లేదట, అంటే యేమిటో?

**తాత్పర్య వివరణ:**

ఓ ప్రజలారా! ఏము (మేము) చిత్త చాంచల్యము వంటి బలహీనతలను గెలిచాము. ఓహో! ఒక్కట (ఒకేసారి) భవమును, గురుకృపవలన గెలిచిన మాకు, ఇక పాపములెక్కడివి? పుణ్యములెక్కడివి చెప్పండి.

ప్రపన్నులనగా అచంచల భక్తితో శరణాగతి పొందినవాడని అర్థము. అటువంటి వారి యెదుట బడిన ఆత్మకు చపలత (చిత్త చాపల్యము) మరియు నాశనము వుండవు. ఉపమల (వివిధోపాయముల ద్వారా) గురుకృపను సంపాదించిన మనస్సునకు వెనుకొను (వెంబడించు) పురాకృత కర్మల వెట్టి (వెట్టి చాకిరి) వుండనే వుండదు.

ఇహపరములను సాధించుటకు తీవ్రకృషి సలిపినదేహి ఘనతరముగా రెంటికీ అధికారికాగలడు. అటువంటిదేహికి, "మినుకుల భవభయమేలేదు" ఆకాశం నుండి భూమ్మీదకు పుట్టడం అనే భయమేవుండదు. అధికారముతో హరిలాంఛనములైన శంఖచక్ర ముద్రలు శరీరముపై ధరించిన ధర్మశీలికి, పురాకృతకర్మలుకానీ దాని పీడగానిఅంటవు.

ఏ ధర్మాత్ముడైనా శ్రీవేంకటేశ్వరుని జేరితే (ఆశ్రయిస్తే) ఆవల (అటుపైన) వానికి మాయలు లేవు. ఆ దేవదేవుడు సృష్టించే భ్రమలు, భ్రాంతులూ వశపరచుకోవు. వానికి కైవల్యపదము (మోక్షప్రాప్తి) కైవసమాయను (స్వాధీనమవుతుంది). ఇక వానికి చావు, ముదిమి (ముసలితనముతో) "సద్దే" (ఆపదయే) లేదు.

**పద్యవివరణ:**

కం॥ **ఎక్కడిపాపము, పుణ్యము**
**లెక్కడివిర? గెల్చినాము మేమునొకటిగా**
**యెక్కినతిరుమలధర్మికి**
**దక్కును కైవల్యపదము తగులదు మృతియున్.**

సంఖ్య: I/409 రాగం : లలిత
కీర్తన : సర్వాంతరాత్ముడవు శరణాగతుడ నేను

**లలిత**

**96 సర్వాంతరాత్ముఁడవు శరణాగతుఁడ నేను**
**సర్వాపరాధినైతి చాలుఁజాలునయ్యా** ॥పల్లవి॥

**పూరకున్న జీవునికి వొక్కొక్క స్వతంత్ర మిచ్చి**
**కోరేటియపరాధాలు కొన్ని వేసి**
**నేరకుంటే నరకము నేరిచితే స్వర్గమంటా**
**దూరువేసే వింతేకాక దోష మెవ్వరిదయ్యా** ॥సర్వా॥

**మనసు చూడవలసి మాయలు నీవే కప్పి**
**జనులకు విషయాలు చవులుచూపి**
**కనుఁగొంటే మోక్షమిచ్చి కానకుంటె కర్మమిచ్చి**
**ఘనముసేసే విందుఁ గర్త లెవ్వరయ్యా** ॥సర్వా॥

**వున్నారు ప్రాణులెల్లా నొక్కనీగర్భములోనే**
**కన్నకన్న భ్రమతలే కల్పించి**
**యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె**
**నిన్ను నన్ను నెంచుకొంటే నీకే తెలుసునయ్యా** ॥సర్వా॥ **409**

**ఉపోద్ఘాతము:**

మేము అస్వతంత్రులమైన జీవులమయ్యా! ఈ జీవులకు కోర్కెలు కల్పించేది మళ్ళీనీవే. మంచి చెడు కల్పించి మాకు స్వర్గమో నరకమో అంటకట్టే వాడివి నీవే. వాటిని పొందాక మామీద నేరం మోపేదీ నీవే. నీవు సర్వాంతరాత్ముడవు. మేము నిన్ను ఆశ్రయించి శరణుచొచ్చిన శరణాగతులము. ఈనాడు నీవు కల్పించిన బలహీనతలవలన నేను అపరాధినై నీయెదుటబడవలసి వచ్చింది. చాలుజాలునయ్యా! నన్ను యేలికవై నీవే నేరములెంచక ఆదుకో అంటున్నారు అన్నమయ్య.





**తాత్పర్య వివరణ:**

ప్రభూ! నీవు సర్వాంతరాత్ముడవు (అందరిలోనూ అంతరాత్మవోలె యుండువాడు) మరి నేనో, నీ శరణాగతుడను. నాలోని బలహీనతలకు, వున్నతికి కారణము నేనే అని అనిపించినా అసలు కారణం నీవే. సర్వాపరాధములను చేసిన చవటగ మిగిలి పోయాను. ఇక చాలుజాలునయ్యా!

ఏదో వాడిదారిన వాడున్న జీవుడికి కొంత కొంత స్వతంత్ర్యము ఇచ్చి వాడిని యేవేవో కోరికలతో కొన్ని అపరాధములను చేయిస్తావు. జీవికి తెలివి లేకపోతే ఇదిగో పాపము చేశావని నరకము అంటకట్టెదవు. వాడు నీ తత్త్వము నేర్చి మంచిగా వుంటే స్వర్గప్రాప్తి ఆపైన అహంకారం అనే దోషం అంటకట్టెదవు. ఓ దేవదేవా! ఇందులో దోషమెవ్వరిదో చెప్పవయ్యా!

ఇకపోతే మాకు మనస్సు అనే దౌర్భాగ్యాన్ని అంటగట్టి దాన్ని లేనిపోని మాయలలో ముంచితేల్చి, మమ్మల్ని ఆదుకోవలసిన నీవే ఈ జనులందరికి విషయసుఖముల రుచిచూపించి... ఇదంతా నీమాయ అను సత్యాన్ని గ్రహించినవాడికి మోక్షం ఇస్తావు. ఒకవేళ వాడు సత్యమును కానకుంటే వాడికి కర్మబంధం అంటకడతావు. నీవేమో ఘనుడిగానే వుండిపోతావు. మరి మేము కర్మబద్ధులమై పోతాము. ఏమిటీ అన్యాయం? దీనికి కర్తలెవరయ్యా?

దేవా! అసలీ ప్రాణులందరూ వున్నది వొక్కనీగర్భముననే కదా! మరి నీ గర్భంలో వున్న నీ బిడ్డలకి నీవే, కానలేని, కానరాని భ్రమలను కల్పించి అనేక కర్మలు చేసేట్లు పురికొల్పుతావు. మళ్ళీ నీవే శిక్షిస్తావు. ఏమిటి స్వామీ ఈ ఆట. నీ శరణాగతులకు ఈ బాధలేవీ వుండవు. ఓ శ్రీవేంకటేశ్వరా నీవు మమ్ము ఇట్టే యేలితివి. నన్ను యెంచుకోవాలని నీకే తెలుసును తండ్రీ!

**పద్యవివరణ:**

కం॥ **సర్వాంతరాత్ముడవు హరి!**
**సర్వావస్థలలోన శరణాగతుడన్**
**సర్వాపరాధినైతిని**
**ఉర్వీధర! చాలుజాలు వున్నతినిమ్మా!**

సంఖ్య: I/416 రాగం : భైరవి
కీర్తన : తెలియరాదు మాయదేహమా మమ్ము

**భైరవి**

**97 తెలియరాదు మాయదేహమా మమ్ము**
**పలువికారాలఁబెట్టి పనిగొన్న దేహమా ॥పల్లవి॥**

**దినమొక్క వయసెక్కె- దేహమా సారె**
**పెనుమదముగురిసే బెండుదేహమా**
**దినదినరుచిగోరేదేహమా నన్ను**
**ఘనమోహపాశాలఁ గట్టఁగదె దేహమా ॥తెలి॥**

**తెలివినిద్రలుగలదేహమా నీ-**
**పొలము పంచభూతాలపొత్తు దేహమా**
**తిలకించి పాపపుణ్యాలదేహమా**
**బలువుగలదాఁకా బదుకవో దేహమా ॥తెలి॥**

**తీరనిసంసారపుదేహమా ఇట్టె**
**వూరట లేనిభోగాల వోదేహమా**
**కూరిమి శ్రీవేంకటేశుఁ గొలిచితి నిఁక నాకు**
**కారణజన్మమవై కలిగినదేహమా ॥తెలి॥ 416**

**ఉపోద్ఘాతము:**

ఓ మాయదారిదేహమా! నీ ఉద్ధతి తెలియరానిది సుమా! నీవు మమ్ము అనేక రకములైన వికారములపెట్టి మాపని పడుతుంటావు. నిన్ను ఒక్కనాటికీ నమ్మరాదు. పోనీ నీవు శాశ్వతంగా వుండేదానివా అంటే కానే కాదు. దినదినము నీవయస్సు యెక్కుతూనే వుంటుంది. పైగా నీకురోజుకొక క్రొత్తరుచి కావాలి. మమ్మల్ని గొప్ప మోహపాశబద్ధులనుచేసి ఆడిస్తావు కదే! దేహమా! నీ సంసార తాపత్రయం యెన్నటికీ తీరనిదే. ఎన్ని భోగాలు అనుభవించినా నీకు తృప్తిలేదు. నీవు శ్రీవేంకటేశుని కొలిచేదాకా నీగతి అంతేనే దేహమా! అంటున్నారు అన్నమయ్య.





**తాత్పర్య వివరణ:**

ఓ మాయదేహమా! (మాయలమారి శరీరమా) నీమాయలను పూర్తిగా అవగతం చేసికోవటం మావలన కావటం లేదు. మమ్ము పలువికారముల బెట్టి (అనేక చిత్త వికారములకు లోనుజేసి) మా పనిగొన్న (మమ్మల్ని నియోగించిన) దేహమా! నీ మాయ దుస్సాధ్యము.

ఓ దేహమా! నీవేమన్నా యెప్పటికీ ఇలాగే వుండిపోతావా అంటే నీ వయస్సు దినదినమూ పెరిగేదే కాని తరిగేది కాదు. ఓ బెండు దేహమా! (నిస్సారమైన శరీరమా!) అవకాశం దొరికితే విపరీతమైన మదమును ప్రదర్శిస్తావు. ఓ దేహమా! నీవు దినదినము క్రొత్తక్రొత్త రుచులు కోరుతావు. ఆ విధంగా నన్ను గొప్ప మోహపాశముతో కట్టిపడేస్తావు కదే! ఓసిమాయలమారి దేహమా!

నిద్రపోవటం మళ్ళీ తెలివితెచ్చుకోవటం నిత్యకృత్యాలైన ఓ దేహమా! పంచభూతాలతో పొత్తుపెట్టుకొని జీవనయానమే వ్యవసాయంగా జీవిస్తావు. మళ్ళీ పాపపుణ్యాల గురించి ఆలోచించి నీకు బలువుగలదా (శరీరంలో సత్తువవున్నంతవరకు) నీకు నచ్చింది చేస్తూనే వుంటావు. ఓ దేహమా! నీకు చెప్పగలవారెవ్వరే? నీ ఇష్టం వచ్చినట్లు బ్రదుకవో!

ఓ దేహమా! నీ సంసారతాపత్రయం యేవొక్క నాటికీ తీరేది కాదు. ఏనాడూ ఊరట (తృప్తి) లేని భోగాల మాయలో చిక్కిన ఓ దేహమా! నీవు ఇట్టే వశురాలై సద్గతిని పొందనేరవు. నాపై కూరిమితో శ్రీవేంకటేశ్వరుడు నాకు తనను కొలిచే భాగ్యమును కల్పించినాడు. ఓ దేహమా! నీది కారణజన్మమై వైభవము కలిగినదే.

**పద్యవివరణ:**

చం॥ **తెలియగరాదు నీ మహిమ దేహమ! మాయలమమ్ముబెట్టుచున్**
**పలువిధులౌవికారముల బాగుగబెట్టినయట్టి దేహమా!**
**తెలివియు నిద్రయున్ గలుగు దేహమ తోడగు పంచభూతముల్**
**కొలిచితి వేంకటేశ్వరుని కూరిమితో కలిగావు దేహమా!**

సంఖ్య: I/393 రాగం : దేవగాంధారి
కీర్తన : విధినిషేధములకు వెఱవగబనిలేదు

## దేవగాంధారి

**98 విధినిషేధములకు వెఱవఁగఁబనిలేదు**
**మధుసూదన నీమన్ననదాసుఁడైతే ॥పల్లవి॥**

**విడువరానిధర్మ విధుల పురుషులను**
**విడిచి గోపికలు విచ్చనవిడి**
**బడి నిన్నుఁ దగులుటే పరమధర్మమాయ**
**యెడయునితరధర్మా లిఁకనేఁటికయ్యా ॥విధి॥**

**మానరానికర్మమార్గము లటు మాని**
**పూనినయతులే పూజ్యులట**
**నీనారాయణనియతే ధర్మమాయ**
**యీనిజ మొకటియు నెఱఁగఁగవలయు ॥విధి॥**

**యిన్నిట శ్రీ వేంకటేశ నీదాసుఁడై -**
**వున్న విచారాల నొదుగనేలా**
**నిన్నుఁ గూర్చినట్టినిజభక్తి గలదని**
**తిన్ననై తెలిపేటితెలివే కలది ॥విధి॥ 393**

**ఉపోద్ఘాతము:**

శ్రీ వేంకటేశ్వరుని దాసులైనవారికి 'మధుసూదన దాసుడు' అనిపించుకోవటమే ఒక గొప్ప మన్నన. వారికి విధి నిషేధముల వలన భయమే వుండదు. ఆ దేవదేవుడు చేసిందే న్యాయం, చెప్పిందే నీతి ఆయన యెడల తగులే పరమధర్మము. ఇక మీదట ఇతర ధర్మాలతో నాకు యేమిపనయ్యా అంటున్నారు అన్నమయ్య. నీదాసులకు





విచారములెందుకు కలుగుతాయి అంటున్నారు. నీ నిజభక్తుడను అని తెలిపేటి తిన్ననైన తెలివే కావలసినది.

**తాత్పర్య వివరణ:**

విధి నిషేధములు (విధి యొక్క కాదను నిర్దేశములను) గురించి వెఱవగ బనిలేదు (భయపడవలసిన పనిలేదు). ఎందుకంటే అది సామాన్యుల విషయములో నిజమే, కానీ మధుసూదనుని మన్నన పొందిన హరిదాసుల విషయంలో మాత్రం ఏమీ పర్వాలేదు.

పురుషులకు విధింపబడిన విడువరాని ధర్మమును విడిచిపెట్టి, గోపికలతో విచ్చలవిడిగా ప్రవర్తించి, బడి (వరుసగా) వారంతా నిన్ను దగులుటయే (పొందుటయే...) పరమధర్మము అయినది. ఓ దేవదేవా! ఇకమాకు యెడయు (ఎడువదగిన) పరధర్మములతో పనియేమి వున్నదయ్యా?

మానరాదని, పెద్దల నిర్దేశమైన, కర్మమార్గమును పూర్తిగా మానివేసి శరణాగతులైన యతులే పూజ్యులు. ఓ దేవా! నీ నారాయణ నియతే ఆ యతీంద్రులకు పరమధర్మమైపోయింది. మేము ఈ నిజమొక్కటి మనస్సులో నిలుపుకొని యెఱిగివుండవలయును. అదే మేలైన విధానము.

ఓ శ్రీవేంకటేశ్వరా! నీ దాసుడైవున్నవాడు అనవసరమైన విచారములలో తగులుకొనుట యెందులకు? నిన్ను గురించిన నిజభక్తి నాకు కలదని, తిన్ననై (యుక్తముగా) తెలుపునట్టి తెలివే (జ్ఞానమే) ... కలది (కలిగినది).

**పద్యవివరణ:**

ఆ.వె॥ **విధి నిషేధములకు వెఱవంగ బనిలేదు**
**నీదుదాసుడైన అదియె ఘనము**
**నిన్ను గూర్చినట్టి నిజభక్తి నీబంట్లు**
**వేడుచుంద్రు శరణు వేంకటేశ!**

సంఖ్య: I/304 రాగం : ముఖారి
కీర్తన : యెఱుక గలుగునాడెఱగడటా

**ముఖారి**

**99 ఎఱుక గలుగునాఁ డెఱఁగఁడటా**
**మఱచినమేనితో మరి యెఱిఁగీనా** ‖పల్లవి‖

**పటువైభవములఁ బరగేటినాఁడే**
**తటకున శ్రీహరిఁ దలఁచఁడటా**
**కుటిలదేహియై కుత్తికఁ బ్రాణము**
**తటతటనదరఁగఁ దలఁచీనా** ‖ఎఱు‖

**ఆలుబిడ్డలతో మహాసుఖ మందుచు**
**తాలిమితో హరిఁ దలఁచఁడటా**
**వాలినకాలునివసమైనప్పుడు**
**దాలు వెండఁగాఁ దలఁచీనా** ‖ఎఱు‖

**కొఱఁతలేక తేఁకువఁ దా నుండేటి-**
**తఱి వేంకటపతిఁ దలఁచఁడటా**
**మఱులు దేహియై మఱచివున్నయడ**
**తఱచుటూరుపులఁ దలఁచీనా** ‖ఎఱు‖ **304**

**ఉపోద్ఘాతము:**

ఈ జీవి ఇదివరలో అనేక జన్మలెత్తాడు. వాడికి కొన్ని జన్మలలో ఎఱుక (తానెవరో అనే జ్ఞానం) కూడా తానెరుగడటా. తానెవరో మఱచిన మేనితో ఇక యేవిధంగా జ్ఞానం పొందగలడు చెప్పండి అంటున్నారు అన్నమయ్య. ఇది నాకు తట్టిన భావన. ఈ జీవి యెంతటి హీనుడంటే వీడు వైభవాలతో విలసిల్లునాడు పట్టుమని ఆ శ్రీహరిని తలచుకొనుట కూడా చేయడు. అటువంటి వాడు ప్రాణంపోయే సమయంలో తటతట అదిరిపడుతుంటాడు, కాని ఆ శ్రీహరిని తలుచుకొంటాడా? ఒక్కనాటికీ తలవడు. మరి వాడి గతేమిటి?





**తాత్పర్య వివరణ:**

ఎఱుక (తానెవ్వరు అనునట్టి జ్ఞానము) కలుగునాడు (కలుగబోతున్న తరుణంలో) యెరుగడటా (కన్నూమిన్నూ గానక నిజం తెలిసికొనలేడట). అంతటి అహంభావియైన ఈ జీవి, మఱచిన మేనితో (ఏది మంచి ఏది చెడు అనే విచక్షణ మఱచిపోయిన శరీరంతో భోగిస్తున్నప్పుడు), మరి యెఱిగీనా (ఇక తెలుసుకోగలడా?)

ఇక ఈ జీవుడి దౌర్భాగ్యం యెట్టిదో వినండి. వీడు పలు వైభవముల (వైభోగముల సమూహములో) పరగేటినాడు (తలమునకలవుతున్నప్పుడు) తటుక్కున (చటుక్కున) శ్రీహరిని తలచుకోవటం కూడా చేయడట. అటువంటివాడు కుటిల దేహియై (శుష్కించిన శరీరంతో) గొంతులో ప్రాణం కొట్టుమిట్టాడుతుంటే, తటతట అదిరిపడుతుంటే, తలచీనా (భగవంతుని స్మరించగలడా?)

ఈ జీవి, ఆలుబిడ్డలతో సంసారసుఖం అనుభవిస్తున్నప్పుడు తాలిమితో (ఓపికతో) ఒక్కసారికూడా శ్రీహరిని తలచుకొనడట. ఇక వీడి గడపలో వాలిన యమధర్మరాజు తన పాశము బిగిస్తున్నప్పుడు, దాలువెండగ దలచీనా (నోటిలో తడి యెండిపోతుంటే... అప్పుడు శ్రీహరిని ధ్యానించాలనే ఆలోచనైనా వస్తుందా?) నామాట నమ్మండి... రానేరాదు.

తనకు యేకొఱతా లేక, తాను తేకువతో (ధైర్యంతో) వున్నప్పుడు ఈ జీవి, శ్రీవేంకటేశ్వరుని తలచుకోవటం కూడా చేయడట. మఱులుకొన్న దేహముతో తనను తానే మఱచివున్నయెడ (మైమరిచనవేళ) ఊపిరివేగము అధికమై గాలి అందక సతమతమైపోతున్నప్పుడు, దేవదేవా! నిన్ను తలుచుకోగలడా ప్రభూ! ఈ జీవిని నీవే కరుణించాలయ్యా!

**పద్యవివరణ:**

కం‖ **ఎఱుక గలుగునాడెరుగడు**
**మఱచిన తనమేని తోటి మరియెటులెఱుగున్**
**గుఱి వేంకటేశుదలవడు**
**మఱులను ఈదేహియెపుడు మానడు భళిరా!**

సంఖ్య: I/394 రాగం : రామక్రియ

కీర్తన : సులభుడు మధుసూదనుడు మన-

**రామక్రియ**

**100 సులభుఁడు మధుసూదనుఁడు మన-**

**మెలమి నమ్మిన నిట్టేసుండీ ॥పల్లవి॥**

**పడుచుమాటన కాప్రహ్లాదునెదుట**

**పొడచూపె నాదిపురుషుఁడు**

**అడవిదేహనక (గ) ఆదంతి మొఱకును**

**తడవికాచినదైవముసుండీ ॥సుల॥**

**ఆఁడుమాటలనక అంతలో ద్రౌపదిని**

**వాఁడిమిఁ గాచినవరదుఁడు**

**పోఁడిమిఁ బేదనక పొందినకుచేలుని**

**వీఁడె సంపదిచ్చె విష్ణుఁడు సుండీ ॥సుల॥**

**వీరువారన కిదె వేఁడినవరములు**

**సారెకు నిచ్చినసర్వేశుఁడు**

**మేరతో లోకముల మెఱసె నిప్పుడును**

**యీరీతి శ్రీవేంకటేశుఁడేసుండీ ॥సుల॥ 394**

**ఉపోద్ఘాతము:**

ఓ భక్తులారా! ఈ మధుసూదనుడు భక్తులను సులభముగా అనుగ్రహించువాడు. ఈయనపై నమ్మకముంచితే మిమ్మల్ని ఇట్టే రక్షిస్తాడు సుమా! అంటున్నారు అన్నమయ్య. కీర్తన అంతా ఒక సీస పద్యములో





ఇమిడ్చకలిగాను. అయితే వచ్చిన చిక్కేమిటంటే, పద్యంలో కీర్తనలోని కొన్ని పదాలను యధాతథంగా వాడాను. మీకు తాత్పర్యవివరణ అర్థమైతేనేగాని పద్యం అర్థం కాదు. ఈ శ్రీవేంకటేశ్వరునికి వీరు వారని తేడాలేమీ వుండవట. వేడినవారికెల్లా వరములిచ్చే సర్వేశ్వరుడట.

**తాత్పర్య వివరణ:**

ఓ భాగవతోత్తములారా! మీకన్నులయెదుటనున్న ఈ మధుసూదనుడు, సులభుడు (భక్తులను సులభముగా అనుగ్రహించు దయాళువు). మనమందరమూ, యెలమి (సంతోషంతో) ఈ స్వామిని నమ్మితే, మనల్ని ఇట్టే (తేలికగా) రక్షిస్తాడు సుండీ (సుమా!)

ఈయన నృసింహుడెట్లైనాడు? "ఇందుగలడందు లేడని సందేహము వలదు" అన్నమాట పడుచుమాట (బాలుని పలుకులు) అనక (అని తోసివేయక), ఈ ఆదిదేవుడు బాలప్రహ్లాదునియెదుట పొడచూపె (కనబడినాడు). కీకారణ్యం కొలనులో మొసలితో పోరి, ప్రాణములు కడబట్టి "మన్నింపన్ తగున్ దీనునిన్ రావే ఈశ్వర కావవే" అని రోదించి, ఆ దంతిని (గజేంద్రుని) మొఱకును (వేదనకు) తడవి (రక్షించి) కాచిన (అనునయించిన) దైవము ఇతడే సుండీ!

ఆడుమాటనక (ఏదో స్త్రీల గొడవ అని తలచక)అంతలో మొరబెట్టిన తక్షణమే నిండుసభలో ద్రౌపదిని, వాడిమి (ప్రతాపముతో) కాచిన వరదుడు (వరప్రదాత) ఇతడే సుండీ! పోడిమి (ఒప్పుగా) పేదనక (పేదవాడు అని భావించక) పొందిన (ఆదరించిన) కుచేలునికి అంతులేని సంపదలిచ్చి అనుగ్రహించిన విష్ణుమూర్తి, వీడే సుండీ!

ఈయన సర్వేశ్వరుడు గనుక వీరు వారనక (వీరు నావారు, వీరు పరాయివారు అను బేధభావములేక) ఇదే తనను వేడిన (అర్థించిన) వారందరికీ, సారెకు (ప్రతిసారీ) వరములనిచ్చినాడు. మరి ఇప్పుడు మీ కనులయెదుట ఈ శ్రీవేంకటేశ్వరుడు ఈరీతిగా, మేరతో (మర్యాదతో) ఇప్పుడు మెఱసె (శోభించుచున్నాడు). లోకములు ఈ స్వామి ప్రభలతో నిండినవి సుండీ!

**పద్యవివరణ:**

సీ|| **పదుచమాటనకనా ప్రహ్లాదునెదుటనే**
**పొడచూపె నీ ఆదిపురుషుడపుడు**

**అడవి నలమటించి ఆర్తితో రోదించు**
**కరిరాజు గాచిన హరి యితండు**

**అడ్డుజెప్పక బూని అంతలో**
**ద్రౌపది వాడిమి గాచిన వరదుడితడు**

**పేదనకుండగ వేడు కుచేలుని**
**వెలలేని సిరులిచ్చు విష్ణుడితడు**

ఆ.వె|| **వేంకటేశుడితడు వీరువారనిగాక**
**శరణువేడినంత కరుణజూపు**
**సులభుడితడట మధుసూదనుడితడెపో**
**యెలమి నమ్మిగొలువ యేలికగును.**





## మంగళా శాసనం

**1** శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

**2** లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానం వేంకటేశాయ మంగళం.

**3** సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

**4** నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

**5** వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

**6** ఎమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

**7** మంగళశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వైః సత్కృతాయాస్తు మంగళమ్

పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః